www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శుక్రవారం | 7-3-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 321 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: అష్టమి ఉ.9:19 తదుపరి నవమి, నక్షత్రం: మృగశిర రా.11:32 తదుపరి ఆర్ద్ర, వర్జ్యం: శే. ఉ.7:07, అమృతఘడియలు: మ.2:56-4:29, దుర్ముహూర్తం: ఉ.8:54-9:41, మ.12:49-1:36, రాహుకాలం: ఉ. 10.30-12.00, సూర్యోదయం: 6:32, సూర్యాస్తమయం: 6:19 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం!

ఆ ప్రాధాన్యాన్ని అమెరికా-భారత్ గుర్తించాయి

ఒప్పందం దిశగా అడుగులు పడుతున్నాయి

ట్రంప్ నేతృత్వంలో బహుళధ్రువ ప్రపంచంవైపు అమెరికా.. ఇది భారత్‌కు అనుకూల పరిణామమే

బ్రిటన్‌లో విదేశాంగ మంత్రి జైశంకర్ 2

మంత్రి వాహనం మీదికి దూసుకొచ్చిన ఖలిస్థానీ

భారత ఎగుమతిదార్ల ప్రయోజనాలు కాపాడతాం

చర్చల కోసమే గోయల్ అమెరికాకు: నిర్మల



'ప్రపంచ చరిత్ర' పుస్తకావిష్కరణలో రచయిత దగ్గుబాటి వెంకటేశ్వరరావు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య, సీఎం చంద్రబాబు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఎంపీలు పురందేశ్వరి, శ్రీభరత్



చంద్రబాబును ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న దగ్గుబాటి వెంకటేశ్వరరావు

ఇద్దరం ఎన్టీఆర్ దగ్గర నేర్చుకున్నాం. తెల్లవారగానే ఆయన దగ్గరకు వెళ్లేవాళ్లం. అప్పజెప్పిన బాధ్యతలు చేసేవాళ్లం. అవన్నీ తలచుకున్నప్పుడు నేనుకున్నా.. వెంకటేశ్వరరావు ఏంటి.. పుస్తకాలు రాయడం ఏంటని..! 40 ఏళ్లు కలిసున్నాం.. ఆయనలో ఇంత డెప్త్ ఉందని, పుస్తకం రాస్తారని నేనెప్పుడూ అనుకోలేదు. - చంద్రబాబు

కోలుకోవడానికి మరిన్ని నిధులు కావాలి

పుస్తకావిష్కరణలో ఆద్యంతం నవ్వుల పువ్వుల్

వెంటిలేటర్‌పై రాష్ట్రం.. కేంద్రం చికిత్సతో ఉపశమనం!

కానీ ఇంకా ట్రీట్‌మెంట్ ఇవ్వాలి

ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి సహకరిస్తున్నారు

'ప్రపంచ చరిత్ర' ప్రతి ఒక్కరూ చదవాలి 14

వెంకటేశ్వరరావు బుక్ రాస్తారనుకోలేదు: సీఎం

బాబుతో వైరం.. ఒకప్పుడు ఉండేది: దగ్గుబాటి

ఎవరో చెబితే చేస్తారా?.. మరి నీ బుద్ధి ఏమైంది?

సోషల్ మీడియా పోస్టులపై వెంకయ్య ధ్వజం

దేశ భవితకు యువతే పెట్టుబడి 16

హార్డ్‌వర్క్ కాదు.. స్మార్ట్ వర్క్ చేయాలి

భవిష్యత్తును ముందే ఊహించి నిర్ణయాలు

30 ఏళ్లనాడే సంస్కరణలు తెచ్చా.. అభివృద్ధిపై మక్కువతోనే ఒక్కోసారి ఓడిపోయా

రిపబ్లిక్ ప్లీనరీ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు

ఎక్సైజ్ కమిషనరేట్‌లో ఎమ్మెల్యే హల్‌చల్!

డైరెక్టర్‌ను ఘెరావ్ చేసిన చదలవాడ అరవిందబాబు

డిపోలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపునకు డిమాండ్

తానిచ్చిన జాబితాలో వారందరికీ పోస్టింగ్ ఇవ్వాలని ఒత్తిడి

అప్పుడే చాంబర్ నుంచి వెళ్తానంటూ సోఫాలో బైఠాయింపు

మంత్రి కొల్లు, ఎమ్మెల్యే జీవీ ఫోన్‌లో మాట్లాడినా బేఖాతరు



చదలవాడ అరవిందబాబు

గుంటూరు/అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు ఎక్సైజ్ కమిషనరేట్‌లో హల్‌చల్ చేశారు. ఏకంగా ఆ శాఖ డైరెక్టర్ నిషాంత్‌కుమార్ చాంబర్‌కు వెళ్లి ఒక రకంగా ఘెరావ్ చేశారు. మద్యం డిపోలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే మార్చేయాలని డిమాండ్ చేశారు. నరసరావుపేటలోని ఎక్సైజ్ శాఖకు చెందిన ఐఎంఎల్ డిపోలో 11మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు విధుల

మిగతా 14వ పేజీలో...



అలా వదిలేస్తారా?

హైకోర్టు బెయిలు ఇచ్చిన తర్వాత... రిమాండ్ ఖైదీని విడుదల చేయడానికి కొన్ని నిబంధనలు పాటించాలి. బెయిలు విషయాన్ని జైలు సూపరింటెండెంట్ తన పై అధికారులకు తెలియజేయాలి. అలాగే... ఆ కేసు నమోదైన పోలీసు స్టేషన్‌కు కూడా సమాచారం పంపించాలి. బోరుగడ్డ అనిల్‌లాంటి వ్యక్తి విషయంలో జైలు అధికారులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంది. కానీ... హైకోర్టు అలా బెయిలు ఇవ్వగానే, ఇలా బయటికి పంపించేశారు. హైకోర్టు మధ్యంతర బెయిలు ఇచ్చి, రెండోసారి దానిని పొడిగించినప్పటికీ ఈ విషయం ప్రభుత్వం దృష్టికి రాలేదు. బోరుగడ్డ బయటికి వచ్చిన సంగతి మీడియాకు కూడా తెలియదు. అంత గుట్టుగా, భద్రంగా రాజమండ్రి జైలు నుంచి బయటికి పంపించేశారన్న మాట!

మాయమైపోయాడు

బోరుగడ్డ అనిల్ గ్రేట్ ఎస్కేప్!?

బెయిలు కోసం హైకోర్టుకే బురిడీ

తల్లి అనారోగ్యం పేరుతో హైకోర్టుకు

గతనెల 15వ తేదీనే ఆయనకు బెయిల్

రాజమండ్రి జైలు నుంచి గుట్టుగా విడుదల

బెయిల్ పొడిగింపు కోసం మళ్లీ హైకోర్టుకు

తల్లికి చెన్నై అపోలోలో చికిత్స చేయించాలని

గుంటూరు డాక్టర్ పేరుతో సర్టిఫికెట్

ఈనెల 11వరకు బెయిల్ పొడిగించిన కోర్టు

చివరికి.. అది ఫేక్ సర్టిఫికెట్‌గా నిర్ధారణ

బోరుగడ్డ అనిల్ ఫోన్ స్విచ్ ఆఫ్

ఎక్కడున్నాడు.. ఏమైపోయాడు?

11న జైలుకు తిరిగొస్తాడా రాడా?

ఇదో గ్రేట్ ఎస్కేప్! హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చింది! జైలు అధికారులు వదిలేశారు! ఈ విషయం పోలీసులకు తెలియదు. ప్రభుత్వానికీ తెలియదు! వైసీపీ హయాంలో కూటమి నేతలపై విచ్చలవిడిగా రెచ్చిపోయిన అరాచకవాది బోరుగడ్డ అనిల్ మాయమైపోయాడు! తల్లి అనారోగ్యాన్ని అడ్డం పెట్టుకుని అతడు జైలు నుంచి బయటికి వచ్చేశాడు! నకిలీ సర్టిఫికెట్‌ను సృష్టించి హైకోర్టునూ బురిడీ కొట్టించాడు! చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తోపాటు కూటమి నేతలను, కుటుంబ సభ్యులనూ అసభ్యంగా దూషించి, బెదిరింపులకు దిగి, రాష్ట్రవ్యాప్తంగా కేసులు నమోదైన ఒక రాజ్యాంగేతర శక్తికి రెండుసార్లు బెయిల్ వచ్చిందనే సంగతే ఎవరికీ తెలియదు. అతడు జైలు నుంచి బయటికి వచ్చిన విషయమూ తెలియదు!

(గుంటూరు/అమరావతి - ఆంధ్రజ్యోతి)

బోరుగడ్డ అనిల్‌ను గత ఏడాది అక్టోబరులో పోలీసులు అరెస్టు చేశారు. అప్పటి నుంచి రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్నాడు. వివిధ కేసుల్లో బెయిలు వచ్చినప్పటికీ... అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు నమోదు చేసిన కేసులో మాత్రం బెయిల్ రాలేదు. తన తల్లి పద్మావతి ఊపిరితిత్తుల సమస్య, గుండెజబ్బుతో బాధపడుతోందని... ఆమెకు చికిత్స

మిగతా 2వ పేజీలో...

'గనుల్లో' 1,300 కోట్లు గాయబ్

సర్కారుకు అడుగడుగునా చిల్లే.. రాష్ట్ర గనుల శాఖ నిర్వాకం

సీనరేజీ కాంట్రాక్టులపై నిర్లిప్తత.. ఇందులోనే 800 కోట్ల బకాయిలు

లీజులు, పర్మిట్లలో ప్రైవేటు జోక్యం.. గడువు దాటినా రాని బకాయిలు

కొత్త కాంట్రాక్టుల ఊసేలేదు.. ఎవరికి వారే సొంత వసూళ్లు 16

అనకాపల్లిలో మిట్టల్ నిప్పాన్ స్టీల్‌ప్లాంట్

1,47,162 కోట్లతో రెండు దశల్లో ఏర్పాటు 15

దేశంలోనే అత్యధికంగా 17.8 మి. టన్నుల లక్ష్యం

దాదాపు లక్ష ఉద్యోగాలు

అసెంబ్లీలో మంత్రి భరత్

ఆపన్నులకు అండగా ఉంటాం

ఎన్టీఆర్ ట్రస్ట్ తలుపు తడితే చాలు: భువనేశ్వరి 2

విజయవాడలో నూతన భవనానికి భూమి పూజ

'శ్రీశైలం' గొయ్యిని తక్షణమే పూడ్చండి

అది డ్యామ్‌కే డేంజర్ 5

రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర జల సంఘం ఆదేశం

వీడియో నాదే.. ఆడియో నాది కాదు 16

పోలీసు విచారణలో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

పోక్సో చట్టంపై కొంతే అవగాహన ఉందని వెల్లడి

శ్రీవారి అన్నప్రసాదంలో మసాలా వడ

నిత్యం 35 వేల మందికి వడ్డింపు 2



భక్తులకు మసాలా వడ వడ్డిస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

అన్నప్రసాదంలో మసాలా వడ

▸ శ్రీవారి భక్తులకు వడ్డింపు ప్రారంభం

తిరుమల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని వెంగమాంబ నిత్యాన్నప్రసాద భవనంలో మసాలా వడ వడ్డింపు మొదలైంది. టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు గురువారం ఉదయం భక్తులకు మసాలా వడలను వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా శ్రీవారి చిత్రపటం వద్ద వడలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ అన్నప్రసాదం మెనూలో భక్తులకు అదనంగా ఓ పదార్థాన్ని వడ్డించాలనే ఆలోచన తనకు కలగడంతో సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా అంగీకారం తెలిపారన్నారు. ఇప్పటికే భక్తులకు నాణ్యమైన దినుసులతో రుచికరమైన అన్నప్రసాదాలను అందిస్తున్నామని చెప్పారు. వడ తయారీలో శెనగపప్పు, పచ్చిమిర్చి, అల్లం, కరివేపాకు, కొత్తిమీర, పుదీన, సోంపు ఉపయోగిస్తున్నారని తెలిపారు. అన్నప్రసాద కేంద్రంలో ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 35 వేల వడలను వడ్డిస్తామని, భవిష్యత్తులో ఈ సంఖ్యను మరింత పెంచుతామని చెప్పారు. కాగా, వడలు చాలా రుచిగా ఉన్నాయంటూ పలువురు భక్తులు ఆనందం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో బోర్డు సభ్యుడు శాంతారామ్, డిప్యూటీ ఈవోలు లోకనాథం, రాజేంద్ర, క్యాటరింగ్ అధికారి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

యూఏఈలో ఇద్దరు కేరళీయులకు మరణ శిక్ష

▸ వేర్వేరు హత్య కేసుల్లో శిక్ష అమలు

న్యూఢిల్లీ, మార్చి 6: వేర్వేరు హత్య కేసుల్లో దోషులుగా తేలిన ఇద్దరు భారతీయులకు యూఏఈలో మరణ శిక్ష అమలు చేశారు. ఈ విషయాన్ని భారత విదేశీ వ్యవహారాల శాఖ గురువారం వెల్లడించింది. శిక్ష పడ్డ ఇద్దరు ముహమ్మద్ రినాష్ ఆరంగిలొట్టు (29), మురళీధరన్ పెరుమ్థట్ట వాలప్పిల్ (43) కేరళకు చెందిన వారు. ఎమిరేట్స్‌కు చెందిన వ్యక్తిని హత్య చేసిన కేసులో ముహమ్మద్ రినాష్‌కు, భారత్‌కే చెందిన వ్యక్తిని హత్య చేసిన కేసులో మురళీధరన్‌కు మరణ శిక్ష విధించారు. ఈ తీర్పును యూఏఈ అత్యున్నత న్యాయస్థానం కోర్టు ఆఫ్ కాసేషన్ సమర్థించిన మీదట శిక్షను అమలు చేశారు. మరణ శిక్ష విషయంపై గతనెల 28న భారత ఎంబసీకి యూఏఈ సమాచారం ఇచ్చింది. వీరి శిక్షను నిలుపుదల చేసేందుకు శాయశక్తులా ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయిందని భారత విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది.

రన్యా రావు వెనుక రాజకీయ నేత..?

▸ బంగారం స్మగ్లింగ్ కేసులో ట్విస్ట్

బెంగళూరు, మార్చి 6: దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తీసుకొస్తూ బెంగళూరు ఎయిర్‌పోర్టులో దొరికిపోయిన కన్నడ నటి రన్యా రావు వ్యవహారం సంచలన మలుపులు తిరుగుతోంది. నటి బంగారం స్మగ్లింగ్ వెనుక ఓ ప్రముఖ రాజకీయ నాయకుడి హస్తం ఉన్నట్లు కథనాలు బయటికొచ్చాయి. దీంతో ఈ కేసు కన్నడ నాట రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. బెంగళూరు విమానాశ్రయంలో రన్యా రావు వద్ద నుంచి 14.2 కిలోల బంగారం స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ అధికారులు.. తర్వాత ఆమె నివాసంలోనూ స్వర్ణ ఆభరణాలు, భారీగా నగదు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఆభరణాలను బెంగళూరులోని ఓషాపు నుంచి కొనుగోలు చేసినట్లు గుర్తించారు. ఆ ఆభరణాలను ఓ రాజకీయ నాయకుడి తరఫున కొనుగోలు చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైన ట్లు తెలుస్తోంది. ఆ నగలకు డబ్బును ఎవరు చెల్లించారు? ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందన్న విషయాలపై విచారణ అధికారులు ఆరా తీస్తున్నారు.

మార్చిలోనే మంటలు..!

▸ తొలివారంలో వడగాడ్పుల ప్రభావం

అమరావతి, విశాఖపట్నం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అప్పుడే వడగాడ్పులు మొదలయ్యాయి. మార్చి తొలి వారంలోనే ఎండలు మండుతున్నాయి. వాయవ్య దిశ నుంచి వస్తున్న పొడిగాలులతో పలు ప్రాంతాలు నిప్పులకొలిమిలా మారుతున్నాయి. వచ్చే రెండు నెలల్లో మరింత తీవ్రమైన వడగాడ్పులు వీస్తాయన్న వాతావరణ నిపుణుల హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. గురువారం రాష్ట్రంలోని ఏడు మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 68 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. అనేకచోట్ల పగటి ఉష్ణోగ్రతలు 36 నుంచి 39.9 డిగ్రీల వరకు నమోదయ్యాయి. అనకాపల్లి, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఎండ తీవ్రత మరింత ఎక్కువగా ఉంది. గురువారం అనకాపల్లి జిల్లా నాతవరం, తూర్పుగోదావరి జిల్లా గోకవరం, కృష్ణా జిల్లా తోట్లవల్లూరులో 39.9, చిత్తూరు జిల్లా సింధురాజపురంలో 39.7, నంద్యాల జిల్లా బండి ఆత్మకూరులో 39.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భూమిలో తేమ గణనీయంగా తగ్గడం, జనవరి, ఫిబ్రవరి నెలల్లో వర్షాలు లేకపోవడంతో వేడి రోజురోజుకూ పెరుగుతోంది. ఈ ఏడాది సుదీర్ఘ వేసవి ఉంటుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. రెండు, మూడు రోజుల తర్వాత గాడ్పుల తీవ్రత స్వల్పంగా తగ్గినా, వేడి ప్రభావం ఉంటుందన్నారు. ముందుగానే వేసవి సీజన్ రావడంతో ప్రజలు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు సాధ్యమైనంత వరకూ ఎండలో పనులకు విరామం ఇవ్వాలని సూచించారు.

నేడు, రేపు వడగాడ్పులు

రాష్ట్రంలో వడగాడ్పులు పెరిగే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. శుక్రవారం మన్యం జిల్లా పాలకొండ, సీతంపేట మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, ఉభయగోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని 84 మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని తెలిపింది. శనివారం కూడా 80 మండలాల్లో వడగాడ్పులు ఉంటాయని పేర్కొంది.

ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం!

▸ ఆ ప్రాధాన్యాన్ని అమెరికా-భారత్ గుర్తించాయి

▸ బ్రిటన్‌లో విదేశాంగమంత్రి జైశంకర్

లండన్, మార్చి 6: ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం అవసరాన్ని అమెరికా-భారత్‌లు గుర్తించాయని విదేశాంగ మంత్రి జైశంకర్ తెలిపారు. గత నెల ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్య జరిగిన చర్చల నేపథ్యంలో.. ఈ ఒప్పందం దిశగా అడుగులు పడుతున్నాయన్నారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రస్తుతం ఈ అంశంపైనే అమెరికా పర్యటనలో ఉన్నారని చెప్పారు. బుధవారం లండన్‌లో ఛాతమ్‌హౌస్ మేధోసంస్థ 'భారత్ ఉత్థానం.. ప్రపంచంలో పాత్ర' అనే అంశంపై జరిగిన చర్చలో జైశంకర్ ప్రసంగించారు. ట్రంప్ సారథ్యంలో అమెరికా బహుళ ధ్రువ ప్రపంచంవైపు అడుగులు వేస్తోందని, అది భారత్‌కు మంచిదేనన్నారు. ట్రంప్ అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత బలంగా ముందుకు తీసుకొస్తున్న సుంకాల అంశాన్ని ప్రస్తావిస్తూ.. దానిపై ఇరుదేశాలూ మనసు విప్పి మాట్లాడుకున్నాయని, దాని ఫలితంగానే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం అవసరాన్ని ఆమోదించాయన్నారు. మరోవైపు, 'భారత్-బ్రిటన్ స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందం' దిశగా కసరత్తు జరుగుతోందని, అయితే, అది కొన్ని సంక్లిష్టతలతో కూడుకొని ఉన్నందున దాని సాకారానికి కొంత సమయం పడుతుందని జైశంకర్ వెల్లడించారు. చైనాతో భారత్‌కు ఉన్న సంబంధాల గురించి ప్రస్తావిస్తూ.. 'ప్రపంచంలో 200 కోట్లకుపైగా జనాభా ఉన్న దేశాలు చైనా, భారత్. మా ప్రయోజనాలకు, అభిప్రాయాలకు గౌరవం దక్కే విధంగా చైనాతో సంబంధాలు ఉండాలని మేం కోరుకుంటున్నాం. టిబెట్‌లో ఉన్న కైలాస పర్వత తీర్థయాత్రకు చైనా అనుమతించటం ఒక మంచి పరిణామం' అని తెలిపారు. కశ్మీర్ అంశంపై ఓ సభికుడు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. 370 అధికరణను రద్దు చేసి కశ్మీర్ అభివృద్ధికి ఇప్పటికే దారులు పరిచామని తెలిపారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ భూభాగం తిరిగి భారత్‌లో చేరినప్పుడే కశ్మీర్ సమస్య సంపూర్ణంగా పరిష్కారం అవుతుందన్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ప్రస్తావిస్తూ.. ఆ రెండు దేశాలతోనూ భారత్ సంప్రదింపులు జరుపుతున్నదని.. తన అవసరం ఉన్నదని భావించిన ప్రతి సందర్భంలోనూ భారత్ ముందుకొస్తోందని చెప్పారు. అమెరికా, భారత్, ఆస్ట్రేలియా, జపాన్‌లతో కూడిన క్వాడ్ కూటమి మంచి పురోగతి సాధిస్తోందని, కూటమిలో ఉన్న సభ్యదేశాలందరికీ తగిన ప్రాతినిధ్యం దక్కుతోందన్నారు. జైశంకర్ ప్రస్తుతం బ్రిటన్, ఐర్లండ్‌లలో ఆరు దేశాల పర్యటనలో ఉన్నారు.

ఖలిస్థానీల దాడి యత్నం

ఛాతమ్‌హౌస్‌లో జైశంకర్ ప్రసంగిస్తున్న సమయంలో అక్కడ కొందరు ఖలిస్థానీ మద్దతుదారులు నిరసన చేపట్టారు. ఛాతమ్‌హౌస్ నుంచి జైశంకర్ వెళ్లిపోతుండగా.. ఆయనను ఎగతాళి చేస్తూ భారత వ్యతిరేక నినాదాలు చేశారు. వారిలోంచి ఓ వ్యక్తి భారత్ జెండాను చింపివేసి, జైశంకర్ వాహనంవైపు దూసుకురావటానికి ప్రయత్నించాడు. భద్రతా సిబ్బంది అతడిని అడ్డుకున్నారు.

అమెరికాలో భారతీయులకు మరో గండం!

▸ 1.35 లక్షల మందికి స్వీయ బహిష్కరణ ముప్పు

▸ హెచ్-1బీ వీసాదారుల పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకం



న్యూఢిల్లీ, మార్చి 6: అమెరికాలో లక్షలాది మంది భారతీయులు ప్రస్తుతం స్వీయ బహిష్కరణ ముప్పును ఎదుర్కొంటున్నారు. గతంలో హెచ్-4 వీసాపై అమెరికాకు మైనర్లుగా వలస వెళ్లిన వీరికి ఇప్పుడు 21ఏళ్ల వయసు రావడంతో ఆందోళన మొదలైంది. అమెరికా ఇమిగ్రేషన్ చట్టాల ప్రకారం ఇకపై వీరంతా హెచ్-1బీ వీసాదారులైన తల్లిదండ్రులపై ఆధారపడిన వారిగా అర్హత కోల్పోతారు. హెచ్-1బీ వీసాదారుల పిల్లలు డిపెండెంట్ వీసాతో అమెరికాకు వెళ్లే అవకాశం ఉంది. వారికి 21 సంవత్సరాల వయసు వచ్చేవరకూ ఈ వీసా అమలులో ఉంటుంది. ఆ తర్వాత వీరు మరో వీసా హోదాకు మారడానికి రెండేళ్ల గడువు ఉండేది. అయితే ఇటీవల ఇమిగ్రేషన్ విధానంలో వచ్చిన మార్పులు వారి భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చాయి. 2023 మార్చి నాటికి డిపెండెంట్ వీసా గడువు ముగింపు దశకు చేరుకున్న భారతీయుల పిల్లలు దాదాపు 1.35 లక్షల మంది వరకూ ఉన్నారు. ఇక, భద్రతా కారణాల దృష్ట్యా పలు దేశాలపై ప్రయాణ నిషేధం విధించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యోచిస్తున్నారు. ఈ నేపథ్యంలో అమెరికాలోకి ప్రవేశించకుండా పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ వాసులపై నిషేధం విధించే అవకాశం ఉంది.

ఆపన్నులకు అండగా ఉంటాం

▸ ఎన్టీఆర్ ట్రస్ట్ తలుపు తడితే చాలు

▸ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి

▸ విజయవాడలో నూతన భవనానికి భూమి పూజ

విజయవాడ/అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉండి ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ తలుపు తట్టిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని ట్రస్టీ నారా భువనేశ్వరి హామీ ఇచ్చారు. మాట ఇస్తే దాన్ని చేసి చూపిస్తామని స్పష్టం చేశారు. విజయవాడ కేపీ నగర్‌లో నూతనంగా నిర్మించనున్న ట్రస్ట్ భవన నిర్మాణానికి ఆమె గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ స్థాపించి 28ఏళ్లు పూర్తయిందని తెలిపారు. ప్రజల కోసం ఎప్పుడూ ముందుండాలని ఈ ట్రస్ట్‌ను చంద్రబాబు ఏర్పాటు చేశారని చెప్పారు. సమాజానికి అవసరమైన కార్యక్రమాలు చేయడానికి ట్రస్ట్ ముందుంటుందని పేర్కొన్నారు. విజయవాడ భవనంలో ట్రస్ట్ కార్యాలయం, రక్తనిధి, తలసేమియా కేంద్రం ఉంటాయని వివరించారు. కొత్తగా నిర్మించే భవనాన్ని 2026 ఫిబ్రవరిలో ప్రారంభిస్తామన్నారు. యుఫోరియా మ్యూజికల్ నైట్ ద్వారా సమకూరిన నిధులను తలసేమియా పిల్లలకు ఉపయోగిస్తామని, సమాజం కోసం ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. సంజీవని ఫ్రీ హెల్త్ క్లినిక్‌ల కింద 1.60లక్షల మందికి సేవలందించడానికి రూ.4.02కోట్లు ఖర్చు చేశామని, 14,056 ఆరోగ్య శిబిరాలు నిర్వహించి 20లక్షల మందికి వైద్యసేవలు అందించామని, దీని కోసం రూ.22.43 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. గండిపేటలో స్కూల్, డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్నామని, చల్లపల్లిలో పేద పిల్లలు, తల్లిదండ్రులు లేని వారికోసం స్కూల్ నడుపుతున్నామని చెప్పారు. అక్కడ 2,020మంది పిల్లలకు 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఉచిత విద్య, వసతి కల్పిస్తున్నామని తెలిపారు. స్త్రీశక్తి కార్యక్రమంలో మహిళలకు 35 తోపుడు బండ్లు, 47 కుట్టుమిషన్లను రూ.25 లక్షలతో పంపిణీ చేశామని చెప్పారు. ట్రస్ట్ సేవా కార్యక్రమాలకు సహకరించిన దాతలకు భువనేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ దంపతులు పాల్గొన్నారు.




విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో భువనేశ్వరి తదితరులు

కోట్లాది మందిని ఆదుకున్న ట్రస్ట్: బాబు

'పేదలకు, అభాగ్యులకు సాయం అందించే లక్ష్యంతోఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ విపత్కర పరిస్థితుల్లో కోట్లాది మందిని ఆదుకుంది. తలసేమియా బాధిత పిల్లలను కంటికి రెప్పలా చూసుకుంటున్న ట్రస్ట్ తన సేవలు విస్తరించడంలో భాగంగా విజయవాడలో సొంత భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్న నేపథ్యంలో ట్రస్ట్ నిర్వాహకులు, దాతలకు అభినందనలు' అని సీఎం చంద్రబాబు తెలిపారు.

లోకం తీరు



ఆ భారం భరించలేం!

▸ అక్రమ వలసదారుల తరలింపులో అమెరికా సైనిక విమానాలకు స్వస్తి

వాషింగ్టన్ డీసీ, మార్చి 6: అక్రమ వలసదారులను దేశం నుంచి తరలించేందుకు అమెరికా ప్రభుత్వం సైనిక విమానాల వినియోగాన్ని నిలిపివేసింది. వాటి వినియోగానికి భారీగా వ్యయం అవుతుండటమే తాజా నిర్ణయానికి కారణమని న్యూయార్క్ నగరానికి చెందిన ఒక పత్రిక కథనాన్ని ప్రచురించింది. ఈ ఆపరేషన్‌లో సైనిక విమానాలను చివరిసారిగా ఈనెల 1న వినియోగించారు. రానున్న కొన్ని రోజుల వరకు సైనిక విమానాలు పంపే షెడ్యూల్ ఏమీ లేదని అమెరికా రక్షణవిభాగం అధికారులు తెలిపారు.

సంగీత విద్వాంసురాలితో బీజేపీ ఎంపీ తేజస్వి వివాహం



బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఓ కచేరీలో సంగీత విద్వాంసురాలితో పరిచయం బీజేపీ ఎంపీ తేజస్విని పెళ్లిపీటల దాకా తీసుకొచ్చింది. బెంగళూరు దక్షిణ లోక్‌సభ సభ్యుడు, బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు తేజస్వీసూర్య, చెన్నైకి చెందిన గాయని శివశ్రీ స్కంద ప్రసాద్ ఒక ఇంటివారయ్యారు. కొన్నాళ్ల క్రితం చెన్నైలో జరిగిన ఓ సంగీత కచేరీలో శివశ్రీ స్కందప్రసాద్‌ను తేజస్వి తొలిసారి చూశారు. ఆపై ఇరువురూ పెద్దలను ఒప్పించి పెళ్లిపీటలెక్కారు. గురువారం ఉదయం బెంగళూరు కనకపుర రోడ్డులోని ఓ రిసార్టులో జరిగిన వీరి వివాహానికి రెండు కుటుంబాలవారి సమీప బంధువులు, ఆప్తులు, పలువురు బీజేపీ నేతలు మాత్రమే హాజరయ్యారు.

కరెన్సీ నోటుపై ఉన్న భాషలను.. అధికార భాషలుగా ప్రకటించలేరా?

▸ 'హిందీ దివస్'లా మిగతా వాటికి వేడుకలు లేవెందుకు?: స్టాలిన్

చెన్నై, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కేంద్రం, తమిళనాడు ప్రభుత్వాల మధ్య హిందీ వివాదం కొనసాగుతోంది. మాతృభాష తేనె తుట్టె లాంటిదని, దానిని కదిపితే తేనెటీగలు కాటు వేస్తాయని సీఎం ఎంకే స్టాలిన్ గురువారం వ్యాఖ్యానించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తమిళ భాషకు ముప్పు కలిగించేలా నిర్బంధ హిందీని అమలు చేయడానికి కుట్ర పన్నుతోందని ఆరోపించారు. "హిందీని వద్దంటున్న మీరు కరెన్సీ నోటుపై ముద్రించిన హిందీ అక్షరాలను చెరిపివేస్తారా? అని బీజేపీలోని కొందరు మేధావులు నన్ను ప్రశ్నిస్తున్నారు. నోటుపై ముద్రించిన భాషల్ని అధికార భాషలుగా ఎందుకు ప్రకటించలేకపోతున్నారో ముందు మీరు సమాధానం చెప్పండి" అని నిలదీశారు. 'మీలో ఒకడిని' పేరుతో స్టాలిన్ విడుదల చేసిన వీడియో సందేశంలో పలు ప్రశ్నలు సంధించారు. కేంద్రం హిందీని జాతీయ భాషగా అమలు చేయడానికే ప్రయత్నిస్తోందని, ప్రతి ఏటా సెప్టెంబరు 14న 'హిందీ దివస్' పేరుతో వేడుకలు జరుపుతున్న పాలకులు, రాజ్యాంగంలో పేర్కొన్న 22 భాషలకు అలాంటి వేడుకలు ఎందుకు జరపటం లేదో సమాధానం చెప్పాలన్నారు. ఇది ద్వేషభావాన్ని సుస్పష్టం చేస్తోందన్నారు. తాము భాషా సమానత్వాన్నే డిమాండ్ చేస్తున్నామని, ఇది దురభిమానం కాదని స్టాలిన్ స్పష్టం చేశారు. నిజమైన దురభిమానులు, దేశ వ్యతిరేకులు హిందీ ఉన్మాదులు అని సోషల్ మీడియా పోస్టులో వ్యాఖ్యానించారు. 'తమిళనాడులో తమిళ భాషకు ప్రాధాన్యం ఉండాలని డిమాండ్ చేసినందుకు.. అదేదో నేరం అన్నట్లుగా కొంత మంది తమను దురభిమానులుగా ముద్ర వేస్తున్నారు. దురభిమానం ఎలా ఉంటుందంటే.. 140 కోట్ల దేశ పౌరులకు వర్తించే మూడు నేర చట్టాలకు తమిళులు అర్థం చేసుకోలేని భాషలో పేర్లు పెట్టడంలో ఉంటుంది' అని పేర్కొన్నారు.

మాయమైపోయాడు!

(మొదటి పేజీ తరువాయి)

చేయించేందుకు వీలుగా బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ గత నెల 14న ఆయన హైకోర్టును ఆశ్రయించాడు. ఈ వ్యాజ్యాన్ని లంచ్ మోషన్‌గా స్వీకరించి విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి... ఫిబ్రవరి 15 నుంచి 28వరకు అతనికి మధ్యంతర బెయిల్ మంజూరు చేశారు. 28వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా జైలు సూపరింటెండెంట్ వద్ద లొంగిపోవాలని ఆదేశించారు. కోర్టు ఆదేశాల మేరకు బోరుగడ్డ అనిల్ బెయిలు గడువు ముగియగానే జైలు సూపరింటెండెంట్ వద్ద లొంగిపోయాడు. అయితే... తన తల్లి ఆరోగ్యం క్షీణించిందని, చెన్నై అపోలో ఆసుపత్రిలో చికిత్స చేయించాలని, మధ్యంతర బెయిల్‌ను పొడిగించాలని ఈనెల 1వ తేదీన అత్యవసరంగా హౌస్ మోషన్ పిటిషన్ వేశారు. ఈ అనుబంధ పిటిషన్‌ను న్యాయమూర్తి విచారణకు స్వీకరించారు. తన తల్లికి అత్యవసరంగా చెన్నై అపోలో ఆసుపత్రిలో చేర్చి చికిత్స చేయించాలని గుంటూరు లలిత సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి చీఫ్ కార్డియాలజిస్ట్ వీవీ రాఘవ శర్మ మెడికల్ సర్టిఫికెట్ ఇచ్చారని బోరుగడ్డ తెలిపాడు. ఆ సర్టిఫికెట్‌ను ఆయన తరఫు న్యాయవాది కోర్టు ముందు ఉంచారు. ప్రస్తుతం ఆమె చెన్నై అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ఆమెకు పిటిషనర్ ఒక్కడే కొడుకు అని వివరించారు. ప్రసుత్త పరిస్థితుల్లో ఆమెకు కుమారుడి సహాయం ఎంతో అవసరమని చెప్పారు. అయితే... కోర్టుకు సమర్పించిన మెడికల్ సర్టిఫికెట్ నిజమైనదో, కాదో అనే సమాచారం తనకు లేదని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్పష్టం చేశారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు మెడికల్ సర్టిఫికెట్ వాస్తవికతను పరిశీలించేందుకు ప్రాసిక్యూషన్‌కు అనుమతించారు. తప్పుడు ధ్రువపత్రం అని తేలితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5వరకు మధ్యంతర బెయిల్ పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

ఫేక్ సర్టిఫికెట్‌తో బురిడీ

తల్లి అనారోగ్యంపై బోరుగడ్డ అనిల్ హైకోర్టుకు అందించిన మెడికల్ సర్టిఫికెట్ నిజమైనదా, కాదా నిర్ధారించాలని అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు గురువారం గుంటూరు పోలీసులను కోరారు. కార్డియాలజిస్టుగా డాక్టర్ రాఘవ శర్మకు మంచి పేరుంది. క్లిష్టమైన కేసులకు సైతం గుంటూరులోనే చికిత్స అందించగల సమర్థులు. అలాంటిది... బోరుగడ్డ అనిల్ తల్లి కేసును చెన్నై అపోలో ఆస్పత్రికి రిఫర్ చేశారనడంతో గుంటూరు పోలీసులకు అనుమానం వచ్చింది. స్పెషల్ బ్రాంచ్ పోలీసులు రంగంలోకి దిగడంతో అసలు విషయం బయటపడింది. గుంటూరు లలితా ఆస్పత్రిలో అనిల్ తల్లి పద్మావతి అసలు చేరనేలేదని... ఆమెను చెన్నై అపోలోకు రిఫర్ చేస్తూ డాక్టర్ రాఘవ శర్మ ఎలాంటి సర్టిఫికెట్ ఇవ్వలేదని వెల్లడైంది. ఆయన పేరుతో ఉన్న లెటర్‌హెడ్‌పై ఉన్న సంతకం ఫోర్జరీ అని స్పష్టమైంది. దీంతో పోలీసులు ఒక్కసారిగా కంగు తిన్నారు.

ఫోన్లు స్విచ్ ఆఫ్...

బోరుగడ్డ అనిల్ ఎక్కడున్నాడో తెలుసుకునేందుకు అటు గుంటూరు, ఇటు అనంతపురం పోలీసులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. అనిల్‌తో పాటు ఆయన తల్లి ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ వస్తోందని తెలిసింది. ఆయన తల్లికి నిజంగా చెన్నై అపోలోలో చికిత్స చేయించారా... లేదా అనేది తెలియడంలేదు! తల్లి అనారోగ్యమే నిజమైతే... గుంటూరు డాక్టర్ పేరిట తప్పుడు సర్టిఫికెట్ ఎందుకు సృష్టించాడు? ఫోన్ ఎందుకు స్విచ్ ఆఫ్ చేశాడు? కేసులు, అరెస్టులు, కారాగారవాసం నుంచి తప్పించుకునేందుకే ఈ పథకం వేశాడా? మధ్యంతర బెయిలు గడువు ముగిసేలోగా... అంటే ఈనెల 11వ తేదీన రాజమండ్రి సెంట్రల్ జైలులో లొంగిపోతాడా... లేదా? ప్రస్తుతానికి ఈ ప్రశ్నలకు సమాధానాలు లేవు.

ఎన్నెన్ని కేసులో...

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు రాజ్యాంగేతర శక్తిగా రెచ్చిపోయిన రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్‌పై రాష్ట్రవ్యాప్తంగా సుమారు 14 కేసులు నమోదయ్యాయి. గుంటూరులోని ఏఈఎల్‌సీ చర్చి ట్రెజరర్ బాబు ప్రకాశ్‌ను కత్తితో బెదిరించి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో అనిల్‌ను గత ఏడాది అక్టోబరులో అరండల్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల్లో అయా పోలీసులు కోర్టులలో పీటీ వారెంట్లు దాఖలు చేసి ఆయనను సంబంధిత కోర్టులలో హాజరు పరిచారు. తాను కేంద్ర మంత్రి పీఏనని అనంతపురం కలెక్టర్, ఎస్పీకి ఫోన్ చేసి అక్కడి చర్చి ఆస్తుల వివాదంలో బోరుగడ్డ తలదూర్చాడు. ఆయా కేసుల్లో ఆయా జిల్లా కోర్టుల నుంచి బెయిల్ వచ్చినప్పటికీ... అనంతపురం నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో అక్కడ జిల్లా కోర్టు బెయిల్ తిరస్కరించింది. ఈ కేసులోనే బోరుగడ్డ అనిల్ రిమాండ్‌లో ఉన్నాడు.

చిత్రజ్యోతి

SINCE 1965

నయనతార కొత్త చిత్రం




నయనతార ప్రధాన పాత్రలో సుందర్ సి. దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'మూకుత్తి అమ్మన్ 2'. వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మిస్తున్నాయి. గురువారం పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ ప్రారంభమైంది. 'మూకుత్తి అమ్మన్'కు సీక్వెల్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. ధునియా విజయ్, రెజీనా కసాండ్రా, యోగి బాబు, ఊర్వశి, అభినయ, రామచంద్ర రాజు, అజయ్ ఘోష్, సింగం పులి, విచ్చు విశ్వనాథ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. బలమైన కథాంశంతో పూర్తి స్థాయి వినోదాత్మకంగా ఈ చిత్రం రూపొందుతుందని యూనిట్ తెలిపింది. ఈ సినిమా అన్ని దక్షిణాది భాషలతో పాటు హిందీలోనూ విడుదల కానుంది. సాధారణంగా చిత్రం ఓపెనింగ్ కార్యక్రమాలకు హాజరుకాని నయనతార 'మూకుత్తి అమ్మన్ 2' పూజా కార్యక్రమాలలో పాల్గొనడం విశేషం.

జాన్వీ న్యూ లుక్



రామ్‌చరణ్, జాన్వీకపూర్ జంటగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఓ చిత్రం (ఆర్‌సి 16 వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. గురువారం జాన్వీ కపూర్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ స్పెషల్ పోస్టర్‌ని రిలీజ్ చేసింది. 'ఇది బిహైండ్ ది సీన్‌కు సంబంధించిన ఫొటో. మొదటి షెడ్యూల్ చిత్రీకరణ సందర్భంగా మైసూర్‌లో తీసింది. అఫీషియల్ లుక్ కాదు' అని చిత్ర బృందం స్పష్టం చేసింది. హైదరాబాద్‌లో గురువారం ప్రారంభమైన కొత్త షెడ్యూల్‌లోనూ ఆమె పాల్గొనబోతున్నారు. ఈ షెడ్యూల్ 12 రోజులపాటు కొనసాగుతుందని, హీరో, హీరోయిన్, ఇతర ఆర్టిస్టులపై కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నామని చిత్రబృందం పేర్కొంది.

దేశానికి దక్కిన గౌరవం



సింఫనీ కచేరి తనకు లభించిన వ్యక్తిగత గౌరవం కాదని, దేశానికి లభించిన గౌరవమని ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా పేర్కొన్నారు. లండన్‌లో ఈ నెల 8న తన తొలి వెస్ట్రన్ క్లాసికల్ సింఫనీ కచేరీలో ఇళయరాజా పాల్గొననున్నారు. 'వాలియంట్' అనే శీర్షికతో ఇళయరాజా కంపోజ్ చేసిన సింఫనీ లండన్‌లోని అపోలో ఆడిటోరియంలో తొలిసారి లైవ్‌షోగా ప్రదర్శితం కానుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు గురువారం ఆయన చెన్నై నుంచి లండన్ బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఇళయరాజా విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ... ఇది ప్రపంచంలోనే అత్యుత్తమ సంగీత ఉత్సవం కానుందన్నారు. 'ఇన్‌క్రెడిబుల్ ఇండియా' లాగా తాను 'ఇన్‌క్రెడిబుల్ ఇళయరాజా' అన్నారు. భవిష్యత్తులో తన స్థాయికి చేరేవారు ఎవరూ లేరని, రాబోరని ఇళయరాజా వ్యాఖ్యానించారు.

-చెన్నై, ఆంధ్రజ్యోతి

మీ ముందుకు వస్తున్నందుకు గర్వంగా ఉంది

\- హీరో విక్కీకౌశల్



విక్కీకౌశల్, రష్మిక మందన్న జంటగా లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో తెరకెక్కి హిందీలో ఘన విజయం సాధించిన చిత్రం 'ఛావా'. నేడు తెలుగులో విడుదలవుతోంది. 550కిపైగా థియేటర్లలో సినిమాను విడుదల చేస్తున్నట్లు గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూటర్స్ తెలిపింది. ఈ సందర్భంగా హీరో విక్కీకౌశల్ ఓ వీడియో సందేశంలో తెలుగు ప్రేక్షకులను ఉద్దేశించి మాట్లాడుతూ 'మా 'ఛావా' చిత్రం తెలుగులో మీ ముందుకు వస్తున్నందుకు గర్వంగా ఉంది. ఈ చిత్రం మీ హృదయాలను తాకుతుందని, గొప్ప మరాఠా యోధులలో ఒకరైన ఛత్రపతి శంభాజీ మహారాజ్ కీర్తి, అజేయమైన శౌర్యం, త్యాగాన్ని చూసే అవకాశం మీకు లభిస్తుందని ఆశిస్తున్నాను' అని అన్నారు.

నిరంతర విద్యా ప్రస్థానంలో సిద్ధార్థ స్వర్ణోత్సవ మైలురాయి

1975లో దార్శనికులైన దాతలబృందం స్థాపించిన సిద్ధార్థ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిరంతర విద్యావ్యాప్తికి పునరంకితమవుతూ స్వర్ణకాంతులు వెదజల్లుతోంది. అత్యుత్తమ జ్ఞానం, నైపుణ్యంతో కూడిన విద్యాబోధనతో లక్షలాది విద్యార్థులను ఐదు దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానంలో విజేతలుగా, ఉత్తమపౌరులుగా మలచింది. సంప్రదాయ విద్య, సాంకేతిక విద్య, ఉన్నత విద్య... అన్ని రకాల కోర్సులతో అందరికీ విద్యను అందుబాటులోకి తెచ్చి విజ్ఞానసర్వస్వంగా నిలిచింది సిద్ధార్థ.

SIDDHARTHA ACADEMY OF GENERAL & TECHNICAL EDUCATION
1975 - 2025
50
GOLDEN JUBILEE
ROOTED IN TRADITION..
GROWING IN EXCELLENCE..



మార్చి 7న స్వర్ణోత్సవ కార్యక్రమాల ప్రారంభం
యు.జి.సి. చైర్మన్ ఆచార్య **మామిడాల జగదీష్ కుమార్** స్వర్ణోత్సవాల లోగో ఆవిష్కరిస్తారు..టీజర్ విడుదల చేస్తారు.

ఈ డిశంబరు వరకు సిద్ధార్థ విద్యాసంస్థల్లో ...
పారిశ్రామిక | వాణిజ్య సదస్సులు | విజ్ఞాన ప్రదర్శనలు | జాతీయ, అంతర్జాతీయ విద్యాసదస్సులు | సాహిత్య, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు

18 — విద్యాసంస్థలు.. విద్యార్థులు 26,500 బోధన, బోధనేతర సిబ్బంది 3,500

170 — విద్యా కార్యక్రమాలు 3 లక్షల 50 వేల పుస్తకాలతో గ్రంథాలయాలు

11300 — పరిశోధక పత్రాలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ లో ప్రచురణ

750 — పేటెంట్ల నమోదు సైన్స్, ఇంజనీరింగ్ మేధో హక్కులు

15 — ఎన్.సి.సి. కేడెట్లు ఢిల్లీ గణతంత్ర వేడుకలకు ఎంపిక

1st — ఎలక్ట్రానిక్ డేటా సమాచారవ్యాప్తికి దేశంలోనే మొదటిసారిగా VSAT సదుపాయ కల్పన

సిద్ధార్థ అకాడమీ నిర్వహణలో విద్యాసంస్థలు...

స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న సిద్ధార్థ సంస్థలు :
- పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ & సైన్స్
- A.G. & S.G. సిద్ధార్థ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల

- వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్
- శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల
- వై.వి. రావు సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్
- వెలగపూడి రామకృష్ణ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజ్ (సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ (డీమ్డ్ యూనివర్సిటీ)
- శ్రీమతి వెలగపూడి దుర్గాంబ సిద్ధార్థ న్యాయ కళాశాల
- కె.సి.పి. సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూల్
- కొమ్మారెడ్డి వెంకట సదాశివరావు సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్
- ప్రసాద్ వి. పొట్లూరి సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి
- సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ & క్యాటరింగ్ టెక్నాలజి
- డా. పిన్నమనేని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ & రీసెర్చ్ ఫౌండేషన్
- డాక్టర్ సి. శోభనాద్రి సిద్ధార్థ స్కూల్ ఆఫ్ నర్సింగ్
- డాక్టర్స్ సుధ & నాగేశ్వరరావు సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్
- డాక్టర్ సి. శోభనాద్రి సిద్ధార్థ కాలేజీ ఆఫ్ నర్సింగ్











సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ & టెక్నికల్ ఎడ్యుకేషన్

• (ఉన్నత విద్యకు ఊతమిచ్చే ఉత్తమ బోధన, నైపుణ్యాల సమున్నత వేదిక) | 91-866-2475866, 2476026 | siddhartha.academy@yahoo.in

---

SIDDHARTHA ACADEMY OF HIGHER EDUCATION VIJAYAWADA

SIDDHARTHA ACADEMY OF HIGHER EDUCATION

(An Institution Deemed to be University Under Section 3 of UGC Act, 1956)

Sponsored by : Siddhartha Academy of General & Technical Education, Vijayawada, A.P.

Formerly VELAGAPUDI RAMAKRISHNA SIDDHARTHA ENGINEERING COLLEGE

SIDDHARTHA ACADEMY OF GENERAL & TECHNICAL EDUCATION 1975 - 2025 50 GOLDEN JUBILEE ROOTED IN TRADITION.. GROWING IN EXCELLENCE..



Prof. Mamidala Jagadesh Kumar Chairman, University Grants Commission, New Delhi
Will inaugurate Y.V.Rao Siddhartha Indoor Sports Complex and Lay the Foundation Stone for the New Building Complex

Why to choose 'Siddhartha' ?

OUTCOMES SPEAK THE QUALITY
- Palcements & Internships in Multi National Compaties
- Higher studies in QS Ranking Universities
- Research publications and Patents by students
- Winning in Global industry Hackathon (Google, Adobe, JP Morgan, etc.,)

INDUSTRY RELEVANT FLEXIBLE CURRICULUM
- Honors / Minors Degree
- Global Certifications
- Skill based Training in Industry attached Labs: Siemens, IBM, NI, Dassault, Cisco etc
- Faculty from industry - Professor of practice

AFFORDABLE TUITION FEE | **SCHOLARSHIPS FOR MERITORIOUS STUDENTS**

ADMISSIONS 2025
Apply Before: 30th March
Admission Test SEEE 2025
PHASE 1 - April 5th, 6th, 12th & 13th
Scan to Register
Visit: https://admissions.vrsiddhartha.ac.in

A PRIDE PLACEMENT

52.5 LPA	35 LPA	34.5 LPA	33 LPA	23 LPA	20 LPA	17.5 LPA	16 LPA	16 LPA	14 LPA	12 LPA	10 LPA	8 LPA	7.20 LPA	8 LPA
amazon	amazon	PayPal	Google	NXP	JPMorgan Chase & Co.	cisco	AT&T	PEGA	SOBHA	Microsoft	verizon	Reliance	TCS DIGITAL	Reliance
CSE	CSE	IT	IT	ECE	CSE	CSE	ECE	IT	CIVIL	IT	AI&DS	EEE	ME	EIE

TOP ACHIEVEMENT BASED ON INNOVATION IDEAS



B.PRUDHVI NARAYANA Dept. of AI&DS | CH.PRANAVI Dept. of CSE | S.BALASAI Dept. of AI&DS | S.CHANDRA MOULI Dept. of CSE | S.VASANTHI Dept. of CSE | S.AKSHAYA Dept. of CSE

4th IEEE Geoscience & Remote Sensing Society (GRSS) Grand Challenge **6000 USD**



15 Lakhs — SK.SHEEBA SULTANA CSE | 10.5 Lakhs — K.RADHA ECE | 7.5 Lakhs — M.SRAVANTI, ECE

MSME Idea Hackathon (Women) 3.0

INTERNSHIP

Stipend in Rs.	Company
1,50,000/-	Google
1,00,000/-	amazon
1,00,000/-	PayPal
98,000/-	cisco

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వికటించిన న్యాయం

వందేళ్ళ చరిత్ర ఉన్న తమిళ మీడియా సంస్థ వికటన్‌కు మద్రాస్ హైకోర్టులో తాత్కాలిక ఉపశమనం దక్కింది. ఈ మ్యాగ్‌జైన్ వెబ్‌సైట్‌ను అన్‌బ్లాక్ చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని గురువారం న్యాయమూర్తి ఆదేశించారు. అయితే, ఏ కార్టూన్ కారణంగా కేంద్ర ప్రభుత్వం ఆగ్రహంతో సదరు సంస్థ వెబ్‌సైట్‌ను బ్లాక్‌చేసిందో, ఆ కార్టూన్‌ను తీసివేయాలన్న ముందస్తు షరతు ఇందులో ఉంది. షరతుకు అంగీకరించిన పక్షంలోనే, సదరు వెబ్‌సైట్ మళ్ళీ తెరమీద ప్రత్యక్షమవుతుందన్న ఈ ఆదేశాలు మధ్యంతరం కావచ్చును, అంతిమతీర్పు మిగిలే ఉండవచ్చు. కానీ, న్యాయస్థానం ఇలా అతిజాగ్రత్తగా వ్యవహరించడం మిగతా మీడియా సంస్థలకు ఉత్తేజాన్నిచ్చే అంశమైతే కాదు.

అక్రమవలసదారులంటూ కాళ్ళకూ చేతులకూ గొలుసులు కట్టి, మొఖానికి మాస్కులు పెట్టి అమెరికా తన విమానాల్లో మన పౌరులను పంజాబ్‌లో దించేసినందుకు దేశం యావత్తూ బాధపడింది, అవమాన పడింది. ఇంత అమానుషంగా, అగౌరవంగా వ్యవహరించడాన్ని ప్రశ్నించకపోతే ఎలా? అని విపక్షాలు ప్రభుత్వాన్ని విమర్శించాయి. ప్రభుత్వం మౌనంగా ఉండటం సరికాదని తప్పుబట్టాయి. ఆవేదనని అమెరికా సర్కారుకు తెలియచేశామని, అయితే, అక్రమార్కులను అలా గొలుసులు కట్టి పంపడం వాళ్ళ విధానమని మన ప్రభుత్వం వ్యాఖ్యానించింది. ఈ వివరణ మన పరువు మరింత దిగజార్చేట్టు ఉన్నదని మళ్ళీ విపక్షాలు తప్పుబట్టాయి. ఈ నేపథ్యంలో, ప్రధాని మోదీ అమెరికా పర్యటన జరిగింది. భేటీలో ఈ అంశాన్ని మోదీ ప్రస్తావించకపోవడంపైన కూడా విమర్శలు వచ్చాయి. ట్రంప్ పక్కనే మోదీ గొలుసులతో కూర్చుని ఉన్న ఈ కార్టూన్ తమిళనాడు బీజేపీ అధినేత అన్నామలైకి ఆగ్రహం కలిగించింది. వికటన్ మ్యాగజైన్ డీఎంకేకు ప్రచారసాధనంలాగా తయారైందని, ప్రధానికి వ్యతిరేకంగా నిరాధారమైన కథనాలు ప్రచురిస్తోందని ఆయన ఓ ఫిర్యాదు సంధించారు. అది ఢిల్లీ చేరిన కొద్దిగంటల్లోనే సదరు సంస్థ వెబ్‌సైట్, దాని యాప్‌లు పనిచేయడం మానేశాయి. కార్టూన్ ఫిబ్రవరి 10న ప్రచురితమైతే, ఐదురోజుల అనంతరం కేంద్రప్రభుత్వం తన వెబ్‌సైట్ బ్లాక్ చేసిందనీ, ఫిబ్రవరి 25వరకూ తనకు అధికారికంగా సమాచారమివ్వలేదని వికటన్ వాదన. కార్టూన్ మంచిచెడ్డలను అటుంచితే, వందేళ్ళ చరిత్ర ఉన్న ఒక సంస్థకు చెందిన వెబ్‌సైట్ మూసేయాలని కేంద్ర ప్రభుత్వం అంతవేగంగా ఎలా నిర్ణయానికి రాగలిగిందో అర్థం కాదు. ఫిర్యాదులో బలంకంటే, ఫిర్యాదిదారు బలవంతుడు కావడం వల్ల కాబోలు భావప్రకటనా స్వేచ్ఛలు, హక్కులు పక్కకు పోయి, కొద్ది గంటల్లోనే ఎదుటిపక్షానికి కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా మ్యాగజైన్‌ను మూసేశారు. ఈ కార్టూన్ దేశ ప్రయోజనాలకు వ్యతిరేకమైనదని నిర్ధారించి కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నదా, లేక ఆనందవికటన్ సంస్థ ప్రత్యర్థి పార్టీకి అనుకూలమనీ, బీజేపీకి వ్యతిరేకమని అన్నామలై చేసిన ఆరోపణతో ఏకీభవించి జరిగిందా?

కేంద్రం నిర్ణయం భావప్రకటనాస్వేచ్ఛకు వ్యతిరేకమని, ఇది పూర్తిగా రాజకీయ ప్రేరేపిత చర్య అనీ ఎడిటర్స్ గిల్డ్ నుంచి తమిళనాడులోని అన్ని మీడియా సంస్థల వరకూ విమర్శించాయి. ఆ కార్టూన్ భావప్రకటనా స్వేచ్ఛ పరిమితుల్లోనే ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది సమర్థించారు, ఇది విదేశాలతో మనకున్న బలమైన బంధాలను దెబ్బతీస్తుందని న్యాయస్థానంలో అడిషనల్ సొలిసిటర్ జనరల్ వాపోయారు. మంచీ చెడూ తేల్చేలోగా ఇచ్చిన ఈ తాత్కాలిక తీర్పులో సమపాళ్ళలో న్యాయం చేస్తున్నట్టు న్యాయమూర్తికి అనిపించి ఉండవచ్చు. కానీ, కేంద్రానికి నచ్చని కార్టూన్‌ని తీసివేయమని చెప్పడం ద్వారా ఆ నియంత్రణను సమర్థించినట్టే అయింది. విచారణ కొనసాగుతుందనీ, వెంటనే వెబ్‌సైట్‌ను పునరుద్ధరించాల్సిందేనని ఆదేశించివుంటే బాగుండేది. తద్వారా ఎటువంటి వివరణలు అడగకుండా, ఏకపక్షంగా, కేంద్రం తీసుకున్న ఆ నిర్ణయాన్ని ప్రశ్నించినట్టూ అయ్యేది. కార్టూన్‌ను తొలగించాల్సిందిగా ఆదేశించి, అందుకు సదరు సంస్థ నిరాకరించినపక్షంలో నిర్దిష్టమైన ప్రక్రియను అనుసరించాల్సిన బాధ్యత కేంద్రానికి ఉన్నది. ఈ కార్టూన్ ద్వారా చేసిన రాజకీయ విమర్శతో అమెరికాలో మనదేశం పరువుపోతుందనీ, ఆ దేశంతో మన సంబంధాలు దెబ్బతింటాయన్న వాదనతో ఏకీభవించడం కష్టం. డోనాల్డ్ ట్రంప్ చర్యలూ చేష్టలమీద అక్కడి మీడియాలో ఎటువంటి విశ్లేషణలు, వ్యాఖ్యలు, కార్టూన్లు వస్తున్నాయో, అవి ఎంత ఘాటుగా ఉంటున్నాయో మన పాలకులు ఒకసారి గమనిస్తే బాగుంటుంది.

కాలుష్యరహిత నగరంగా ఢిల్లీ

ఢిల్లీ శాసనసభ ఎన్నికల ప్రక్రియ ముగిసింది. కొత్త పార్టీ అధికారంలోకి వచ్చింది.. ప్రజాస్వామ్య నర్తన మహత్యమిది. అయితే ఈ సారి పాలక పక్షం మారిపోవడంలో ఒక కీలక వ్యత్యాసమున్నది. అధికారంలో ఉన్న పార్టీకి వ్యతిరేకంగా ఎందుకు ఓటు వేశారు అన్న ప్రశ్నకు సమాధానంగా పలు అపరిష్కృత సమస్యలను ఓటర్లు ప్రస్తావించారు.. అవన్నీ ఢిల్లీ ప్రజలను ఎడతెగకుండా వేధిస్తున్నవే. అయినప్పటికీ అధికార పార్టీ వాటిని పరిష్కరించేందుకు సరైన ప్రాధాన్యమివ్వలేదు. ఏమిటా సమస్యలు? ఢిల్లీ నగరంలో 22 కిలోమీటర్ల పొడవునా ప్రవహిస్తున్న యమునా నది కాలుష్య కూపంగా మారిపోవడం అన్ని సమస్యలలోకి అగ్రగణ్యమైనది. ఆరోగ్యకరమైన శ్వాసను నిరోధిస్తున్న వాయుకాలుష్యం, వీధుల్లో పేరుకుపోతున్న చెత్త కుప్పలు మొదలైనవి కూడా ఢిల్లీవాలాలను పీడిస్తున్న సమస్యలు. ఇటువంటి పర్యావరణ సమస్యలను రాజకీయ పక్షాలు తమ ఎన్నికల ప్రణాళికలలో తప్పక ప్రస్తావించేవి, వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చేవి. అయితే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఢిల్లీ వాసులు ఆ సమస్యల గురించి గొంతెత్తి చెప్పారు, ఎప్పుడు పరిష్కరిస్తారని రాజకీయ పార్టీలను, వాటి అభ్యర్థులను నిలదీశారు. ప్రజల ఈ నిక్కచ్చి వైఖరి పరిస్థితులలో మార్పుకు తప్పకుండా దారితీయగలదనే ఆశాభావం కలిగిస్తోంది.



■ సునీతా నారాయణ్

మట్టివాసన

యమునా నదిని పరిశుభ్రం చేసి, నిర్మల వాహినిగా మార్చేందుకు పూనుకుంటున్న కొత్త ప్రభుత్వం కొన్ని వాస్తవాలను స్పష్టంగా గుర్తుంచుకోవాలి. మొదటిది–అధికారం నుంచి దిగిపోయిన ప్రభుత్వమూ, దానికి ముందున్న ప్రభుత్వమూ యమునా నదిని పరిపూర్ణంగా స్వచ్ఛపరిచేందుకు నిబద్ధతతో శ్రద్ధాసక్తులు చూపాయి. సందేహం లేదు. ఒక మురుగునీటి కాలువగా తయారయిన యమునా నదిలో పూర్వపు స్వచ్ఛతను పునరుద్ధరించేందుకు అన్ని ప్రభుత్వాలూ సంకల్పించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలూ రెండూ యమునానది ప్రక్షాళనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించి, ఖర్చు చేశాయి. ఇక్కడ చెప్పవలసినదేమిటంటే ప్రభుత్వాల నిబద్ధత, ఆర్థిక వనరుల లభ్యతకు సంబంధించి ఎటువంటి లోటు లేదు.

ఇక రెండోది– యమునా నదిని సంపూర్ణంగా పరిశుభ్రం చేసేందుకు ఒక కార్యాచరణ ప్రణాళిక ఉన్నది. ఎంతయినా అది దేశ రాజధాని గుండా ప్రవహిస్తోంది కదా. అయితే ఈ కార్యాచరణ ప్రణాళిక అమలవుతున్న తీరుతెన్నులను ఉన్నత న్యాయస్థానాలు క్రమబద్ధంగా సమీక్షిస్తున్నాయి. ప్రతినెలా ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం చాలా శ్రద్ధగా ఒక నివేదిక కోర్టుకు సమర్పిస్తోంది. కనుక కొత్తగా అధికారాన్ని చేపట్టిన ప్రభుత్వం యమునా నది ప్రక్షాళనకు అసలేమీ జరగలేదని, ఆ విషయం గురించి పట్టించుకోలేదని ఎట్టి పరిస్థితులలోను భావించకూడదు. ఎన్నికల ప్రచార పర్వంలో మాత్రమే అటువంటి విమర్శలు అభియోగాలు చెల్లుబాటు అవుతాయి. అయితే ఇప్పుడు నిర్ణయాత్మకంగా చర్యలు చేపట్టవలసి ఉన్నందున అటువంటి వాద ప్రతివాదాలు ఎంతమాత్రం అర్థవంతమైనవి కాబోవు.



ప్రస్తుతం ఢిల్లీ నగరం
యమునానది నుంచి
నీటిని తీసుకుని మురికి నీటిని
తిప్పి పంపిస్తుంది.
అలా కాకుండా నీటిని తీసుకుని
శుద్ధిచేసిన వ్యర్థజలాలను
మాత్రమే తిరిగి నదికి పంపేలా
జాగ్రత్త వహించాలి.
అప్పుడు మాత్రమే ఢిల్లీలో
యమునా నది స్వచ్ఛ
వాహినిలా పునర్జీవిస్తుంది.

నిబద్ధతా పూర్వకమైన లక్ష్య శుద్ధితో, వేల కోట్ల రూపాయాలు ఖర్చు చేసినప్పటికీ యమునా నది పరిస్థితి ఎందుకు మెరుగుపడలేదు? ఈ విషయమై ఇప్పుడు నిశిత, నిష్పాక్షిక చర్చ జరగవలసి ఉన్నది. యమునా నది ఢిల్లీ నగరంలోకి ప్రవేశిస్తున్న పల్లా అనే ప్రదేశంలో యమునా జలాల నాణ్యత సంవత్సరం పొడుగునా అనేకనెలల్లో శ్రేష్ఠంగా ఉంటుందని ఢిల్లీ కాలుష్య నియంత్రణ కమిటీ నెలవారీ నివేదిక స్పష్టంగా పేర్కొంటోంది. అయితే ఢిల్లీలోకి ప్రవేశించి తన 22 కిలోమీటర్ల ప్రస్థానాన్ని ఆరంభించిన తరువాత కొద్ది కిలోమీటర్ల దూరంలోనే యమునా వాహిని కాలుష్యమయమైపోతోంది. ఇంటర్ స్టేట్ బస్ టెర్మినల్ వద్ద నీటి నాణ్యతను తనిఖీ చేసే సమయానికి నదీజలాల్లో ఆక్సిజన్ పూర్తిగా హరించుకుపోతోంది. ఆక్సిజన్ కొరవడడమంటే యమునా జలాలు జీవరహితంగా మారిపోవడమే. దీన్నిబట్టి ఢిల్లీ నగరంలో నది ఒక మృత వాహినిగా అయిపోయిందని చెప్పక తప్పదు. వాస్తవమేమిటంటే కార్యాచరణ పథకం ప్రభావవంతం కావాలంటే దాన్ని పునః రూపొందించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. యమునా నది ప్రక్షాళనకు మనం చేయవలసినవి సరిగ్గా చేయడం లేదు. ఇదొక నిష్ఠుర సత్యం. దీన్ని అర్థం చేసుకోవలసిన అవసరమున్నది. ఈ దృష్ట్యా యమునా నది ప్రక్షాళన అజెండా ఎలా ఉండాలి?

తొలుత మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్‌టీపీ) నిర్మించడం పైనే కాకుండా నిలిపివేసి, శుద్ధికి తీసుకువెళ్లే మురుగు పరిమాణంపై కూడా దృష్టి పెట్టాలి. అంటే ఢిల్లీలోని చాలా విస్తృత ప్రాంతాలు భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థలతో అనుసంధానం కాబడలేదనే వాస్తవాన్ని అంగీకరించవలసి ఉన్నది. ప్రస్తుత కార్యచరణ పథకం ఈ అనుసంధాన పనులకు పెద్దగా ప్రాధాన్యమివ్వడంలేదు. ఈ కారణంగానే సెప్టిక్ ట్యాంక్‌ల నిర్వహణకు డి–స్లడ్జింగ్ ట్యాంకర్స్‌పై ఆధారపడడం మినహా ప్రజలకు మరో ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. చేపట్టవలసిన కీలక చర్య డి–స్లడ్జింగ్ ట్యాంకర్లు అన్నిటినీ రిజిస్టర్ అయ్యేలా చూడాలి. వాటిలో జీపీఎస్ ఏర్పాటును తప్పనిసరి చేయాలి. ఆ ట్యాంకర్ల కదలికలను పర్యవేక్షించేందుకు ఒక కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేయాలి. సెప్టిక్ ట్యాంక్‌లలోని పంకంను విధిగా శుద్ధి కేంద్రాలకు తీసుకువెళ్లేలా చూడాలి. దీనివల్ల ఉపయోగించిన నీటిని, శుద్ధి చేసిన మలాన్ని పునః ఉపయోగించుకోవడం వీలవుతుంది. ఇక రెండోది శుద్ధి చేసిన వ్యర్థ జలాలను మోరీలలోకి వదలకూడదు. ఎందుకని? అలా చేయడం వల్ల అనుసంధానం కాబడని ప్రదేశాల నుంచి వచ్చిన శుద్ధిచేయబడని వ్యర్థజలాలతో కలిసిపోతాయి. శుద్ధిచేసిన మురికి ద్రవాలు, పదార్థాలను పునః ఉపయోగించాలి. ఢిల్లీ ఎకనామిక్ సర్వే ప్రకారం శుద్ధిచేసిన వ్యర్థ జలాలలో కేవలం 10 శాతాన్ని మాత్రమే తిరిగి ఉపయోగించుకోవడం జరుగుతోంది. చాలా ఎస్‌టీపీలు నది సమీప ప్రాంతాలలో ఉండడం లేదు. ఈ కారణంగా శుద్ధిచేసిన వ్యర్థజలాలను శుద్ధి చేయబడని మురుగునీటిని నదికి తీసుకువెళుతున్న మోరీలలోకి వదిలివేయడం జరుగుతోంది. మరి యమునా జలాల నాణ్యత మెరుగ్గా ఉండకపోవడంలో ఆశ్చర్యమేముంది? ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలోని 22 మోరీల నిర్వహణకు ప్రాధాన్యమిచ్చేలా కార్యాచరణ పథకంలో మార్పులు చేయవలసిన అవసరమున్నది. ప్రతి మోరీ నిర్వహణకు ఒక ప్రత్యేక ప్రణాళికను ఉండేలా ఢిల్లీ ప్రభుత్వం శ్రద్ధ చూపాలి. శుద్ధిచేయబడని మురుగునీరు నదిలోకి పారకుండా నిరోధించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించాలి. శుద్ధిచేసిన వ్యర్థ జలాలను శుద్ధిచేయబడని వ్యర్థ జలాలతో కలవకుండా చూడాలి.

ప్రస్తుతం ఢిల్లీ నగరం యమునానది నుంచి నీటిని తీసుకుని మురికి నీటిని తిప్పి పంపిస్తుంది. అలా కాకుండా నీటిని తీసుకుని శుద్ధిచేసిన వ్యర్థజలాలను మాత్రమే తిరిగి నదికి పంపేలా జాగ్రత్త వహించాలి. అప్పుడు మాత్రమే ఢిల్లీలో యమునా నది స్వచ్ఛ వాహినిలా పునర్జీవిస్తుంది.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

ఇన్ని అసమానతలతో ఆర్థికశక్తిగా నిలవగలమా?

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఇటీవల బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో మార్చి 10న సమావేశాలు తిరిగి ప్రారంభం కానున్నాయి. మలిదశ బడ్జెట్ సమావేశాల్లో బడ్జెట్ పద్దులు, జమాఖర్చులు, లెక్కల పైనే కాకుండా దేశ ఆర్థిక గమనం, గమ్యంపై చర్చ జరగాల్సిన అవసరముంది. ఆ చర్చ ఆర్థిక అసమానతలు రూపుమాపేలా ఉండాలి. ఇందుకు కొన్ని అధ్యయన వివరాలను, వాస్తవ స్థితిగతులను, పరిష్కార మార్గాలను కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల ముందు పెట్టాలి. ఇందుకు ఇటీవల విడుదలైన ఓ ప్రతిష్ఠాత్మక సర్వే దోహదపడుతుందని భావిస్తున్నాను.

ప్రపంచంలోని ప్రముఖ ఆర్థికవేత్తలు, నిపుణులతో కూడిన 'వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్' సంస్థ 'భారతదేశంలో ఆదాయం, సంపద, అసమానతలు: 1922–2023' పేరుతో విడుదల చేసిన ఓ నివేదిక భారతదేశంలోని ప్రజల గత వంద సంవత్సరాల స్థితిగతులను బహిర్గతం చేసింది. సంపద, ఆదాయంలో తారతమ్యాలు విస్తృతమయ్యాయని ఈ నివేదిక వెల్లడించింది. సామాజిక, ఆర్థిక విభజనను సృష్టించడంపై తక్షణం దృష్టి సారించాల్సిన ఆవశ్యకతను తెలియజేసింది. ఈ నివేదిక ప్రకారం– భారతదేశంలో అట్టడుగు 50శాతం జనాభా వద్ద 6.4శాతం సంపద మాత్రమే ఉంటే; 10శాతం ధనికుల వద్ద 65శాతం సంపద; 40శాతం మధ్యతరగతి ప్రజల వద్ద 28.6శాతం సంపద మాత్రమే ఉంది. ఈ గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. విధాన నిర్ణయకర్తలు, రాజకీయ పార్టీలు ప్రణాళికలను, ఆర్థిక విధానాలను, బడ్జెట్‌ను రూపొందించేటప్పుడు ఈ అసమానతలను పరిగణనలోకి తీసుకోవాలి.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలినాళ్లలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలోని భారత ప్రభుత్వం మిశ్రమ ఆర్థికవ్యవస్థ గురించి ఆలోచించింది. పెట్టుబడిదారీ విధానం, సామ్యవాదం రెండింటి సూత్రాలను సమన్వయంతో పాటిస్తూ దేశీయ పరిశ్రమలను సురక్షితం చేసింది. మిశ్రమ ఆర్థికవ్యవస్థ స్వావలంబన ఆర్థికవ్యవస్థకు పునాదులు వేసింది. కీలక రంగాల్లో అభివృద్ధి ప్రభుత్వ ఆధ్వర్యంలోనే జరగాల్సిన ఆవశ్యకతను తెలియజెప్పింది. ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడులు ఆర్థిక విస్తరణకు పునాదిగా దోహదపడ్డాయి. ప్రభుత్వ రంగ సంస్థలు విజయాలు నమోదు చేసినప్పటికీ ప్రభుత్వ రంగ సంస్థల్లో అసమర్థ పనితీరు, అధికారికమైన ఆటంకాలు, పరిమితమైన ప్రైవేటురంగం భాగస్వామ్యం వల్ల ఆర్థిక ప్రగతి కుంటుపడింది. ఈ లోపాల నేపథ్యంలో 1990 దశకంలో సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్పీజీ) సంస్కరణలను స్వీకరించేందుకు దోహదం చేశాయి.

భారత మార్కెట్‌లో విదేశీ పెట్టుబడులకు దారులు తెరవడం వల్ల ప్రపంచ ఆర్థికవ్యవస్థతో ఏకమైంది. ఆర్థిక సంస్కరణలు అంతకు ముందెప్పుడూ లేనంత వృద్ధికి దారితీశాయి. సాంకేతిక, టెలీ కమ్యూనికేషన్స్, తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆర్థిక సంస్కరణలు ఉత్ప్రేరకంగా పనిచేశాయి. దీంతోపాటు అనేక సవాళ్లనూ సృష్టించాయి. ఆర్థిక సంస్కరణలు ఆచరణలోకి వచ్చిన సమయంలో సృష్టించిన సంపద కొందరి చేతుల్లోనే కేంద్రీకృతమైంది. సంపద ఫలాలను పంపిణీ చేయడంలో నియంత్రణ వ్యవస్థలు విఫలమయ్యాయని చెప్పవచ్చు. పన్నుల విధింపులో ప్రగతిశీల విధానాలు, సాంఘిక సంక్షేమ పథకాల ద్వారా సంపద పునః పంపిణీకి చర్యలు తీసుకోకపోవడం వల్ల ఆర్థిక అసమానతలు పెరిగాయి. సరళీకరణ ఆర్థిక విధానాల ఫలాలను జనాభాలోని కొంతమంది మాత్రమే అందిపుచ్చుకున్నారు. విస్తృతమైన మెజారిటీ ప్రజలు పెరగని ఆదాయంతో, పెరిగిన జీవన వ్యయంతో, వ్యవస్థాగతమైన అసమానతలతో కొట్టుమిట్టాడుతూ ఉన్నారు.



భారత్ ఆర్థిక మహాశక్తిగా ఎదుగుతున్న ఈ కీలక తరుణంలో సమ్మిళిత అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వక తప్పదు. కాబట్టి ప్రభుత్వ రంగ సంస్థల్లోను, ప్రైవేట్ కంపెనీలోను ప్రజలు పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా ఆర్థిక విధానాల్లో సంస్కరణలు చేపట్టాల్సిన ఆవశ్యకత నెలకొంది. అదే విధంగా ప్రజలు, ముఖ్యంగా మధ్యతరగతి ప్రజానీకం, కూడా పెట్టుబడులు పెట్టేలా వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపర్చేందుకు ప్రభుత్వం తగు చొరవ చూపాలి. అప్పుడే కొందరి లాభమే కాకుండా అందరి శ్రేయస్సు సాధ్యమవుతుంది.

మధ్య తరగతి ప్రజల్లో కొనుగోలుశక్తి తగ్గుతుండగా, జీవన ప్రమాణాలు పెరుగుతున్నాయి. తగినంత నగదు లభ్యత కూడా ఉండటం లేదు. ఫలితంగా చాలా కుటుంబాలు ఆర్థికపరమైన ఒత్తిడితో ఇబ్బంది పడుతున్నాయి. ప్రముఖ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు కూడా ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నట్టు పరిశీలనలు చెప్తున్నాయి. కొన్ని రోజుల క్రితం నేను టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంటల్ రీసెర్చ్‌కు వెళ్లినపుడు, అక్కడ ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయి ఉద్యోగులు కూడా విపరీతంగా పెరిగిన స్కూల్ ఫీజుల కారణంగా తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడం గగనమైపోయిందని వాపోతున్నారు. ఓ వైపు అధిక ధరలు, మరోవైపు జీవన ప్రమాణాలు పెంచలేని ఆర్థిక వనరులతో మధ్యతరగతి ప్రజలు అయోమయంలో చిక్కుకున్నారు.

ఆర్థిక అసమానతలు రూపుమాపేందుకు నిరంతరం తీసుకోవాల్సిన బహుముఖ మార్గాలను ప్రముఖ ఆర్థిక వేత్త సీహెచ్ హనుమంతరావు తన ప్రతిభావంతమైన పుస్తకం రైజింగ్ ఇన్‌కమ్ ఇనిక్వాలిటీస్ ఇన్ ద వేక్ ఆఫ్ గ్లోబలైజేషన్: ఎమర్జింగ్ ఛాలెంజెస్' (ప్రపంచీకరణ నేపథ్యంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలు: ఉద్భవిస్తున్న సవాళ్లు)లో సూచించారు. మౌలిక వసతుల కల్పనలోను, విద్య వైద్య రంగాల్లోను ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలని సూచించారు. గ్రామాల్లో వ్యవసాయాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ; వ్యవసాయేతర రంగాలకు, తయారీ రంగానికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. అలాగే అసమానతలు తగ్గించేందుకు సరిపడా ఉపాధి అవకాశాలు కల్పించాలని ఉద్ఘాటించారు.



అలాగే కార్మిక హక్కులను బలోపేతం చేయాలని, న్యాయమైన వేతనాల భరోసాను కల్పించాలని, శ్రామికవర్గాల సాధికారత, ఆర్థిక వ్యవస్థలో మధ్యతరగతి భాగస్వామ్యాన్ని పెంచాలని చెప్పారు.

దేశంలో పాలకులు భారీ పరిశ్రమలను పూర్తిగా ప్రైవేటు రంగానికి వదిలేయకుండా ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయాలి. 1997 ఆసియా టైగర్స్ ఆర్థిక సంక్షోభం నుంచి, 2008లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం నుంచి ప్రభుత్వరంగ బ్యాంకులే దేశాన్ని కాపాడాయి. మన దగ్గర ఉన్న మానవ వనరులను సద్వినియోగం చేసుకోవాలి. కొత్త తరానికి ఉపాధి అవకాశాలు కల్పించాలి. రైల్వే, విమానయాన రంగాలు, ఉక్కు, బొగ్గు వంటి తయారీ రంగాల్లో ప్రభుత్వరంగ పెట్టుబడులు ఉపసంహరించుకోవడం సరికాదు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వహించడం అంటే నష్టాలను భరించడం కాదని పాలకులు గుర్తించాలి. ప్రభుత్వరంగ సంస్థల విజయాలెన్నో చరిత్రలో ఇందుకు నిదర్శనాలుగా ఉన్నాయి. ఏవైనా నష్టపోయిన సంస్థలుంటే అందుకు కారణమైన గత తప్పిదాలను గుర్తించాలి. పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి. మెరుగైన విధానాలను ప్రవేశపెట్టాలి. లిస్టెడ్ కంపెనీలకు కనీస పబ్లిక్ షేర్ హోల్డింగ్ (ఎంపీఎస్) అవసరంపై సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) నిర్దేశాలు జారీచేసింది. ఎంపీఎస్ నియమం ప్రకారం ఒక కంపెనీ ఈక్విటీ షేర్లలో కనీసం 25శాతం ప్రజల వద్ద కలిగి ఉండాలి. ఎంపీఎస్ శాతాన్ని 50 శాతానికి పెంచితే ప్రైవేట్ సంపద సామాన్య మధ్య తరగతి ప్రజలకు చేరే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం దేశంలో బడా కంపెనీలలో కేవలం 3 శాతం ప్రజలే పెట్టుబడి పెడుతున్నారు. అమెరికా, యూరప్ వంటి దేశాల్లో 50–70 శాతం ప్రజలు కంపెనీలలో భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నారని తెలుస్తున్నది. భారత్ ఆర్థిక మహాశక్తిగా ఎదుగుతున్న ఈ కీలక తరుణంలో సమ్మిళిత అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వక తప్పదు. కాబట్టి ప్రభుత్వ రంగ సంస్థల్లోను, ప్రైవేట్ కంపెనీలోను ప్రజలు పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా ఆర్థిక విధానాల్లో సంస్కరణలు చేపట్టాల్సిన ఆవశ్యకత నెలకొంది. అదే విధంగా ప్రజలు, ముఖ్యంగా మధ్యతరగతి ప్రజానీకం, కూడా పెట్టుబడులు పెట్టేలా వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపర్చేందుకు ప్రభుత్వం తగు చొరవ చూపాలి. అప్పుడే కొందరి లాభమే కాకుండా అందరి శ్రేయస్సు సాధ్యమవుతుంది.


■ బోయినపల్లి వినోద్‌కుమార్
న్యాయవాది, పార్లమెంట్ మాజీ సభ్యులు

స్వతంత్ర మహిళ.. రాహుల్‌జీ స్వప్నం

స్త్రీ జాతి పట్ల తరతరాలుగా వస్తున్న సంకుచిత, సాంప్రదాయ భావాలని మహాపండితుడు రాహుల్ సాంకృత్యాయన్ అంగీకరించరు. స్త్రీ జాతి కోసం మనుస్మృతిలో చెప్పిన నీతి నియమాలను ఆయన ఖండిస్తారు. మనుస్మృతిలో ఇలా ఉంది. "బాల్యావస్థలో స్త్రీ– తండ్రి సంరక్షణలో, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో పుత్రుని సంరక్షణలో ఉండాలి. స్త్రీ స్వాతంత్ర్యానికి అనర్హురాలు. తన కోర్కెలకి అనుగుణంగా ఏ పనీ చేయరాదు."

బాల్యావస్థలో సంరక్షణ అనివార్యమైనా, తరువాత స్త్రీ ఎవరి సంరక్షణలోనూ ఉండాల్సిన అవసరం లేదంటారు రాహుల్‌జీ. స్త్రీ పరాధీనురాలుగా ఉండటం, భర్తపైన ఆర్థికంగా ఆధారపడడం అనేది పాతకాలపు మాట. ఇప్పుడు ఆ రోజులు గతించిపోయాయి. పురుషులతో సమానంగా స్త్రీలు తమ హక్కులను పొందే నిజమైన హక్కుదారులు. మానవ సమాజం, మానవ జీవితం సాధించుకున్న అన్ని రంగాలలో ప్రవేశించడానికి స్త్రీలకి హక్కు ఉన్నది. ఆ రంగాల ద్వారాలు ఆమె కోసం తెరుచుకుని ఉన్నాయి. ఆమె ఎందుకు వెనుకబడి ఉండాలి?

ఇంటి నాలుగు గోడల మధ్యనే స్త్రీ స్థానం. ఆమె గడప బయట కాలు పెట్టరాదు. భర్త, కుటుంబానికి సేవ చేస్తూ ఇంటి పనులను చక్కబెట్టడమే ఆమె పని అనే అవగాహనని పాతకాలపు పురాణవాదుల బుర్ర నుంచి పుట్టిన నియమాలని రాహుల్‌జీ అనేవారు. వాస్తవానికి రాహుల్‌జీ జీవితంపైనా, స్త్రీ జాతి పట్ల వారి అవగాహనపైనా సామ్యవాద ఆలోచనా విధాన ప్రభావం చాలా ఉన్నది. స్త్రీని కేవలం భోగ వస్తువుగా కాకుండా సమాజంలో ఆమెకి కూడా సమాన అవకాశాలు ఉండాలని చెబుతూ ఆయన స్త్రీల పక్షాన నిలబడ్డారు. స్త్రీలలో కేవలం శారీరక ఆకర్షణ మాత్రమే ఉండదు. దానికంటే కూడా ఉన్నతమైన ప్రేమ పాత్రురాలు అయ్యే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది.



భారత స్త్రీల దయనీయమైన పరిస్థితిని వర్ణిస్తూ, వారిని ఉద్ధరించే మార్గాలను చెబుతూ 1942లోనే రాహుల్‌జీ భోజ్‌పురీ భాషలో చిన్న చిన్న నాటికలు చాలా రాశారు. 'మెహరారున్ దురవస్థ', 'మందలి ప్రపంచం' కథలలో స్త్రీ సమాజాల పట్ల, స్త్రీ పక్షపాతిగా వారి ఆలోచనలు మనకి కనిపిస్తాయి. కుసంస్కారాలు, భయంకరమైన నీతి శాసనాలలో బంధించబడి ఉన్న భారత సమాజ స్త్రీ జాతి దుర్భర పరిస్థితులను చూసి రాహుల్‌జీ హృదయం ద్రవించిపోయింది. స్త్రీ జాతి దుస్థితి పట్ల తన తిరుగుబాటు స్వభావాన్ని చాలా మార్మిక శబ్దాలలో ఇలా చిత్రించారు.

"ఒకే తల్లి, ఒకే గర్భం/ ఇద్దరూ జన్మించారు/ కొడుకు జన్మించినందుకు ఆనందం/ కూతురు జన్మించినందుకు దుఃఖం/ సంపదపై కొడుక్కి హక్కు/ కూతురుకి ఏ హక్కులూ లేవు."


రాహుల్‌జీ తన ప్రఖ్యాత రచన 'పారిపోకు ప్రపంచాన్ని మార్చుకోలో' ఒక అధ్యాయం మొత్తాన్ని స్త్రీ జాతికి అంకితం చేశారు. భారత సమాజంలో స్త్రీ జాతి పట్ల పురుషుల అన్యాయానికి వ్యతిరేకంగా గొంతెత్తారు. "మహిళని బానిసని చేసి పురుషుడు తన ఇంటికి తెస్తాడు. దీన్ని పెళ్లి అంటారు. తండ్రి తన కూతురు కోసం వరుడిని వెతుకుతాడు, ఎందుకు? కూతురికి తిండి, బట్ట తప్పక దొరకాలి. పురుషునికి తప్పనిసరి అవసరం లేదు. ఎందుకంటే తండ్రి ఆస్తిపాస్తులు మొత్తం అతడికే లభిస్తాయి. అతడు దుకాణం తెరవగలడు లేదా ఆఫీసులో ఉద్యోగం చేయగలడు. సంపాదించుకోవడానికి అతడికి అన్ని దారులూ తెరచి ఉన్నాయి. కానీ మహిళలకి అన్ని దారులూ మూసి ఉన్నాయి. అందుకని ఆమెకి తిండి, బట్టలు ఇచ్చేవాడు ఎవరన్నా ఒకడు కావాలి. తిండి బట్టలనే డబ్బులంటారు కదా!"

ఇంకా తీవ్రంగా చర్చిస్తూ రాహుల్‌జీ ఇలా అంటారు. "నేను పెళ్లిని తప్పు అనడం లేదు. కానీ పెళ్లి పేరుతో ధనం, బేరసారాలు సాగటం మహిళలను అగౌరపరచటమే. ప్రేమ అనే పునాదిపై పెళ్లి ఆధారపడాలి. ప్రేమ అనేది ఇరువురు సమాన వ్యక్తుల మధ్యనే ఉంటుంది. యజమాని, కొనబడిన దాసిల మధ్య ప్రేమ ఉండదు. అందుకే సంపాదనలో, తల్లిదండ్రుల ఆస్తిపాస్తులలో సమాన అధికారం వచ్చేవరకూ మహిళ, పురుషునికి సమానం కాలేదు."

ఇంకా కఠిన పదాలలో రాహుల్‌జీ ఇలా ప్రశ్నిస్తారు. "మహిళలు ఎప్పటికీ గొర్రెలుగా ఉండలేరు. చదువుకున్న మహిళలు చాలాచోట్ల బహిరంగసభలు పెట్టి ప్రశ్నిస్తున్నారు. మానవ పొట్ట నుండి మగపిల్లలు పుడితే, ఆడపిల్లలేమన్నా చింతచెట్టు తొర్రలోంచి పుట్టారా?"

1944 నాటికే స్త్రీల పట్ల పండిట్‌జీకి స్పష్టమైన అవగాహన వచ్చింది.

ప్రస్తుత కాలంలో మహిళా జగత్తులో వస్తున్న అభివృద్ధిని చూసి సంతోషిస్తూ, భారత స్త్రీ తన దృఢమైన మనోబలంతో, పని సామర్థ్యంతో 'ఆడది అబల కాదు సబల' అని నిరూపించే రోజు దూరం లేదని రాహుల్‌జీ ఆశిస్తున్నారు. "మహిళ ఏ రకమైన అన్యాయం ముందూ తలవంచదు. కచ్చితంగా ఎదిరిస్తుంది. భారత మహిళ తన బాటలు నిర్మించుకుంటున్నది. వందల సంఖ్యలో ఇంగ్లండు, అమెరికా ఇంకా ఇతర దేశాలలో చదవటానికి వెళ్లే మహిళలకి సంరక్షకులుగా ఎవరు పంపబడ్డారు? (మనుస్మృతిలో చెప్పబడినట్టు) పురుషుడు తనని తాను రక్షించుకున్నట్టు గానే స్త్రీలు తమని తాము రక్షించుకుంటారు. తమ దారికున్న అడ్డంకుల్ని తొలగించుకుంటూ ఇతర దేశాల మహిళలు ముందడుగు వేస్తున్నారు. ఆయా దేశాలు చాలాకాలం క్రితమే ఈ పనిని ప్రారంభించాయి. నేటి ప్రపంచ ప్రవాహం మనతో పాటుగా ఉన్నది."



తెలుసుకోవాలనే జిజ్ఞాసలో పురుషులే కాదు ఎంతో ఉత్సాహంతో స్త్రీలు కూడా రాహుల్‌జీ దగ్గరికి వచ్చేవారు. మంచి పనులను చేయటం కోసం పురుషులని ఎలా ప్రోత్సహించేవారో, అలానే స్త్రీల కోసం కూడా ప్రణాళికలు తయారు చేసేవారు. వాటికి కార్యరూపం ఇచ్చే సాధనాలు, ఉపాయాలను కూడా చెప్పేవారు. ఎవరైనా స్త్రీకి, ఆమె భర్తకి మధ్య మనస్పర్థలు వచ్చి వాటిని పూడ్చటంలో ఆమె విఫలమవుతుంటే "భర్తతో కలిసి ఉండగలిగినంతకాలం ఉండడానికి ప్రయత్నించు. పరిస్థితి ఇంకా విషమిస్తే వేరుపడి నువ్వు నీ కాళ్లపై నిలబడే ప్రయత్నం చేయి. నువ్వు కార్యక్షేత్రంలో దిగటమే ఆలస్యం. నీలో ఆత్మవిశ్వాసాన్ని ప్రేరేపించు. నువ్వు ఎవ్వరికీ దేంట్లోనూ తీసిపోవు, వెనుకబడవు" అని ధైర్యాన్నిచ్చేవారు.

స్త్రీ జాతి ఉజ్వల భవిష్యత్ వైపు సూచిస్తూ మహా పండిట్ తన ఉన్నత భావాలని ఇలా ప్రకటిస్తున్నారు. "భారత మహిళలు మూడు తరాలుగా క్రమంగా ముందుకు వెళుతూ ఆధునిక వాతావరణంలో ప్రవేశించారు. మొదటి తరం– పరదాలను తీసేసి పూజా గ్రంథాల దాకా వెళ్ళే సాహసం చేసింది. రెండవ తరం– కొంచెం కొంచెం చదువు సంధ్యలు ప్రారంభించింది. ఇంకా కాలేజీలో చదువుతూ కూడా తనతో చదివే మగపిల్లలతో సమానత్వాన్ని పొందే సాహసం చేయలేదు. ఇప్పటి నవ యువతుల మూడో తరం– యువకులతో సరిసమానమవడానికి తయారుగా ఉన్నది. మామూలు పనులలోనే కాదు ప్రభుత్వ యంత్రాంగంలోకి, పెద్ద పెద్ద ఉద్యోగాలలోకి కూడా పోవడానికి ఇప్పటి తరం తయారుగా ఉంది.

భారత స్త్రీల పట్ల 1944లో రాహుల్‌జీ తన భావాలను ప్రకటించారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో స్త్రీలు ఉన్నతమైన గొప్ప ప్రాముఖ్యత గల స్థానాన్ని తమ కోసం ఏర్పర్చుకుంటున్నారు. అన్ని రంగాలలోనూ సంపూర్ణ మహిళా విముక్తి వైపు సాగిపోవడానికి నేటి తరం యువతులు అన్ని రకాల అడ్డంకులనీ తొలగించుకోవాలనేది రాహుల్‌జీ స్వప్నం.

(రాహుల్ సాంకృత్యాయన్ సహచరి కమలా సాంకృత్యాయన్ హిందీ రచన 'మహామానవ్–మహాపండిత్' పుస్తకం నుంచి)

తెలుగు అనువాదం: **ఆలూరి ఉషారాణి**

(మార్చి 8: అంతర్జాతీయ మహిళా దినోత్సవం)

న్యాయవ్యవస్థలోనూ మహిళలకు అన్యాయమేనా?

మనకు స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయినా మహిళా న్యాయమూర్తుల సంఖ్యను కోర్టుల్లో పెంచుకోలేకపోయాం. 1989, అక్టోబర్ 6న ఫాతిమా బీవీ సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా నియమితమయ్యే వరకు మన దేశ అత్యున్నత న్యాయస్థానంలో మహిళా న్యాయమూర్తులు లేరు. ఫాతిమా బీవీని నియమించుకున్న ఆనందం కూడా రెండున్నర ఏళ్లకు మించి లేదు. ఆమె తరువాత మళ్లీ రెండేళ్లకు సుజాతా మనోహర్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితురాలయ్యారు. ఆ తర్వాత జస్టిస్ రుమా పటేల్ ఆరేళ్ల మూణ్నెల్లు కొనసాగారు, కానీ ప్రధాన న్యాయమూర్తి కాలేకపోయారు. ఇలా ఏడు దశాబ్దాలకు పైగా స్వతంత్ర పరిపాలనలో 276 మంది సుప్రీంకోర్టు జడ్జిలను నియమించుకున్నా, కేవలం 11మంది మహిళలు మాత్రమే సుప్రీంకోర్టు జడ్జిలు కాగలిగారు. ప్రస్తుత 34మంది న్యాయమూర్తులలో మహిళలు ఇద్దరే.

ఇక హైకోర్టుల వైపు చూస్తే పరిస్థితి అంత బాగా ఏమీ లేదు. గత ఆగస్టు 31 నాటికి సుప్రీంకోర్టు లెక్కల ప్రకారం దేశం మొత్తం మీద హైకోర్టుల్లో కొలువుదీరిన 754 మంది న్యాయాధీశుల్లో కేవలం 106 మంది మాత్రమే మహిళలు. అంటే 14శాతం అన్నమాట. అన్ని హైకోర్టుల్లో ఉండాల్సిన 1100 పై చిలుకు జడ్జీల సంఖ్య పరిగణిస్తే, మహిళా న్యాయమూర్తుల శాతం ఇంకా పడిపోతుంది. ఒకే ఒక్క మహిళా న్యాయమూర్తి ఉన్న హైకోర్టులు ఎనిమిది ఉన్నాయి. అవి చత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్, ఝార్ఖండ్, మణిపూర్, ఒరిస్సా, పట్నా, సిక్కిం, ఉత్తరాఖండ్.

జిల్లా కోర్టుల పరిస్థితి కాస్త మెరుగ్గా ఉంది. దేశం మొత్తంలోని 719 జిల్లాల్లో గల 2,188 కోర్టుల్లో దాదాపు 37 శాతం జడ్జీలు మహిళలు కావడం ఆనందదాయకమే. కాని వారికి ప్రమోషన్లు వచ్చి హైకోర్టు, సుప్రీంకోర్టుల వరకు వెళ్లగలుగుతున్నారా? లేదు.

ఓ వైపు న్యాయవ్యవస్థలో మహిళల కొరత, మరోవైపు వ్యవస్థలో వారి అవస్థలు మహిళల అస్తిత్వాన్నే ప్రశ్నిస్తున్నాయి. పైపెచ్చు మహిళలకు అధికారాలు అప్పజెప్తే పనులు పకడ్బందీగా జరుగుతాయన్న అభిప్రాయానికి విలువ లేకుండా పోతోంది. నమోదైన న్యాయవాదుల్లో 18 శాతమే మహిళలున్నా వారి సంఖ్య రెండున్నర లక్షల పైనే ఉంది. మనకు అంతమంది మహిళా న్యాయమూర్తులు అవసరం లేదు. దేశంలోని అన్ని కోర్టుల్లో కలిపి ఏభై శాతం నింపితే కనీసం న్యాయవ్యవస్థలోనైనా స్త్రీలకు న్యాయం దొరుకుతుంది.

'పెళ్లి, పిల్లలుకనడం వల్ల స్త్రీలు తమ వృత్తిని వదిలేస్తారు. కానీ పిల్లలు పుట్టిన తర్వాత వారి పెంపకానికి కావాల్సిన సమయం కేటాయించి వారు మళ్లీ వృత్తిలోకి రావచ్చని' ఇటీవలే సుప్రీంకోర్టు జస్టిస్ నాగరత్న ఓ సందర్భంలో అన్నారు. న్యాయవ్యవస్థలో సగం న్యాయమూర్తులు స్త్రీలే ఉండేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

– డా. పి. మాధవరావు
ఐక్యరాజ్యసమితి మాజీ సీనియర్ సలహాదారు

తండ్రే 'ఉరి'గొల్పాడు!

- పరువు హత్య కేసులో పెద్దల్లుడు కూడా...
- భారతిని అల్లుడితో కలిసి చంపిన తండ్రి
- చేతికి తాడిచ్చి ఉరి వేసుకోవాలని గద్దింపు
- కాళ్లు నేలకు తాకగా, ఉరితాడును పైకి కట్టిన వైనం
- మృతదేహంతోపాటు ఆధార్, పుస్తకాలు, సర్టిఫికెట్ల దహనం
- ఇద్దరినీ అరెస్టు చేసిన కసాపురం పోలీసులు


గుంతకల్లు టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా గుంతకల్లు మండలంలో జరిగిన భారతి (22) పరువు హత్య కేసులో పోలీసులు మరో కోణాన్ని గుర్తించారు. ఆమెను తండ్రి రామాంజనేయులే ఆత్మహత్యకు ఉసిగొల్పినట్లు భావించిన పోలీసులు.. మరింత లోతుగా విచారించగా, ఈ హత్యలో రామాంజనేయులు పెద్దల్లుడు, మృతురాలి బావ మారుతి పాత్ర ఉన్నట్లు బయట పడింది. దీంతో భారతి తండ్రి తుపాకుల రామాంజినేయులుతో పాటు, మారుతిని కసాపురం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన ఆటోను, పెట్రోల్ క్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. గుంతకల్లు డీఎస్పీ ఎ.శ్రీనివాసులు విలేకరులకు గురువారం తెలిపిన వివరాలు.. గుంతకల్లు పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన తుపాకుల రామాంజనేయులు స్థానికంగా టిఫెన్ సెంటర్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు భార్య, నలుగురు కూతుళ్లు ఉన్నారు. చిన్న కూతురు భారతి డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. తిలక్ నగర్‌కే చెందిన యశ్వంత్‌ను ఆమె ఐదేళ్ల నుంచి ప్రేమిస్తోంది. ఈ విషయం తెలిసి భారతిని తండ్రి పలుమార్లు మందలించాడు. వేరే కులం యువకుడితో పెళ్లి వద్దని చెప్పినా ఆమె వినలేదు. చావనైనా చస్తానుగాని యశ్వంత్‌ను మరచిపోనని తెగేసి చెప్పింది. ఆగ్రహించిన తండ్రి.. కూతురిని కడతేర్చాలని నిర్ణయించుకున్నాడు. ఆటో తోలుకునే తన పెద్ద అల్లుడు మారుతిని ఈ నెల ఒకటో తేదీన ఇంటి వద్దకు రప్పించాడు. భారతినీ.. ఆమె పుస్తకాలు, సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, తాడు, పెట్రోల్ క్యాన్‌ను ఆటోలో తీసుకుని కసాపురం గ్రామ శివారులోని తిక్కస్వామి దర్గా వద్దకు వెళ్లాడు. అక్కడ చివరిసారి హెచ్చరించినా భారతి వినిపించుకోలేదు. దీంతో సమీపంలోని ఒక వేప చెట్టు కొమ్మకు ఉరివేసుకోవాలని భారతిని గద్దించాడు. భారతి తాడుకు ఉరివేసుకోగా, ఆమె కాళ్లు నేలను తాకాయి. దీంతో తాడును మరింత పైకి కట్టారు. భారతి ఉరి వేసుకుని, మృతి చెందే వరకూ ఇద్దరూ అక్కడే ఉన్నారు. ఆ తర్వాత మృతదేహాన్ని కిందికి దించి, వెంట తెచ్చుకున్న పెట్రోలు పోసి నిప్పంటించారు. భారతి సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, పుస్తకాలను ఆ మంటల్లో వేశారు. నాలుగు రోజుల తర్వాత, ఈ నెల 4వ తేదీన గుంతకల్లు టూ టౌన్ పోలీసుల ఎదుట రామాంజనేయులు లొంగిపోయాడు. కూతురిని తానే చంపేశానని చెప్పాడు. పోలీసులు మరుసటి ఉదయం మృతదేహాన్ని గుర్తించారు. అల్లుడిని కేసు నుంచి తప్పించాలని భావించి, రామాంజనేయులు నేరాన్ని తన ఒక్కడిపైనే వేసుకోవాలనుకున్నాడు. కానీ పోలీసులు గట్టిగా ప్రశ్నించడంతో అల్లుడి పాత్ర వెలుగులోకి వచ్చింది.

శ్రీశైలం ప్లంజ్‌పూల్ వద్ద..

ఆ గొయ్యిని తక్షణమే పూడ్చండి!

డ్యామ్ భద్రతకే ప్రమాదం.. రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర జల సంఘం ఆదేశం.. 2 రాష్ట్రాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

- మరమ్మతులకు ఇంత జాప్యమెందుకు?
- శ్రీశైలం, గుండ్లకమ్మ, రైవాడ, కాటన్ బ్యారేజీల్లో పనులకు రుణమిచ్చేందుకు ప్రపంచ బ్యాంకు రెడీ
- రూ.480 కోట్ల స్కీమ్‌లో కొనసాగుతారా.. లేదా? ఏపీని నిలదీసిన జలసంఘం
- వడ్డీ అధికంగా ఉందనడంపై అసహనం
- వానాకాలం వచ్చేలోపు పనులు చేయాలని నిర్దేశం
- నేటి నుంచే రంగంలోకి జలవనరుల శాఖ
- సీడబ్ల్యూపీఆర్ఎస్‌కు రూ.7 కోట్లు ఇవ్వడానికి రెడీ



శ్రీశైలం డ్యాం క్రస్ట్‌గేట్స్ దిగువన ప్లంజ్‌పూల్ ప్రాంతంలో ఏర్పడిన భారీ గుంత

అమరావతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయంలో ప్లంజ్‌పూల్ వద్ద ఏర్పడిన భారీ గొయ్యి డ్యాం భద్రతకే పెను ప్రమాదంగా మారిందని కేంద్ర జలసంఘం ఆందోళన వ్యక్తంచేసింది. దీనికి మరమ్మతులు చేపట్టకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర జల సంఘం నిలదీసింది. రూ.480 కోట్ల ప్రపంచ బ్యాంకు రుణంతో శ్రీశైలం ప్లంజ్‌పూల్‌తో పాటు గుండ్లకమ్మ, రైవాడ, సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ (ధవళేశ్వరం) ప్రాజెక్టుల మరమ్మతు పనులపై కదలిక లేకపోవడంతో.. గురువారం ఆంధ్ర, తెలంగాణ అధికారులతో జల సంఘం అధికారులు వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. రాష్ట్రం ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, సీఈ కబీర్ బాషా, రాష్ట్ర ప్రాజెక్టుల భద్రతాధికారి కుమార్ తదితరులు పాల్గొన్నారు. 2009 అక్టోబరులో సంభవించిన భారీ వరదలకు.. శ్రీశైలం క్రస్ట్ గేట్లు ఎత్తినప్పుడు దిగువకు నీరు జాలువారే ప్లంజ్ పూల్ ప్రాంతంలో భారీ గొయ్యి ఏర్పడింది. ఇది 120 మీటర్ల లోతు, 270 మీటర్ల వెడల్పు, 400 మీటర్ల పొడవున ఉన్నట్లు నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ), సెంట్రల్ సాయిల్-మెటీరియల్స్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్) నిపుణులు, ఇంజనీర్లు గతంలోనే అంచనా వేశారు. దీని కారణంగా డ్యాంకు ముప్పువాటిల్లే ప్రమాదం నెలకొన్నందున తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కూడా సూచించారు. ఈ పనులతో పాటు గుండ్లకమ్మ, రైవాడ, సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ (ధవళేశ్వరం) ప్రాజెక్టుల మరమ్మతులకు రూ.480 కోట్ల అర్థిక సాయం అందించేందుకు ప్రపంచబ్యాంకు ఇదివరకే ముందుకొచ్చింది. ప్లంజ్‌పూల్ వద్ద పనులకు రూ.14 కోట్లు, గుండ్లకమ్మ గేట్ల మార్పిడికి రూ.125 కోట్లు, మిగతా మొత్తం రైవాడ, ధవళేశ్వరం ప్రాజెక్టుల మరమ్మతులకు ఖర్చవుతుందని అంచనా వేశారు. రుణమిచ్చేందుకు ప్రపంచ బ్యాంకు కూడా సూత్రప్రాయంగా అంగీకరించినా పనుల్లో జాప్యంపై జలసంఘం తాజాగా తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసింది. పై నాలుగు ప్రాజెక్టులకు సంబంధించి ప్రపంచబ్యాంకు రుణ స్కీంలలో కొనసాగుతారో లేదో తేల్చిచెప్పాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ పథకాల కోసం ప్రపంచ బ్యాంకు నుంచి తీసుకునే రుణానికి వడ్డీ భారం అధికంగా ఉందంటూ రాష్ట్ర ఆర్థిక శాఖ వేస్తున్న కొర్రీలపై అసహనం వ్యక్తం చేసింది. వానాకాలం వచ్చేలోపు పనులు పూర్తిచేయడానికి వీలుగా తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించింది. ఈ పనులను సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్-పుణే)

ద్వారా వెంటనే మొదలుపెట్టాలని సూచించింది. దరిమిలా శుక్రవారం నుంచే జలవనరుల శాఖ రంగంలోకి దిగనుంది. గొయ్యి పూడ్చివేతకు వినియోగించిన టెక్నాలజీపై మేధోమథనం చేపట్టనుంది. సీడబ్ల్యూపీఆర్ఎస్‌కు రూ.7 కోట్లు అడ్వాన్సుగా చెల్లించేందుకు కూడా సుముఖత వ్యక్తం చేసింది. దీనిపై రాష్ట్ర ఆర్థిక శాఖతోనూ సంప్రదింపులు జరుపనుంది.

ప్లంజ్‌పూల్ సమస్య ఎప్పటిదంటే..!

శ్రీశైలం జలాశయం ప్లంజ్‌పూల్ వద్ద గొయ్యి సమస్య 1985లో మొదలైంది. అప్పట్లో భారీ వరదకు ప్రాజెక్టు స్పిల్‌వే గుండా ఉధృతంగా వరద ప్రవహించడంతో ప్లంజ్‌పూల్ ప్రాంతంలోని రాతి నేల దెబ్బతింది. అక్కడ భారీగా గుంతపడింది. దీనిపై కేంద్ర జల సంఘం సమీక్షించి.. మరమ్మతు చేపట్టింది. మళ్లీ 2000లో ఇదే సమస్య పునరావృతమైంది. అప్పుడు కూడా సిమెంట్ కాంక్రీట్ వేశారు. మళ్లీ 2009లో భారీ స్థాయిలో వరదలు రావడంతో అక్కడ 120 మీటర్ల లోతున భారీ గొయ్యి ఏర్పడింది. ఆ గొయ్యి వెడల్పు 270 మీటర్లు కాగా.. పొడవు 400 మీటర్లు ఉంది. దీనివల్ల ప్రధాన డ్యాంకే ముప్పు ఏర్పడుతుందని.. మరమ్మతులు చేయాలంటూ పొరుగు రాష్ట్రం తరచూ కేంద్రానికి లేఖలు రాస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో జల సంఘం మరమ్మతులకు ఆదేశాలివ్వడంతో శుక్రవారం నుంచే పనులు చేపట్టేందుకు ఏపీ జలవనరుల శాఖ సమాయత్తమైంది.

ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర దివస్

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో భాగంగా ప్రతి నెలా మూడో శనివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రాంతాల్లో 'స్వచ్ఛాంధ్ర దివస్'ను నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ కార్యదర్శులు, శాఖాధిపతులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ 'స్వచ్ఛాంధ్ర దివస్‌కు సంబంధించి, గత రెండు నెలల్లో ఎదురైన అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, ఈనెల 15న నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతంగా జరపాలి. కార్యక్రమ వివరాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. విజన్ 2047 కింద రాష్ట్రాన్ని పరిశుభ్ర, ఆరోగ్య, హరితాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు రూపొందించిన ప్రణాళికలను అమలు చేయాలి. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వస్తువుల నిషేధానికి కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలి. చేనేత, జౌళి శాఖ, ఎంఎస్ఎంఈ, ఖాదీ గ్రామీణ పరిశ్రమలు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ల భాగస్వామ్యంతో పర్యావరణ హితమైన వస్తువుల తయారీకి చర్యలు తీసుకోవాలి' అని స్పష్టం చేశారు.

పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్ నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయండి: సీఎస్

నగరాలకు క్లైమేట్ బడ్జెట్!

కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర పురపాలకశాఖ ఒప్పందం

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు తరాలకు సురక్షితమైన పర్యావరణాన్ని అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఓ వైపు సుస్థిర పట్టణాభివృద్ధి దిశగా ముందుకు సాగుతూనే కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ, జాతీయ పట్టణ వ్యవహారాల సంస్థలతో సిటీస్-2.0 వాతావరణ కార్యాచరణ ప్రణాళికను అమలు చేయడానికి త్రైపాక్షిక అవగాహన ఒప్పందం చేసుకుంది. రాజస్థాన్‌లోని జైపూర్‌లో నిర్వహించిన 12వ ప్రాంతీయ ఆర్థిక ఫోరం వేదికగా ఈ చారిత్రక ఒప్పందం జరిగింది. కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ సమక్షంలో రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ ఈ ఒప్పందంపై సంతకం చేశారు. ఒప్పందం ఫలితంగా ఏపీ ప్రభుత్వానికి రూ.23.10 కోట్ల గ్రాంటు లభించనుంది. ఈ నిధులతో నగరాలకు సంబంధించి రాష్ట్ర క్లైమేట్ సెంటర్ స్థాపన, రాష్ట్ర, నగర స్థాయిలో క్లైమేట్ డేటా అబ్జర్వేటరీల నిర్మాణం, డేటా ఆధారిత వాతావరణ కార్యాచర ప్రణాళికల రూపకల్పన, తక్కువ కార్బన్ నగరాల నిర్వహణ చట్టం ద్వారా మున్సిపల్ అధికారుల సామర్థ్యాల పెంపుదల కార్యక్రమాలు చేపట్టనున్నారు. సిటీస్-2.0 కార్యక్రమంలో ప్రత్యేకంగా నగరాలకు క్లైమేట్ బడ్జెట్ కేటాయించడం విశేషం. ఈ బడ్జెట్ ద్వారా వాతావరణ సంరక్షణకు సంబంధించిన కార్యక్రమాలకు తగిన ఆర్థిక మద్దతు లభిస్తుంది. అదనంగా మూడు స్థాయిల్లో సాంకేతిక సహాయ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో దేశీయ, అంతర్జాతీయ నిపుణుల భాగస్వామ్యంతో రాష్ట్ర నగర స్థాయిల్లో పర్యావరణ పరిరక్షణకు సమగ్ర మార్గదర్శకం అందించనున్నారు.

ఎంఆర్ దొరస్వామి కన్నుమూత

బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పీఈఎస్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి(88) మృతిచెందారు. వయోభారం సమస్యలతో ఆయన కొన్నాళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. బెంగళూరు బనశంకరి రెండోస్టేజ్‌లోని తన నివాసంలో గురువారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య రాధామనోహరి, కుమారుడు జవహర్ దొరస్వామి, కూతురు డాక్టర్ రూప సురేశ్ ఉన్నారు. చిత్తూరు జిల్లాలోని మారుమూల గ్రామంలో జన్మించిన దొరస్వామి, ఉన్నత విద్యకోసం బెంగళూరుకు బంధువుల ఇంటికి వచ్చారు. ఎంఏ, బీఎల్ పూర్తి చేశారు. పీఈఎస్ విద్యాసంస్థను స్థాపించి, కొంత కాలం ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఆ తర్వాత హనుమంతనగర్‌లో పీయూ కళాశాలను ప్రారంభించారు. ఆ విద్యాసంస్థలు ప్రస్తుతం పీఈఎస్ యూనివర్సిటీగా మారాయి. ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర సంతాపం ప్రకటించారు.

'తొక్కిసలాట' ఘటనలో మరో పది మందికి సమన్లు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 6(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో 'తొక్కిసలాట' ఘటనకు సంబంధించి విచారణకు హాజరు కావాలంటూ మరో పది మందికి గురువారం రాత్రి సమన్లు జారీ అయ్యాయి. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య న్యాయ విచారణ కమిషన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి ఈ నెల 17వ తేదీ నుంచి మూడో దశ విచారణ చేపట్టనున్నారు. ఇప్పటికే పలువురికి సమన్లు, నోటీసులు జారీ చేశారు. తాజాగా జనవరి 8న బైరాగిపట్టెడ పార్కు వద్ద విధుల్లో ఉన్న ఇతర జిల్లాలకు చెందిన పది మంది పోలీసు అధికారులు, సిబ్బందికి సమన్లు పంపించారు.

ఎక్సైజ్‌లో పెరుగుతున్న అవినీతి ఆరోపణలు

- షాపునకు 5వేలు అడుగుతున్నారని ఇద్దరిపై ఫిర్యాదు

అమరావతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖపై అవినీతి ఆరోపణలు పెరుగుతున్నాయి. షాపునకు రూ.10 వేలు డిమాండ్ చేసిన అంశం ఇటీవల కలకలం రేపగా తాజాగా షాపునకు రూ.5వేలు అడుగుతున్నారంటూ ఇద్దరు అధికారులపై ప్రభుత్వానికి ఫిర్యాదులందాయి. ప్రకాశం జిల్లాకు చెందిన ఓ సీనియర్ అధికారి, ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలోని ఓ ఆఫీస్ సూపరింటెండెంట్‌పై ఈ మేరకు కొందరు లైసెన్సీలు ఇటీవల ఫిర్యాదు చేశారు. మరోవైపు ఎక్సైజ్ నేరాలను నియంత్రించాల్సిన ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్‌పైనా క్షేత్రస్థాయిలో ఫిర్యాదులు వస్తున్నాయి. కేంద్రం కార్యాలయంలోని ఇద్దరు అధికారులు తమకు నచ్చినట్లుగా సొంత నిబంధనలు అమలు చేస్తున్నారని, ఈ క్రమంలో కేసులు రాయకుండా అడ్డుకుంటున్నారనే వాదన వినిపిస్తోంది. వారికి భయపడి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసేందుకు లైసెన్సీలు భయపడుతున్నారు.

గీత కులాలకు మద్యం షాపులు కేటాయింపు

అమరావతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గీత కులాలకు ప్రకటించిన మద్యం షాపులను ఎక్సైజ్ శాఖ గురువారం కేటాయించింది. రాష్ట్రవ్యాప్తంగా 15 జిల్లాల్లో 202 షాపులకు 3,955 దరఖాస్తులు రాగా... లాటరీ ద్వారా లైసెన్సీలను ఎంపిక చేసింది. గీత కులాల మద్యం షాపుల పాలసీలో 339 షాపులు గుర్తించగా ఎమ్మెల్సీ ఎన్నిలకు ముందు 137 షాపులు కేటాయించారు. ఎన్నికల కోడ్ వల్ల 15 జిల్లాల్లో 202 షాపులకు లాటరీ నిర్వహణ నిలిపివేయగా, ఆ ప్రక్రియను గురువారం పూర్తిచేశారు. మొత్తంగా గీత కులాలకు 339 షాపులు ఇచ్చారు.



మృతులు బొంతు భీమేశ్వరరావు, జుత్తిగ భవాని, మటపర్తి భవాని, డ్రైవర్ మధుసూదన్

నిద్రలోనే మృత్యుఒడికి..

- ఆగి ఉన్న లారీని ఢీకొట్టి ప్రైవేటు బస్సు బోల్తా
- బస్సు డ్రైవర్‌తోపాటు ముగ్గురు ప్రయాణికుల దుర్మరణం
- 21 మందికి తీవ్ర గాయాలు..ఏలూరు జిల్లాలో ఘోర ప్రమాదం

ఏలూరు క్రైం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఏలూరు సమీపంలోని 16వ నంబర్ జాతీయ రహదారిపై చొదిమెళ్ల వద్ద గురువారం వేకువ జామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రైవేటు ట్రావెల్ బస్సు టైరు పంక్చర్ పడడంతో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్‌తో పాటు ముగ్గురు ప్రయాణికులు దుర్మరణంపాలయ్యారు. మరో 21 మంది తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి కాకినాడ బయలుదేరిన బస్సులోని ప్రయాణికులంతా గాఢనిద్రలో ఉండగా ఈ ఘోరం జరిగింది. ఆర్తనాదాలతో దద్దరిల్లిన ఆ ప్రాంతానికి స్థానికులు, హైవే పెట్రోలింగ్ పోలీసులు హుటాహుటిన చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు, క్షతగాత్రుల కథనం మేరకు.. హైదరాబాద్ నుంచి కాకినాడకు రమణ ట్రావెల్ బస్సు బుధవారం రాత్రి బయలుదేరింది. గురువారం తెల్లవారుజాము 5.30 గంటల సమయంలో ఏలూరు సమీపంలోని చొదిమెళ్ల వద్ద బస్సు వేగంగా వెళ్తుండగా, టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని అతివేగంగా ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సు ఎడమభాగం నుజ్జునుజ్జుకాగా, ఏలూరు జిల్లా భీమడోలు మండలం గుర్రాల చెరువుకు చెందిన బొంతు భీమేశ్వరరావు(43), కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం కాట్రావులపల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మటపర్తి భవాని(23), కాజులూరు మండలం కోలావారిపేట, పల్లిపాలేనికి చెందిన జుత్తిగ భవాని(38) అక్కడికక్కడే మరణించారు. కాకినాడకు చెందిన బస్సు డ్రైవర్ ముంగంటి మధుసూదన్(38) ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన 21 మందిని ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడినవారంతా వేరే బస్సులో తమ గ్రామాలకు వెళ్లిపోయారు. కాగా, ప్రమాదం జరిగిన వెంటనే బస్సు రెండో డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బస్సు

స్థానిక సంస్థల పనుల మంజూరు పరిమితి పెంపు

అమరావతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ, జిల్లా పరిషత్, మండల పరిషత్‌ల పరిపాలన మంజూరు పరిమితులను పెంచుతూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మండల పరిషత్‌లకు ఇప్పటి వరకు రూ.3లక్షల విలువైన పనులు మంజూరు చేసే అధికారం ఉండేది. తాజాగా ఈ పరిమితిని రూ.10 లక్షలకు పెంచారు.

10 నుంచి ఏపీపీఎస్సీ హాల్ టికెట్లు

ఏపీపీఎస్సీ నిర్వహించనున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పోస్టుల స్క్రీనింగ్ టెస్ట్ హాల్ టికెట్లు 10వ తేదీ నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఈ నెల 16న జరగనున్న స్క్రీనింగ్ పరీక్ష కోసం ఏపీపీఎస్సీ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని కమిషన్ గురువారం సూచించింది.

లైసెన్స్‌డ్ ఎలక్ట్రీషియన్లతోనే విద్యుత్తు సేవలు

రాష్ట్రంలో గృహాలు, పరిశ్రమలు, కార్యాలయాల్లో విద్యుత్తు కనెక్షన్లు, వైరింగ్ పనులు సహా ఇతర విద్యుత్తు పరికరాల బిగింపు, మార్పిడి కేవలం లైసెన్స్‌డ్ ఎలక్ట్రీషియన్లతోనే చేపట్టాలని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.



DINESH VIJAN PRESENTS
MADDOCK FILMS
నేడే విడుదల
తెలుగులో
ఛావా
DIRECTED BY LAXMAN UTEKAR
PRODUCED BY DINESH VIJAN
MUSIC BY A.R. RAHMAN
A MADDOCK FILMS PRODUCTION




నేడే విడుదల
సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు



SHE films
నేడే విడుదల
NAARI
THE WOMEN
PRODUCED BY SMT. SASHI VANTIPALLI
WRITTEN & DIRECTED BY SURYA VANTIPALLI
మహిళా దినోత్సవ కానుకగా



శ్రీ ఇందిరా కంబైన్స్
నేడే విడుదల
జిగేల్
నిర్మాతలు : డా॥ వై.జగన్మోహన్, నాగార్జున అల్లం
దర్శకత్వం : మల్లి యేలూరి
Release By Sri Vijaya Films




NVR CINEMA
ఉగాదికి వస్తున్నాడు
CHIYAAN VIKRAM
వీర ధీర శూర
PART-2
AN S.U. ARUN KUMAR PICTURE
A GV PRAKASH KUMAR MUSICAL
VEERA DHEERA SOORA
ISSUED BY : NVR CINEMA - 79895 67742, 99669 63111



THEY REMAIN UNSEEN BUT THEIR LOVE LEAVES A MARK
ADITYA MUSIC
SHREE PADMINI CINEMAS
నేడే విడుదల
రా రాజా




ZEE STUDIOS & PARALLEL UNIVERSE PICTURES
G V PRAKASH KUMAR
కింగ్స్టన్
AND THE CURSED SEA
నేడే విడుదల



వనజాక్షి.. ఇదేం పని?

220 కేవీ అలైన్‌మెంట్ మాయ



పెదపారుపూడి మండలం ఈదులమద్దాలి గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ టవర్

తహసీల్దార్ వనజాక్షి భర్త, బంధువుల భూములను తప్పించటానికి ట్రాన్స్‌కోపై ఒత్తిడి

కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో అలైన్‌మెంట్ మార్పు

- 33 ఎకరాల వనజాక్షి భర్త, బంధువుల భూముల నుంచి లైన్ వెళ్లకుండా మార్పు
- సామాన్య రైతుల భూముల్లోకి అలైన్‌మెంట్ మారటంతో కోర్టుకెళ్లిన రైతులు
- ప్రభుత్వం విచారణకు ఆదేశించాలని గుడివాడ ప్రజల వినతి

దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అక్రమంగా ఇసుక తవ్వుతుంటే అడ్డుకున్నందుకు తనపై దాడి చేశారని నానాయాగీ చేసిన తహసీల్దార్ వనజాక్షి.. వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని తమ భూములను రక్షించుకునేందుకు పేదల భూములను ఎరగా వేశారు. పేదల భూములు అయితే ఒక న్యాయం.. రెవెన్యూ అధికారులు, వారి బంధువులు అయితే మరో న్యాయం అన్నట్టుగా వనజాక్షి భర్త, వారి బంధువుల భూములను గుడివాడ-మెరకగూడెం 220 కేవీ ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ టవర్ లైన్ అలైన్‌మెంట్ నుంచి అడ్డగోలుగా తప్పించేశారు. ఈ క్రమంలో తమకు అన్యాయం జరిగిందని రైతులు కోర్టును ఆశ్రయించారు. భూములను తప్పించిన విషయం బయట పడుతుందని ట్రాన్స్‌కో అధికారులు కోర్టుకు సమాచారం ఇవ్వట్లేదు. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న ఈ అలైన్‌మెంట్ మాయ కారణంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎందరో రైతులు నష్టపోవాల్సి వస్తోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గుడివాడ ప్రాంత ప్రజల విద్యుత్ కష్టాలను తీర్చటానికి వీలుగా యలమర్రు వద్ద 400/220/132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు రూ.19 కోట్ల నిధులు కేటాయించారు. దీంతో పాటు యలమర్రులోనే 69.03 ఎకరాల భూములను కూడా సబ్‌స్టేషన్‌కు కేటాయించారు. అప్పట్లో పనులు ప్రారంభించినా వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పర్యవేక్షణ లేక పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటికి కూడా పూర్తికాలేదు. ఈ సబ్‌స్టేషన్‌కు గుడివాడ నుంచి జంక్షన్ వెళ్లే ప్రాంతం మెరకగూడెం సబ్‌స్టేషన్ వరకు 220 కేవీ ట్రాన్స్‌మిషన్ విద్యుత్ హైటెన్షన్ లైన్లను వేయాల్సి ఉంది. ఇందులో నిర్దేశించిన అలైన్‌మెంట్ ప్రకారం పెదపారుపూడిలో ఏడు కిలోమీటర్ల మేర అలైన్‌మెంట్‌ను మార్చారు. నిర్దేశిత అలైన్‌మెంట్ కంటే కూడా 340 అడుగుల తేడాతో అలైన్‌మెంట్‌ను మార్చటం జరిగింది. ఈ ఏడు కిలోమీటర్ల పరిధిలో భూములను తప్పించటానికి అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో తహసీల్దార్ వనజాక్షి తన అధికారాన్ని అడ్డం పెట్టుకుని ట్రాన్స్‌కో అధికారులపై ప్రభావం చూపి భూములను అలైన్‌మెంట్ నుంచి తప్పించినట్టు ఆరోపణలు వస్తున్నాయి.

ఇలా బయట పడింది..

గుడివాడ-మెరకగూడెం 220 కేవీ ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ లైన్ అలైన్‌మెంట్‌కు సంబంధించి 2023, మార్చి 14న ట్రాన్స్‌కో ఎస్ఈ గజిట్ నోటిఫికేషన్ విడుదలకు ప్రభుత్వానికి లేఖ రాశారు. గజిట్ నోటిఫికేషన్ విడుదల కాకముందే అనధికారికంగా పెదపారుపూడి దగ్గర ఏడు కిలోమీటర్ల మేర అలైన్‌మెంట్‌ను మార్చేశారు. అంతర్గత సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టుగా ఇంటర్నల్ మినిట్స్‌లో పొందుపరిచారు. ఇదే సందర్భంలో 12 కిలోమీటర్ల మేర పనులు చేసుకోమని కాంట్రాక్టర్‌కు అనుమతులిచ్చినట్టు కూడా మినిట్స్‌లో ఉంది. ఇంటర్నల్ మినిట్స్‌లో పొందుపరిచిన అంశాలు సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగుచూశాయి. వాస్తవానికి గజిట్ నోటిఫికేషన్‌కు లేఖ ఇచ్చినపుడు ఈ మార్పులు చేయకూడదు. ఈ క్రమంలో ట్రాన్స్‌కో ఎస్ఈ ఇచ్చిన లేఖ ప్రకారం 2023, ఏప్రిల్ 6న ప్రభుత్వం గజిట్ నోటిఫికేషన్‌ను వెలువరించింది. ఈ అలైన్‌మెంట్‌పై స్థానిక ప్రజల అభిప్రాయాలు, అభ్యంతరాలను కోరుతూ రెండు నెలల గడువు ఇచ్చారు. గజిట్ ప్రకారం రెండు నెలల్లో అభ్యంతరాలు తీసుకోవాల్సి ఉండగా, గజిట్ విడుదల కాకముందే అధికారులు అలైన్‌మెంట్ మార్చేశారు. తహసీల్దార్ వనజాక్షి ప్రభావం కారణంగానే అలైన్‌మెంట్‌ను మార్చారన్న ఆరోపణలు ఉన్నాయి. కిందటి వైసీపీ ప్రభుత్వ పెద్దల ఆదేశాల వల్ల కూడా అలైన్‌మెంట్‌ను మార్చినట్టు విమర్శలు ఉన్నాయి.

అలైన్‌మెంట్ నుంచి తప్పించిన భూములన్నీ తహసీల్దార్ వనజాక్షి భర్త, వారి బంధువులవే..

- తహసీల్దార్ వనజాక్షి భర్త పొట్లూరి లోకేశ్‌కు చెందిన సర్వే నెంబర్ 29-1, 30-1, 30-2, 31-2, 32-1, 33-1 (ఎల్‌పీఎం నెంబర్ 92)లోని 11.51 ఎకరాల భూమి తప్పించిన అలైన్‌మెంట్ పరిధిలో ఉంది.
- బంధువైన కోడె వెంకట సుబ్బారావుకు చెందిన సర్వే నెంబర్ 183-4 (ఎల్‌పీ నెం.664) లోని 1.7 ఎకరాలు
- తహసీల్దార్ వనజాక్షి భర్త తరఫు బంధువులైన పొట్లూరి రామకృష్ణ ప్రసాద్‌కు చెందిన సర్వే నెంబర్ 131 (ఎల్‌పీ నెం.315)లోని 5.52 ఎకరాలు, సర్వే నెంబర్ 239-2బీ (ఎల్‌పీ నెం.458)లో 3 ఎకరాలు
- పొట్లూరి ప్రమీలాదేవికి చెందిన సర్వే నెంబర్ 145-6 (ఎల్‌పీ నెం. 331)లోని 0.80 ఎకరాలు
- పొట్లూరి లలితకు చెందిన సర్వే నెంబర్ 145-5, 145-7ఏ, 145-7బీ (ఎల్‌పీ నెం.332)లో 1.9 ఎకరాలు, సర్వే నెంబర్ 155-1 (ఎల్‌పీ నెం.376)లో 2 ఎకరాలు, సర్వే నెంబర్ 182-1, 182-2ఏ, 284-16ఏ, 184- 16బీ, 184-17 (ఎల్‌పీ నెం.643)లో 1.77 ఎకరాలు
- పొట్లూరి వెంకటేశ్వరరావుకు చెందిన సర్వే నెంబర్ 143-4ఏ (ఎల్‌పీ నెం.329)లో 1.00 ఎకరం, సర్వే నెంబర్ 145-1 (ఎల్‌పీ నెం.340)లోని 0.76 ఎకరం
- పొట్లూరి సుజాతకు చెందిన సర్వే నెంబర్ 145-3, 146-4, 147-3, 148-3, 149-4 (ఎల్‌పీఎం నెంబర్లు 1037, 1038, 1040)లో 0.21 ఎకరం, 2.00 ఎకరాలు, 0.75 ఎకరం

మామిడి మొద్దులను లారీలో లోడు చేస్తున్న కూలీలు



చెట్లు కొట్టేస్తున్నారు

మైలవరం మండలంలో తొలగిస్తున్న మామిడి తోటలు

- 9 వేల నుంచి 6,800 ఎకరాలకు పడిపోయిన సాగు
- పెరిగిన పామాయిల్ సాగు

(ఆంధ్రజ్యోతి, మైలవరం రూరల్): మధుర ఫలం మామిడికి ఈ ఏడాది కూడా నష్టాలు వచ్చే పరిస్థితులు దాపురించడంతో మామిడి సీజన్ ప్రారంభం కాకముందే మైలవరం మండలంలో తోటలను రైతులు నరికివేస్తున్నారు. గత ఐదారు సంవత్సరాల నుంచి మామిడి పంట ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో దాన్ని తీసివేసి వేరే పంటల సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. మార్కెట్‌లో నూజివీడు మామిడి తర్వాత మైలవరం ప్రాంత మామిడి కాయలకు మంచి పేరుంది. అయితే ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా ఖర్చులు పెరిగి, దిగుబడి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో మామిడి రైతులు చెట్లను తెగనమ్ముకుంటున్నారు. సైజును బట్టి ఒక్కో చెట్టును రూ.4వేల నుంచి 6వేల వరకు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. గతంలో మైలవరం మండలంలో తొమ్మిది వేల ఎకరాల విస్తీర్ణంలో మామిడి తోటలు ఉండేవి. ఐదు సంవత్సరాల నుంచి వివిధ కారణాలతో తోటలు నరికి వేస్తుండటంతో ప్రస్తుతం మామిడి తోటల విస్తీర్ణం 6,800 ఎకరాలకు పడిపోయింది. రానున్న రోజుల్లో కూడా మామిడి తోటలకు గడ్డు కాలం నడిస్తే మార్కెట్‌లో మైలవరం మామిడి కనుమరుగయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మామిడి పంట సాగుకు కూడా సబ్సిడీలు ప్రకటించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పెరిగిన ఖర్చులు, తగ్గిన దిగుబడి

మామిడి తోటల సాగుకు గతం కంటే ప్రస్తుతం ఖర్చులు అధికమయ్యాయి. వర్షాకాలంలో దుక్కులు, చెట్లకు బలం కోసం భూమిలో మందులు, కాపు సమయంలో రసాయనిక

మిగతా 8లో..

పంట ఎండిపోతోంది..!

ఏటూరు, కంచల మేజర్ల ఆయకట్టు రైతుల ఆక్రోశం

- సాగర్ నీటి నిలిపివేతతో ఎన్ఎస్ఎల్‌బీసీ జోన్లపై ఎఫెక్ట్!
- అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలి

10లో

ఇక భగభగ!

నేడు, రేపు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో వడగాడ్పులు

నమోదు కానున్న అధిక ఉష్ణోగ్రతలు



మచిలీపట్నం/ఇబ్రహీంపట్నం, మార్చి6 (ఆంధ్రజ్యోతి): మార్చి మొదటి వారంలోనే కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలు మండిపోతున్నాయి. రానున్న రెండు రోజుల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతోపాటు వడగాడ్పులు వీస్తాయని వాతావరణశాఖ గురువారం జారీ చేసిన హెచ్చరికలు మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. కృష్ణాజిల్లాలో గన్నవరం, చల్లపల్లి, ఘంటసాల, గుడివాడ, గుడ్లవల్లేరు. గూడూరు, కంకిపాడు, కోడూరు. మోపిదేవి,

మిగతా 8లో..

ఆర్టీసీలో సరదా బుల్లోడు(ఆర్టీసీ విజయవాడ జోన్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగంలో ఓ అధికారి) ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. తన మందు, విందు, చిందులకు ఏకంగా పర్సనల్ ట్యాక్స్ విధిస్తున్నారు. ఆయన ఏ డిపోకు వెళితే అక్కడ అప్పటికప్పుడే ట్యాక్స్ చెల్లించాల్సిందే. లేకుంటే స్థాన చలనమే. ఈ సరదా బుల్లోడి అవసరాలు తీర్చలేక బస్ డిపోల్లోని సెక్యూరిటీ సిబ్బంది అల్లాడిపోతున్నారు. ఈయన గారికి చెల్లించిన ఫోన్‌పేలు, పంపిన మందు బాటిళ్ల చిట్టాలను ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవటం లేదని వాపోతున్నారు.

సరదా బుల్లోడు!

ఆర్టీసీ విజయవాడ జోన్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం అధికారి రూటే సపరేటు

- మందు, విందు, చిందులకు పర్సనల్ ట్యాక్స్ విధింపు
- సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ తరహాలో డిపోల్లో సెక్యూరిటీ సిబ్బందికి డీఎస్‌టీ
- నెలవారీ ఫోన్‌పేల ద్వారా డబ్బులు, మద్యం బాటిళ్లు పంపాల్సిందే!
- సెక్యూరిటీ సిబ్బందిని ఏజెంట్లుగా పెట్టుకుని అక్రమ వసూళ్లు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) విజయవాడ జోన్ పరిధిలో సంస్థని సంస్కరించాల్సిన విభాగం కాసా అవినీతి కంపుకొడుతోంది. ఆర్టీసీలో జరిగే అవినీతి వ్యవహారాలపై దృష్టి సారించి అటకట్టించాల్సిన విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగమే అవినీతిమయం కావడంతో ఇక అడ్డూ అదుపూ లేకుండా పోయాయి. యథా గురువు తథా శిష్యులు అన్నట్టుగా ఆర్టీసీ అధికారులు కూడా పీకల్లోతు అవినీతిలో కూరుకుపోతున్నారు. విజయవాడ జోన్ ఆర్టీసీలో విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం పూర్తిగా భ్రష్టుపట్టిపోయింది.

నిద్రలో నిఘా

ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల ఆర్టీసీలోని కొందరు అధికారులపై తీవ్ర అవినీతి ఆరోపణలు ఉన్నాయి. రెండు జిల్లాల్లో పలువురు డిపో మేనేజర్లు సెలవులు, సస్పెన్షన్ కేసులు, డిపో స్పేర్ కేసుల పేరుతో విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారని సమాచారం. గ్యారేజీలు, వర్క్‌షాప్‌లు, టైర్స్, స్టోర్స్ విభాగాల్లో అనేక అవినీతి వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నాయి. బస్సులకు బాడీ బిల్డింగ్ వ్యవహారంలో కూడా అవినీతి బాగోతాలు

మిగతా 8లో..

విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి ఏ డిపోకు వెళితే అక్కడ ఆయన గారి సరదాల కోసం సెక్యూరిటీ సిబ్బంది రూ. 15 వేల నుంచి రూ. 20 వేల వరకు ఖర్చులు చేయాల్సి వస్తోందని సమాచారం. ఖర్చు చేయకపోతే హిట్‌లిస్ట్‌లో ఉంటామన్న ఉద్దేశంతో సెక్యూరిటీ సిబ్బంది డబ్బులు ఖర్చు చేస్తున్నారు. ఈ అధికారి వెళ్లని డిపోల నుంచి నెలవారీగా ఫోన్‌పేల ద్వారా డబ్బులు పంపించాల్సి ఉంటుందని సమాచారం. వారంలో రెండు సార్లు విజయవాడ వన్‌టౌన్ నుంచి ప్లాస్టిక్ సామాన్లు, చెప్పుల బండిల్స్, మచిలీపట్నం నుంచి అక్కడి కానిస్టేబుల్ ద్వారా వన్ గ్రామ్ గోల్డ్ వస్తువులను తెప్పించి రాజమండ్రి బస్సులో ఎస్ఆర్‌లో రాసి పంపించటం జరుగుతోందని తెలిసింది. ఈ విధంగా ఆర్టీసీ కార్గో వ్యవస్థను మోసం చేస్తున్నట్టు సమాచారం. వినుకొండ డిపోలో ఓ కాంట్రాక్టర్ రూ.7లక్షల అవినీతి చేస్తే, ఈ విషయం బయట పడకుండా ఉండటానికి అతని వద్ద రూ.లక్ష వసూలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇదే వినుకొండలో ఓ కానిస్టేబుల్ అసభ్య ప్రవర్తనపై సస్పెన్షన్‌కు గురైతే ఆ తర్వాత డబ్బులు తీసుకుని ఏడీకి కూడా తెలియకుండా సస్పెన్షన్ ఎత్తేసినట్టు ఫిర్యాదులున్నాయి. ఆటోనగర్, విజయవాడ బస్ డిపోల పరిధిలో అనేక అక్రమ వసూళ్లపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి.

ఎక్కడకెళితే అక్కడ రాచమర్యాదలు

బ్యూటిఫుల్.. బెజవాడ..!

- నగర సమగ్రాభివృద్ధికి సత్వర డీపీఆర్‌లు
- విస్తృత ప్రజాప్రయోజన మౌలిక వసతుల పనులపై ప్రత్యేక దృష్టి
- కాలువగట్ల సుందరీకరణ, వాకింగ్ ట్రాక్‌లు, ఫుడ్‌కోర్టుల ఏర్పాటుకూ చర్యలు
- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్‌బాబు

10లో



ఇఫ్తార్ (సాయంత్రం) : 6-15 (శుక్ర)
సహర్ (ఉదయం) : 5-09 (శని)



విజయవాడలోని కేపీ నగర్‌లో నూతనంగా నిర్మించబోయే ఎన్టీఆర్ ట్రస్ట్ భవన నిర్మాణానికి గురువారం భూమి పూజ చేసి హారతి తీసుకుంటున్న ట్రస్టీ నారా భువనేశ్వరి



తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడ ధర్నాచౌక్‌లో గురువారం ధర్నా నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

దుర్గగుడిలో చీరల గోల్‌మాల్‌పై నేడు, రేపు విచారణ

- 2018-2019 మధ్య రూ.కోట్ల విలువైన 33,686 చీరలు మాయం
- జూనియర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యంపై ఆరోపణలు
- విచారణ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోనున్న ఈవో

ఇంద్రకీలాద్రి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో కోట్ల రూపాయల విలువైన చీరల గోల్‌మాల్ వ్యవహారంపై విచారణకు రంగం సిద్ధమైంది. శుక్ర, శనివారాల్లో ఆయా విభాగాల్లోని ఉద్యోగులను అధికారులు విచారించనున్నారు. వివరాల్లోకి వెళితే.. ఇంద్రకీలాద్రిపై 2018 మే 25 నుంచి 2019 ఆగస్టు 31 వరకు చీరల విభాగంలో జూనియర్ అసిస్టెంట్ టి.సుబ్రహ్మణ్యం పనిచేసిన కాలంలో రూ.1,66,54,822 విలువ గల 33,686 సాధారణ చీరలు మాయమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయనపై పలు అభియోగాలు మోపుతూ తాత్కాలికంగా విధుల నుంచి నిలుపుదల చేశారు. సుబ్రహ్మణ్యం తనపై వచ్చిన అభియోగాలను కోర్టులో సవాల్ చేశారు. దీంతో అతనిని తిరిగి ఉద్యోగంలోకి తీసుకున్నారు. ఇప్పుడు తాజాగా ఈవోగా వచ్చిన దేవదాయ కమిషనర్ కె.రామచంద్రమోహన్ గతంలో జరిగిన విషయాలన్నింటినీ పరిశీలించి చీరల గోల్ మాల్ విషయంలో అసలు ఏమి జరిగిందన్న దానిపై నిగ్గు తేల్చేందుకు డిప్యూటీ కమిషనర్ తదితరులతో విచారణ కమిటీని నియమించారు. విచారణ కమిటీ కొద్దిరోజుల క్రితం ప్రాథమిక సమాచారాన్ని సేకరించింది. శుక్ర, శనివారాల్లో ఆయా సంబంధిత విభాగాల ఏఈవోలు, సూపరింటెండెంట్లు, గుమస్తాలను విచారించనుంది. కాగా, ఈ గోల్ మాల్ మొత్తానికి కారణమనే ఆరోపణలు ఎదుర్కొంటున్న టి.సుబ్రహ్మణ్యం హైకోర్టు ఉత్తర్వుల మేరకు విధుల్లోనే కొనసాగడం గమనార్హం.

అసెంబ్లీ వేదికగా



గరికపాడు పాలిటెక్నిక్ కళాశాలలో వ్యవసాయ డిగ్రీ కోర్సులు ప్రారంభించాలి

- పోలంపల్లి డ్యాం మరమ్మతులకు నిధులు ఇవ్వండి
- వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించాలి
- దేవదాయ శాఖలో సంస్కరణలు చేయాలి
- ఎమ్మెల్యే తాతయ్య



జగ్గయ్యపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : గరికపాడు కేవీకేలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో అగ్రికల్చర్ బీఎస్సీని ప్రారంభించాలని, పోలంపల్లి మునేరు డ్యాం మరమ్మతులకు తక్షణం నిధులు కేటాయించాలని, ముక్త్యాల ఎత్తిపోతల పథకాన్ని పునఃప్రారంభించాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య గురువారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీలో మాట్లాడిన ఆయన గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీల కొరత వల్ల యాంత్రీకరణకు ప్రాధాన్యత ఇచ్చి సబ్సిడీపై పరికరాలు ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలో కీలకమైన పోలంపల్లి మునేరు ఆయకట్టు పరిరక్షణకు ఆనకట్ట రిపేర్లకు నిధులు వెంటనే విడుదల చేయాలని, గత ప్రభుత్వ నిర్వాకం వల్ల మూలనపడిన ముక్త్యాల ఎత్తిపోతల పథకాన్ని తిరిగి ప్రారంభించాలని కోరారు. గరికపాడు కేవీకేలో వ్యవసాయంపై డిగ్రీ కోర్సులు ప్రారంభించటంతో పాటు సేంద్రియ వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇవ్వాలని, సేంద్రియ ఉత్పత్తులను గుర్తించేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

ఒక ఆలయానికి 22 బ్యాంకు ఖాతాలా..

దేవదాయ శాఖలో ఒక ఆలయానికి 22 బ్యాంకు ఖాతాలు అవసరమా అని తాతయ్య అసెంబ్లీలో ప్రశ్నించారు. తన కుటుంబీకులు ధర్మకర్తలుగా ఉన్న శ్రీరంగనాయకస్వామి దేవస్థానం నిర్వహణకు 22 బ్యాంకు ఖాతాలు ఉన్నాయని, ఇటీవల రాష్ట్రంలో ఒక ఆలయం డిపాజిట్లను ఇవో స్వాహా చేశారన్న ఆరోపణలు వచ్చాయని, ఇప్పటికైనా కరెంట్, సేవింగ్స్ ఆకౌంట్లు రెండు మాత్రం నిర్వహించేలా చూడాలని కోరారు. ఉద్యోగులు, సిబ్బందిల విషయంలో అనేక ఏజెన్సీలు వద్దని, సిబ్బంది నియామక విధానం రద్దు చేయాలని ఆయన కోరారు.

అంబేడ్కర్ స్మృతివనం అభివృద్ధి చేయాలి

- బొండా ఉమా



అజిత్‌సింగ్‌నగర్ : విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి పరిచేందుకు నిధులు కేటాయించాలి. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే అంబేడ్కర్ భారీ విగ్రహం, స్మృతి వనం నిర్మిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇవ్వగా.. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే హడావుడిగా విగ్రహాన్ని ఏర్పాటు చేసి అసంపూర్తిగా ప్రారంభించారు. ప్రస్తుతం స్మృతివనంలో సరైన మౌలికసదుపాయాలు లేవు. ప్రభుత్వం నిధులు కేటాయించాలి.

వెటర్నరీ కళాశాల ప్రహరీ మరమ్మతులకు నిధులు కేటాయించాలి

- యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం : వెటర్నరీ కళాశాల ప్రహరీకి మరమ్మతులకు నిధులు కేటాయించాలి. చేపట్టాలి. బ్రిటీష్ కాలంలో బ్రహ్మాండంగా ఉన్న కళాశాల ప్రభుత్వాలు మారుతుంటే ప్రాధాన్యతను కోల్పోతోంది. విమానాశ్రయం చెంతనే ఉన్న కళాశాల కళవిహీనంగా తయారైంది. దీని మరమ్మతులకు రూ.56లక్షలు మంజూరు చేయాలి. కేడీసీసీ బ్యాంకులో 2023లో కొనుగోలు చేసిన టీసీఎస్ సాఫ్ట్‌వేర్ అంశంపై విచారణ జరపాలి.

మాజీ మంత్రి అవినీతిపై విచారణ చేపట్టండి

- వెనిగండ్ల రాము



గుడివాడ : వైసీపీ ప్రభుత్వ హయాంలో పౌర సరఫరాల శాఖ మంత్రి, అధికారుల కోట్లాది రూపాయల అవినీతిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలి. నాడు కొడాలి నాని పౌరసరఫరాల మంత్రిగా ఉండి పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని బొక్కేశారు. పట్టణంలో 40వేల రేషన్ కార్డులుంటే కేవలం 12వేల కార్డులకు కేంద్రం యిచ్చిన బియ్యం పంపిణీ చేశారు. మిగిలిన బియ్యం ఎక్కడికి వెళ్లిందో పూర్తిస్థాయి విచారణ చేపట్టాలి.

టైలరింగ్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన తరగతుల కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేయుటలో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు కోరుతున్నట్టు కార్యనిర్వాహక సంచాలకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వెనుకబడిన తరగతులకు చెందిన బీసీ మహిళలు, ఆర్థికంగా బలహీనవర్గాలకు చెందిన (ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ) చెందిన మహిళలు, కాపు (కాపు, తెలగ, బలిజ, ఒంటరి) కులాలకు చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్పొరేషన్ల వారీగా.. బీసీ కార్పొరేషన్-1674, కాపు కార్పొరేషన్-544, ఈబీసీ కార్పొరేషన్-380, కమ్మ కార్పొరేషన్-1027, రెడ్డి కార్పొరేషన్-333, క్షత్రియ కార్పొరేషన్-62, ఆర్యవైశ్య కార్పొరేషన్-354, బ్రాహ్మణ కార్పొరేషన్-254 మందికి కేటాయించనున్నట్టు చెప్పారు.

దరఖాస్తుకు అర్హతలు

దరఖాస్తు చేసుకునే మహిళలు సంబంధిత కులధృవీకరణ పత్రము కలిగి, వయస్సు 18 నుంచి 50 సంవత్సరాలలోపు వుండాలి. తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు కలిగి వుండాలి. మార్చి 7 నుంచి ఆన్‌లైన్ ద్వారా హెచ్‌టీటీపీఎస్://ఏపీఓబీఎంఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్/వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. గ్రామ, వార్డు సచివాలయం/మండల పరిషత్ అభివృద్ధి అధికారి/మున్సిపల్ కమిషనర్‌ల కార్యాలయంలో తమపేర్లు నమోదు చేసుకోవాలని ప్రకటనలో తెలిపారు.

12న కలెక్టరేట్‌లో జాబ్ డ్రైవ్

కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వికాస ఆధ్వర్యంలో ఈనెల 12న బుధవారం కలెక్టరేట్‌లో జాబ్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌డ్రైవ్‌లో వర్ధ్యాశ కన్‌సల్టింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కంటెండ్ ఎనలిస్ట్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఏదైనా డిగ్రీ (నాన్‌ఇంజినీరింగ్), ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్స్ 2021 నుంచి 2024లో ఉత్తీర్ణులైన ఫ్రెషర్స్, 6 నెలలు ఎక్స్‌పీరియన్స్ ఉన్న స్త్రీ/పురుష అభ్యర్థులు అర్హులు. కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలి. ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.2,11,473 జీతం ఉంటుంది. హైదరాబాద్, చెన్నై పరిసర ప్రాంతాల్లో ఉన్నవారు అక్కడ ఆఫీసుల్లో పనిచేయాల్సి ఉంటుంది. ఇతర ప్రాంతాల వారికి వర్క్‌ఫ్రమ్ హోం, ల్యాప్‌టాప్ సౌకర్యం కల్పిస్తారు. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈనెల 12న బుధవారం ఎన్టీఆర్ వికాస కార్యాలయం, కలెక్టరేట్, విజయవాడ వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జిరాక్సులతో హాజరు కావాల్సి ఉంటుంది. వివరాలకు 8297400777, 7799376444 డబ్ల్యూడబ్ల్యూ.డబ్ల్యూ.వికాసజాబ్స్.కామ్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

చుర్రుమన్న సూరీడు!



వేసవి కాలం వచ్చేసింది.. రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. మార్చి మొదటి వారమే ఎండలు నగర వాసులను ఠారెత్తిస్తున్నాయి. ఒంటిపూట బడులు ఇంకా ప్రారంభం కానేలేదు.. భానుడి భగభగలతో చంటి పిల్లలు స్కూళ్లకు వెళ్లాలంటే బెంబేలెత్తుతున్నారు. రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వృద్ధులు, ఉద్యోగులు, చిరువ్యాపారులు బయటకు రావాలంటే భయపడిపోతున్నారు.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

జైపూర్ సదస్సుకు స్వచ్ఛ కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి



భారతీనగర్, మార్చి6 (ఆంధ్రజ్యోతి) : జైపూర్‌లో రెండు రోజులుగా ఆసియా అండ్ పసిఫిక్ యూఎన్ కాన్ఫరెన్స్ సదస్సులో ఒక ముఖ్య సెషన్‌కు ప్రతినిధిగా వ్యవహరించడంతో పాటు సర్క్యులర్ ఎకానమీ, సస్టైనబుల్ డెవలప్ మెంట్ గోల్స్‌పై ఈఎస్‌సిఎపి (ఎకనామిక్ అండ్ సోషల్ కమిషన్ ఫర్ ఆసియా పసిఫిక్), యుఎన్‌సిఆర్‌డి (యునైటెడ్ నేషన్స్‌సెంటర్ ఫర్ రీజినల్ డెవలప్‌మెంట్)ల రెండు ముఖ్యమైన నివేదికలను రాష్ట్రం తరఫున విడుదల చేసినట్టు ఏపీ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న అంతర్జాతీయ ప్రేక్షకులను ఉద్దేశించి ప్రసంగించే అరుదైన అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు గురించి సదస్సులో ప్రస్తావించానని తెలిపారు.

మహిళల హక్కులకు రక్షణేదీ!

- విముక్తి రాష్ట్ర అధ్యక్షురాలు అపూర్వ

గాంధీనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్న నేపథ్యంలో దేశ వ్యాప్తంగా నేటికీ అక్రమ రవాణా బాధిత మహిళలు, వ్యభిచార వృత్తిలో మగ్గుతున్న మహిళల హక్కులు హరించబడుతున్నాయని, మానవ అక్రమరవాణా, లైంగిక దోపిడీపై బాధితుల సంఘం విముక్తి అధ్యక్షురాలు అపూర్వ ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అక్రమ రవాణ బాధిత మహిళల సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలు ఇప్పటికే తమ ప్రాథమిక గౌరవం, సమాన హోదా కోసం పోరాడుతున్నారన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి పద్మ మాట్లాడుతూ, బాధిత మహిళల మానసిక, ఆరోగ్య హింస నుంచి రక్షణ కల్పించాలన్నారు. సమాజంలో వివక్షతకు గురవుతున్న వారికి అండగా ఉండాలన్నారు. ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి దుర్గాంబ మాట్లాడుతూ, సెక్స్ వర్కర్లు, అక్రమ రవాణ బాధితులకు రాజ్యాంగపరమైన రక్షణ ఉన్నప్పటికీ వివక్ష, హింసకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత మహిళల పట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరుమారాలని హితవు పలికారు. విముక్తి రాష్ట్ర కోశాధికారి లక్ష్మీ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను వెంటనే అమలు చేయాలన్నారు. సెక్స్ వర్కర్ల పట్ల పోలీసులు, కస్టమర్ల వేధింపులపై చర్యలు తీసుకుని సమాజంలో అందరి మహిళల మాదిరిగానే సముచిత స్థానం కల్పించాలన్నారు.

గౌడ సామాజికవర్గాలకు మద్యం దుకాణాల కేటాయింపు

- కృష్ణాలో 12, ఎన్టీఆర్ జిల్లాలో 11

మచిలీపట్నం, మార్చి6 (ఆంధ్రజ్యోతి) : గౌడ సామాజికవర్గాలకు కృష్ణాజిల్లాలో 12మద్యం దుకాణాలను జేసీ గీతాంజలి శర్మ లాటరీతీసి కేటాయించారు. కలెక్టరేట్‌లో గురువారం ప్రక్రియను నిర్వహించారు. 12మద్యం దుకాణాలకు 280 దరఖాస్తులు రాగా, తొలుత మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్, గుడివాడ, పెడన, తాడిగడప పురపాలక సంఘాల్లోని మద్యం దుకాణాలకు లాటరీ తీశారు. అనంతరం గూడూరు, గుడివాడ, మచిలీపట్నం, పమిడిముక్కల పెడన, కోడూరు, పెదపారుపూడి, బంటుమిల్లి మండలాల్లోని మద్యం దుకాణాలకు లాటరీతీసి షాపులను కేటాయించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. గౌడ, గౌడ్, శెట్టిబలిజ సామాజిక వర్గాలకు మద్యం దుకాణాలను ప్రభుత్వం కేటాయించిందన్నారు. లాటరీపద్ధతిలో దుకాణాలు దక్కించుకున్న వారు కులధృవీకరణపత్రాలు 24గంటల వ్యవధిలో అధికారులకు అందజేయాల్సి ఉందన్నారు. లేకుంటే లాటరీలో రిజర్వ్‌గా ఉంచిన రెండోనెంబరుకు షాపును కేటాయించడం జరుగుతుందన్నారు. తాడిగడపలోని మద్యం దుకాణానికి మండవల్లికి చెందిన మహిళ దరఖాస్తు చేశారని, ఆమె కృష్ణాజిల్లావాసి కాకపోవడంతో ఆ దరఖాస్తు చెల్లుబాటు కాదని జేసీ ప్రకటించారు. విజయవాడ ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ వై.శ్రీనివాసచౌదరి, కృష్ణా ఎక్సైజ్ కార్యాలయ సూపరింటెండెంట్ జి.గంగాధరరావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ భార్గవ్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.



లాటరీ తీసి నెంబరు ప్రకటిస్తున్న జేసీ గీతాంజలిశర్మ

ఎన్టీఆర్ జిల్లాలో 11 దుకాణాలు

విద్యాధరపురం : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ ఆధ్వర్యంలో గురువారం గౌడ కులస్థులకు 11 మద్యం దుకాణాలు లాటరీ ప్రక్రియ ద్వారా కేటాయించారు. విజయవాడ రూరల్ గొల్లపూడిలోని బీసీ భవన్‌లో లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపు ప్రక్రియ జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా 335 దరఖాస్తులు రాగా లాటరీ ప్రక్రియ ద్వారా 11 దుకాణాలను దరఖాస్తుదారులకు కేటాయించారు. అనంతరం ప్రొవిజినల్ లైసెన్స్ జారీ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు టి.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, రామశివ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



లాటరీలో మద్యం షాపులు కేటాయిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ



పైపులైన్ పనుల్ని అడ్డుకుంటున్న నందలూరు గ్రామ రైతులు

మా భూముల్లో పైపులు వేస్తారా..!

- సెంటినీ ఫ్యాక్టరీ పైపులైన్ పనులను అడ్డుకున్నరైతులు



తమ భూముల పట్టాలను చూపుతున్న రైతులు

వీరులపాడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కంచికచర్ల మండలం గండేపల్లి గ్రామంలో ఉన్న సెంటిని ఫ్యాక్టరీకి వీరులపాడు మండలం నందలూరు గ్రామ శివారు వైరా కట్లేరు నుంచి అక్రమంగా చేపట్టిన నీటి పైపులైన్‌ను రైతులు గురువారం అడ్డుకున్నారు. ఫ్యాక్టరీ సిబ్బంది యంత్రాలు, పైపులను తీసుకొని కట్లేరు వద్దకు రావడంతో విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకొని పనుల్ని అడ్డుకొని మా భూముల్లో మీరెలా పైపులు వేస్తారని ప్రశ్నించారు. దీంతో అనుమతులు ఉన్నాయని ఫ్యాక్టరీ ప్రతినిధులు చెబుతున్నారే తప్ప వాటిని చూపడం లేదని రైతులు ఆరోపించారు. మా పట్టా భూముల్లో పైపులైన్ వేస్తే ఊరుకునేది లేదని రైతులు పట్టుబట్టారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకొని ఫ్యాక్టరీ ప్రతినిధులతో మాట్లాడి రెవెన్యూ అధికారులను పిలిచి సర్వే చేయగా రైతు పట్టా భూముల్లోనే పైపులైన్ వేస్తున్నారని తేలింది. దీంతో యంత్రాలను బయటకు పంపివేశారు. పైపులైన్ వేసే చోటే నుంచి నందలూరు, జమ్మవరం, బోడవాడ గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుంది. నందలూరు, గండేపల్లి గ్రామాలకు సాగునీరు అక్కడి నుంచే పంపింగ్ స్కీమ్ ద్వారా వెళుతుంది. ఇక్కడ నుంచి పైపులైన్ వేసి ఫ్యాక్టరీకి నీరు ఇస్తే మాకు సాగు, తాగునీటికి కష్టాలు తప్పవని రైతులు వాపోతున్నారు. రైతులు కిలారు సంగమేశ్వరరావు, దగ్గుపాటి సీతామహాలక్ష్మి, బెల్లంకొండ నారాయణ, బెల్లంకొండ భారతమ్మ, బెల్లంకొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెట్లు కొట్టేస్తున్నారు

(7వ పేజీ తరువాయి)

మందులను అధికంగా పిచికారీ చేస్తుండటంతో ఎకరాకు రూ.20 వేలనుంచి 30 వేలుఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది పూతలు ఆశించిన స్థాయిలో పూసిన తెగుళ్ల ధాటికి పూత రాలిపోయి చెట్లకు కాడలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. గత రెండేళ్ల నుంచి నల్లి, పేలు మామిడి తోటలను ఆశిస్తుండటంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. వీటి నివారణకు ఎన్నో రకాల మందులు పిచికారీ చేసినా ఫలితం ఉండటం లేదని రైతులు చెబుతున్నారు. మామిడి తోటలను తెగనరకడంలో నల్లి, పేలు పాత్ర అధికంగా ఉందని అంటున్నారు. దీంతో ఖర్చులు పెరిగి, ఆశించిన స్థాయిలో దిగుబడి రాక నష్టాలు చవిచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పామాయిల్ సాగుకు మొగ్గు

మామిడి తోటల స్థానంలో అధికశాతం మంది రైతులు పామాయిల్ తోటలను సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. గత రెండేళ్లుగా మైలవరం మండలంలో పామాయిల్ సాగు అధికమయ్యింది. పామాయిల్ సాగుకు ప్రభుత్వం పలు రకాల సబ్సిడీలు ఇస్తుంది. దీంతో సాగుకు ఖర్చులు తక్కువతోపాటు మార్కెట్‌లో పామాయిల్ పంటకు డిమాండ్ ఉండటంతో మైలవరం మండలంలో సుమారు 2వేల ఎకరాల్లో పామాయిల్ పంటను సాగు చేస్తున్నారు.



మామిడి తోట స్థానంలో పామాయిల్ మొక్కలు

ముదురు తోటలు తొలగిస్తున్నారు

- సొహైల్ అహ్మద్, ఉద్యానశాఖ అధికారి

40 సంవత్సరాల వయసున్న మామిడి చెట్లను రైతులు నరికివేస్తున్నారు. ఆయా తోటల్లో మందులు పిచికారీ కష్టంగా మారింది. దీంతో రైతులు మామిడి తోటలు తీసివేసి పామాయిల్, జామ, తదితర వాటిపై దృష్టి పెడుతున్నారు.

కేతవీరునిపాడులో మంత్రి మనోహర్ ప్రత్యేక పూజలు



నందిగామ రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే ఉత్సవాలను కలిసి మెలిసి నిర్వహించుకోవాలని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మండలంలోని కేతవీరునిపాడు గ్రామంలో పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. గురువారం విగ్రహమూర్తులకు పూజలు చేశారు. అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనం, స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పెట్టుబడులు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

సరదా బుల్లోడు

(7వ పేజీ తరువాయి)

బయట పడుతున్నాయి. విజయవాడలో ఆసియాలోనే రెండో అతిపెద్ద బస్‌స్టేషన్ అయిన పీఎన్‌బీఎస్‌తో పాటు జోనల్ పరిధిలోని కమర్షియల్ షాపుల ముసుగులో జరుగుతున్న అవినీతి వ్యవహారాలు, దుకాణదారుల నుంచి అక్రమ వసూళ్లు అన్నీ, ఇన్నీ కావు. అద్దె బస్సుల యజమానుల నుంచి జరుపుతున్న అక్రమ వసూళ్లు, అద్దె బస్సుల కేటాయింపుల వ్యవహారంలో చోటు చేసుకుంటున్న అధికారుల స్వప్రయోజనాలు వంటి వాటిపై విజిలెన్స్ విభాగానికి, ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి. ఆర్టీసీలో అధికారుల అవినీతిపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సిన విజయవాడ జోన్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం ఆ పని చేయటం మానేసింది.

ఆర్టీసీ విజిలెన్స్ విభాగంపై అనేక అవినీతి ఆరోపణలు

విజయవాడ జోన్ పరిధిలో ఆర్టీసీని సంస్కరించాల్సిన విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయినట్లు సమాచారం. తన విచ్చలవిడి సరదాలను తీర్చటంతో పాటు, అక్రమార్జనకు అడ్డాగా విజిలెన్స్ విభాగాన్ని ఓ అధికారి మార్చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ విభాగంలోని కొందరు సెక్యూరిటీ కానిస్టేబుళ్లను ఆ అధికారి తన ఏజెంట్లుగా పెట్టుకున్నారు. వీరికి అనుకూలమైన ప్రదేశాల్లో పోస్టింగులు ఇచ్చుకున్నారు. విజయవాడ జోన్‌లో ఏవైతే రీజనల్ కేంద్రాలు ఉన్నాయో వాటిలో తన ఏజెంట్లుగా వసూళ్ల రాజాలను ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. మద్యం బాటిళ్లు, డబ్బులు వసూలు చేసి ఇచ్చేందుకు ఆఫీసులోని ఓ సెక్యూరిటీ కానిస్టేబుల్‌ను తన పర్సనల్ సెక్రటరీగా ఉపయోగించుకుంటున్నట్లు తెలిసింది. విజిలెన్స్ విభాగానికి ఏడీగా పనిచేసే పైస్థాయి అధికారులకే పర్సనల్ సెక్రటరీగా ఉపయోగించుకోవటానికి అధికారం లేదు. కానీ ఈ అధికారి మాత్రం పర్సనల్ సెక్రటరీగా ఉపయోగించుకుంటున్నారు. పర్సనల్ సెక్రటరీగా ఉపయోగించుకుంటున్న కానిస్టేబుల్ స్థానంలో విద్యాధరపురం డిపోకు చెందిన కానిస్టేబుల్‌ను గత మూడళ్లుగా ఉపయోగించుకుంటున్నారు. ఈ కానిస్టేబుల్ కూడా అవినీతి అధికారికి అనుచరుడు కావటం గమనార్హం. ఈ కానిస్టేబుల్ పిల్లలు కలిగి భర్త లేని మహిళలను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, వారితో కొంత కాలం సహజీవనం చేసి వదిలేస్తుంటాడన్న ఆరోపణలున్నాయి. ఇలా ఒక మహిళతో సహజీవనం చేసి వదిలివేయటంతో బాధిత మహిళ ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు ఇచ్చినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఉన్నతాధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆఖరుకు బాధిత మహిళ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినా తమకు ఉన్న పలుకుబడితో కేసు కట్టనీయకుండా చర్యలు తీసుకున్నారు.

ఇక భగభగ!

(7వ పేజీ తరువాయి)

మొవ్వ, నందివాడ, నాగాయలంక, పామర్రు, పెదపారుపూడి, పెనమలూరు, ఉయ్యూరు మండలాల్లో శుక్ర, శనివారాల్లో 39 నుంచి 42.2 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని అధికారులు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలోని జి.కొండూరులో 39.8, గంపలగూడెం 39.7, ఇబ్రహీంపట్నం 40.8, కంచికచర్ల 40, విజయవాడ రూరల్‌లో 39.7, విజయవాడ అర్బన్ 39.8లో డిగ్రీల ఉష్ణోగ్రతలు శనివారం నమోదు కానున్నాయి. రెండు జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

షైనింగ్ స్టార్స్ సీసీపై ఫ్రెండ్స్ జట్టు గెలుపు

విజయవాడ(స్పోర్ట్స్),మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మూలపాడు గ్రౌండ్స్‌లో జరుగుతున్న దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ బి లీగ్ మ్యాచ్‌లలో గురువారం షైనింగ్ స్టార్స్ సీసీ, ఫ్రెండ్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో షైనింగ్ స్టార్స్ సీసీ జట్టు 46.3 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 188 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఫ్రెండ్స్ జట్టు 30 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 192 పరుగులతో విజయం సాధించింది. జట్టులో పి.శివకుమార్ సాయి 56 పరుగులు, దుర్గారావు 48 పరుగులు, సురేష్ 47 పరుగులు చేసి విజయం సాధించారు.



ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉద్యోగినుల ఆటల పోటీలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం పక్షాన చైర్‌పర్సన్ పారె లక్ష్మి, సెక్రటరీ పి.విజయలక్ష్మిల ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగినులకు సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో బుధ, గురువారాల్లో ఆటల పోటీలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు.

ఈ పోటీల్లో లెమన్ అండ్ స్పూన్స్, మ్యూజికల్ చైర్, స్కిప్పింగ్, కప్ అండ్ బెలూన్, చెస్, క్యారమ్స్, బాల్‌గేమ్, సింగింగ్, డ్యాన్స్, క్విజ్, రంగోలి, తెలుగు మూవీ డైలాగ్ డెలివరీ, ట్రెడిషనల్ డ్రెస్, టగ్ ఆఫ్ వార్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు.

పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడండి

ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు

కార్పొరేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు అన్నారు. గురువారం వీఎంసీ ప్రధాన కార్యాలయం నూతన భవనంలోని సమావేశ హాలులో లీడ్ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య నిర్వహణలో సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని, లోడర్ పాయింట్ల వద్ద లోడర్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రపరచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక యాప్ ఆంధ్రప్రదేశ్ కన్సిస్టెంట్ మానిటరిం గ్ ఆఫ్ మున్సిపల్ సర్వీసెస్ (ఏపీసీఎంఎంఎస్)లో ప్రతిరోజు అప్‌డేట్ చేయాలన్నారు. అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ బాబు శ్రీనివాస్, డాక్టర్ గోపీనాయక్, శానిటరీ సూపర్‌వైజర్లు, లీడ్ వర్కర్లు పాల్గొన్నారు.



ఎస్ఎస్ఎం స్కూల్ గోడ పక్కన అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలు

దర్శిపేటలో తరచూ ట్రాఫిక్ స్తంభన

● మార్జిన్లలో అడ్డదిడ్డంగా కార్లు, ఆటోల పార్కింగ్

పటమట, ఆంధ్రజ్యోతి

14వ డివిజన్ దర్శిపేట ఐదు రోడ్ల జంక్షన్ నుంచి ఎస్ఎస్ఎం స్కూల్ వరకు దర్శిపేట మార్జిన్ రోడ్డులో అడ్డదిడ్డంగా ఆటోలు కార్లు నిలిపి ఉంచడం వల్ల తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఎస్ఎస్ఎం స్కూల్ గోడ పక్కనే శాశ్వతంగా కార్లను పార్కింగ్ చేసి వదిలేస్తున్నారు. రామలింగేశ్వరనగర్, ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఎస్ఎస్ఎం స్కూల్ మీదుగా యనమలకుదురు వరకు వేలాది మంది రోజూ ప్రయాణం చేస్తుంటారు. ముఖ్యంగా ఎస్ఎస్ఎమ్ స్కూల్‌కు పిల్లలను తల్లిదండ్రులు ఈమార్గం ద్వారానే తీసుకువెళుతుంటారు. గత వైసీపీ ప్రభుత్వంలో విజయవాడను కాలుష్య రహితనగరంగా మార్చాలనే ఉద్దేశంతో రోడ్డుకు ఇరువైపులా మార్జిన్లలో పేవర్ బ్లాక్స్ నిర్మించారు. వాహనదారులు యదేచ్ఛగా వాటి మీద వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఈ మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 20 మందికి ఉద్యోగార్హత

లబ్బీపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నలంద కళాశాలలో గురువారం అడాప్ట్ టాలెంట్ అక్విజిషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం. అనురాధ తెలిపారు. ఈ ఎంపికల్లో 60 మంది విద్యార్థులు పాల్గొనగా 20 మంది ఉద్యోగార్హత పొందినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 10 నుంచి ఉద్యోగంలో జాయిన్ అవుతారని ఆమె తెలిపారు. ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ ఎ.విజయబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్ రాజీవ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.చంద్రగిరి పాల్గొన్నారు.



ఉద్యోగ అర్హత పొందిన విద్యార్థులతో ప్రిన్స్‌పాల్ అనురాధ

హెల్త్ అలవెన్స్ ఇప్పించండి

ఎంపీ చిన్నికి వీఎంసీ వెహికల్ డిపో మెకానిక్స్, హెల్పర్స్ వినతి

వన్‌టౌన్,మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగం వెహికల్ డిపోలో పనిచేసే డ్రైవర్లు, క్లీనర్లకు పెంచిన హెల్త్ అలవెన్స్ రూ.6వేలు తమకు ఇప్పించాలని కోరుతూ ఎంపీ కేశినేని శివనాథ్‌ను (చిన్ని)కు మెకానిక్స్, హెల్పర్స్ వినతి పత్రం అందచేశారు. ఏపీ బిల్డింగ్స్, అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు ఆధ్వర్యంలో గురువారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ కేశినేని శివనాథ్‌ను వెహికల్ డిపోలో పనిచేసే మెకానిక్స్, హెల్పర్స్ కలిశారు. తమను కూడా పారిశుధ్య కార్మికులుగా పరిగణనలోకి తీసుకుని రూ.6వేలు హెల్త్ అలవెన్స్ ఇప్పించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. వారి సమస్యలపై ఎంపీ కేశినేని శివనాథ్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో తెలుగునాడు మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాంబాబు, తోకల రమేష్, డి.బాబూరావు, సత్తిబాబు, రంగారెడ్డి, మల్లెపల్లి నానిలు ఉన్నారు.



ఎంపీ కేశినేని శివనాథ్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తున్న వీఎంసీ వెహికల్ డిపో మెకానిక్స్ హెల్పర్స్

శ్రమదినాల దీక్షలు ప్రారంభం

మొగల్రాజపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవ సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే ఉపవాస శ్రమదినాల దీక్షలను మొగల్రాజపురం ఆర్‌సీఎం చర్చిలో గురువారం ప్రారంభించారు. ఆర్‌సీఎం చర్చి ఫాతిమా దేవాలయం ఫాదర్ ప్రకాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలతో ప్రారంభం అయిన కార్యక్రమంలో విశ్వాసులకు విభూది రాస్తూ దీక్షలను ప్రారంభించారు. మొత్తం 40 దినాలు నిర్వహించే దీక్షలో ఉపవాస ప్రార్థనలు చేస్తూ సేవాకార్యక్రమాలలో పాల్గొంటారని చెప్పారు. ఉపదేశికులు ఫ్రాన్సిస్, ఆర్‌సీఎం సంఘ పెద్దలు, సభ్యులు, విశ్వాసులు పాల్గొన్నారు.



ప్రార్థన చేస్తున్న ఫాదర్ ప్రకాష్

ఆంధ్రా లయోలలో ల్యాబ్ టు స్కూల్

భారతీనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా లయోలా కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ల్యాబ్ టు స్కూల్ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో వెటర్నరీ కాలనీకి చెందిన ది బ్రిలియంట్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులకు విభాగాధిపతి టి. కమలాకర్ కంప్యూటర్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రస్తుత సమాజంలో విద్యా, వైద్య రంగాల్లో కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు, కళాశాల విద్యార్థులు, 100 మంది బ్రిలియంట్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

90 ప్రాజెక్టుల ప్రదర్శన

ఆంధ్రా లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఐక్యూఏసీ, సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో ఇన్నోవేథాన్ 2025 రెండో రోజు కార్యక్రమంలో మెకానిక్ విభాగం నుంచి 90 ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో ముఖ్య అతిథిగా వీఆర్ సిద్ధార్థ అకాడమీ మెకానిక్ విభాగాధిపతులు డాక్టర్ జమునారాణి, డాక్టర్ బాల చిన్న లింగ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రదర్శనలు విద్యార్థుల్లోని మేధాశక్తిని పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఫాదర్ బి. జోజిరెడ్డి, సెక్రటరీ డి.బాలస్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఓ.మహేష్, విభాగాధిపతులు, సిస్టర్ క్యాండీ, 450మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఇద్దరు మహిళల మధ్య వివాదం

మూడు గుడిసెలు అగ్నికి ఆహుతి

ఆటోనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు మహిళల మధ్య వివాదం ముదిరింది. ఆగ్రహానికి గురైన ఓ మహిళ.. మరో మహిళ ఇంటికి నిప్పంటించింది. దీంతో పక్కపక్కనే ఉన్న మరో రెండు గుడిసెలకు మంటలు వ్యాపించడంతో మూడు ఇళ్లు అగ్నికి ఆహుతైన సంఘటన పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటోనగర్ వంద అడుగుల రోడ్డు సమీపంలోని బస్‌స్టాప్ వద్ద బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పేదల గుర్రమ్మ చిత్తు కాగితాలు వేరుకుని జీవనం సాగిస్తుంటుంది. భర్త పౌల్, కుమారుడు ఏసోబుతో ఉంటుంది. ఈ క్రమంలో భర్త పౌల్‌తో కలిసి చిత్తు కాగితాలతోపాటు చిల్లర దొంగతనాలకు అలవాటు పడిందని తెలిపారు. సమీపంలోని నాగమణితో పౌల్ సన్నిహితంగా ఉండేవాడు. బుధవారం అర్ధరాత్రి భర్తని దొంగతనానికి వెళ్లడానికి గుర్రమ్మ పిలిచింది. అతను నిరాకరించడంతో నాగమణి వల్లే తనతో దొంగతనాలకు రావడం లేదని వాగ్వాదం పెట్టుకుంది. నాగమణి ఇంట్లో ఉండగా ఆమెతో గొడవకు దిగి పదునైన కట్టర్‌తో గాయపరిచింది. అంతటితో ఆగకుండా నాగమణి ఉంటున్న ఇంటిని తగలబెట్టింది. దీంతో పక్కనే ఉన్న మరో రెండు ఇళ్లకు అగ్ని వ్యాపించింది. ఫైర్ సిబ్బంది రంగంలోకి దిగడంతో మంటలు అదుపు చేశారు. ప్రాథమికంగా రూ.50వేలు ఆస్తి నష్టం వాటిల్లిందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రేవతి తెలిపారు.



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

అగ్ని బాధితులకు ఆర్థిక సహాయం

పటమట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ అగ్నిప్రమాద బాధితులకు గురువారం గద్దె అనుచరులు ఆర్థికసాయం అందజేశారు. హైదరాబాద్‌లో ఉన్న తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రమాద విషయం తెలుసుకుని పార్టీ డివిజన్ నాయకుల్ని ఘటనా స్థలానికి పంపి సహాయ కార్యక్రమాలు అందేలా చూశారు. బాధితులతో ఆయన ఫోన్‌లో మాట్లాడి వారికి అండగా ఉంటామన్నారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ మాట్లాడుతూ కుటుంబానికి రూ.5 వేలు, నూతన వస్త్రాలు అందించామన్నారు. అధికారులు దృష్టికి తీసుకువెళ్లి బాధితులకు సాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. డివిజన్ అధ్యక్షుడు కోనేరు రాజేష్, డివిజన్ నాయకులు యూవీ శివాజీ, కాటూరి సుబ్రహ్మణ్యం, జాస్తి సురేష్, రాజనాల పవన్ తదితరులు పాల్గొన్నారు.


నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

రామలింగేశ్వరనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం స్క్యూ బ్రిడ్జి సెక్షన్, స్క్యూ బ్రిడ్జి సెక్షన్ విద్యుత్ ఉపకేంద్రం, 11 కేవీ పటమటలంక ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి. రవీంద్రబాబు తెలిపారు. నేతాజీ రోడ్డు, సీతారామనగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగస్వాములు కావాలి

● శానిటరీ సూపర్‌వైజర్ ఓబేశ్వరరావు

చిట్టినగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని శానిటరీ సూపర్‌వైజర్ ఓబేశ్వరరావు పిలుపునిచ్చారు. నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు గురువారం కేఎల్ పార్కులో ప్రజల నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అభిప్రాయాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్ర నగరాల్లో విజయవాడకు మొదటి ర్యాంక్ వచ్చేలా నగర ప్రజలు సహకరించాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగస్వాములై ప్రతి ఒక్కరు మీ మొబైల్ ద్వారా ఓట్ చేయాలన్నారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థకు చెందిన స్వచ్ఛ సర్వేక్షణ్ టీం పలువురు పార్కుకు వచ్చే వాకర్స్ నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ కృపాల్ పాల్గొన్నారు.




కరెన్సీనగర్ 4వ క్రాస్‌రోడ్లో ధ్వంసమైన సిమెంట్ దిమ్మలు

ప్రమాదకరంగా మారిన డ్రెయినేజీ

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: మూడవ డివిజన్ కరెన్సీ నగర్ కాలనీ 4వ క్రాస్ రోడ్డు గోపాలకృష్ణయ్య వీధిలోని డ్రెయినేజీపై వేసిన సిమెంట్ దిమ్మలు వాహనాల రాకపోకలకు ధ్వంసం కావడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రధాన రోడ్డు కావడంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

పంట ఎండిపోతోంది..!

ఏటూరు, కంచల మేజర్ల ఆయకట్టు రైతుల ఆక్రోశం



తెలంగాణ అధికారులు నాగార్జున సాగర్ నీటిని నిలిపివేయడంతో ఎన్టీఆర్ జిల్లాలో ఎన్ఎస్ఎల్‌బీసీ జోన్-2, జోన్-3 పరిధిలో పంటలు నిలువునా ఎండిపోతున్నాయి. న్యాయంగా రావల్సిన నీటి కోసం ఈ ప్రాంత ఎమ్మెల్యేలు చేస్తున్న ప్రయత్నాలు తెలంగాణ అధికారులను కదిలించలేక పోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి తెలంగాణ ప్రభుత్వ పెద్దలతో మాట్లాడాల్సి ఉంది. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన నీటిని సాధించి రైతుల్ని ఆదుకోవాల్సి ఉంది. - ఆంధ్రజ్యోతి, కంచికచర్ల

- సాగర్ నీటి నిలిపివేతతో ఎన్ఎస్ఎల్‌బీసీ జోన్లపై ఎఫెక్ట్!
- అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలి



తెలంగాణా సీఈ రమేష్‌బాబుతో మాట్లాడుతున్న రైతులు

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ జోన్-2కు తెలంగాణలోని చెరువు మాధవరం ట్యాంక్ నుంచి ఏటా 13.5 టీఎంసీల నీరు విడుదల కావాల్సి ఉంది. జోన్-3కు ప్రాజెక్ట్ నుంచి నేరుగా 18 టీఎంసీల నీరు అందాలి. వైసీపీ హయంలో అప్పటి పాలకుల నిర్లక్ష్యంతో ఐదేళ్ల పాటు అడిగే వారు లేకనీటిని ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో జోన్-2, జోన్-3 కింద రైతులు వాణిజ్య, ఆహార పంటల సాగు చేపట్టారు. జోన్-2కు విడతల వారీగా ఇప్పటికి 9.5 టీఎంసీల నీటిని మాత్రమే విడుదల చేశారు. అందులో ఇటీవల వచ్చిన వరద నీటిని కూడా తెలంగాణ అధికారులు లెక్క కట్టినట్టు ఆరోపణలున్నాయి. ఏదేమైనా తొలి విడత కొంత నీటిని అందుకొని సాగు చేపట్టిన రైతులు మలి విడత నీటి కోసం వేచి చూస్తున్నారు. రైతుల ఆందోళన, స్థానిక అధికారుల ఒత్తిడితో కంటి తుడుపుచర్యగా సీఎం ట్యాంక్ నుంచి ఇటీవల కొద్ది మోతాదులో నీటిని విడుదల చేశారు. ఆ నీటిని ఎగువన ఉన్న గండ్రాయి, శనగపాడు-1, శనగపాడు-2, మేజర్ల ఆయకట్టు రైతులు దిగువకు రానివ్వకుండా వాడుకున్నారు. ఫలితంగా కంచల, ఏటూరు మేజర్ల ఆయకట్టు రైతులకు నీరందలేదు. దీంతో ఇక్కడి రైతులు ఆందోళనలకు సిద్ధమయ్యారు. స్పందించిన అధికారులు ఎగువనున్న మేజర్ కాలువలకు నీటిని ఆపి దిగువనున్న కంచల, ఏటూరుకు పంపేందుకు సిద్ధయ్యారు. ఈ క్రమంలో తెలంగాణ అధికారులు సీఎం ట్యాంక్ నుంచి నీటి విడుదల నిలిపేశారు. సీఎం ట్యాంక్‌లో నీటి మట్టం తగ్గినందున ఆపేశామని ఖమ్మం నీటిపారుదల శాఖ అధికారులు చెప్పుకొస్తున్నారు.కంట్రోల్స్ మొత్తం వారి చేతుల్లోనే ఉండడంతో ఇక్కడి రైతులను మోసం చేస్తున్నారు. సాగర్‌లో నీరు పుష్కలంగా ఉన్నప్పుడు సీఎం ట్యాంక్‌కు నీటిని నింపాలని స్థానిక అధికారులు కోరగా సాగర్ నుంచి పాలేరు రిజర్వాయర్‌కు, అక్కడ నుంచి సీఎం ట్యాంక్‌కు నీరు రావల్సి ఉందని, పాలేరు రిజర్వాయర్‌కు తరచూ గండ్లు పడుతున్నందున సాగర్ నీరు విడుదల చేయలేకపోతున్నట్టు తెలంగాణ అధికారులు కుంటుసాకులు చెప్పుకొస్తున్నారు. జోన్-2కు పాలేరు గండ్లను కారణంగా చూపి నీటిని నిలిపేసిన తెలంగాణ అధికారులు జోన్-3 గురించి ఏం చెపుతారంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. రిజర్వాయర్లతో సంబంధం లేకుండా 21 ఎంబీసీ (మధిర బ్రాంచ్ కెనాల్) నుంచి నేరుగా నీరు ఇవ్వాల్సి ఉన్నా ఎందుకు ఇవ్వలేకపోయారంటూ రైతులు మండిపడుతున్నారు.

రాజకీయ విభేదాలతో సమస్య

తెలంగాణలో ఏర్పడిన రాజకీయ విభేదాలతోనే నీటి విడుదలకు అక్కడి అధికారులు వెనుకాడుతున్నట్టు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఆంధ్ర ప్రాంతానికి అధిక నీటిని ఇచ్చి తెలంగాణకు అన్యాయం చేస్తున్నారంటూ అక్కడి ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల కారణంగా ప్రభుత్వం నీటిని నిలిపేసి ఉండొచ్చని అనుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి వాటా ప్రకారం రావల్సిన నీటిని తీసుకురావాని రైతులు కోరుతున్నారు.

ఏటూరు, కంచల మేజర్ల ఆయకట్టు రైతుల ఆక్రోశం

ఎత్తిపోతల పథకాలు మరమ్మతులకు గురి కావడంతో పూర్తిగా సాగర్ నీటిపై ఆధారపడిన ఏటూరు, కంచల మేజర్ల ఆయకట్టులో పంటలు పూర్తిగా ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి. తెలంగాణ అధికారుల నిర్లక్ష్యం, ఎగువ రైతుల స్వార్థంతో సాగునీరందక అల్లాడుతున్న ఇక్కడి రైతులు ఆందోళనలకు సిద్ధమౌతున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి సాగుచేస్తున్న తమ పంటలకు కనీసం నెలాఖరు వరకైనా నీటిని ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈక్రమంలో ఎన్ఎస్‌పీ నందిగామ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రాటకొండ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రైతులు సోమవారం ఖమ్మం సీఈ రమేష్‌బాబును కలిసి నీటిని విడుదల చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఆయన ఇది తన పరిధిలో అంశం కాదని, రెండు ప్రభుత్వాల ఉన్నతాధికారులు సంప్రదింపులు జరపాలని చెప్పారు. కృష్ణా రివర్ బోర్డు సమావేశం జరుగుతున్నందున తుది నిర్ణయం కోసం వేచి చూస్తున్నట్టు సీఈ చెప్పారని రైతులు తెలిపారు. ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు స్పందించి తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి మురళీధరన్

దేశమంతా ఒకేసారి ఎన్నికలతో మేలు

- కేంద్ర మాజీ మంత్రి మురళీధరన్

పటమట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఒన్ నేషన్ ఒన్ ఎలక్షన్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కేంద్ర మాజీ మంత్రి మురళీధరన్ అన్నారు. విజయవాడ స్టెల్లా కళాశాల ఆడిటోరియంలో గురువారం ఒన్ నేషన్ ఒన్ ఎలక్షన్ అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో భారత్ శక్తివంతమైన దేశమని ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఐదో స్థానంలో ఉందన్నారు. కొవిడ్ సమయంలో అభివృద్ధి చెందిన దేశాలు సైతం వ్యాకిన్స్ కోసం ఇబ్బందులు పడితే ఇండియా వాటికి వ్యాక్సిన్ అందించిందన్నారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు పోతుందన్నారు. మాటిమాటికీ ఎన్నికలు నిర్వహించడం కోడ్ అమలులో ఉండటంతో సంక్షేమ పథకాలు అమలుకు ఇబ్బంది కలుగుతుందన్నారు. దీనివల్ల ఖర్చుతో పాటు సమయం కూడా వృథా అవుతుందన్నారు. తక్షశిల దుర్గా ప్రసాద్, స్టెల్లా కళాశాల ప్రిన్సిపల్ జసింతా క్వాడ్రస్, సూర్యనారాయణ, వల్లూరి జయప్రకాష్ నారాయణ, రమేష్‌నాయుడు, విష్ణువర్ధన్ రెడ్డి, సయ్యద్ బాషా పాల్గొన్నారు.



వాడుకలోకి వచ్చిన వాటర్ ప్లాంట్, దాతలు ఏర్పాటు చేసిన మంచినీటితో దాహం తీర్చుకుంటున్న రోగుల బంధువులు

దాతల సాయం.. తీరిన దాహం..!

- ప్రభుత్వాసుపత్రిలో తాత్కాలికంగా తాగునీటిని ఏర్పాటు చేసిన అధికారులు, దాతలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ప్రభుత్వాసుపత్రి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో తాగునీటి సమస్య అధికంగా ఉండటంతో రోగులు, కుటుంబ సభ్యులు తాగునీటి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించి ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు శిథిలావస్థలో ఉన్న వాటర్‌ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి తాగునీటిని అందించారు. దీనితో పాటు సూపర్‌స్పెషాలిటీ బ్లాక్‌కు వచ్చే రోగులకు కూడా ప్రత్యేకంగా వాటర్ క్యాన్స్ ఏర్పాటు చేసినట్టు సూపరింటెండెంట్ డాక్టర్ ఏపీ రావు తెలిపారు. అన్ని బ్లాక్స్‌లో తాగునీరు ఏర్పాటు చేసి ఎవ్వరికీ ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. హైదరాబాద్‌కు చెందిన వసుధ ఫౌండేషన్ నిర్వాహకులు వాటర్ కూలర్స్‌ను బహుకరిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. త్వరలో వాటిని ఏర్పాటు చేసి చల్లటి నీటిని అందిస్తామన్నారు. అదనపు కుళాయిని ఏర్పాటు ప్రతిపాదించినట్టు చెప్పారు.

కల్లుగీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపు



ఎన్టీఆర్ కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా గీత కులాలకు సంబంధించిన మద్యం దుకాణాల కేటాయింపును విజయవాడ రూరల్, గొల్లపూడి బీసీ భవన్‌లో కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో గురువారం లాటరీ ద్వారా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో 11 మద్యం దుకాణాలకు 335 దరఖాస్తులు వచ్చాయి. లాటరీ ప్రక్రియ ద్వారా 11 మద్యం దుకాణాలను దరఖాస్తుదారులకు కేటాయించారు. 11 మద్యం దుకాణాలకు ప్రొవిజినల్ లైసెన్స్ జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఎక్సైజ్ అధికారులు టి.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, రామశివ, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆహ్లాదకరమైన జీవనానికి క్రీడలు దోహదం

- ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి

గాంధీనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళా ఉ ద్యోగుల మానసిక ధైర్యం, ఆ హ్లాదకరమైన జీవనానికి క్రీడ లు ఎంతగానో తోడ్పడతాయని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కే వీ శివారెడ్డి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎన్జీవో సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు నిర్వహించిన పలు సాంస్కృతిక, ఆ టల పోటీలు ముగిశాయి. దీనిలో భాగంగా గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో పాటలు, నృత్య ప్రదర్శన పోటీలు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ మూడు రోజులు నిర్వహించిన ఈ పోటీల్లో మహిళా ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొనడంపై హర్షం వ్యక్తం చేశారు. విజేతలకు ఈ నెల 8న బహుతుల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న ఉద్యోగి

బ్యూటిఫుల్.. బెజవాడ..!

విజయవాడ నగర సమగ్రాభివృద్ధికి సత్వర డీపీఆర్‌లు

- విస్తృత ప్రజాప్రయోజన మౌలిక వసతుల పనులపై ప్రత్యేక దృష్టి
- రహదారుల విస్తరణ, సుందరీకరణ పనులకు ప్రాధాన్యత
- అభివృద్ధి పనులకు అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ రహదారులు
- కాలువగట్ల సుందరీకరణ, వాకింగ్ ట్రాక్‌లు, ఫుడ్‌కోర్టుల ఏర్పాటుకూ చర్యలు
- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్‌బాబు

కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వాహ్.. బెజవాడ అనిపించేలా నగర సుందరీకరణతో కూడిన అభివృద్ధికి అడుగులు ముందుకు పడ్డాయి. నగరాన్ని మరింత అందంగా తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన సత్వర ప్రాజెక్టులపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్, జంక్షన్ల సుందరీకరణ, కొండలపై ట్రెకింగ్, వాటర్ ఫౌంటెయిన్స్, రహదారుల విస్తరణ, వాక్‌వేల ఏర్పాటు, పార్కుల అభివృద్ధికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. నగరాన్ని పట్టిపీడిస్తున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి, శ్రీకారం చుట్టారు. అలాగే నగరానికి మణిహారంగా మారనున్న మహానాడు ఫ్లై ఓవర్, విజయవాడ మెట్రో ప్రాజెక్టులపైనా చర్చించారు. రాజధాని అమరావతికి ముఖద్వారంగా ఉన్న బెజవాడ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గురువారం ఎంపీ కేశినేని శివనాథ్ అధ్యక్షతన కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి రహదారులు, భవనాలు, వీఎంసీ, రెవెన్యూ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. విజయవాడ తూర్పు, పశ్చిమ, మధ్య నియోజకవర్గాల పరిధిలో భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. మహానాడు రోడ్డు నుంచి నిడమానూరు వరకు ఫ్లై ఓవర్‌తో పాటు తొలిదశలో గన్నవరం నుంచి మెట్రో కారిడార్ పనులు పూర్తయితే విజయవాడ శరవేగంగా అభివృద్ధి చెందనున్న నేపథ్యంలో ఆ పనులు పూర్తయ్యేలోపు ఎవరికీ ఇబ్బంది లేకుండా అభివృద్ధి చేయాల్సిన ప్రత్యామ్నాయ మార్గాలపై మ్యాపుల ఆధారంగా చర్చించారు.



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్, చిత్రంలో కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, వివిధ శాఖల అధికారులు

సుందరమైన నగరం కోసం..

కృష్ణాతీరం వెంబడి రివర్‌బండ్, హిల్స్ రెయిలింగ్, కాళేశ్వరరావు మార్కెట్ జంక్షన్ సుందరీకరణ, గాంధీ హిల్ అభివృద్ధి, కేదారేశ్వరపేట-టన్నెల్ రహదారి విస్తరణ, చిట్టినగర్ జంక్షన్, వాటర్ ఫౌంటేయిన్‌తో సితార్ జంక్షన్, టన్నెల్-గొల్లపూడి 200 అడుగుల రహదారి, కృష్ణలంక కట్ట వంటి సుందరీకరణ పనులు, వాక్‌వేలపై చర్చించారు. వీటి సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రతిపాదనలు, అంచనాలు, డీపీఆర్‌లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అర్బన్ డెవలప్‌మెంట్ ఫండ్ (యూడీఎఫ్), పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) ప్రాజెక్టుల ద్వారా నగరాభివృద్ధికి తీసుకోవాల్సిన సత్వర చర్యలపై సమావేశంలో చర్చించారు.

పార్కుల అభివృద్ధే కీలకం

నగర ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు వీలున్న పార్కులను అభివృద్ధి చేయడంతోపాటు కొత్త పార్కులను అందుబాటులోకి తేవాల్సిన అవసరముందని గుర్తించారు. కెనాల్ వెంబడి చిన్నచిన్న పార్కులను అభివృద్ధి చేసి, హరితమయ వాతావరణంలో ఫుడ్‌కోర్టులు ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. మూడు నియోజకవర్గాల పరిధిలో సైక్లోన్ సెంటర్ల ఏర్పాటుపైనా చర్చించారు. ఆర్డీవో కావూరి చైతన్య, వీఎంసీ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, వీఎంసీ సూపరింటెండింగ్ ఇంజినీర్ (ప్రాజెక్టులు) సి.సత్యకుమారి పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై..

నగరంలో ట్రాఫిక్ సమస్యల తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. ప్రధానంగా ఎన్‌హెచ్-16, ఎన్‌హెచ్-65పై సమస్యలు అన్నీ, ఇన్నీ కావు. బయట నుంచి నగరానికి వచ్చేవారికి నరకం కనిపిస్తోంది. భవిష్యత్తులో ఎలాంటి ట్రాఫిక్ సమస్య ఎదురుకాకుండా ఏర్పాటు చేయాల్సిన పార్కింగ్ స్థలాలు, వంతెనలు, జంక్షన్ల అభివృద్ధి, ప్రత్యామ్నాయ రహదారులు, రహదారుల అనుసంధానంపై చర్చించారు.

నంద్యాల ఎస్‌డీపీఐ కార్యాలయంలో ఈడీ సోదాలు

నంద్యాల క్రైం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కేంద్రంలోని ఎస్‌డీపీఐ (సోషల్ డెమొక్రాటిక్ పార్టీ ఆఫ్ ఇండియా) కార్యాలయంలో ఈడీ అధికారులు గురువారం సోదాలు నిర్వహించారు. దాదాపు 5 గంటలపాటు ఎస్‌డీపీఐ కార్యాలయాన్ని ప్రత్యేక పోలీస్ బలగాలతో తమ ఆధీనంలోకి తీసుకున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన నలుగురు ఈడీ అధికారుల బృందాన్ని ఎస్‌డీపీఐ కార్యకర్తలు ఆఫీస్ తాళాలు తెరవకుండా అడ్డుపడ్డారు. దీంతో నంద్యాల వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తన బృందంతో వారిని వారించి తాళాలు తెరిపించారు. ఈడీ సోదాలు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5:25 వరకు కొనసాగాయి. ఈడీ సోదాల్లో ఎటువంటి ఆధారాలు, డాక్యుమెంట్లు లభించకపోవడంతో ఈడీ బృందం పంచనామా నిర్వహించి వెళ్లిపోయింది. ఈడీ అధికారులు వెళ్లే సమయంలో ఎస్‌డీపీఐ కార్యకర్తలు వారి వాహనాలకు అడ్డుపడి ఈడీకి, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈడీ సోదాలు కక్షపూరితమని ఎస్‌డీపీఐ నంద్యాల అసెంబ్లీ ఇన్‌చార్జి ఫాజిల్ పేర్కొన్నారు.

టీటీడీ చైర్మన్ పీఆర్వోనంటూ బురిడీ

- దర్శనం, సేవల పేరిట.. భక్తులను మోసగించిన వ్యక్తి అరెస్ట్

తిరుమల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకుని, తాను ఆయన పీఆర్వోనని భక్తులు మోసం చేస్తున్న వ్యక్తిని తిరుమల టూటౌన్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. చంద్రగిరికి చెందిన ఫరూక్ అలియాస్ ప్రసాద్ ప్రస్తుతం నెల్లూరు జిల్లా కోవూరులో నివాసం ఉంటున్నాడు. నాలుగు నెలల నుంచి 'తిరుమల సమాచారం' పేరుతో వాట్సాప్ గ్రూపులు ప్రారంభించి దాదాపు 600 మంది భక్తులను వాటిలో చేర్చాడు. తిరుమల శ్రీవారి దర్శనం, సేవలు కావాలంటే తనను సంప్రదించాలని ఆ గ్రూపుల్లో పోస్టులు పెట్టేవాడు. తాను టీటీడీ చైర్మన్ పీఆర్వో అని నమ్మించి తిరుమల దర్శన టికెట్ల సమాచారాన్ని గ్రూపుల్లో షేర్ చేసేవాడు. భక్తులు ఎవరైనా వ్యక్తిగతంగా కాల్ చేసి మాట్లాడితే ఆన్‌లైన్ ద్వారా నగదు తీసుకుని ఆ తర్వాత వారికి సమాధానమిచ్చేవాడు కాదు. ఇలా దాదాపు రూ.80 వేల వరకు వసూలు చేసి మోసగించాడు. భక్తుల ఫిర్యాదుపై స్పందించిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు విచారణకు ఆదేశించారు. ఫరూక్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు ఓ సెల్‌ఫోన్, సిమ్ కార్డులు, బ్యాంక్ పుస్తకాలు స్వాధీనం చేసుకుని.. అతన్ని రిమాండుకు పంపారు.

'కల్తీ నెయ్యి' నిందితులకు ముగిసిన సిట్ కస్టడీ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 6(ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి కేసులో ఇద్దరు నిందితులకు మూడు రోజుల సిట్ కస్టడీ ముగిసింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ కేసులో ఏ3 నిందితుడు పామిల్ జైన్, ఏ5 అపూర్వ వినయ్‌కాంత్ చావడాలను మంగళవారం సిట్ అధికారులు తమ కస్టడీకి తీసుకున్నారు. సిట్ కార్యాలయంలో విశాఖ సీబీఐ డీఐజీ మురళీ రాంబా నేతృత్వంలో అధికారులు వివిధ కోణాల్లో విచారించారు. వారిద్దరి వాంగ్మూలాలను రికార్డు చేశారు. మూడు రోజుల కస్టడీ గడువు ముగియడంతో గురువారం సాయంత్రం వారిని జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించారు. మరోవైపు ఏ2 నుంచి ఏ5 నిందితుల బెయిల్ కోసం దాఖలైన పిటిషన్లపై ఈ నెల 10న విచారణ జరగనుంది.

లభించని భక్తుడి ఆచూకీ!

- అవ్వాచారి కోన లోయలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు

తిరుమల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలినడక మార్గంలోని అవ్వాచారి కోన లోయలోకి దూకిన వ్యక్తి కోసం భద్రతా సిబ్బంది గురువారం తనిఖీలను కొనసాగించారు. రివర్స్ మోడ్‌లో విధానంలో ఆ వ్యక్తిని సిద్దారెడ్డిగా గుర్తించిన పోలీసులు బుధవారం అతని ఆచూకీ కోసం ప్రయత్నించిన విషయం తెలిసిందే. సిద్దారెడ్డికి చెందిన కీ ప్యాడ్ ఫోన్, ఓ జత దుస్తులను అతని స్నేహితుడు వీరప్ప పోలీసులకు అందజేశాడు. దీంతో పోలీసులు ఆ దుస్తుల ఆధారంగా డ్యాగ్ స్క్వాడ్‌తో గురువారం అవ్వాచారి కోనలోయలో గాలించారు. ఈక్రమంలో పోలీసు జాగిలం కేవలం 30 మీటర్లు మాత్రమే లోపలకు వెళ్లి తిరిగి వెనక్కి వచ్చేసింది. దీంతో రెండో రోజూ ఆ వ్యక్తి గురించి ఎలాంటి ఆధారాలు లభించలేదు.



శంకుస్థాపనలో పాల్గొన్న నారా భువనేశ్వరి, ఎంపీ దంపతులు

ఎన్టీఆర్ ట్రస్టు భవన నిర్మాణం హర్షణీయం

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

పటమట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజాసేవే ధ్యేయంగా తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్ ట్రస్టు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. విజయవాడ టీచర్స్ కాలనీలో సాయిబాబా గుడి వద్ద ఎన్టీఆర్ ట్రస్టు భవన నిర్మాణానికి గురువారం సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి శంకుస్థాపన చేశారు. ఎంపీ కేశినేని శివనాథ్ దంపతులు పాల్గొని హైదరాబాద్ నుంచి ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఏపీ ప్రజలకు మరింత చేరువ చేసేందుకు విజయవాడలో భవన నిర్మాణం చేపడుతున్నందుకు భువనేశ్వరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాజధాని అమరావతి ప్రాంతంలో పైగా తన నియోజకవర్గంలో జరగడం సంతోషాన్నిస్తుందన్నారు. పేద విద్యార్థులకు విద్య, వైద్య సదుపాయాలతో పాటు తలసేమియా కేర్ సెంటర్, బ్లడ్ బ్యాంక్ అందుబాటులోకి వస్తాయన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా నారా భువనేశ్వరి ట్రస్టును విజయవంతంగా నిర్వహిస్తున్నారన్నారు.

మహిళాభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలి

- కృష్ణా మిల్క్‌యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు



చిత్రలేఖనం పోటీలను ప్రారంభించి, ప్రదర్శనను తిలకిస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

గవర్నర్‌పేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ముఖ్య భూమిక పోషిస్తున్నారని, ఈ అభివృద్ధి మరింతగా కొనసాగాలని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో ఎంబీవీకే, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, సేఫ్, తరుణీతరంగాలు, భారత మహిళా మండలి, జనశిక్షణా సంస్థాన్, స్నేహాప్తి, సమన్విత సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం చిత్రలేఖనం పోటీలు, అభ్యుదయ గీతాలు, కవితల పోటీలు జరిగాయి. చిత్రలేఖనం పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధిలో మహిళల పాత్రే కీలకమన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాల రిటైర్డ్ డైరెక్టర్, సేఫ్ ఈసీ సభ్యురాలు డాక్టర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ గెలుపు, ఓటములు ముఖ్యం కాదని, ఇలాంటి అవకాశం వచ్చినప్పుడు తప్పనిసరిగా పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని కోరారు. యూఎస్‌ఏ హెల్త్‌కేర్ ఎకన మిస్ట్ పాలపర్తి ఇంద్రాణి మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యాలను నిర్లక్ష్యం చేయకుండా యోగా, మెడిటేషన్ వంటి వాటికి తప్పనిసరిగా సమయం కేటాయించాలని కోరారు. ఎంబీవీకే మేనేజింగ్ కమిటీ సభ్యురాలు కె.స్వరూపరాణి మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న సృజనాత్మకతను పెంపొందించేందుకు ఎంబీవీకే ఇతర మహిళా సంస్థలను కలుపుకుని ఈ పోటీలను నిర్వహించిందన్నారు. చిత్రలేఖనం పోటీలు న్యాయనిర్ణేతలుగా వివిధ సంస్థల ప్రతినిధులు రమేష్, గిరిధర్, చిత్రం సుధీర్, పాటల పోటీల న్యాయనిర్ణేతలుగా స్వరలయ ప్రభాకర్, సూర్య కామేశ్వరి, కవితలకు అనిల్ డ్యాని, వడ్లమూడి పద్మ, వైష్ణవి వ్యవహరించారు. ఎంబీవీకే బాధ్యులు పి.విజయ, పావని, గీత, నందిని, సేఫ్ సంస్థ నుంచి ఉషారాజా, శేషు, తరుణీతరంగాలు బాధ్యులు శ్రీదేవి, జనశిక్షణా సంస్థాన్ పూర్ణిమ, వన్‌ఎర్త్ వన్‌లైఫ్ బాధ్యులు లీలాకుమారి, భారత మహిళా మండలి సూర్యకామేశ్వరి, సమన్విత బాధ్యులు వడ్లమూడి పద్మ పాల్గొన్నారు.

సహజయోగ



రేపు మహిళా దినోత్సవం

సర్వ శక్తులకూ మూలం... ఆమె

'యత్ర నార్యస్తు పూజ్యంతే... రమంతే తత్ర దేవతాః... మహిళలను గౌరవించే చోట దేవతలు నివసిస్తారు' అన్నారు పూర్వులు. మన పురాణాలలో స్త్రీని శక్తిస్వరూపిణిగా వర్ణించారు. ఇంతకీ ఆ శక్తి ఏమిటి? అది ఏ విధమైన శక్తి? దానికి కొలమానం ఏమిటి? అది ఎలా పని చేస్తుంది? ఇలాంటి ప్రశ్నలు ఎన్నిటికో శ్రీమాతాజీ నిర్మలా దేవి వివిధ సందర్భాలలో సమాధానాలు ఇచ్చారు.

"మన ఇతిహాసాలలో శ్రీరాముని శక్తి సీత. శివుడి శక్తి పార్వతి. కృష్ణుడి శక్తి రాధ. ఈ శక్తులు రాక్షస సంహారం కోసమో, యుద్ధం చేయడం కోసమో రణరంగానికి వెళ్ళలేదు. శ్రీరాముడు, కృష్ణుడే యుద్ధం చేశారు. కానీ ఆ శక్తుల ప్రభావం వారితో యుద్ధం చేయించింది. అందుకే... పురుషులది గతి శక్తి అయితే మహిళలది స్థితి శక్తి. బయటనుంచి చూసినప్పుడు ఫ్యాన్ తిరుగుతున్నట్టు కనిపిస్తోంది. కానీ దాన్ని తిప్పుతున్నది దానిలోపల ప్రవహిస్తున్న విద్యుచ్ఛక్తి. అదే విధంగా పురుషులు పనులు చేస్తున్నట్టు కనిపించినా... వారితో ఆ పనులు చేయించేది మాత్రం మహిళల శక్తే. అందుకే స్త్రీని శక్తి స్వరూపిణి అంటారు" అని నిర్మలాదేవి వివరించారు.

ఆ బాధ్యత మహిళలదే...

జీవశాస్త్రం ప్రకారం కణంలో ఉండే శక్తి కేంద్రాన్ని 'మైటోకాండ్రియా' అంటారు. అది మానవులలో ఒక తరం నుంచి మరో తరానికి సంక్రమించేటప్పుడు... తల్లి ద్వారానే లభిస్తుంది. అంటే ప్రతి మానవుడికి శక్తి తల్లి నుంచే సంక్రమిస్తుంది. కాబట్టి సైన్స్ ప్రకారం కూడా శక్తికి మూలం మహిళే. ఈ తల్లులందరికీ మూలమైన తల్లిని హిందూ ధర్మంలో 'ఆదిశక్తి' అని పిలుస్తారు. ఇక్కడ 'శక్తి' అంటే ఏదో ఒక ప్రత్యేకమైన శక్తి అని కాదు.. 'అన్ని శక్తులూ' అని అర్థం. ఇవన్నీ మన సూక్ష్మ శరీరంలోని షట్చక్రాలపై ఉంటాయి. మొత్తం శక్తి కేంద్రం జగదంబగా మన హృదయ చక్రంలో ఉంటుంది. ఇది చాలా ప్రబలమైనది. ఈ శక్తి ఆరాధన ద్వారా... సర్వ దేవతా శక్తులకూ పూజ జరుగుతుంది. ఆ శక్తులు చెడిపోతే మన శరీరంలోని చక్రాలు దెబ్బతింటాయి. మనకు శారీరక, మానసిక, భావోద్వేగ సమస్యలు వస్తాయి. కాబట్టి ఎల్లప్పుడూ ఈ శక్తులను ప్రసన్నంగా ఉంచుకోవాలి. అందుకే దేవీ ప్రసన్నం చేసుకోవాలని అంటూ ఉంటారు. "స్త్రీ శక్తి స్వరూపిణి కాబట్టి ఆమెను గౌరవించడం గృహిణిని గృహలక్ష్మిగా భావించడం చాలా ముఖ్యమైన విషయం. ఎక్కడ మహిళలను ఇబ్బంది పెడితే అక్కడ దేవతలు నివసించరు. మహిళలకు, పురుషులకు మధ్య సమతుల్యత లేనప్పుడు ఇంట్లో ప్రశాంతత కొరవడుతుంది. పిల్లలపై ఆ దుష్ప్రభావం పడుతుంది. చివరకు సమాజం నాశనం అవుతుంది. దీన్ని నివారించే బాధ్యత ప్రధానంగా మహిళలపైనే ఉంది" అని నిర్మలాదేవి స్పష్టం చేశారు. "ప్రస్తుత కాలంలో మహిళల్లో ఆధ్యాత్మిక ఔన్నత్యం తగ్గడం, విలువలు పోగొట్టుకోవడం జరుగుతోంది. పోటీతత్వం, ధనాశ లాంటివి పెరిగాయి. నిరర్థకమైన విషయాల్లో ఆసక్తి పెరగడం వల్ల ఆధ్యాత్మిక ఉన్నతిపై శ్రద్ధ తగ్గుతోంది.



న్యాయబుద్ధి, మంచి నడవడి, జాలి అనేవి స్త్రీలకు సహజమైన గుణాలు. కరుణ ఆమెకు అలంకారం. మహిళలు తమకున్న శక్తిని గుర్తించినట్టయితే ఈ ప్రపంచాన్ని అత్యంత సుందరంగా మార్చగలరు. కొందరు మహిళలు ఈ మార్గంలో చక్కటి ఉన్నతిని సాధించారు. ఒక శక్తిమంతుడైన పురుషుణ్ణి చూసినప్పుడు... అతని వెనుక ఒక స్త్రీ ఉందని మనం వెంటనే గుర్తించవచ్చు. స్త్రీలకు అటువంటి శక్తులు ఉన్నాయి" అనేది నిర్మలాదేవి ఇచ్చిన సందేశం.

రక్షణ కవచం

"మహిళలను భూమాతతో పోలుస్తారు. భూమాత ఎంతో ఒత్తిడిని భరిస్తూ మొత్తం ప్రపంచానికి ఆధారంగా నిలుస్తుంది. మహిళలకు ఈ పృథ్వీ తత్వాన్ని భగవంతుడే ఇచ్చాడు. అయితే మహిళలను దిగజార్చడానికి ప్రతికూల శక్తులు ఎన్నో ఎదురుచూస్తూ ఉంటాయి. అవి మహిళలను ప్రలోభాలకు, ఆకర్షణలకు గురి చేస్తాయి వాటికి లొంగకూడదు. మానవుల ఆధ్యాత్మిక ప్రయాణంలో మహిళల పాత్ర అత్యంత కీలకమైనది. వారిని శక్తి స్వరూపిణులుగా భావించి గౌరవించాలి. దీనివల్ల మనలోని వివిధ చక్రాలు చైతన్యవంతం అవుతాయి" అని నిర్మలాదేవి సోదాహరణంగా వివరించారు. "మహిళ తన సంపూర్ణ శక్తులను వెలికితీసి ఉపయోగించినప్పుడు... ఆమె చాలా శక్తిమంతురాలిగా, భీకరంగా ఉంటుంది. అలా కాకుండా ఎప్పుడూ వాదిస్తూ, కొట్లాడుతూ, విమర్శిస్తూ, చౌకబారుగా ప్రవర్తించినప్పుడు ఆ శక్తులన్నీ వృథా అవుతాయి. ఆమె కావాలనుకుంటే పురుషులకన్నా ఎక్కువగా పని చేయగలదు. అయితే మొదట ఆమె నమ్రతగా, అణకువగా, హుందాతనంతో, చక్కటి అవగాహనతో, వాత్సల్యపూరితంగా ఉండాలి. తనలోని శక్తులను గౌరవించుకోవాలి, శాంతిని నెలకొల్పడం నేర్చుకోవాలి. ఒక కవచంలా రక్షణ కల్పించడం స్త్రీల బాధ్యత. కత్తి, కవచం ఒకటి చేసే పని మరొకటి చేయలేకపోవచ్చు. కానీ రెండిటిలో కవచమే గొప్ప. ఎందుకంటే అది కత్తి దెబ్బను తట్టుకోవాలి. కత్తి విరుగుతుందేమో కానీ కవచం విరగదు" అని ఆమె పేర్కొన్నారు. మహిళలు తమలోని శక్తులను గుర్తించాలి. వాటిలో స్థిరపడాలి. నమ్రత అనేది ఈ శక్తులకు గొప్ప ఇరుసు లాంటిది. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో ఎన్నో హింసాత్మకమైన, అనైతికమైన కార్యక్రమాలను చూస్తున్నాం. వీటి ప్రభావం సమాజం మీద... ప్రధానంగా చిన్న పిల్లల మీద పడుతోంది. మహిళలు సహజయోగ మార్గాన్ని సరైన రీతిలో అర్థం చేసుకొని ఆచరించడం ద్వారా సమాజంలో పరివర్తన తీసుకురాగలరు. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా సహజయోగ సాధన చేస్తున్న ఎందరో మహిళలు... శ్రీమాతాజీ నిర్మలాదేవి అనుసరించిన, ప్రబోధించిన ధర్మాలను ఆచరిస్తున్నారు. ఉత్తమ కుటుంబ సభ్యులుగా, సమాజ పౌరులుగా తమతమ దైనందిన జీవితంలో ప్రశాంతమైన, సమతుల్యమైన జీవితం గడుపుతున్నారు.

డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



బ్రహ్మకుమారీస్



మహిళలు ఆధ్యాత్మిక నాయకులు కావాలంటే...

ఆధ్యాత్మిక మార్గాన్ని మహిళలు ఎందుకు ఎంచుకోవాలి? తనను తాను పూర్తిగా తెలుసుకోవడానికి, ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవడానికి, స్వీయ నియంత్రణలో ఉండడానికీ అని భావించవచ్చు. తన అస్థిత్వాన్ని గుర్తించడం అనేది ఎవరికైనా ప్రధానం. ఆధిపత్యం, అణచివేతల నుంచి విముక్తి పొందడం, వేరొకరి సంతోషం కోసమో, మెప్పుకోసమో మనం జీవించనవసరం లేని స్థితికి చేరడం, పరిపూర్ణత, స్వతంత్రత సాధించడం... ఇదే ఆధ్యాత్మిక శక్తి, అదే మనలోని అసలైన శక్తి. దాదాపు గత రెండువేల ఏళ్ళకు పైగా మహిళలు తమ ఆధ్యాత్మిక శక్తిని పూర్తిగా ఉపయోగించుకోలేదు. అన్ని మత సంప్రదాయాలు మహిళలను సంకేత రూపంలో తీసుకున్నాయి. ఒకవైపు వారిని పీఠాలపై ఉంచి పూజిస్తారు. మరోవైపు మతపరమైన ఆచారాల నుంచి వారిని మినహాయించారు. కొన్నిచోట్ల ప్రార్థనా స్థలాల్లో ప్రవేశించకుండా నిషేధించారు. మహిళలను ఉన్నతంగా చూసినా, వివక్ష చూపినా... ఎప్పుడూ వారిని పురుషులతో సమానంగా పరిగణించకపోవడం అనేది ప్రధాన సమస్య. ఆధ్యాత్మిక నాయకులుగా, ఆధ్యాత్మిక అన్వేషకులుగా సమానత్వం లేకపోవడానికి మూలాలు సామాజిక, సాంస్కృతిక వ్యవస్థలలో ఉన్నాయి.

అవి బలహీనతలు కావు...

మహిళలు ఆధ్యాత్మిక నాయకులు కావాలంటే... అటువంటి పాత్ర పోషించే సామర్థ్యం, అవసరమైన లక్షణాలు తమకు ఉన్నాయని వారు స్వయంగా అంగీకరించాలి. అనర్థమైన భావాలు, వైఖరుల నుంచి దూరంగా వెళ్ళడానికి, తనలోనే ఉన్న గొప్పతనాన్ని గుర్తించడానికి వారి చైతన్యంలో మార్పు అవసరం. ప్రేమ, సహనం, కరుణ, అవగాహన, వినయం లాంటివి స్త్రీ లక్షణాలు. అవి ఆధ్యాత్మికమైన పురోగతికి కూడా అవసరం. ఎందుకంటే ఇవి లేకుండా భగవంతుడికి దగ్గర కావడం, స్వీయ సాక్షాత్కారం పొందడం అసాధ్యం. ప్రతి మానవుడిలో ఈ లక్షణాలు ఉంటాయి. కానీ మహిళలు వాటిని సులభంగా పొందగలరు. ఎందుకంటే ప్రేమ, భక్తి భావాలు వారిలో సహజంగానే ఉంటాయి, అవి క్రమశిక్షణతో, వ్యవస్థీకృతంగా ఉంటాయి. వారు నాయకత్వానికి ఉదాహరణగా నిలుస్తారు. సేవ చేయడం, నిస్వార్థంగా ఏదైనా ఇవ్వడం ఎలాగనేది వారికి తెలుసు. సేవ చేయడం, ఇతరుల పట్ల వినయంగా ఉండడం, నమస్కరించడం అనేవి బలహీనతలుగా పరిగణించేవారూ ఉన్నారు. కానీ అవి బలహీనతలు కావు. నిజమైన వినయంతో ఇతరులకు నమస్కరించే సామర్థ్యం... అహంకారాన్ని జయించిన ఆత్మ గొప్పతనానికి సంకేతం. అయితే ధైర్యం, సంకల్పం, స్పష్టమైన ఆలోచన, ఆత్మగౌరవం లాంటి లక్షణాలతో ఈ గుణం సమతుల్యం కావాలి.

> మహిళలను ఉన్నతంగా చూసినా, వివక్ష చూపినా... ఎప్పుడూ వారిని పురుషులతో సమానంగా పరిగణించకపోవడం అనేది ప్రధాన సమస్య. ఆధ్యాత్మిక నాయకులుగా, ఆధ్యాత్మిక అన్వేషకులుగా సమానత్వం లేకపోవడానికి మూలాలు సామాజిక, సాంస్కృతిక వ్యవస్థలలో ఉన్నాయి.

ఆత్మగౌరవంతోనే సాధ్యం

ఇతరులకు సేవ చేయడంలో, వేరే బాధ్యతల్లో మునిగిన మహిళలు తమ సొంత ఆధ్యాత్మిక అవసరాలను నిర్లక్ష్యం చేస్తారు. వారు తమనుతాము తక్కువ చేసుకోవడానికి, వారిలో ఆధ్యాత్మిక శక్తి లేకపోవడానికి కారణాల్లో ఇదొకటి. వారి ఆలోచనా ధోరణిలో, వివేకంలో వచ్చే మార్పు రావాలి. ఆధ్యాత్మిక నాయకత్వాన్ని మహిళలు స్వీకరించడానికి అదే పునాది. ఆత్మగౌరవాన్ని పెంచుకోవడం ద్వారా మాత్రమే... మహిళలు తాము ఆధ్యాత్మిక నాయకులుగా మారకుండా నిరోధించే శారీరకమైన మతపరమైన సామాజికమైన అడ్డంకులను అధిగమించగలరు. ఆత్మగౌరవం అనే లక్షణం సామాజిక, సాంస్కృతిక, శారీరక గుర్తింపునకు అతీతమైన, శాశ్వతమైన స్వీయజ్ఞానం, అనుభవం నుంచి వస్తుంది. 'ఆత్మ' అనేది స్వచ్ఛమైనది, శాంతియుతమైనది, దైవికమైన, ఆధ్యాత్మికమైన లక్షణాలతో సంపూర్ణమైనది. మహిళలు తమలో అంతర్గతంగా ఉండే శాశ్వతమైన ఈ మూలాన్ని తాకినప్పుడు... తమకు సామర్థ్యం ఉన్న పాత్రను పోషించే ధైర్యాన్ని పొందుతారు. ఆధ్యాత్మిక శక్తి అనేది ఆత్మ తాలూకు స్వాభావిక లక్షణాల వ్యక్తీకరణ. దీనికి లింగ పరమైన, శారీరకమైన పరిమితులతో సంబంధం లేదు. తాము ఉన్నతులమనో, తక్కువవారిమనో భావించే పరిస్థితులు ఉన్న చోటే ఆధిపత్యమో, అణచివేతో సంభవిస్తాయి. ఆత్మ పట్ల ఎరుక ఉన్నప్పుడు సమానత్వ భావాలు వ్యక్తమవుతాయి. ఈ భావాలు, వైఖరులు సానుకూల ఫలితాలను ఇచ్చే చర్యల ద్వారా వ్యక్తం అవుతాయి. మహిళలు ఆధ్యాత్మిక నాయకత్వ స్థానాలను అందుకోవడానికి చాలా దూరంలో ఉన్నారు. అలాగే మహిళలు మంచి ఆధ్యాత్మిక నాయకులు అవుతారనే భావనతో సమాజం నేటికీ పూర్తిగా ఏకీభవించడంలేదు. ఎవరైనా వ్యక్తి లేదా వ్యక్తుల సమూహం ఈ భావాలను విచ్ఛిన్నం చేసి, ఆదర్శప్రాయమైన నమూనాను రూపొందించే వరకూ సమాజంలో మార్పు కచ్చితంగా రాదు. అలాంటి మార్పుకోసం 'ప్రపంచ ఆధ్యాత్మిక విశ్వవిద్యాలయం' వ్యవస్థాపకుడు బ్రహ్మ బాబా (లేఖ్‌రాజ్ కృపలాని) చేసిన ఆలోచన నుంచి 'బ్రహ్మకుమారీస్' సంస్థ ఆవిర్భవించింది.

• బ్రహ్మకుమారీస్

సద్బోధ

భక్తి సంకుచితమైతే...

చైనాలో ఒక భక్తురాలు ఉండేది. బుద్ధుడు అంటే ఆమెకు ఎనలేని ప్రేమ, సాటిలేని భక్తి ఉండేది. తన ఆస్తిపాస్తులన్నిటినీ అమ్మేసి, వచ్చిన డబ్బుతో మేలి బంగారపు బుద్ధ విగ్రహాన్ని ఆమె తయారు చేయించింది. అయినవారందరినీ వదిలేసి సహస్ర బుద్ధ మందిరానికి వెళ్ళి, అక్కడే సన్యాసినిగా జీవించసాగింది.

అదొక పెద్ద ఆలయం. ఒక భారీ పర్వతాన్ని ఆలయంగా మలిచారు. అందులో వెయ్యి బుద్ధుడి విగ్రహాలు ఉండేవి కాబట్టి దాన్ని 'సహస్ర బుద్ధ ఆలయం' అని పిలిచేవారు. తనతోపాటు తెచ్చుకున్న స్వర్ణ బుద్ధుణ్ణి ఆమె అక్కడే కొలువుతీర్చింది. రోజూ భక్తి శ్రద్ధలతో పూజించేది. పూజలో సువాసన వెదజల్లే చాలా ఖరీదైన అగరుబత్తిలను ఈ విగ్రహం ముందు వెలిగించేది. ఆ సువాసనను తన ఇష్టదైవం... అంటే ఆ బంగారు ప్రతిమ మాత్రమే ఆస్వాదించాలనేది ఆమె కోరిక. కానీ అగరుబత్తిల పొగ తన బుద్ధుడివైపు కాకుండా... ఆలయంలో ఉన్న ఇతర బుద్ధ విగ్రహాల వైపు వెళ్తూ ఉండేది. ఇది ఆమెకు నచ్చేది కాదు. కేవలం తన బుద్ధుడికి మాత్రమే ఆ సువాసన చేరాలంటే ఏం చేయాలా? అని రాత్రింబవళ్ళు తీవ్రంగా ఆలోచించింది. చివరకు ఆమెకు ఒక ఉపాయం తట్టింది. వెంటనే దాన్ని అమలుచేసింది.



ఒక గొట్టాన్ని తయారు చేసి, దాన్ని తన బంగారు బుద్ధ విగ్రహం ముందు పెట్టింది. వెలిగించిన అగరు బత్తిలను ఆ గొట్టంలో అమర్చింది. సువాసనను మోసుకొచ్చే పొగ నేరుగా ఆ బుద్ధుడి ముక్కులోకి వెళ్ళే ఏర్పాటు చేసింది. ఆ పొగ తన బుద్ధుడివైపే వెళుతూ ఉంటే చూస్తూ ఆమె ఎంతో ఆనందిస్తూ ఉండేది. కానీ కొద్దిరోజులకే ఆ ఆనందం దుఃఖంగా మారింది. కారణం ఏమిటంటే... ఆమె రోజూ అలా చేయడం వల్ల... ఆ బంగారు బుద్ధుడి ముఖం మసిబారిపోయింది, కళావిహీనంగా మారింది. ఎంతో ప్రశాంతంగా, నిర్మలంగా, ప్రకాశవంతంగా ఉండే ఆ ముఖం నల్లగా, దుఃఖభరితంగా కనిపించింది. దాన్ని ఎంత శుభ్రపరిచినా ఇదివరకటి కళ లేదు. దీంతో ఆమె ఎంతో ఆందోళనతో, ఆవేదనతో... ఆ ఆలయ ముఖ్య పూజారి దగ్గరకు వెళ్ళింది. ఆయనను తీసుకువచ్చి, తన బంగారు బుద్ధుణ్ణి చూపించింది. "నా స్వామి, నా బుద్ధుడు ఎలా అయ్యాడో చూడండి. నేను ఏం చేస్తే నా బుద్ధుడు మళ్ళీ ప్రకాశిస్తాడో చెప్పండి" అని ఏడుస్తూ వేడుకుంది.

"అమ్మా! ఇది నీవు ఒక్కదానివి మాత్రమే చేసే తప్పు కాదు. లోకంలో ప్రతి మూఢ భక్తుడు తన ఇష్టమూర్తిని సంకుచిత ధోరణితో ఇలాగే మసిపూసి, మసకబారుస్తున్నాడు" అని ఆమెను ఆయన ఓదార్చాడు.

తన బుద్ధుడే అసలైన బుద్ధుడనీ, ఆయనకు మాత్రమే తన ఆరాధన మొత్తం చేరాలనీ, ఆలయంలో ఇతర బుద్ధ ప్రతిమలకు చేరకూడదనీ ఆమె సంకుచితంగా వ్యవహరించింది. అదే ఆ బంగారు బుద్ధుణ్ణి అందవిహీనుడిగా చేసిందనీ, ఇలాంటి సంకుచిత భక్తి, ప్రేమ దుఃఖాన్నే విగులుస్తాయనే బోధ ఆయన మాటల్లో ఉంది.

• రాచమడుగు శ్రీనివాసులు

చింతన



సేవే పరమావధి

సమాజానికి మొదటి గురువు... మహిళ. వారికి ఉన్న గొప్ప బలం... మాతృత్వం. సృష్టిని కొనసాగించడం కోసం, భావి తరాలను తీర్చిదిద్దడం కోసం భగవంతుడు అది వారికి ఇచ్చిన వరం, బాధ్యత కూడా. తల్లులు ప్రయత్నించినట్టయితే, తమ పిల్లల్లో మన ఘనమైన సంప్రదాయం గురించి ఆలోచనలు నాటుకొనేలా చేయగలరు. ఆడపిల్లలను, మహిళలను గౌరవించడం ఎంత ముఖ్యమనే పాఠాలు నేర్పగలరు. వారు సరైన పరిస్థితులు సృష్టించినప్పుడు... పిల్లలు ఆదర్శవంతులైన పౌరులుగా ఎదుగుతారు. మన సంస్కృతిపట్ల ఆపేక్షను వారిలో కలిగించగలం. వారి వ్యక్తిత్వాలను సమున్నతంగా రూపుదిద్దగలం. మనిషికి సంబంధించిన చాలా అంశాలను అతనిలోని జన్యువులు నిర్ధారిస్తాయని సైన్స్ చెబుతోంది. కానీ పెరుగుతున్న పిల్లలపై తల్లి, ఇల్లు, పరిసరాలు, పరిస్థితులు చూపే ప్రభావం చాలా పెద్దది.

ఈ రోజు మహిళలు జీవితాల్లో ఎలా పురోభివృద్ధి సాధించాలా అనేది మాత్రమే ఆలోచిస్తున్నారు. అది మంచిదే. మహిళలు అన్ని రంగాల్లో కచ్చితంగా ముందుకు సాగాల్సిందే. కానీ, అప్పుడప్పుడు ఆగి, వెనక్కి తిరిగి చూసుకోవడం కూడా మంచిది. ఎందుకంటే వారి వెనుక వారిని అనుసరించే, అనుకరించే పిల్లలు ఉంటారు. రేపటి సమాజం శక్తి, సౌందర్యం, పరిమళం... వీటన్నిటినీ నిర్ణయించేది నేటి తల్లులే. తల్లి పాలు పిల్లల శరీరానికి పోషకాలు అందించడమే కాదు, వారి మెదడు, తెలివితేటలు, హృదయం అభివృద్ధి చెందడానికి కూడా దోహదం చేస్తాయి. అదేవిధంగా, ఒక ఆదర్శమూర్తిగా తల్లి నేర్పే జీవిత పాఠాలు, విలువలు పిల్లలకు వారు భవిష్యత్తులో ఉపయోగించుకోగలిగే బలాన్నీ, ధైర్యాన్ని అందిస్తాయి. కేవలం తల్లి పాత్ర గురించి ఇంతగా చెప్పడానికి కారణం ఏవిటంటే... మహిళ బలం ఆమె మాతృత్వంలోనే ఉంది. మాతృత్వం అనేది లోకాన్ని రూపాంతరీకరించే ఒక శక్తి. ఇతరుల హృదయాలను అర్థం చేసుకోవడం ద్వారా ఆ శక్తి పని చేస్తుంది. మహిళలో స్వతస్సిద్ధంగా ఉండే ఈ మమకారం చాలా విలువైనది.


> మహిళలు అన్ని రంగాల్లో కచ్చితంగా ముందుకు సాగాల్సిందే. కానీ, అప్పుడప్పుడు ఆగి, వెనక్కి తిరిగి చూసుకోవడం కూడా మంచిది. ఎందుకంటే వారి వెనుక వారిని అనుసరించే, అనుకరించే పిల్లలు ఉంటారు. రేపటి సమాజం శక్తి, సౌందర్యం, పరిమళం... వీటన్నిటినీ నిర్ణయించేది నేటి తల్లులే.

మహిళలు నిస్సహాయులో, వేరేవారిపై ఆధారపడేవారో కాదు. వారికి సింహాల్లా గర్జించే ధైర్యం, శక్తి ఉన్నాయి. వారు వేరొకరు వెలిగించే కొవ్వొత్తులలాంటివారు కాదు. స్వయంప్రకాశకత్వం కలిగిన సూర్యుడులాంటివారు. సరైన అవకాశాలు, స్వేచ్ఛ లభిస్తే వారు అద్భుతాలు చెయ్యగలరు. తెలివితేటల్లో కానీ, సామర్థ్యంలో కానీ మహిళలు పురుషులకు ఏమాత్రం తక్కువ కాదు. ఎలాంటి పనినైనా చక్కగా నిర్వర్తించగలిగే సంకల్పబలం, సృజనాత్మక శక్తి వారికి ఉన్నాయి. ఏ రంగంలోనైనా వారు అత్యుత్తమ శిఖరాలు సాగించగలరు. ఆధ్యాత్మిక రంగానికి కూడా ఇది వర్తిస్తుంది. దీన్ని సాధించడానికి స్వచ్ఛమైన హృదయం, మేథోపరమైన సామర్థ్యం ఉండాలి. ఏ పనినైనా సానుకూల దృక్పథంతో ప్రారంభించాలి. ఆరంభం మంచిగా ఉంటే... అది మంచిగా కొనసాగుతుంది, ముగింపు సైతం మంచిగానే ఉంటుంది. దీనికి సాధన కావాలి. అలా సాధన చేసే క్రమంలో సహనం కలుగుతుంది, తమ పట్ల విశ్వాసం, తోటివారి పట్ల ప్రేమ బలపడతాయి. అయితే ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఏ రంగంలోనైనా నాయకత్వం అంటే ఆధిపత్యం కోసమో, నియంత్రణ కోసమో కాకూడదు. ఇతరులకు ప్రేమతో, ఆప్యాయతతో సేవ చెయ్యడమే మనకు పరమావధి కావాలి.

• మాతా అమృతానందమయి

వారు శాశ్వతులు

సుభాషితం



సుకృతాత్ములు రససిద్ధులు
సుకవీంద్రులు విజయ నిధులు సుమ్ము తదీయా
ధిక కీర్తి శరీరంబులు
ప్రకట జరామరణ జన్మ భయ రహితంబుల్

ఈ పద్యం... భర్తృహరి రచించిన 'నీతిశతకం'లో సుప్రసిద్ధమైన 'జయంతితే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః... నాస్తి తేషాం యశః కాయే జరామరణజం భయం' అనే శ్లోకానికి ఏనుగు లక్ష్మణకవి చేసిన తెలుగు అనువాదం.


భావం: గొప్ప కావ్యాలు రచించిన కవీంద్రులు ధన్యులు, తమ గ్రంథాల ద్వారా వారు సాధించిన రససిద్ధి ద్వారా శాశ్వతులు. వారి కీర్తి శరీరాలకు చావు పుట్టుకలనేవి ఉండవు. వారు సర్వకాలాల్లో ప్రకాశిస్తూనే ఉంటారు.

గీతాసారం


స్థితప్రజ్ఞుడు ఎవరు?

"స్థితప్రజ్ఞత అంటే ఏమిటి? స్థితప్రజ్ఞుడు ఎలా ఉంటాడు?" అనే అర్జునుడి ప్రశ్నకు, దానికి శ్రీకృష్ణుడు ఇచ్చిన వివరణకు భగవద్గీతలో ఎంతో ప్రాధాన్యత ఉంది. స్థితప్రజ్ఞుడు తన పట్ల తాను సంతృప్తితో ఉంటాడని చెప్పిన కృష్ణుడు... స్థితప్రజ్ఞత కలిగినవారు ఎలా మాట్లాడతారు, కూర్చుంటారు, నడుస్తారు? అనే సందేహంపై స్పందించలేదు.పరిస్థితులను బట్టి అజ్ఞాని, స్థితప్రజ్ఞుడు... ఈ ఇద్దరూ ఒకే మాటలు మాట్లాడవచ్చు, ఒకే రీతిలో కూర్చోవచ్చు, నడవవచ్చు. 'స్వయంతో (తనతో) సంతృప్తి' అనేది పూర్తిగా అంతర్గతంగా జరిగే విషయం. బాహ్య ప్రవర్తన కారణంగా దాన్ని కొలవడానికి అవకాశం లేదు. ఇది స్థితప్రజ్ఞత గురించి మనకున్న అవగాహనను మరింత క్లిష్టతరం చేస్తుంది. మరి ఇది ఎలా తెలుసుకోవాలి?

శ్రీకృష్ణుని జీవితం స్థితప్రజ్ఞత కలిగిన జీవితానికి ఉత్తమమైన ఉదాహరణ. ఆయన పుట్టినప్పుడే తల్లితండ్రుల నుంచి విడిపోయాడు. ఆయనను 'వెన్న దొంగ' అని పిలిచేవారు. ఆయన శృంగారం, నృత్యం, వేణుగానం... ఇవన్నీ ఆయన కథలో ఉన్నాయి. కానీ బృందావనాన్ని విడిచిపెట్టాక శృంగారాన్ని కోరుతూ తిరిగి రాలేదు. అవసరమైనప్పుడు పోరాడాడు. శత్రువులను చంపాడు. కానీ కొన్ని సమయాల్లో యుద్ధానికి దూరంగా ఉన్నాడు. అందుకే ఆయనను 'యుద్ధం నుంచి పారిపోయే వ్యక్తి' అని కూడా అన్నారు. ఆయన ఎన్నో అద్భుతాలు చేశాడు. స్నేహితులకు స్నేహితుడు. తనకు దొంగతనం అంటగట్టినప్పుడు, ఆ తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టడానికి... శమంతకమణి జాడను కనిపెట్టాడు. గీతాజ్ఞానాన్ని ఏ సమయంలో ఇవ్వాలో ఆ సమయంలో అర్జునుడిద్వారా అందించాడు.



గుర్తించాల్సిన విషయం ఏమిటంటే... బయటికి కనిపించే ఆయన జీవితం ఒక క్రమపద్ధతిలో ఉన్నట్టు అనిపించదు. కానీ అంతరంగికంగా ఆయన ఎప్పుడూ వర్తమానంలోనే జీవించాడు. అనేక ప్రతికూల పరిస్థితులు, సమస్యలు ఎదురైనప్పటికీ... ఆయన జీవితం నిరంతరం ఉత్సాహంగా, ఆనందమయంగా సాగింది. 'స్వయంతో సంతృప్తి' అంటే క్రియాశూన్యత కాదు. కర్తృత్వ భావన అంటే 'చేసేవాడిని నేనే' అనే భావన లేకుండా, కర్మ ఫలాలను ఆశించకుండా కర్మలు నిర్వహించడం. అంటే... గతం తాలూకు భారాన్ని మోయకుండా, భవిష్యత్తు గురించి ఆశ పెంచుకోకుండా వర్తమానంలో జీవించడం. శ్రీకృష్ణుడు తన జీవితం ద్వారా స్థితప్రజ్ఞుడి ప్రవర్తన ఎలా ఉంటుందో చూపించాడు.



కె. శివప్రసాద్

నేటి నుంచి ఐపీఎల్ టిక్కెట్ల విక్రయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) జట్టు టిక్కెట్ల విక్రయాలను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించడంతో తెలుగు రాష్ట్రాల్లో ఐపీఎల్ సందడి మొదలైంది. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 'జొమాటో డిస్ట్రిక్ట్ యాప్‌'లో టిక్కెట్లను అమ్మకానికి ఉంచినట్టు ఎస్‌ఆర్‌హెచ్ యాజమాన్యం తెలిపింది. ఉప్పల్ స్టేడియంలో ఈనెల 23న సన్‌రైజర్స్-రాజస్థాన్, 27న సన్‌రైజర్స్-లఖ్‌నవూ జట్ల మధ్య జరిగే రెండు మ్యాచ్‌ల టిక్కెట్లను ఆన్‌లైన్‌లో మాత్రమే విక్రయించనున్నారు. ఆన్‌లైన్‌లో కొన్న టిక్కెట్లను ఏ కేంద్రాల్లో పొందాలో ఎస్‌ఆర్‌హెచ్ ఇంకా ప్రకటించకపోవడంపై ఫ్యాన్స్ సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వన్డేలకు ముష్ఫికర్ గుడ్‌బై



ఢాకా: బంగ్లాదేశ్ వికెట్ కీపర్-బ్యాటర్ ముష్ఫికర్ రహీమ్ వన్డేలకు గుడ్‌బై చెప్పాడు. తన నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని అతడు సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. 37 ఏళ్ల ముష్ఫికర్ చాంపియన్స్ ట్రోఫీలో కూడా ఆడాడు. 2006లో జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో అతడు వన్డేల్లో అరంగేట్రం చేశాడు. మొత్తం 274 వన్డేలు ఆడిన ముష్ఫికర్ 36.42 సగటుతో 7795 పరుగులు సాధించాడు. టీ20లకు ఎప్పుడో రిటైర్మెంట్ ప్రకటించిన ముష్ఫికర్.. టెస్టుల్లో కొనసాగనున్నాడు.

సన్‌రైజర్స్ జట్టులో ముల్డర్



హైదరాబాద్: ఐపీఎల్ ఆరంభానికి ముందే సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు గట్టి దెబ్బ తగిలింది. ఆ టీమ్ వేలంలో రూ. కోటికి కొనుగోలు చేసిన ఇంగ్లండ్ పేసర్ బ్రైడన్ కార్స్ కాలికి గాయం కావడంతో మెగా లీగ్‌కు దూరమయ్యాడు. దీంతో అతడి స్థానాన్ని దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ వియాన్ ముల్డర్‌తో భర్తీ చేశారు. వేలంలో అన్‌సోల్డ్‌గా మిలిగిన ముల్డర్‌ను రూ. 75 లక్షలకు తీసుకొన్నట్టు సన్‌రైజర్స్ తెలిపింది.

టాప్‌లో అరవింద్

ప్రేగ్: ప్రేగ్ అంతర్జాతీయ చెస్ ఫెస్టివల్‌లో భారత గ్రాండ్ మాస్టర్లు అరవింద్ చిదంబరం, ప్రజ్ఞానంద టాప్-2లో కొనసాగుతున్నారు. గురువారం జరిగిన ఎనిమిదో రౌండ్ గేమ్‌లో డేవిడ్ నవారో (చెక్)తో అరవింద్, లియమ్ లి (వియత్నాం)తో గేమ్‌ను ప్రజ్ఞానంద డ్రాగా ముగించారు. దీంతో మొత్తం 8 రౌండ్ల నుంచి అరవింద్ 5.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలవగా.. ప్రజ్ఞానంద 5 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఏడో రౌండ్‌లో అనీష్ గిరి (నెదర్లాండ్స్)పై చిదంబరం నెగ్గగా.. వి యి (చైనా)తో ప్రజ్ఞానంద పాయింట్ పంచుకొన్నాడు.



ఫైనల్ మ్యాచ్‌కు

ఫీల్డ్ అంపైర్లు: పాల్ రీఫిల్ (ఆస్ట్రేలియా), రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్ (ఇంగ్లండ్); మ్యాచ్ రెఫరీ: రంజన్ మదుగలే (శ్రీలంక); థర్డ్ అంపైర్: జోయల్ విల్సన్ (వెస్టిండీస్)

కివీస్‌తో సులువేం కాదు!

ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లోనూ భారత జట్టు న్యూజిలాండ్‌ను ఎదుర్కొనబోతోంది. గత ఆదివారం గ్రూప్ 'ఏ'లో జరిగిన మ్యాచ్‌లో రోహిత్ ఇదే జట్టుపై గెలిచిన విషయం తెలిసిందే. కానీ లాహోర్‌లో జరిగిన రెండో 'సెమీస్‌'లో దక్షిణాఫ్రికాపై విరుచుకుపడిన కివీస్ మరోసారి టీమిండియాకు సవాల్ విసురుతోంది. అయితే ఇదివరకే సునాయాసంగా గెలిచాం కదా అని కివీస్‌ను తేలిగ్గా తీసుకుంటే మాత్రం అసలుకే మోసం రావచ్చు. అదీగాకుండా ఆ జట్టు కూడా దుబాయ్‌లోనే ఆడింది కాబట్టి ఇక్కడి పరిస్థితులపై అవగాహన ఉంటుంది. వాస్తవానికి పెద్ద టోర్నీలు జరిగేటప్పుడు న్యూజిలాండ్‌ను చాలామంది ఫేవరెట్‌గా భావించరు. కానీ వారు తమ ప్రణాళికలను సరైన పద్ధతిలో అమలు చేస్తూ ఊహించని విధంగా దాడి చేస్తుంటారు. అందుకే ఫైనల్లో కివీస్‌ను ఓడించడం భారత్‌కు అంత సులువేమీ కాబోదు. మనోళ్లతో పోలిస్తే వారు కూడా అన్ని విభాగాల్లో సమంగానే ఉన్నారు. స్పిన్నర్ల విషయంలో.. తాజా టోర్నీలో భారత్‌కు సమీపంలో ఉన్న జట్టేదైనా ఉంటే అది కివీస్ మాత్రమే. లెఫ్టామ్ స్పిన్నర్ శాంట్నర్ నేతృత్వంలో బ్రేస్‌వెల్, ఫిలిప్స్, రచిన్‌ల రూపంలో బలంగానే కనిపిస్తోంది. గ్రూప్ మ్యాచ్‌లో వీరిపై భారత్ ఆధిపత్యం చూపి మ్యాచ్‌ను గెలవగలిగింది. కానీ ఈసారి దుబాయ్ పరిస్థితులు తెలుసు కాబట్టి పక్కా వ్యూహంతో భారత్‌ను కట్టడి చేయాలనుకుంటోంది. అలాగే కొత్త బంతితో చక్కటి సీమ్‌ను రాబట్టగల పేసర్లు అండగా ఉన్నారు. ఇందుకు వారి ఎత్తు కూడా దోహదపడుతుంది. ఈ కారణంగా బంతి ఎక్కువ సేపు గాల్లో ఉండడంతో పాటు గుడ్ లెంగ్త్‌లో విసరగలుగుతారు. ఐసీసీ టోర్నీల్లో కివీస్ పేసర్లు తమ ఎక్స్‌ట్రా బౌన్స్‌తో భారత టాపార్డర్‌ను ఇబ్బందిపెట్టడం అలవాటే. అందుకే తొలి పవర్‌ప్లేలో వీరిని ఎదుర్కోవాలంటే భారత జట్టు ఆ మేరకు ప్రణాళికలతో బరిలోకి దిగాల్సి ఉంటుంది.



'భారత్‌కు స్పష్టత ఉంటుంది'

దుబాయ్‌లోనే మ్యాచ్‌లను ఆడుతున్న భారత్‌కు పిచ్‌లపై అవగాహన ఉండడం సహజమేనని కివీస్ వెటరన్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ అన్నాడు. క్రికెట్‌లో ఇదంతా మామూలేనని, గతంలోనూ తామిక్కడ చాలా మ్యాచ్‌లను ఆడినట్టు గుర్తు చేశాడు. అయినా భారత్‌కు ఉండే అనుకూలతపై కాకుండా ఫైనల్‌ను గెలవడంపైనే దృష్టి సారించినట్టు కేన్ చెప్పాడు.

బ్యాటింగ్, ఫీల్డింగ్‌లోనూ సమవుజ్జీలే..

భారత్ మాదిరే కివీస్ బ్యాటింగ్ ఆర్డర్ కూడా దుబాయ్ పిచ్‌లకు సరిపోయే విధంగా ఉంది. తమ గ్రూప్ మ్యాచ్‌లో భారత్ స్కోరును ఛేదించకపోయినా, వారిని తక్కువ చేయడానికి లేదు. యంగ్, రచిన్, విలియమ్సన్ ఆది నుంచే భారీ షాట్లకు వెళ్లకపోవచ్చు. కానీ మిడిలార్డర్‌కు చక్కటి వేదికను ఏర్పరిచేలా సుదీర్ఘ ఇన్నింగ్స్ ఆడే నైపుణ్యం ఉంది. మధ్య ఓవర్లలో భారత స్పిన్నర్లను ఎదుర్కొనేందుకు ఇతర జట్లు ఇబ్బందిపడ్డాయి. అయితే లాథమ్, మిచెల్, ఫిలిప్స్ అలాంటి బంతులను సమర్థవంతంగా ఎదుర్కోగలరు. దీనికితోడు ఐదు వికెట్లతో దెబ్బతీసిన మిస్టరీ స్పిన్నర్ వరుణ్‌పై ఈసారి ప్రత్యేక దృష్టి సారించడం ఖాయమే. అన్నింటికన్నా ముఖ్యంగా కివీస్ ఫీల్డింగ్ ప్రమాణాల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందే. గ్లెన్ ఫిలిప్స్‌ను ఆధునిక జాంటీ రోడ్స్‌గా పిలుస్తున్నారు. మైదానంలో అతడి విన్యాసాలకు ఎవరైనా ఫిదా కావాల్సిందే. అతడితో పాటు యంగ్, బ్రేస్‌వెల్, శాంట్నర్‌లను కూడా సూపర్ ఫీల్డర్లుగా పరిగణిస్తారు. బంతి వారి దరిదాపుల్లోకి వెళ్తే కనీసం సింగిల్ తీసేందుకు కూడా బ్యాటర్లు ఆలోచించాల్సి ఉంటుంది. కనీసం 30-40 పరుగులు ఫీల్డింగ్ ద్వారా కట్టడి చేయగలరు. అందుకే భారత జట్టు చాంపియన్స్ ట్రోఫీని దక్కించుకోవాలంటే ఫైనల్లో కివీస్‌ను ఆషామాషీగా తీసుకుంటే కుదరదు. అంతేకాకుండా 2000లో జరిగిన చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో కివీస్ చేతిలోనే ఓడామన్న విషయం గుర్తుకు తెచ్చుకుంటే మరీ మంచిది..

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

డబ్ల్యూపీఎల్‌లో నేడు
ఢిల్లీ × గుజరాత్
రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

తిప్పేసిన కెర్

- 6 వికెట్లతో ముంబై విజయం
- యూపీ ప్లేఆఫ్స్ ఆశలు ఆవిరి!
- వోల్ ఫిఫ్టీ వృథా



కెర్ (5/38)

లఖ్‌నవూ: హేలీ మాథ్యూస్ (46 బంతుల్లో 68) అర్ధ శతకంతోపాటు అమేలియా కెర్ (5/38) తిప్పేయడంతో.. మహిళల ప్రీమియర్ లీగ్ ముంబై ఇండియన్స్ రెండో స్థానానికి ఎగబాకింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో ముంబై 6 వికెట్లతో యూపీ వారియర్స్‌ను చిత్తు చేసింది. వరుసగా మూడో ఓటమితో ప్లేఆఫ్స్ అవకాశాలను యూపీ మరింత సంక్లిష్టం చేసుకొంది. తొలుత యూపీ నిర్ణీత 20 ఓవర్లలో 150/9 స్కోరు చేసింది. కెర్ ఐదు వికెట్లకు తోడు.. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ మాథ్యూస్ 2 వికెట్లు పడగొట్టింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన వారియర్స్‌కు ఓపెనర్లు జార్జియా వోల్ (33 బంతుల్లో 55), గ్రేస్ హ్యారిస్ (28) తొలి వికెట్‌కు 74 పరుగుల భాగస్వామ్యంతో అదిరే ఆరంభాన్నిచ్చారు. అయితే, 14 బంతుల తేడాతో మూడు కీలక వికెట్లను చేజార్చుకోవడంతో.. యూపీ ఓమాదిరి స్కోరుకే పరిమితమైంది. హ్యారిస్ ను అవుట్ చేసిన మాథ్యూస్.. జట్టుకు బ్రేక్ అందించింది. కిరణ్ నవ గిరె (0)ను కెర్ డకౌట్ చేయగా.. హాఫ్ సెంచరీతో జోరుమీదున్న వోల్‌ను బ్రంట్ బౌల్డ్ చేసింది. బ్రింద (10), హెన్రీ (6), దీప్తి (27), సోఫీ ఎకెల్‌స్టోన్ (16)ను కెర్ పెవిలియన్ చేర్చింది. అనంతరం ఛేదనలో ముంబై 18.3 ఓవర్లలో 4 వికెట్లకు 153 పరుగులు చేసి నెగ్గింది. హ్యారిస్ 2 వికెట్లు పడగొట్టింది. ఓపెనర్ కెర్ (10)ను హెన్రీ స్వల్ప స్కోరుకే అవుట్ చేసింది. కానీ, హేలీ, వన్‌డౌన్‌లో వచ్చిన సివర్ బ్రంట్ (37) రెండో వికెట్‌కు 58 బంతుల్లో 92 పరుగులు జోడించడంతో.. ముంబై అలవోకగా నెగ్గింది. హేలీ నాలుగు బౌండ్రీలు, సిక్స్‌తో చెల రేగడంతో.. పవర్‌ప్లేలో ముంబై 50/1తో నిలిచింది. మధ్య ఓవర్లలో వీరిద్దరూ పోటీపడి మరీ షాట్లు ఆడుతూ స్కోరుబోర్డును పరుగులు పెట్టించారు. 11వ ఓవర్‌లో బౌండ్రీతో మాథ్యూస్ అర్ధ శతకం పూర్తి చేసుకోగా.. జట్టుస్కోరు సెంచరీ మార్క్‌ను అందుకొంది. అయితే, వరుస ఓవర్లలో బ్రంట్, మాథ్యూస్, ఆపై హర్మన్‌ప్రీత్ (4) అవుటైనా.. అమన్‌జోత్ (12 నాటౌట్), యాస్తిక భాటియా (10 నాటౌట్) మరో 9 బంతులు మిగిలుండగానే జట్టును గెలిపించారు.

సంక్షిప్త స్కోర్లు: యూపీ: 20 ఓవర్లలో 150/9 (వోల్ 55, హ్యారిస్ 28; కెర్ 5/38, హేలీ 2/25); **ముంబై:** 18.3 ఓవర్లలో 153/4 (మాథ్యూస్ 68, బ్రంట్ 37; హ్యారిస్ 2/11).

ఛెత్రి మళ్లీ వస్తున్నాడు!

రిటైర్మెంట్ వెనక్కి



న్యూఢిల్లీ: భారత ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ సునీల్ ఛెత్రి తన రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకున్నాడు. జాతీయ జట్టు తరపున మళ్లీ బరిలోకి దిగనున్నాడు. ఏఎఫ్‌సీ ఆసియా క్వాలిఫయర్స్‌లో భాగంగా ఈనెల 25న మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో బంగ్లాదేశ్‌తో భారత్ తలపడనుంది. ఈ మ్యాచ్ ద్వారా 40 ఏళ్ల ఛెత్రి తిరిగి ఆటలోకి అడుగుపెట్టనున్నట్టు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) గురువారం ప్రకటించింది. ఆ మ్యాచ్‌లో తలపడే 26 మంది సభ్యులతో కూడిన జట్టులో అతడిని కూడా చేర్చింది. 'కెప్టెన్, లీడర్, లెజెండ్ సునీల్ ఛెత్రి మళ్లీ వస్తున్నాడు' అని ఎక్స్‌లో ఏఐఎఫ్‌ఎఫ్ పోస్ట్ చేసింది. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు గత ఏడాది జూన్‌లో ఛెత్రి వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే.

స్పేర్ టైర్ కంటే ఎక్కువగా వాడేస్తున్నారు!



న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీలో వికెట్ కీపర్, బ్యాటర్ కేఎల్ రాహుల్ భారత విజయాలలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ నేపథ్యంలో రాహుల్‌పై మాజీ బ్యాటర్, కామెంటేటర్ నవజ్యోత్ సింగ్ సిద్ధూ ప్రశంసలు కురిపించాడు. వివిధ స్థానాలకు అనుగుణంగా తన బ్యాటింగ్ శైలిని మార్చుకోవడం అతడికే చెల్లిందన్నాడు. 'కేఎల్ రాహుల్‌ను స్పేర్ టైర్ కంటే ఎక్కువగా వాడేస్తున్నారు. వికెట్ కీపర్‌గా బాధ్యతలు నిర్వర్తించాలంటారు. ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు దింపుతారు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ వస్తే మూడో నెంబర్‌లో ఆడాలంటారు. అంతేకాదు ఒక్కోసారి ఓపెనర్‌గానూ దిగాలని ఆదేశిస్తారు. ఇన్ని స్థానాల్లో ఆడుతూ, నిస్వార్థంగా రాహుల్ జట్టుకు సేవలందిస్తున్నాడు' అని సిద్ధూ కొనియాడాడు.

బ్యాటింగ్‌కు రాకుండా నిద్రపోయాడు!



సౌద్ షకీల్ టైమ్డ్ అవుట్

రావల్పిండి: పాకిస్థాన్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అరుదైన ఘటన చోటు చేసుకుంది. ప్రెసిడెంట్ కప్ గ్రేడ్-1 టోర్నీ ఫైనల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ పాకిస్థాన్‌కు ఆడుతున్న సౌద్ షకీల్ మ్యాచ్ సమయంలో నిద్రపోయి టైమ్డ్ అవుట్ అయ్యాడు. ఐసీసీ నిబంధనల ప్రకారం ఓ బ్యాటర్ అవుటయ్యాక మరో బ్యాటర్ మూడు నిమిషాల్లోపు క్రీజులోకి రావాల్సి ఉంటుంది. లేనిపక్షంలో అతడిని 'టైమ్డ్ అవుట్'గా ప్రకటిస్తారు. మంగళవారం పాక్ టెలివిజన్ టీమ్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లోని 27వ ఓవర్ 3, 4 బంతులకు ఆటగాళ్లు వరుసగా అవుటయ్యారు. ఆలస్యంగా వచ్చిన షకీల్‌పై ప్రత్యర్థి కెప్టెన్ ఫిర్యాదు చేయడంతో అంపైర్ అవుట్‌గా ప్రకటించాడు. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్ కూడా ఐదో బంతికి వెనుదిరగడంతో షకీల్‌తో కలిపి ఆ ఓవర్లో మొత్తం నలుగురు అవుటైనట్టయ్యింది. ఇక టైమ్డ్ అవుటైన తొలి పాక్ క్రికెటర్‌గా షకీల్ నిలిచాడు.

గోల్డ్ లోన్.. ఇక ఈజీ కాదు!

త్వరలో నిబంధనలు కఠినతరం!!



న్యూఢిల్లీ: బంగారం తాకట్టు పెట్టి రుణం పొందడం ఇకపై అంత సులభం కాకపోవచ్చు. ఎందుకంటారా..? గోల్డ్ లోన్ నిబంధనలను భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మరింత కఠినతరం చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఈ రుణాల మంజూరు ప్రక్రియలో నిబంధనలను తూ.చ తప్పకుండా పాటించాలని, రుణగ్రహీత నిధులను ఎందుకోసం ఖర్చు చేయనున్నారనే విషయంపైనా కన్నేసి ఉంచాలని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలను ఆర్‌బీఐ ఆదేశించనున్నట్లు సమాచారం. అంతేకాదు, రుణగ్రహీతల బ్యాక్‌గ్రౌండ్‌నూ చెక్ చేయాలని, తాకట్టు పెట్టే బంగారం వాస్తవ హక్కుదారు ఎవరనేదీ తెలుసుకోవాలని నిర్దేశించనుందని సమాచారం. పసిడి రుణాల వ్యాపారంలో అనైతిక వ్యవహారాలకు చెక్ పెట్టడంతో పాటు ఆర్థిక వ్యవస్థ స్థిరత్వానికి భంగం కలగకుండా చూడటమే ఆర్‌బీఐ ఉద్దేశంగా ఉన్నట్లు తెలుస్తోంది.

బ్యాంకుల పసిడి రుణాల్లో 50 శాతం వృద్ధి

ఈ మధ్య కాలంలో బంగారం తాకట్టు రుణాలకు డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. 2024 సెప్టెంబరు నుంచి బ్యాంకుల గోల్డ్ లోన్ వ్యాపారం 50 శాతం మేర పెరుగుతూ వస్తోంది. మొత్తం రుణాల వృద్ధి కంటే చాలా అధికమిది. గత ఏడాది ఆర్‌బీఐ తనఖారహిత వ్యక్తిగత రుణాల నిబంధనలను కఠినతరం చేయడంతో పాటు పసిడి ధరలు వేగంగా పెరుగుతూ రావడం ఇందుకు కారణాలని ఇండస్ట్రీ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం 10 గ్రాముల మేలిమి బంగారం రూ.89,000 స్థాయికి చేరుకుంది.

ప్రపంచంలో రెండో అతిపెద్ద బంగారం వినియోగదారు

భారతీయులకు బంగారంపై మోజు ఎక్కువే. ప్రపంచలో చైనా తర్వాత రెండో అతిపెద్ద బంగారం వినియోగ దేశం మనదే. పండగలు, పెళ్లిళ్లకు బంగారం కొనుగోలు చేయడం సంప్రదాయంగా వస్తోంది. మన వారికి బంగారమంటే కేవలం అలంకరణే కాదు ఆపద నుంచి గట్టెక్కించేది కూడా. వ్యక్తిగత, వ్యాపార అత్యయిక, స్వల్పకాలిక అవసరాల్లో తక్షణమే పొందగలిగేది పసిడి రుణం. కరోనా కష్టకాలం నుంచే బంగారం తాకట్టు రుణాలకు డిమాండ్ వేగంగా పెరుగుతూ వచ్చింది. తనఖారహిత రుణాల మంజూరు కఠినతరం కావడంతో రుణగ్రహీతలు కూడా పసిడి రుణాలపై ఎక్కువగా ఆధారపడుతున్నారు.


పసిడి రుణాల మంజూరులో అవకతవకలపై ఆర్‌బీఐ నజర్

పసిడి రుణాల మంజూరులో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు అనుసరిస్తున్న అనుచిత విధానాలపై 2024 సెప్టెంబరు 30న ఆర్‌బీఐ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ రుణాల సోర్సింగ్, తాకట్టు బంగారం విలువ మదింపు, తనిఖీ ప్రక్రియ, పర్యవేక్షణ, బంగారం వేలం, లోన్ టు వాల్యూ (ఎల్‌టీవీ) రేషియో, రిస్క్ వెయిటేజీ అంశాల్లో లోపాలను ఎత్తి చూపింది. అంతేకాదు, రుణగ్రహీతలు తాకట్టు పెట్టే బంగారంపైనే ఆధారపడకుండా వారి తిరిగి చెల్లింపుల సామర్థ్యాన్నీ పరిశీలించాలని రుణదాతలను ఆర్‌బీఐ ఆదేశించింది. పాక్షిక చెల్లింపులపై రుణ కాలపరిమితి రెన్యువల్‌నూ ఆర్‌బీఐ తప్పుపట్టింది.

బిజినెస్

కృత్రిమ మేధ ఆవిష్కరణలకు మరింత ప్రోత్సాహం

- ఇండియాఏఐ కంప్యూట్ పోర్టల్, ఏఐకోష ప్రారంభం
- గంటకు రూ.67కే జీపీయూ సేవలు అందుబాటులోకి..



అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ: ఇండియా ఏఐ మిషన్ తొలి వార్షికోత్సవం సందర్భంగా కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ గురువారం ఇండియాఏఐ కంప్యూట్ పోర్టల్, డేటా సెట్ ప్లాట్‌ఫామ్ 'ఏఐకోష'తో పాటు దేశంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు పలు కార్యక్రమాలను ప్రారంభించారు.

ఇండియాఏఐ కంప్యూట్ పోర్టల్: ఈ వేదిక ద్వారా 18,000కు పైగా జీపీయూ (గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్)లతో పాటు క్లౌడ్ స్టోరేజ్, ఇతర ఏఐ సేవలను వినియోగించుకోవచ్చు. విద్యార్థులు, స్టార్టప్‌లు, పరిశోధకులు, ప్రభుత్వ శాఖలు అందుబాటు ధరలో కంప్యూటింగ్ వనరులను ఉపయోగించుకోవడంతో పాటు దేశంలో ఏఐ మోడల్ ట్రైనింగ్, డెవలప్‌మెంట్‌ను వేగవంతం చేసేందుకు కేంద్రం ఈ మౌలిక వసతిని ప్రారంభించింది. ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత్‌లోనే అత్యంత చౌకగా గంటకు రూ.67కే జీపీయూల వినియోగ సేవలను ఈ పోర్టల్ ద్వారా అందుబాటులోకి తెచ్చామన్నారు. భారత చంద్రయాన్ మిషన్ తరహాలో చాలా తక్కువ ఖర్చుతో భారత్ సొంత ఏఐ మోడళ్లను అభివృద్ధి చేసుకోనుందని మంత్రి ఈ సందర్భంగా అన్నారు. అంతేకాదు, 3-4 ఏళ్లలో మేడ్ ఇన్ ఇండియా జీపీయూలు అందుబాటులోకి రానున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఏఐకోష: ఇది సమగ్ర డేటాసెట్ ప్లాట్‌ఫామ్. అత్యంత నాణ్యమైన వ్యక్తిగతేతర డేటా సెట్ల వినియోగాన్ని క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం దీన్ని అందుబాటులోకి తెచ్చింది. ఈ వేదిక దేశీయ అవసరాలకు అనుగుణమైన ఏఐ మోడళ్ల అభివృద్ధిని ప్రోత్సహించేందుకు డెవలపర్లకు వనరులు, టూల్స్, నిపుణుల మార్గదర్శకత్వ సేవలను అందించనుంది.

ఇండియాఏఐ మిషన్: పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యాల ద్వారా దేశంలో ఏఐ ఆవిష్కరణలకు ఊతమివ్వడంతో పాటు సొంత ఏఐ ఆవరణ వ్యవస్థను అభివృద్ధి చేసే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం రూ.10,371 కోట్ల బడ్జెట్‌తో ఇండియాఏఐ మిషన్‌ను ప్రారంభించింది. గత ఏడాది మార్చిలో కేంద్ర కేబినెట్ దీని ఆమోదం తెలిపింది.

గ్రీన్‌ప్యానల్ ఎండీఎఫ్ ప్లాంట్ విస్తరణ

మీడియం డెన్సిటీ ఫైబర్‌బోర్డ్ (ఎండీఎఫ్), ప్లైవుడ్, ఉడెన్ ఫ్లోరింగ్ ఉత్పత్తుల తయారీ సంస్థ గ్రీన్‌ప్యానల్.. ఆంధ్రప్రదేశ్, శ్రీకాళహస్తిలోని ప్లాంట్‌లో కొత్త ఉత్పత్తి లైన్‌ను ప్రారంభించింది. కార్యకలాపాల విస్తరణలో భాగంగా ఈ కొత్త లైన్‌ను ఏర్పాటు చేసినట్లు కంపెనీ తెలిపింది. ఈ లైన్‌తో ఏటా ఎండీఎఫ్ తయారీ సామర్థ్యం 6,60,000 సీబీఎం నుంచి 8,91,000 సీబీఎంకి పెరుగుతుందని పేర్కొంది. ప్రస్తుతం కంపెనీ శ్రీకాళహస్తితో పాటు ఉత్తరాఖండ్‌లో ప్లాంట్లను నిర్వహిస్తోంది.

- మారుతి సుజుకీ ఇండియా తన మినీ ట్రక్ సూపర్ క్యారీని ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్ (ఈఎస్‌పీ)తో తీసుకువచ్చింది. డ్రైవర్ సహా కార్గోను సురక్షితంగా చేర్చేందుకు ఏడు సేఫ్టీ ఫంక్షన్స్‌తో మినీ ట్రక్‌ను తీసుకువచ్చింది. దీని ప్రారంభ ధర రూ.5.64 లక్షలు.
- టయోటా కిర్లోస్కర్ మోటార్.. సరికొత్త మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ (ఎంటీ) గ్రేడ్‌తో ఫార్చ్యూనర్ లెజెండర్‌ను విడుదల చేసింది. 2.8 లీటర్ డీజిల్ ఇంజన్, 6-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో కూడిన ఈ ఎస్‌యూవీ ధర రూ.46.36 లక్షలు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



7వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	410
వరంగల్	412	గోదావరి	425
చిత్తూరు	443	విశాఖపట్నం	435
		డజను గుడ్లు రూ.	66

దారికొస్తున్న పన్ను చెల్లింపుదారులు

రూ.29,000 కోట్ల విదేశీ ఆస్తుల వెల్లడి



న్యూఢిల్లీ: భారతీయుల విదేశీ ఆస్తులు లేదా విదేశీ ఆదాయ వివరాలు కక్కించేందుకు ఆదాయ పన్ను (ఐటీ) శాఖ చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. గత ఏడాది నవంబరు 17 నుంచి ఐటీ శాఖ ఇందుకోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా 19,501 మందికి ఎస్ఎంఎస్‌లు, ఈ-మెయిల్స్ పంపించింది. వెంటనే మీ అసలు విదేశీ ఆస్తులు, ఆదాయాలకు అనుగుణంగా ఐటీ రిటర్న్‌లు ఫైల్ చేయాలని కోరింది. దీంతో 2024-25 అసెస్‌మెంట్ ఇయర్‌కు సంబంధించి 24,678 మంది తమ పన్ను రిటర్న్‌లను సమీక్షించుకోవటంతో పాటు మరో 5,483 మంది ఆలస్యంగా రూ.29,208 కోట్ల అదనపు విదేశీ ఆస్తులు, ఆదాయం వెల్లడిస్తూ కొత్త ఐటీ రిటర్న్‌లు దాఖలు చేశారు. మరో 6,734 మంది తమ నివాస హోదాను రెసిడెంట్ నుంచి నాన్-రెసిడెంట్ స్థాయికి మార్చుకున్నారు.

అమితవ ముఖర్జీ చేతికే ఎన్‌ఎండీసీ పగ్గాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రభుత్వ రంగంలోని ఎన్‌ఎండీసీ కొత్త చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా అమితవ ముఖర్జీ నియమితులయ్యా రు. ప్రస్తుతం ఆయన సీఎండీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2028 ఫిబ్రవరి 29వ తేదీ వరకు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆయన ఆ పదవిలో ఉంటా రు. 2018 నవంబరులో ఎన్‌ఎండీసీలో డైరెక్టర్ (ఫైనాన్స్)గా చేరిన ఆయన 2023 మార్చి నుంచి సీఎండీగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కాగా ఎన్‌ఎండీసీతో పాటు ఎన్‌ఎండీసీ స్టీల్, లెగసీ ఐరన్ ఓర్ లిమిటెడ్‌కు ముఖర్జీ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,490 ▼	80,200 ▼	1,08,000 ▲
విజయవాడ	89,000 ▼	84,250 ▲	98,500 ▲
విశాఖపట్నం	86,210 ▼	79,030 ▼	98,020 ▲
రాజమండ్రి	87,930 ▲	80,600 ▲	99,500 ▲
ప్రొద్దుటూరు	88,350 ▼	81,810 ▲	98,800 ▲
ముంబై	85,876 ▼	78,662 ▼	96,460 ▲

74,000 పైకి సెన్సెక్స్

- 22,500 స్థాయిని దాటిన నిఫ్టీ
- వరుసగా రెండో రోజూ లాభాలు

రూ.4.54 లక్షల కోట్ల సంపద వృద్ధి

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా రెండో రోజూ లాభపడ్డాయి. గురువారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 609.86 పాయింట్లు బలపడి 74,340.09 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 207.40 పాయింట్ల వృద్ధితో 22,544.70 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో జోరుగా కొనుగోళ్లు జరగడంతో పాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల విషయంలో కాస్త మెత్తబడటం మార్కెట్ ర్యాలీకి దోహదపడ్డాయి. ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్‌ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4.54 లక్షల కోట్ల మేర పెరిగి రూ.397.58 లక్షల కోట్లకు చేరుకుంది.

- నయారా ఎనర్జీ (గతంలో ఎస్సార్ ఆయిల్) తన మైనారిటీ షేర్ హోల్డర్ల నుంచి 2.59 కోట్ల షేర్లను ఒక్కొక్కటీ రూ.731 చొప్పున తిరిగి కొనుగోలు (బైబ్యాక్) చేయనున్నట్లు తెలిపింది.

ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్‌కు అవంతి ఫీడ్స్‌లో మరో 4.4% వాటా

ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ సర్వీసెస్ అనుబంధ విభాగమైన ఐఐఎఫ్ఎల్ ఫెసిలిటీస్ సర్వీసెస్..ఓపెన్ మార్కెట్లో బ్లాక్ డీల్ ద్వారా హైదరాబాద్‌కు చెందిన అవంతి ఫీడ్స్‌లో మరో 4.4 శాతం వాటాను రూ.470 కోట్లకు దక్కించుకుంది. ఈ మంగళవారం కూడా ఐఐఎఫ్ఎల్ సర్వీసెస్ అవంతీ ఫీడ్స్‌లో 4.4 శాతం వాటాను రూ.435 కోట్లకు కొనుగోలు చేసింది.

నాలెడ్జ్ రియల్టీ ట్రస్ట్ రూ.6,200 కోట్ల రీట్స్ ఇష్యూ

ప్రముఖ రియల్టీ కంపెనీ సత్వ గ్రూప్, అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బ్లాక్‌స్టోన్ స్పాన్సర్లుగా ఉన్న నాలెడ్జ్ రియల్టీ ట్రస్ట్.. రీట్స్ (రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్) పబ్లిక్ ఇష్యూకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఈ ఇష్యూ ద్వారా రూ.6,200 కోట్లకు పైగా సమీకరించాలనుకుంటోంది.

విశాఖలో రెండో ప్లాంట్ షురూ

సల్ఫర్ ఉత్పత్తి సామర్థ్యం రెండింతలు పెంపు
కోరమాండల్ ఇంటర్నేషనల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మురుగప్పా గ్రూప్‌నకు చెందిన కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సల్ఫర్ తయారీ సామర్థ్యాలు రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా విశాఖపట్నంలో రెండో తయారీ ప్లాంట్‌ను ప్రారంభించింది. ఈ ప్లాంట్ ఏర్పాటుతో సల్ఫర్ తయారీ సామర్థ్యాన్ని 50 వేల మెట్రిక్ టన్నులకు చేర్చాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. రైతులకు అత్యధిక నాణ్యత గల బెంటోనైట్ సల్ఫర్‌ను నిలకడగా సరఫరా చేయాలనుకుంటున్నామని కంపెనీ ఎండీ, సీఈఓ ఎస్ శంకరసుబ్రమణియన్ తెలిపారు. ఇందుకు అవసరమైన ముడిసరుకు సరఫరాకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఈ ప్లాంట్ ఫాస్పారిక్, సల్ఫ్యూరిక్ యాసిడ్‌తో పాటు 12 ఎల్ఎంటీ కాంప్లెక్స్ ఎరువులు తయారుచేస్తుందని ఆయన చెప్పారు. రాబోయే 4-5 ఏళ్ల కాలంలో బెంటోనైట్ సల్ఫర్ ఎరువులకు పెరిగే డిమాండ్‌ను ఈ ప్లాంట్ తీరుస్తుంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	73	విజయవాడ	95
వరంగల్	73	గుంటూరు	88
కరీంనగర్	73	ఒంగోలు	88
మహబూబ్‌నగర్	73	చిత్తూరు	82
కర్నూలు	73	నెల్లూరు	87
విశాఖపట్నం	94	అనంతపురం	87
గోదావరి	95		

ఎడ్లబండికి సోలార్ పవర్..!

» ఆరో తరగతి విద్యార్థి ప్రతిపాదన

» 'ఇన్‌స్పైర్ మనాక్' ఆర్థిక సాయం



లక్ష్మీనరసింహతో టీచర్ యువరత్న కిశోర్ నాయక్

వేలేరుపాడు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ జీవనశైలిని ఆధునీకరించే ఉద్దేశంతో ఎడ్లబండికి ప్రత్యామ్నాయంగా సౌర శక్తితో నడిచే విద్యుత్ వాహనాన్ని(ఈవీ) తయారు చేయాలన్న ఆరో తరగతి విద్యార్థి ఆలోచనకు ఇన్‌స్పైర్ మనాక్ సంస్థ ఫిదా అయింది. ఎడ్లబండికి సోలార్ పవర్‌తో నడిచే మోటార్‌ను అమర్చడం ద్వారా ఎద్దులపై భారం తగ్గించొచ్చన్న ప్రతిపాదన నచ్చడంతో ఆ విద్యార్థికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించి నమూనా (ప్రొటోటైప్) తయారు చేయాలని కోరింది. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం భూదేవిపేట ఎంపీ, యూపీఎస్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న కె లక్ష్మీనరసింహ తన టీచర్ ఎం.యువరత్న కిశోర్ నాయక్ మార్గనిర్దేశంలో ఈవీ ఎడ్లబండి ప్రతిపాదనను పంపాడు.

200కు చేరిన 'మనమిత్ర' సేవలు: లోకేశ్

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): 'మనమిత్ర' వాట్సాప్ యాప్ ద్వారా పౌరులకు ప్రభుత్వం అందించే సేవలు 200కు చేరుకున్నాయని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. వాట్సాప్ గవర్నెన్స్ దిశగా రాష్ట్రం అడుగులు వేస్తోందని గురువారం పేర్కొన్నారు. 'పదో తరగతి, ఇంటర్ హాల్ టికెట్‌లను మనమిత్ర ద్వారా అందించాం. మనమిత్ర-వాట్సాప్ గవర్నెన్స్ సేవలు పొందేందుకు 9552300009కు వాట్సాప్ మెసేజ్ పంపి.. ప్రభుత్వ సేవలు పొందవచ్చు' అని లోకేశ్ వెల్లడించారు.

మోదీ అమెరికాతో మైత్రీ బంధాన్ని వదిలేయాలి

» ఐటీ ఉద్యోగులపట్ల ఆ దేశం వ్యవహార శైలి దారుణం

» ఏపీ సీఎం ఏమీ మాట్లాడకపోవడం అన్యాయం: నారాయణ

హైదరాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): 'ప్రపంచ దేశాలన్నింటికీ ప్రమాదకరంగా మారుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలను ప్రధాని మోదీ ఖండించాలి. ఆ దేశంతో మైత్రీ బంధాన్ని వీడాలి' అని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. 'సాఫ్ట్‌వేర్‌రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకువెళ్లింది తానే అని గొప్పగా చెప్పుకునే సీఎం చంద్రబాబు.. అమెరికా ప్రభుత్వం అక్రమ వలసదారుల పేరుతో భారత ఐటీ ఉద్యోగుల పట్ల అత్యంత దారుణంగా వ్యవహరిస్తున్నా కనీసం మాట్లాడకపోవడం అన్యాయం. బీజేపీ ప్రభుత్వానికి ఆక్సిజన్ అందిస్తున్న చంద్రబాబు ప్రధాన మంత్రిపై ఒత్తిడి తీసుకురావాలి' అని నారాయణ

సభ్యసమాజం సిగ్గుపడేలా పోసాని వాఖ్యలు

» మహిళల వ్యక్తిత్వంపై మాట్లాడడం సరైంది కాదు: రామకృష్ణ

కర్నూలు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ నాయకుడు, సినీ నటుడు పోసాని కృష్ణమురళి మాటలు సభ్యసమాజం సిగ్గుపడేలా ఉన్నాయి. అలా దిగజారి మట్లాడడం సరైనది కాదు' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం కర్నూలులో జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ అనుసరించాల్సిన విధానాలపై పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గిడ్డయ్యతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 'చంద్రబాబు, పవన్ కల్యాణ్ సహా వారి కుటుంబ సభ్యులపై పోసాని జుగుప్సాకర విమర్శలు చేయడాన్ని ఎవరు సమర్థించరు. రాజకీయ నాయకులు ఎలా మాట్లాడకూడదో పోసాని ఓ ఉదాహరణ. రాష్ట్రం అప్పుల్లో ఉందని, ఖజానా దివాలా తీసిందని చెబుతూనే.. బాహుబలి బడ్జెట్ ప్రవేశపెట్టారు. బడ్జెట్ కేటాయింపుల్లో రాయలసీమ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారు' అని రామకృష్ణ పేర్కొన్నారు.

జమిలిపై చర్చలో 'బ్యాలెట్' డిమాండ్ చేయండి!

» పోలవరం ఎత్తుపైనా మాట్లాడండి.. వైసీపీ ఎంపీలకు జగన్ ఆదేశం



జగన్‌తో సమావేశం సందర్భంగా గురువారం ఆయనకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైసీపీ ఎంపీలు

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): 'ఒక దేశం.. ఒకే ఎన్నిక'పై ఈ లోక్‌సభ సమావేశాల్లో చర్చకు వచ్చే వీలుందని వైసీపీ అధ్యక్షుడు జగన్ అన్నారు. ఆ సందర్భంలో బ్యాలెట్ విధానంలో పోలింగ్ కోసం డిమాండ్ చేయాలని తన పార్టీ ఎంపీలను ఆదేశించారు. పార్లమెంటు మలివిడత బడ్జెట్ సమావేశాలు ఈ నెల 10న పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో గురువారమిక్కడ తాడేపల్లి ప్యాలెస్‌లో వారితో ఆయన సమావేశమయ్యారు. నియోజకవర్గాల పునర్విభజనపై రకరకాల చర్చ నడుస్తోందని.. ఉత్తరాదిలో సీట్లు పెరిగి, దక్షిణాదిలో తగ్గుతాయని ప్రచారం జరుగుతోందని.. దీనిపై కేంద్రం నుంచి స్పష్టత వచ్చేలా ఎంపీలు ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చర్యలను నిలువరించేలా చర్యలు చేపట్టాలన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గింపు అంశంపై పార్లమెంటులో మాట్లాడాలని సూచించారు.

12న ఫీజు పోరుకు జగన్ పిలుపు

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ దీక్షలు, పోరాటాలకు ప్రజాస్పందన లేకపోయినా మాజీ సీఎం జగన్ పట్టించుకోవడం లేదు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం 12న ఆందోళనలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపిచ్చారు. తల్లికి వందనం మే నెల నుంచి అమలు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. జగన్ ప్రభుత్వం పెండింగ్ పెట్టిన ఫీజు బకాయిలను కూడా విడుదల చేశారు. అయినా ఫీజు పోరుకు జగన్ ఆదేశించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జగన్ చేయని తప్పు లేదు: ఆదినారాయణరెడ్డి

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): 'ఈ జగత్తులో ఎవ్వరూ చేయనన్ని తప్పులు జగన్ చేశారు. తప్పులెన్ను వారు తమ తప్పులెరుగరు అన్నట్లు ఆయన తీరు ఉంది' అని బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ... "జగన్ 100% స్ట్రైక్ రేట్ ఉన్న పవన్ కల్యాణ్‌ను కించపరుస్తున్నాడు. అసెంబ్లీలో ప్రతిపక్ష హోదాకు తగ్గ సీట్లు రాకున్నా... హోదా ఇవ్వాలంటూ జగన్ డిమాండ్ చేయడం దారుణం. ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి అసెంబ్లీకి రాకుండా హోదా ఇస్తేనే వస్తానంటే జనం నవ్వరా? జగన్ భారత రాజ్యాంగాన్ని అనుసరించాలి. 'భారతి' రాజ్యాంగాన్ని కాదు. సభలో జగన్ ప్రజాప్రతినిధిగా మాట్లాడతానంటే... 2గంటలు కాకపోతే 4 గంటలు అవకాశం ఇస్తాం. జగన్‌కు చెక్ పెట్టే బాధ్యత ఎన్డీయే ప్రభుత్వం తీసుకుంటుంది" అన్నారు. వివేకా ఇంటి వాచ్‌మెన్ రంగయ్య మృతి విషయాన్ని ఓ విలేకరి ప్రస్తావించగా... 'ఏమో..! ఏదైనా జరిగి ఉండొచ్చు. జగన్ ఘోరమైన వ్యక్తి. ఎంత దూరమైనా వెళ్తాడు. వివేకా హత్య కేసులో సాక్షులు, కీలక వ్యక్తులైన డాక్టర్ అభిషేక్, ఈసీ గంగిరెడ్డి మరణాలు అనుమానాస్పదమే కదా?' అని ఆదినారాయణరెడ్డి వ్యాఖ్యానించారు.

భారత్‌కు అప్పగించొద్దు.. చిత్రవధ చేస్తారు

» అమెరికా సుప్రీంకోర్టులో తహావూర్ రాణా పిటిషన్

న్యూఢిల్లీ, మార్చి 6: దేశాన్ని కుదిపేసిన 26/11 ముంబై దాడుల కేసులో కీలక సూత్రధారి తహావూర్ రాణా తనను భారత్‌కు అప్పగించొద్దంటూ అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. భారత్‌కు పంపిస్తే అక్కడ తనను చిత్రహింసలు పెడతారని ఆరోపించాడు. తన అప్పగింతపై తక్షణమే స్టే విధించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశాడు. రాణాను భారత్‌కు అప్పగించేందుకు తమ ప్రభుత్వం అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో న్యాయస్థానంలో పిటిషన్ వేసిన రాణా.. తాను పాకిస్థాన్ సంతతికి చెందిన ముస్లింనని, గతంలో పాక్ ఆర్మీలో పనిచేశానని.. తన గుర్తింపు కారణంగా భారత్‌లో తనను చిత్రవధ చేస్తారని ఆరోపించాడు. తన ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా తాను అక్కడ చనిపోవచ్చని పేర్కొన్నాడు. కాగా, ఇటీవల ఆయన దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను అమెరికా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

ఎండ తీవ్రత దెబ్బకు గురువారం మధ్యాహ్నం విజయవాడలోని బెంజ్ సర్కిల్ ఫ్లై ఓవర్ ఇలా నిర్మానుష్యంగా కనిపించింది



500 కోట్లు హుష్‌కాకి!

» వెలుగులో దళిత మహిళల సొమ్ముకు రెక్కలు

» పీఓపీ, ఆదర్శ మండలాల నిధులు గల్లంతు

» గ్రామ, మండల సమాఖ్యల్లో సిబ్బంది చేతివాటం?

» నిధుల గోల్‌మాల్‌పై విచారణకు డిమాండ్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వెలుగు పథకంలో దళిత మహిళలకు చెందాల్సిన నిధులు దాదాపు రూ.500 కోట్లు గల్లంతయ్యాయి. ఖాతాల్లో డబ్బులు ఉన్నట్లు ఆన్‌లైన్‌లో కనిపిస్తున్నా.. నిజానికి అక్కడేమీ లేవని తెలుస్తోంది. వెలుగు గ్రామ, మండల సమాఖ్యల్లో సిబ్బందితో పాటు స్థానిక నాయకుల చేతివాటంతో కోట్లాది రూపాయలు దారిమళ్లించారని ఆరోపణలు వస్తున్నాయి. దళితుల్లో అత్యంత పేదలు పూరెస్ట్ ఆఫ్‌ది పూర్ (పీఓపీ)ను అభివృద్ధిలోకి తీసుకొచ్చేందుకు కేటాయించిన ఈ నిధులు ఏమయ్యాయనేది ప్రశ్నార్థకంగా మారింది. రాజకీయ నాయకుల సభలు, సమావేశాల కోసం కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (సీఐఎఫ్) నిధులను మళ్లించినట్లుగానే పీఓపీ నిధులనూ కరిగించేశారేమోనన్న సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కొన్ని జిల్లాల్లో డ్వాక్రా సంఘాల మధ్య గొడవల్లో నిధుల గల్లంతు విషయం వెలుగులోకి వచ్చింది. పలు జిల్లాల్లో ఈ నిధులు పేద ఎస్సీలకు చెందకుండానే మాయమైనట్లు తెలుస్తోంది. గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ(సెర్ప్) ఒక మాయాజాలంగా మారిందని, సెర్ప్‌కు వివిధ పథకాల కింద కేటాయించిన నిధులు ఆయా గ్రామ, మండల సమాఖ్యల్లో ఉన్నట్లు లెక్కలు రాసుకుంటున్నా.. నిజానికి అక్కడ ఆ నిధులు లేవని స్పష్టమవుతోంది. వెలుగు కార్యాలయాల్లో అవినీతిని ఎవరూ పట్టించుకోకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, మండల సమాఖ్యల్లో వివిధ పథకాల కింద జమ అయిన నిధులు గల్లంతయినట్లు తెలుస్తోంది. మహిళా సంఘాలకు ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వాలు.. డ్వాక్రా సంఘాలు, సెర్ప్‌లో అవినీతి గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో కొంతమంది సిబ్బంది డ్వాక్రా సంఘాల వద్ద ఉండాల్సిన నిధులను కొద్దికొద్దిగా కరిగించారు. ఆన్‌లైన్‌లో రూ.కోట్లు ఉన్నట్లు లెక్కలు చూపుతున్నా... ఆయా ఖాతాల్లో రూ.లక్షలు మాత్రమే ఉన్నాయని చెబుతున్నారు.

పలు పథకాల నుంచి నిధులు

- వెలుగు పథకం ప్రారంభంలో సీఐఎఫ్ కింద గ్రామ, మండల సమాఖ్యలకు రూ.400 కోట్ల వరకూ ప్రభుత్వం విడుదల చేసింది. ఆ నిధులను స్వయం సహాయక సంఘాలకు రుణాలుగా ఇచ్చి దానిపై వచ్చే వడ్డీతో మండల వెలుగు కార్యాలయాలను నిర్వహించుకోవాల్సి ఉంటుంది. అయితే జగన్ హయాంలో డ్వాక్రా సంఘాల సభ్యులను సీఎం సభలకు తీసుకొచ్చేందుకు సీఐఎఫ్ నిధులు ఇష్టారాజ్యంగా ఖర్చు చేశారు.
- 2008-11 మధ్యకాలంలో ఒక్కో జిల్లాలో ఎస్సీలు ఎక్కువగా ఉన్న 7, 8 మండలాలను గుర్తించి ఒక్కో మండలానికి రూ.70లక్షల నుంచి రూ.1.30 కోట్ల వరకూ ఇచ్చారు. జిల్లాకు రూ.10 కోట్లు చొప్పున సుమారు రూ.130 కోట్లు దాకా నిధులు విడుదల చేశారు. ఈ నిధులతో ఎస్సీ డ్వాక్రా సంఘాలకు రుణాలిచ్చి, వాటిని వడ్డీతో సహా వసూలు చేసి, గ్రామ, మండల సమాఖ్యల్లో రిజర్వు చేయాల్సి ఉంది. అయితే రాష్ట్రవ్యాప్తంగా ఆ నిధుల ఆచూకీ తెలియడం లేదు.
- ఆదర్శ మండలాల పథకం ద్వారా ఒక్కో జిల్లాలో 7, 8 మండలాలను ఎంపిక చేసి ప్రతి మండలానికి రూ.70 లక్షల దాకా నిధులు విడుదల చేశారు. దీనికింద సుమారు రూ.100 కోట్ల వరకూ గ్రామ, మండల సమాఖ్యలకు అందాయి. ఇవి కూడా ఆయా గ్రామ, మండల సమాఖ్యల్లో ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తున్నా... ఖాతాల్లో మాత్రమే లేవని తెలుస్తోంది.
- స్వయం సహాయక సభ్యుల్లో గర్భిణులు ఉంటే వారికి పౌష్టికాహారం అందించడం కోసం నిధిని ఏర్పాటు చేసేందుకు ప్రతి జిల్లాల్లో 3-5 మండలాలను ఎంపిక చేశారు. ఒక్కో మండలానికి రూ.70-80 లక్షలు విడుదల చేశారు. దీనికింద సుమారు రూ.50 కోట్లు దాకా వెలుగు సమాఖ్యలకు అందాయి. ఈ నిధులు రుణాలుగా ఇచ్చి వాటిపై వడ్డీతో గర్భిణులకు ఉచితంగా పౌష్టికాహారం అందించాల్సి ఉంది. అయితే ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.
- యూఎన్‌డీపీ కింద ప్రతి జిల్లాల్లో 5-7 మండలాలను ఎంపిక చేశారు. ఈ పథకం కింద ఒక్కో మండలానికి రూ.కోటి వరకూ విడుదల చేశారు. ఈ నిధులు సుమారు రూ.100 కోట్లు గ్రామ, మండల సమాఖ్యలకు చేరాయి. మొత్తంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి సుమారు రూ.1,000 కోట్ల వరకూ సమాఖ్యల ఖాతాల్లో ఉండాలి. అయితే ప్రస్తుతం అంతా కలిపినా రూ.500 కోట్లు కూడా ఈ ఖాతాల్లో లేవని పేర్కొంటున్నారు.

ఖాతాలన్నీ ఆన్‌లైన్‌లోకి

గ్రామ, మండల సమాఖ్యలకు జమ అవుతున్న నిధుల లెక్కల్లో పారదర్శకత లేదని గత టీడీపీ హయాంలో సెర్ప్ సీఈవోగా పనిచేసిన కృష్ణమోహన్ గుర్తించారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, మండల సమాఖ్యల ఖాతాల్లో ఉన్న నిధుల వివరాలను ఆన్‌లైన్‌లో చూపించాలని ఆదేశించారు. అప్పట్లో ఆయా పథకాల కింద వచ్చిన నిధులను వివిధ ఖాతాల్లో కాకుండా ఒకే సీఐఎఫ్ ఖాతాలో జమ చేయాలని సూచించారు. దీంతో అన్ని నిధులు సీఐఎఫ్ ఖాతాల్లో జమచేశారు. ఈ క్రమంలో ఆ నిధులు సీఐఎఫ్ ఖాతాలోకి జమ చేయకుండానే కొంతమంది దారిమళ్లించినట్లు సమాచారం. ఏ పథకం నిధులు ఎంత ఉన్నాయో?, సమాఖ్యల ద్వారా ఎంత మేరకు రుణాలిచ్చారు? సంఘాల వద్ద ఎన్ని నిధులున్నాయో ఎవరికీ తెలియని పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నిధులపై విచారణ జరిపితే అవినీతిపరులను వెలుగులోకి తీసుకురావొచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని నిధుల గల్లంతుపై సమగ్ర విచారణ జరపాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

అమెరికన్లు, ఎన్నారైలే లక్ష్యం

» పేపాల్ సిబ్బంది అంటూ సైబర్ నేరం!

» మాదాపూర్‌లో కాల్‌సెంటర్.. అమెరికన్లకు కాల్స్

» ఉద్యోగులుగా ఈశాన్య రాష్ట్రాల యువత

» అక్రమ లావాదేవీలంటూ బెదిరించి సొమ్ము వసూలు

» ఆ డబ్బును క్రిప్టో కరెన్సీగా మళ్లించి దుబాయ్‌కి

» నిర్వాహకురాలు, 62 మంది ఉద్యోగుల అరెస్ట్

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అమెరికా పౌరులనే లక్ష్యంగా చేసుకొని సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముఠా గుట్టు రట్టయింది. ఇందుకోసం ఏర్పాటు చేసిన కాల్‌సెంటర్ నిర్వాహకురాలు, 62 మంది ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ షికా గోయల్ గురువారం విలేకరులకు వెల్లడించారు. మాదాపూర్‌లో ఎక్సిటో సొల్యూషన్స్ పేరిట హైదరాబాద్‌కు చెందిన చందా మనస్విని ఓ కాల్ సెంటర్‌ను ప్రారంభించారు. ఇందులో పనిచేయడానికి ఈశాన్య రాష్ట్రాలకు చెందిన యువతీయువకులను నియమించుకున్నారు. వీరంతా అమెరికన్ పౌరులు, ఎన్నారైలకు కాల్ చేసి.. తాము పేపాల్ సిబ్బంది అని నమ్మించేవారు. దుబాయ్‌కి చెందిన ఆజాద్, విక్కీ ద్వారా పేపాల్ ఖాతాదారుల వివరాలను సేకరించేవారు. టార్గెట్ చేసిన వినియోగదారులకు ముందు మెయిల్ చేసి ఒక కస్టమర్ కేర్ సెంటర్ నంబరు ఇచ్చేవారు. ఖాతాదారులు ఆ నంబరుకు ఫోన్ చేయడంతో మనస్విని బృందం రంగంలోకి దిగేది. మీ పేపాల్ ఖాతాలో 500-1000 డాలర్ల వరకు అక్రమ లావాదేవీలు జరిగాయని చెప్పేవారు. పేపాల్ నుంచి అదనంగా పొందిన డబ్బు తిరిగి ఇవ్వకపోతే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని బెదిరించేవారు. ఇలా అమెరికన్ పౌరుల నుంచి కాజేసిన సొమ్మును వివిధ ఖాతాల ద్వారా క్రిప్టో కరెన్సీగా మళ్లించి దుబాయ్‌కి పంపిచేవారు. ఈ దందాకు సూత్రధారి గుజరాత్‌కు చెందిన కైవన్ పటేల్ అలియాస్ జాదు భాయ్, దుబాయ్‌లో ఉండే అతని సోదరుడు విక్కీ, వీరి మరో భాగస్వామి ఆజాద్ అని షికా గోయల్ తెలిపారు. ఈ ముగ్గురూ పరారీలో ఉన్నారన్నారు. వీరితో కలిసి మనస్విని ఈ కాల్ సెంటర్‌ను నడుపుతున్నారని చెప్పారు. ఉద్యోగుల్లో 22 మంది మహిళలు, 41 మంది పురుషులు ఉన్నారని.. మనస్విని సహా వీరందరికీ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.

తెలిసే నేరం చేశారు..

ఈశాన్య రాష్ట్రాల నుంచి పొట్టకూటి కోసం హైదరాబాద్ వచ్చి కాల్ సెంటర్ నిర్వాహకుల వలలో చిక్కిన యువతను అరెస్టు చేయడం సరైన నిర్ణయమేనా? అని విలేకరులు ప్రశ్నించగా.. వారంతా నేరం చేస్తున్నామని తెలిసే కాల్ సెంటర్‌లో పనిచేశారని, అందుకే అరెస్టు చేశామని గోయల్ చెప్పారు. తెలంగాణలో సైబర్ నేరాలను పూర్తిగా అరికట్టడం కోసమే కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మాదాపూర్ కాల్ సెంటర్‌లో పనిచేసిన వాళ్లంతా అమెరికా కాలమానం ప్రకారం షిఫ్టుల్లో పనిచేశారన్నారు. ఇలాంటి షిఫ్టుల్లో నడుస్తున్న కాల్ సెంటర్లలో స్థానిక పోలీసులు తనిఖీలు నిర్వహించాలని.. వారేం పని చేస్తున్నారో నిఘా పెట్టాలని గోయల్ సూచించారు.

విమానాశ్రయాలు కళకళ



» జనవరిలో భారీగా పెరిగిన ప్రయాణికుల సంఖ్య

» విజయవాడలో 46%, విశాఖలో 33.8% పెరుగుదల

(ఆంధ్రజ్యోతి,-రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

తెలుగు రాష్ట్రాల్లోని విమానాశ్రయాలు ప్రయాణికులతో కళకళలాడుతున్నాయి. డీజీసీఏ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) గురువారం విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. దీని ప్రకారం.. గత ఏడాది జనవరితో పోలిస్తే 2025 జనవరిలో విజయవాడ విమానాశ్రయం నుంచి ప్రయాణించిన వారి సంఖ్య 46శాతం పెరిగింది. అలాగే, వైజాగ్‌లో 33.8 శాతం వృద్ధి కనిపించింది. తెలంగాణలోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో 21.2 శాతం వృద్ధి నమోదైంది. అలాగే విమాన సర్వీసుల పెరుగుదల అంశంలో హైదరాబాద్ 16.2 శాతం, విజయవాడలో 22.4శాతం, విశాఖపట్నంలో 34శాతం పెరుగుదల రికార్డయింది.

2025 జనవరిలో వివిధ ఎయిర్‌పోర్టుల్లో ప్రయాణికుల రాకపోకల వివరాలు (దేశీయ, అంతర్జాతీయ)

ఎయిర్‌పోర్టు	ప్రయాణికుల సంఖ్య	గత జనవరితో పోలిస్తే వృద్ధి %
ఢిల్లీ	69,03,650	9.7
ముంబై	49,94,239	3.5
బెంగుళూరు	37,24,850	14.7
హైదరాబాద్	26,42,587	21.2
కోల్‌కతా	19,41,893	14.3
చెన్నై	20,64,961	9.8
విశాఖపట్నం	2,72,717	33.8
విజయవాడ	1,31,061	46.0

రోజుకు లక్షకు చేరువలో శంషాబాద్

శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఇటీవల మరిన్ని దేశీయ, అంతర్జాతీయ సర్వీసులు ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 21న రికార్డు స్థాయిలో 96వేల మంది రాకపోకలు సాగించారు. దేశీయ ప్రయాణికులు విశాఖలో 31.9 శాతం, విజయవాడలో 48.1 శాతం పెరిగారు.

త్వరలో మరిన్ని దేశాలకు నేరుగా..

హైదరాబాద్ విమానాశ్రయం నుంచి వచ్చే నెల 18న హోచిమిన్‌కు నేరుగా విమాన సర్వీసులు ప్రారంభించనున్నారు. మదీనా, హాంకాంగ్, పారిస్, ఆస్ట్రేలియా, ఆమ్‌స్టర్‌డామ్, రియాద్, హనోయ్, అడిస్ అబాబాకు కూడా సర్వీసులు నడిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఎన్జీ రంగా వర్సిటీలో వైసీపీ రాజ్యం!

» కీలక విషయాల్లో 'మాజీ'ల మాటే చెల్లుబాటు

» నెలల తరబడి సెలవులో ఉన్నా పట్టించుకోరు

» బదిలీలు, ప్రమోషన్లలో ఇన్‌చార్జి వీసీ ఇష్టారాజ్యం

గుంటూరు సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వైసీపీ మార్కు పరిపాలనే కొనసాగుతోంది! గత ప్రభుత్వ హయాంలో యూనివర్సిటీని రాజకీయ వేదికగా మార్చిన అధికారుల మాటే ఇంకా చెల్లుబాటు అవుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మాజీ వీసీ విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ పరిశోధన సంచాలకులు ప్రశాంతి, ప్రొఫెసర్ వెంకటరామ్ మునిరెడ్డికి వర్సిటీలోని కీలక వ్యక్తులు రెడ్ కార్పెట్ పరుస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. మాజీ వీసీ గతంలో డిప్యూటేషన్‌పై వేరే విభాగానికి వెళ్లిపోయారు. డిప్యూటేషన్‌పై వెళ్లే సమయంలో వర్సిటీకి చెల్లించాల్సిన రూ.12 లక్షల సొమ్మును చెల్లించకుండానే వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఆయన ఉద్యోగ విరమణ తర్వాత ఇది వెలుగులోకి వచ్చింది. ఉద్యోగ విరమణ ప్రయోజనాలు పొందాలంటే వర్సిటీకి రూ.12 లక్షలు చెల్లించాలని చెప్పటంతో మాజీ వీసీ ఆగ్రహం వ్యక్తం చేశారని, 'ఈసారి వచ్చేది మా ప్రభుత్వమే' అని కన్నెర్ర చేయడంతో వర్సిటీలోని కీలక వ్యక్తి రంగ ప్రవేశం చేసి ఆ ప్రయోజనాలన్నీ క్లియర్ చేయించినట్లు తెలిసింది. ఇప్పటికీ పలు విషయాల్లో ఆయన మాట బాగానే చెల్లుబాటు అవుతోందని అంటున్నారు.

6-7 నెలలుగా విధులకు రాకున్నా..

గత ప్రభుత్వ హయాంలో పరిశోధన సంచాలకురాలిగా పనిచేసిన ప్రశాంతి ప్రస్తుతం మేకపాటి వ్యవసాయ కళాశాలలో పనిచేస్తున్నారు. ఆమె గత ఏడు నెలలుగా విధులకు హాజరుకాకపోయినా వర్సిటీ కీలక వ్యక్తులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. మాజీ వాటర్ హెడ్ అధికారి, ప్రస్తుత బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ వెంకటరామ్ మునిరెడ్డి గత ఆర్నెల్లుగా సరిగా విధులకు హాజరు కావడం లేదని అంటున్నారు.

వివాదాస్పదంగా ఇన్‌చార్జి వీసీ తీరు

ప్రస్తుత ఇన్‌చార్జి వీసీ శారదా జయలక్ష్మి కూడా వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైన వారే. వర్సిటీ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ పూర్తి కాకుండానే ఎన్నికల ముందు హడావుడిగా అప్పటి సీఎం జగన్ చేత ప్రారంభించి విమర్శలు ఎదుర్కొన్నారు. ఇన్‌చార్జి వీసీ వైసీపీ సానుభూతి అధికారులు, ఉద్యోగులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న వాదన వినిపిస్తోంది. గత బదిలీలు, ప్రమోషన్లలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా బోధనేతర సిబ్బంది ప్రమోషన్లు, బదిలీ ప్రక్రియకు ఇన్‌చార్జి వీసీ పచ్చజెండా ఊపినట్లు తెలుస్తుంది. కొందరు వ్యక్తులు భారీ వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఐదు పోస్టులకు 15 మంది

ఇన్‌చార్జి వీసీ నిర్ణయాలు దుమారం రేపుతున్నాయి. తిరుపతి ప్రాంతీయ పరిశోధన కేంద్రంలో ఐదు పోస్టులు మాత్రమే ఉండగా, అక్కడ 15 మంది డిప్యూటేషన్‌పై ఇప్పటికీ పనిచేస్తున్నారు. వేరే చోట జీతాలు తీసుకుంటూ ఇక్కడ కాలం గడుపుతున్నారు. వీరంతా గత వైసీపీ ప్రభుత్వ పెద్దల సిఫార్సుతోనే డిప్యూటేషన్లు పొందారు. తిరుపతి పరిశోధన స్థానానికి కూతవేటు దూరంలో ఉన్న పెరుమాళ్లపల్లి పరిశోధన స్థానంలో లేబర్ బడ్జెట్ ఎక్కువగా మంజూరు అవుతుంది. ఈ బడ్జెట్ వినియోగంలో అవకతవకలు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

రెండేళ్లుగా పాలక మండలి ఏదీ?

మరోవైపు వ్యవసాయ కళాశాలల్లో బయోమెట్రిక్ అటెండెన్స్ బుట్టదాఖలైందన్న విమర్శలు వస్తున్నాయి. గత రెండేళ్లుగా వర్సిటీకి పాలకమండలి లేకపోవడం, ఇన్‌చార్జి వీసీ మాత్రమే నియమితులవ్వడంతో కీలక విభాగాలు అచేతనంగా మారిపోయాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. కాగా, ఆరోపణలను ఇన్‌చార్జి వీసీ శారదా జయలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లగా అవి నిజం కాదన్నారు.

ఎస్సీ.. బీసీ.. సై!

వర్గీకరణ, రిజర్వేషన్ల పెంపునకు తెలంగాణ కేబినెట్ ఓకే

స్థానిక సంస్థలతోపాటు విద్య, ఉద్యోగాల్లోనూ 42%

హైదరాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డు కులాల (ఎస్సీ) వర్గీకరణ, బీసీ రిజర్వేషన్లపై చట్టాలను రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ సర్వేలు, కమిషన్ల నివేదికలు, మేధావులు, కుల సంఘాల అభిప్రాయాల ఆధారంగా విస్తృత కసరత్తు చేసి, చట్టాల రూపకల్పనకు మార్గాన్ని సుగమం చేసింది. ఈమేరకు మూడు ముసాయిదా బిల్లులకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. ఎస్సీ వర్గీకరణ ముసాయిదా బిల్లుతోపాటు బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం; విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు సంబంధించి రెండు ముసాయిదా బిల్లులకు ఆమోద ముద్ర వేసింది. వీటిని రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి, ఆమోదించాలని నిర్ణయించింది. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విషయంలో దక్షిణాది రాష్ట్రాలు.. ముఖ్యంగా తెలంగాణకు అన్యాయం జరగకుండా కేంద్రానికి తమ వాణిని వినిపించాలని తీర్మానించింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు.

ఎస్సీ వర్గీకరణపై ముసాయిదా బిల్లు

"ఎస్సీ వర్గీకరణకు దశాబ్దాలుగా పోరాటాలు జరిగాయి. సుప్రీం కోర్టు తీర్పు నిచ్చిన కొన్ని గంటల్లోనే.. దానిని తమ ఇందిరమ్మ ప్రభుత్వం తూ.చా. తప్పకుండా అమలు చేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అన్న మాట ప్రకారం.. జస్టిస్ షమీమ్ అక్తర్ ఆధ్వర్యంలో ఏక సభ్య కమిషన్ వేశారు. ఆయన ఇచ్చిన నివేదికను ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చించింది. కమిషన్ సిఫారసులను పునఃపరిశీలన చేయాలంటూ వివిధ వర్గాల నుంచి 71 విజ్ఞప్తులు వచ్చాయి. వాటిని పరిశీలించాలంటూ మళ్లీ షమీమ్ అక్తర్ కమిషన్‌కు ఇవ్వడం జరిగింది. భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండడానికి, మొక్కుబడిగా చేశారన్న ఇబ్బంది రాకుండా ఉండడానికి మళ్లీ కమిషన్‌కు అప్పగించాం. వీటిని పరిశీలించిన కమిషన్.. ప్రభుత్వానికి మరోసారి నివేదిక ఇచ్చింది. దాని ఆధారంగా ముసాయిదా బిల్లును రూపొందించాం" అని పొంగులేటి వివరించారు. దీనిని రాబోయే అసెంబ్లీ సమావేశంలో ప్రవేశపెట్టి, చట్ట రూపంలో తీసుకురావాలని క్యాబినెట్‌లో నిర్ణయించడం జరిగిందని తెలిపారు. బీసీ రిజర్వేషన్లపై కుల గణన సర్వే, బలహీన వర్గాల సంఘాలు, మేధావుల సలహాలపై క్యాబినెట్‌లో చర్చించామని, ఈ వివరాలతో రాబోయే శాసనసభ సమావేశాల్లో బిల్లులను ప్రవేశపెట్టనున్నామని వెల్లడించారు. గత శాసనసభలో (2017) 37 శాతంతో పెట్టిన బిల్లును వాపసు చేయాలని నిర్ణయించామని తెలిపారు.

కేంద్రీయ విద్యాలయాల్లో అడ్మిషన్లు

న్యూఢిల్లీ: కేంద్రీయ విద్యాలయాల సంఘటన్ (కేవీఎస్) 2025-26 సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. బాల్‌వాటిక-1, 2, 3 (ప్రీ ప్రైమరీ)తో పాటు, ఒకటో తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం వరకు అడ్మిషన్లు నిర్వహించనున్నారు. బాల్‌వాటికా క్యాటగిరీ తప్ప మిగిలిన తరగతుల సీట్లను అందుబాటులో ఉన్న ఖాళీల ఆధారంగా భర్తీ చేస్తారు. భద్రతా దళాలు, కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు అలాగే ఏక సంతానంగా ఆడపిల్లలు ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు. దరఖాస్తుల దాఖలుకు ఈ నెల 21న చివరి తేదీ. ఆ తరువాత నాలుగైదు రోజుల్లో ఎంపికైన విద్యార్థుల జాబితాను ప్రకటిస్తారు. కేంద్రీయ విద్యాలయ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాల కోసం https://kvsangathan.nic.in/en/ వెబ్‌సైట్ చూడవచ్చు.

పారా మిలిటరీ ఫోర్సుల్లో 357 అసిస్టెంట్ కమాండెంట్‌లు

పారా మిలిటరీ ఫోర్సుల్లో అసిస్టెంట్ కమాండెంట్ ఉద్యోగాల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్‌కు చెందిన ఈ ఉద్యోగాల దరఖాస్తుల దాఖలుకు 25 చివరి తేదీ. రాత పరీక్ష 2025 ఆగస్టు 3వ తేదీన జరుగుతుంది. పూర్తి వివరాల కోసం ఖ్టిఇట//ఇఞట.జౌఠి.జీుఞ/ వెబ్‌సైట్ చూడవచ్చు.



నవ్వులే నవ్వులు..

సభలో దగ్గుబాటి, చంద్రబాబు ప్రసంగాలు నవ్వులు పూయించాయి. తొలుత మాట్లాడిన దగ్గుబాటి.. '30 ఏళ్ల తర్వాత మైకు పట్టుకుని మాట్లాడుతున్నాను. బోర్ కొడుతోందా' అని సభికులను ప్రశ్నించడంతో వేదికపై ఉన్న చంద్రబాబు సహా అంతా నవ్వారు.

..మీ అబ్బాయి బాధపడతాడు

మరో ఐదారేళ్ల తర్వాత జరిగే ఆవిష్కరణల వల్ల మరో యాభై ఏళ్లపాటు జీవన ప్రమాణం పెంచుకోవచ్చని దగ్గుబాటి అన్నారు. చంద్రబాబు వైపు చూస్తూ.. 'మీరూ మరో 50 ఏళ్లు జీవించవచ్చు కాకపోతే మీ అబ్బాయి బాధపడతాడు' అంటూ చమత్కరించడంతో సీఎం సహా అంతా నవ్వులు చిందించారు.

నువ్వే రాశావా.. అని అడిగా

అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. 'వెంకటేశ్వరరావు డాక్టర్ చదివారు. డాక్టర్ చేసిన తర్వాత ప్రాక్టీస్ చేయాలి. కానీ మంత్రిగా ఉండి డాక్టర్ ప్రాక్టీస్ చేశారు' అని చెప్పడంతో నవ్వులు పూశాయి. 'అందరం ఏదో ఒకచోట తిరగాలని అనుకుంటాం. పుస్తకం రాయాలని అనుకోం. పుస్తకం గురించి నాకు చెప్పగానే.. నువ్వే రాశావా అని అనుమానంగా అడిగా' అని చంద్రబాబు చెప్పగానే..మరోసారి అంతా పగలబడి నవ్వారు. 'ఇద్దరం కూడా ఎన్టీఆర్ దగ్గర నేర్చుకున్నాం. తెల్లవారి నిద్రలేస్తే ఆయన దగ్గరకు వెళ్లే వాళ్లం. ఆయన అప్పజెప్పిన బాధ్యతలు చేసే వాళ్లం. అవన్నీ తలచుకున్నప్పుడు నేను అనుకున్నా.. వెంకటేశ్వరరావు ఏంటి పుస్తకాలు రాయడం ఏంటని.. 40 ఏళ్లు కలుసున్నాం.. ఆయనలో ఇంత డెప్త్ ఉంది.. పుస్తకం రాస్తారని నేనెప్పుడూ అనుకోలేదు. మా కుటుంబంలో ఆయన రిలాక్స్‌డ్‌గా, జోవియల్‌గా ఉంటారు. రోజు ఎలా గడుస్తోందని అడిగితే, "ఉదయం బ్యాడ్మింటన్.. తర్వాత పిల్లలతో కాసేపుఆడుకోవడం, స్నేహితులతో మాట్లాడడం, సాయంత్రం పిల్లలకు కథలు చెబుతానని చెప్పారు." అని సీఎం తెలిపారు. దగ్గుబాటి స్పందించి.. పేకాట కూడా ఆడతానని చెప్పానని గుర్తుచేశారు. అవును చెప్పారని చంద్రబాబు అనగానే సభికులు పగలబడి నవ్వారు. రైటర్ కానటువంటి రైటర్ ఆయన. రచయిత కానటువంటి రచయిత' అని ప్రశంసించారు. సమయం దొరికినప్పుడు ఈ పుస్తకాన్ని చదువుతానన్నారు. లోతుగా వెళ్లి అనేక అంశాలను పొందుపరిచినట్లు అర్థమవుతోందన్నారు. అచ్చుయంత్రం, సాంకేతిక విప్లవం, భవిష్యత్తు ఆవిష్కరణల గురించి కూడా తెలియజేయడం గొప్ప విషయమన్నారు.

కోలుకోవడానికి

నిధులు కావాలి

- కేంద్రం 'మందు'తో ఉపశమనం!
- కానీ ఇంకా ట్రీట్‌మెంట్ ఇవ్వాలి: సీఎం
- 'ప్రపంచ చరిత్ర' ప్రతి ఒక్కరూ చదవాలి: బాబు

విశాఖపట్నం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాధనే ధ్యేయంగా అభివృద్ధి ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 2047 నాటికి దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో తెలుగు జాతి ఉండాలన్నది తన ఆకాంక్షగా పేర్కొన్నారు. మాజీ మంత్రి, ఆయన తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు రాసిన 'ప్రపంచ చరిత్ర' పుస్తకావిష్కరణ గురువారం ఉదయం విశాఖలోని గీతం విశ్వవిద్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి చంద్రబాబుతో పాటు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరయ్యారు. పుస్తకం ఆంగ్ల వెర్షన్‌ను నిర్మలా సీతారామన్, తెలుగు వెర్షన్‌ను వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. రాష్ట్రం తీవ్ర ఇబ్బందుల్లో ఉందని, వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన మందుల (నిధులు)తో ఉపశమనం దక్కుతోందని చంద్రబాబు ఈ సందర్భంగా అన్నారు. అయితే ఇంకా ట్రీట్‌మెంట్ ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. రోగి బలంగా ఉన్నప్పటికీ శక్తి (నిధులు) కావాలని, అప్పుడే పూర్తిగా కోలుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రాభివృద్ధికి అవసరమైన నిధులను అందిస్తూ ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహకారం అందిస్తున్నారని చెప్పారు. 'ఢిల్లీ వెళ్లి కేంద్ర ఆర్థిక మంత్రిని నిధుల గురించి అడిగితే నా ముందే ఫోన్ చేసి విడుదల చేయాలని చెప్పారు. విశాఖ వచ్చేసరికి నిధులు వచ్చిన విషయం చెప్పారు' అని తెలిపారు. రాష్ట్రంలో క్లిష్ట పరిస్థితులు ఉన్నాయని, అయినప్పటికీ తాను ఆత్మస్థైర్యాన్ని పోగొట్టుకోనని అన్నారు.

30 ఏళ్ల తర్వాత ఒకే వేదికపైకి...

చంద్రబాబు, దగ్గుబాటి వెంకటేశ్వరరావు 30 ఏళ్ల తరువాత ఒకే వేదికపై కనిపించారు. దీనికి 'ప్రపంచ చరిత్ర' పుస్తకావిష్కరణ కార్యక్రమం వేదికగా నిలిచింది. ఇద్దరూ వేదికపై ముచ్చటిస్తూ కనిపించారు. ప్రసంగాల సమయంలో చమక్కులు మెరిశాయి. వారిద్దరూ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు.

వెంకయ్య, జైపాల్‌రెడ్డిని చూసి భయపడేవాళ్లం

వెంకయ్యనాయుడు, తాను తొలిసారి ఎమ్మెల్యేలం అయ్యామని.. ఆయన తెలుగులో అనర్గళంగా మాట్లాడితే.. జైపాల్‌రెడ్డి ఇంగ్లి‌ష్‌లో మాట్లాడేవారని, వారిని చూస్తే భయపడేవారమని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. విజయవాడలో ఒక కాలేజీలో రెండో అబ్బాయికి సీటు ఇవ్వలేదని ఎంవీవీఎస్ మూర్తి గీతం కాలేజీని ఏర్పాటుచేశారన్నారు.

ఈ పుస్తకానికి అంత విలువ ఉందా..?



చంద్రబాబుకు, తనకు వైరం ఉందని అంటుంటారని.. ఉన్నమాట వాస్తవమేనని.. కానీ ఇప్పుడు కాదని దగ్గుబాటి చెప్పారు. జీవితం ఒకే ఒక్కటని, ఆస్వాదిస్తూ ముందుకు వెళ్లడం కీలకమన్నారు. తన పుస్తకావిష్కరణకు ప్రముఖులను ఆహ్వానించేందుకు సిద్ధమైనప్పుడు.. ఈ పుస్తకానికి అంత విలువ ఉందా అన్న సందేహం తనను వేధించిందన్నారు. అయితే తన స్నేహితుడొకరు చాట్‌జీపీటీలో ఈ పుస్తకాన్ని అప్‌లోడ్ చేసి తన సందేహాన్ని నివృత్తి చేశాక ఈ కార్యక్రమానికి పూనుకున్నట్లు చెప్పారు.

దేశ చరిత్ర వక్రీకరణకు గురైంది

- నూతన విద్యావిధానంతో వాస్తవాలు తెలియజేసే యత్నం: నిర్మల



భారతదేశ చరిత్ర వక్రీకరణలకు గురైందని, చరిత్రకారులు దేశానికి మేలు చేసేలా రాయలేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. నూతన విద్యా విధానంలో భాగంగా వాస్తవాలతో కూడిన చరిత్రను విద్యార్థులకు తెలియజేసే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. 'ప్రపంచ చరిత్ర' పుస్తకావిష్కరణ సభలో ఆమె ప్రసంగించారు. 'విలువలతో కూడిన రచనలు భావితరాలకు ఎంతో అవసరం. చరిత్ర పుస్తకాలు రాయడం అంత సులభం కాదు. దానికెంతో అధ్యయనం చేయాల్సి ఉంటుంది. 350 పేజీల్లో ప్రపంచ చరిత్రను తీసుకురావడం సాధారణ విషయం కాదు. దగ్గుబాటి వెంకటేశ్వరరావు పూర్తిగా నిమగ్నమై పుస్తకం రాసినట్లు అర్థమవుతోంది. జరిగింది జరిగినట్లు చెప్పడమే చరిత్ర. అయితే, మనదేశ చరిత్ర ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. ఈ పుస్తకాన్ని తెలుగులో రాయడం ద్వారా వెంకటేశ్వరరావు మాతృభాష అభివృద్ధికి ఎంతో కృషి చేశారు.' అని అభినందించారు.

వేలెత్తి చూపలేని వ్యక్తి

- దగ్గుబాటి పురందేశ్వరి



దగ్గుబాటి వెంకటేశ్వరరావు భార్య, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడుతూ.. 33 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఎక్కడా వేలెత్తి చూపలేని వ్యక్తి డాక్టర్ దగ్గుబాటి అని తెలిపారు. అయితే ఇందులో తన పాత్ర ఏమిటన్న ప్రశ్నకు సమాధానం దొరకడం లేదన్నారు. ఇది భావితరాలకు ఉపయోగపడే పుస్తకమన్నారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ.. తన తాత (ఎంవీవీఎస్ మూర్తి)పై పుస్తకాన్ని ఇక్కడే ప్రారంభించాలని భావించామని.. అయితే మంచి పుస్తకాన్ని ఇక్కడ ఆవిష్కరించడం ఆనందంగా ఉందని చెప్పారు. అనంతరం నిర్మల, వెంకయ్యనాయుడు, చంద్రబాబులను దగ్గుబాటి కుటుంబ సభ్యులు, శ్రీభరత్ ఘనంగా సత్కరించారు. ప్రత్యేకంగా డిజైన్ చేయించిన ఫొటోలను అందజేశారు.

ఎవరో చెబితే చేసారా?.. మరి నీ బుద్ధి ఏమైంది?

- సోషల్ మీడియా పోస్టులపై వెంకయ్య ధ్వజం
- అమ్మ భాషను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలి
- బాబు పాలనాదక్షుడు, అభివృద్ధి కాముకుడు
- కానీ చేయగలిగేవే చేయాలి: మాజీ ఉపరాష్ట్రపతి

సోషల్ మీడియా.. యాంటీ సోషల్ మీడియాగా మారుతోందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆవేదన వ్యక్తంచేశారు. 'సోషల్ మీడియాను కాస్త అదుపులో పెట్టాలని కేంద్రం ఏదో చేస్తుంటే.. మీరెలా కంట్రోల్ చేస్తారని అంతా గొడవ గొడవ చేస్తున్నారు. కంట్రోల్ చేయకపోతే వచ్చే పరిణామాలేంటో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో మీరు చూశారు. దాని పరిణామాలను ఇప్పుడు కొందరు అనుభవిస్తున్నారు కూడా. అదేమంటే.. మేం అనుకోలేదు.. మేం కాదండీ.. ఆయనెవరో, ఎక్కడి నుంచో చెప్పారని అంటున్నారు. ఆయనెవరో చెబితే చేయడానికి మీకు బుద్ధి ఉండొద్దా' అని మండిపడ్డారు. పుస్తకావిష్కరణ సభలో ఆయన మాట్లాడుతూ.. ఏఐతో ఇక్కడ ఉంటే అక్కడ ఉన్నట్లు.. ఏదో చేస్తున్నట్లు చూపిస్తారని, దీనికి పరిష్కారం ఏమిటని ప్రశ్నించారు. చంద్రబాబు పాలనాదక్షుడని, అభివృద్ధి కాముకుడని పేర్కొన్న వెంకయ్య.. చేయగలిగిన వాటిపై దృష్టి సారిస్తే బాగుంటుందని సూచించారు. 'ఆయన ఆలోచనలు మంచివి. కానీ అవి చాలా ఎక్కువగా ఉంటాయి. అదేసమస్య. మనకున్న సమయం గుర్తుపెట్టుకుని,మనకు ఇచ్చిన అవకాశాన్ని గుర్తుపెట్టుకుని, చేయగలిగిన వాటిపై ఎక్కువగా దృష్టి పెడితే మరింతగా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నాను. మాతృభాషలో విద్యా బోధన జరగాలని చంద్రబాబు బుధవారం మంచి మాట చెప్పారు. మనదేశంలో మనం మనభాషలో మాట్లాడుకోకుండా ఇంకో భాషలో మాట్లాడమేంటి..?'అని వ్యాఖ్యానించారు దగ్గుబాటి ఎన్నో ఏళ్లుగా తనకు తెలుసన్నారు.



కేంద్ర మంత్రి మనోహర్ లాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఎం చంద్రబాబు

రెండు మెట్రోలకు వంద శాతం సాయం

- కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం చంద్రబాబు వినతి

న్యూఢిల్లీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులకు చేయూతనివ్వాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను సీఎం చంద్రబాబు కోరారు. మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం, పట్టణీకరణ సవాళ్లను పరిష్కరించడంలో ప్రాజెక్టుల ప్రాముఖ్యతను వివరిస్తూ వినతిపత్రం అందించారు. గురువారం ఢిల్లీలోని ఖట్టర్ నివాసంలో చంద్రబాబు కేంద్ర మంత్రిని కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టులపై చర్చించారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి, ఆర్థిక వృద్ధిని పెంపొందించడానికి, పట్టణాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడానికి విశాఖ, విజయవాడ మెట్రో రైలు ఎంతో కీలకమని వివరించారు. ఈ ప్రాజెక్టులను వెంటనే ఆమోదించి, వంద శాతం ఆర్థిక సాయం అందించాలని కోరారు. కీలక పారిశ్రామిక కేంద్రమైన విశాఖలో ట్రాఫిక్ రద్దీ పెరుగుతోందన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తవుతుందని, అప్పటిలోగా మెట్రో కారిడార్‌ను జాతీయ రహదారులతో అనుసంధానం చేయడం ఎంతో అవసరమని తెలిపారు. మొదటి దశలో ప్రధాన పట్టణ కేంద్రాలను అనుసంధానించడం లక్ష్యమని చెప్పారు. తర్వాత విమానాశ్రయం వరకు విస్తరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. రాజధాని అమరావతికి గేట్ వేగా విజయవాడ మెట్రో వ్యవస్థ ఏర్పాటు చేయాలని, ప్రాంతీయ కనెక్టివిటీతో బలోపేతం చేయాలని నిర్ణయించామని వివరించారు. విజయవాడ పరిసరాల్లో ఆర్థిక వృద్ధి తోడ్పాటుకు ఇది ఎంతో అవసరమని చెప్పారు. విజయవాడలో పెరుగుతున్న రవాణా అవసరాలను తీర్చడానికి ఈ ప్రాజెక్టును ప్రాధాన్యమైనదిగా పరిగణించాలని కోరారు. విభజన తర్వాత రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని, మెట్రో ప్రాజెక్టులను స్వతహాగా నిర్మించే పరిస్థితుల్లో లేదన్నారు. సకాలంలో ప్రాజెక్టును గ్రౌండ్ చేసేందుకు ఫేజ్-1 అనుమతులు, భూసేకరణకు కేంద్రం మద్దతునివ్వాలని విజ్ఞప్తి చేశారు. రెండు మెట్రో ప్రాజెక్టులతో వాయు కాలుష్యం తగ్గుతుందని, ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని చంద్రబాబు వివరించారు.

ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌కు కేకేఆర్ గౌతమ్ విద్యార్థి అర్హత



హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ ట్రైనింగ్ క్యాంప్‌కు తమ విద్యార్థి ఉజ్వల్ రామ్ అర్హత సాధించాడని కృష్ణజిల్లా గుడివాడలోని కేకేఆర్ గౌతమ్ హైస్కూల్ గురువారం తెలిపింది. ఈ క్యాంప్ మే 8 నుంచి 31 వరకు చెన్నైలో జరగనుందని వెల్లడించింది. ఇటీవల హోమిబాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియన్ నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో ఉజ్వల్ రామ్ అత్యంత ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.సత్యారామ్ తెలిపారు. జాతీయ పోటీలకు దేశవ్యాప్తంగా 69మంది ఎంపికవగా, ఆంధ్రప్రదేశ్ నుంచి కేవలం తమ విద్యార్థి మాత్రమే ఉన్నాడని ఆయన చెప్పారు.



శాసనమండలి సభ్యత్వం కోసం నాగబాబు నామినేషన్ పత్రాలపై మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో సంతకాలు చేస్తున్న జనసేన ఎమ్మెల్యేలు

ఎమ్మెల్సీ అభ్యర్థిగా నేడు నాగబాబు నామినేషన్

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా శుక్రవారం ఉదయం నామినేషన్ దాఖలు చేయనున్నారు. నామినేషన్ పత్రాలపై గురువారం సాయంత్రమే అభ్యర్థితో సంతకాలు చేయించారు. నాగబాబు అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ 10 మంది... మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, లోకం నాగ మాధవి, ఆరణి శ్రీనివాసు తదితరులు సంతకాలు చేశారు. మంత్రి నాదెండ్ల మనోహర్ స్వయంగా ఈ బాధ్యత తీసుకొన్నారు.

సరస్వతీ పవర్ షేర్ల బదిలీపై ట్రైబ్యునల్‌లో విచారణ

- ప్రతివాదిగా తన పేరు తొలగించాలని షర్మిల వినతి



హైదరాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సరస్వతీ పవర్‌కు సంబంధించిన షేర్ల బదిలీని అడ్డుకోవాలని కోరుతూ ఏపీ మాజీ సీఎం జగన్, ఆయన భార్య భారతి దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్సీఎల్టీ) హైదరాబాద్ బెంచ్‌లో విచారణ జరిగింది. జగన్, భారతిల తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ప్రతివాదులైన వైఎస్ విజయలక్ష్మి, షర్మిల తరఫున సీనియర్ న్యాయవాది వివేకరెడ్డి, విశ్వరాజ్ హాజరయ్యారు. ఈ కేసుతో తనకు సంబంధం లేదని, ఆస్తుల పంపకాలకు కంపెనీ పిటిషన్‌కు సంబంధం లేదని షర్మిల విన్నవించారు. తనను ప్రతివాదిగా తొలగించాలని కోరారు. దీనిపై సమాధానాలు ఇవ్వాలని సంబంధిత పార్టీలకు బెంచ్ నోటీసులు జారీచేసింది. ప్రధాన పిటిషన్‌పై వాదనలు వినాలని నిరంజన్‌రెడ్డి కోరగా, బెంచ్ అంగీకరించలేదు. మధ్యంతర దరఖాస్తులపై ఉత్తరప్రత్యుత్తరాలు పూర్తయ్యాక అన్నీ కలిపి వింటామని పేర్కొంది. తదుపరి విచారణను ఏప్రిల్ 3కు వాయిదా వేసింది.

ఎక్సైజ్ కమిషనరేట్‌లో ఎమ్మెల్యే హల్‌చల్!

(మొదటి పేజీ తరువాయి)

నిర్వర్తిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో నియమితులయ్యారనే వంకతో వారిలో ఒకరు మినహా మిగిలిన పదిమందిని వెంటనే తొలగించాలని, వారి స్థానాల్లో తాను సూచించిన పదిమందిని తక్షణమే ఉద్యోగంలోకి తీసుకోవాలని అరవిందబాబు గురువారం మధ్యాహ్నం ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లి పట్టుబట్టారు. ఇదే విషయమై తాను రాసిన లేఖపై స్పందన లేదనే విషయాన్ని డైరెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. తాను చెప్పినవారికి అవకాశం కల్పిస్తేనే చాంబర్ నుంచి బయటకు వెళతానంటూ అక్కడే సోఫాలో పడుకుని నిరసన వ్యక్తంచేసినట్లు తెలిసింది. దీంతో దిక్కుతోచని డైరెక్టర్... ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్రకు సమాచారం అందించారు. మంత్రితో పాటు వినుకొండ ఎమ్మెల్యే, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఫోన్‌లో మాట్లాడి సముదాయించినా చాంబర్ నుంచి వెళ్లేందుకు ఎమ్మెల్యే అంగీకరించలేదు. చివరకు రెండు గంటల తర్వాత నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని నర్సరావుపేట డిపో మేనేజర్‌ను ఆదేశిస్తూ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడంతో అరవిందబాబు అక్కడినుంచి వెళ్లిపోయారు. కాగా, ఎమ్మెల్యే ఈ విధంగా ప్రవర్తించడం విమర్శలకు దారితీస్తోంది. ప్రతిపక్ష నేతలు వచ్చి నిరసనలు చేయడం సహజమేనని, కానీ అధికార పార్టీ ఎమ్మెల్యే తీరుతో అధికారులు, ఉద్యోగులపై ఒత్తిడి పెరుగుతుందనే వాదన వినిపిస్తోంది. ఇకపై పనులు కావాల్సిన ఎమ్మెల్యేలు ఇలాగే ఆఫీసుకు వచ్చి నిరసనలు చేస్తే తామేం చేయాలని సిబ్బంది ప్రశ్నిస్తున్నారు.

దానికి ఓ లెక్క ఉంది!

- ప్రజలకు ఏ సదుపాయమూ ఊరకనే రాదు
- జీఎస్టీ, ఇతర ట్యాక్స్‌ల విధింపుపై నిర్మల వ్యాఖ్య
- విశాఖ మెట్రో రైల్ డీపీఆర్ ఇస్తే నిధులిస్తామని వెల్లడి
- విశాఖలో పర్యటనలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి

విశాఖపట్నం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ, ఇతర ట్యాక్సులు విధిస్తున్నామంటే, దానికి కారణముందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ అన్నారు. ఏ సదుపాయమూ ఊరకనే రాదని ప్రజలు గ్రహించాలని వ్యాఖ్యానించారు. విశాఖపట్నం నోవాటెల్‌లో గురువారం వివిధ వ్యాపార, వాణిజ్య సంస్థలు, చార్టెడ్ అకౌంటెంట్లతో ఆమె సమావేశం అయ్యారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన తరువాత దానిని పార్లమెంటులో చర్చకు పెట్టి ఆమోదించే ముందుగా వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు తీసుకుంటున్నామని నిర్మల తెలిపారు. "బడ్జెట్ సూచనల కోసం తొలుత ముంబైలో సమావేశం నిర్వహించాం. ఇప్పుడు విశాఖలో రెండో సమావేశం ఏర్పాటు చేశాం" అన్నారు.

పన్నులు కడుతోంది మూడు కోట్లమందే..

ఒక కారును రూ.12 లక్షలు పెట్టి కొంటే జీఎస్టీ, రోడ్ ట్యాక్స్, ఇన్సూరెన్స్ ట్యాక్స్...ఇలా సుమారు మరో రూ.10 లక్షలు అదనంగా పన్నుల రూపంలో చెల్లించాల్సి వస్తోందని, ఇది న్యాయమా?...అని ఒకరు ప్రశ్నించగా మంత్రి సవివరంగా సమాధానమిచ్చారు. "సాధారణ పౌరుల దృష్టిలో ఇది పన్నుల భారంగానే కనిపిస్తుంది. కానీ అవన్నీ వేర్వేరు అవసరాల కోసం చెల్లిస్తున్నారు. తయారు చేసిన కారు కొన్నందుకు జీఎస్టీ కడతారు. రహదారిపై ఆ వాహనం నడుపుతున్నందుకు ఆ రోడ్డు నిర్మాణానికి అయిన ఖర్చు కోసం పన్ను కట్టాల్సి ఉంటుంది. పెట్రోల్ పోయించుకుంటే, దానిని దిగుమతి చేసుకున్నందుకు పన్ను చెల్లించాలి. ఇలా అన్ని వేర్వేరు ప్రయోజనాల కోసం చెల్లించాల్సి ఉంటుంది. దేశంలో ఐటీ రిటర్న్స్ దాఖలు చేసేవారు తొమ్మిది కోట్ల మంది ఉంటే...వారిలో కేవలం మూడు కోట్ల మంది మాత్రమే పన్ను చెల్లింపుదారులు ఉన్నారు" అని మంత్రి వివరించారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని మత్స్యపురి గ్రామానికి చాలాకాలం క్రితం వరకు తాగునీరు ఉండేది కాదని, ఇప్పుడు ఆ గ్రామం సహా దేశంలోని ప్రతి ఇంటికీ జల జీవన్ మిషన్ ద్వారా నీటి కొళాయి ఇస్తున్నామని చెప్పారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు ఉన్న రుణాలను చాలావరకు చెల్లించడం వల్ల బ్యాంకులు ఇప్పుడు ఆర్థిక సాయం అందించడానికి చర్యలు చేపడుతున్నాయన్నారు.

పోలవరం జాతీయ ప్రాజెక్టుగానే పూర్తిచేస్తాం

పోలవరం జాతీయ ప్రాజెక్టు అని, దానిని పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని నిర్మల అన్నారు. విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుకు డీపీఆర్ సమర్పిస్తే...దానికీ నిధులిస్తామని హామీ ఇచ్చారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నిర్మలా సీతారామన్, పంకజ్ చౌదరి

ఎగుమతిదారుల ప్రయోజనాలు కాపాడతాం

- దీనికోసమే వాణిజ్యమంత్రి అమెరికా వెళ్లారు
- సుంకాల పైనే చర్చలు జరుపుతున్నారు
- ట్రంప్ 'ప్రతీకార' సుంకాల హెచ్చరిక నేపథ్యంలో.. నిర్మల వ్యాఖ్యలు

విశాఖపట్నం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): భారత ఎగుమతిదారుల ప్రయోజనాలను కాపాడతామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. అమెరికాలో ట్రంప్ ప్రభుత్వం భారత్‌పై పెద్దఎత్తున సుంకాలు విధిస్తామని హెచ్చరికలు చేస్తున్న నేపథ్యంలో నిర్మల వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. విలేకరుల సమావేశంలో ట్రంప్ విధిస్తానంటున్న ప్రతీకార సుంకాల ప్రస్తావన రాగా, ఆమె వివరంగా స్పందించారు. "దేశంలోని ఎగుమతిదారుల ప్రయోజనాలే మా ప్రభుత్వానికి ప్రధానం. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయల్ అమెరికా వెళ్లారు. సుంకాల అంశం కేంద్రంగానే ఆయన అక్కడి అధికారులతో చర్చలు జరుపుతున్నారు" అని నిర్మల తెలిపారు. కాగా, భారత్‌పై ఏప్రిల్ రెండో తేదీ నుంచి ప్రతీకార సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు. ఈ నిర్ణయం వల్ల భారత్ ఏటా 700 కోట్ల డాలర్ల (దాదాపు రూ.61 వేల కోట్లు) ఆదాయం కోల్పోతుందని అంచనా వేస్తున్నారు.

వినాయక బొమ్మల్నీ దిగుమతి చేసుకుంటున్నాం

ఆత్మనిర్భర్ భారత్ కింద మేకిన్ ఇండియా పేరుతో అన్నీ ఇక్కడే తయారుచేస్తున్నారని, ఇతర దేశాలు కూడా ఇదే నినాదంతో ముందుకు వెళుతున్నప్పుడు ఇక ఈ విధానం వల్ల ప్రయోజనం ఏమిటన్న ప్రశ్నకు నిర్మల వివరంగా స్పందించారు. "మట్టితో వినాయకుడిని తయారుచేసి పూజించుకునే భారతీయులు ఇప్పుడు చైనా నుంచి దిగుమతి చేసుకున్న వినాయక ప్రతిమలు ఉపయోగిస్తున్నారు. అగరబత్తి తయారీలో ఉపయోగించే వెదురు, అగ్గిపెట్టెలు కూడా దిగుమతి అవుతున్నాయి. దీనివల్ల దేశంలో చిన్న పరిశ్రమలు దెబ్బతింటున్నాయి. మందుల తయారీకి అవసరమైన ముడి పదార్థాలన్నీ చైనా నుంచి దిగుమతి అవుతున్నాయి. వాటిపై మనం ఆధారపడడం వల్ల రూ.10 విలువైన సరుకు రూ.100కు విక్రయిస్తున్నారు. అందుకే దేశంలో ఫార్మా రంగాన్ని బాగా ప్రోత్సహిస్తున్నాం. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తున్నాం" అని నిర్మల తెలిపారు. ఇంకా...

ప్రశ్న: సెంట్రల్ జీఎస్టీ, స్టేట్ జీఎస్టీ కలిపి వసూలు చేయొచ్చుగా?

నిర్మల జవాబు: అది ఫెడరల్ విధానంలో భాగం.

ప్రశ్న: విమానాశ్రయాల ద్వారా సముద్ర ఉత్పత్తులు, మందులు వంటి సరుకులు రవాణాకు కోల్డ్ స్టోరేజీ సౌకర్యాలు లేవు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో వీటిని ఏర్పాటుచేసేందుకు ఏమైనా అవకాశం ఉందా?

జవాబు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపితే పరిశీలిస్తాం.

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు... కొత్త క్రెడిట్ అసెస్‌మెంట్ మోడల్

- ప్రారంభించిన నిర్మలా సీతారామన్

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల కోసం ఆన్‌లైన్ డేటా ఆధారిత కొత్త క్రెడిట్ అసెస్‌మెంట్ మోడల్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రారంభించారు. విశాఖపట్నం వచ్చిన ఆమె ఈ మోడల్‌ను ప్రారంభించారు. ప్రభుత్వ రంగ సంస్థలు రుణాలు మంజూరుచేసే సమయంలో థర్డ్ పార్టీ మదింపులపై ఆధారపడకుండా ఈ మోడల్‌ను ఉపయోగించుకుంటాయని తెలిపారు. ఈ విధానంలో ఎంఎస్ఎంఈలు ఎక్కడి నుంచైనా దరఖాస్తు సమర్పించుకునే అవకాశం ఉంది. వ్యాపారులు, చార్టెడ్ అకౌంటెంట్లు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానాలు ఇచ్చారు. మరికొన్నింటికి ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యక్ష పన్నుల విభాగం అధికారులతో జవాబులు చెప్పించారు. అప్పులకే ఏటా రూ.12 లక్షల కోట్ల వరకు వడ్డీలను దేశం చెల్లిస్తున్నదని, అప్పును పూర్తిగా తీర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయా? అని ఒకరు ప్రశ్నించగా...బడ్జెట్‌లో దానిపై కూడా చర్చించామని మంత్రి సమాధానం ఇచ్చారు. ఆదాయ పన్నుకు కొత్త విధానం వచ్చినప్పుడు పాత విధానం రద్దు చేయాలి కదా?...అని ప్రశ్నించగా దశల వారీగా ఆ చర్యలు చేపడతామని ఓ అధికారి సమాధానమిచ్చారు.

వివేకా వాచ్‌మన్ రంగయ్య మృతిపై కేసు నమోదు

- ఆర్కేవ్యాలీ సీఐకి దర్యాప్తు బాధ్యత
- వివేకా హత్య కేసులో నలుగురు సాక్షులు మృతి
- కారణాల వెలికితీతకు డీఎస్పీ నేతృత్వాన కమిటీ: ఎస్పీ

పులివెందుల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి ఇంటి వాచ్‌మన్ అయిన తన భర్త రంగయ్య మృతి పట్ల అనుమానాలున్నాయని ఆయన భార్య సుశీలమ్మ ఫిర్యాదు చేశారు. దీంతో పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారు. రంగయ్య బుధవారం అనారోగ్యంతో కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విదితమే. గురువారం మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. శుక్రవారం అంత్యక్రియలు జరుగుతాయి. వివేకా హత్య కేసులో ఏకైక ప్రత్యక్ష సాక్షి రంగయ్యే. దీనిపై గురువారం రాత్రి తన కార్యాలయంలో ఎస్పీ అశోక్ కుమార్ విలేకర్లతో మాట్లాడారు. 'హత్య కేసులో ఇప్పటి వరకు నలుగురు సాక్షులు మృతి చెందారు. ప్రధాన సాక్షిగా ఉన్న రంగయ్య మృతిపై ఆయన భార్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టుగా కేసు నమోదు చేసి విచారిస్తున్నాం. సాక్షులు చనిపోవడం వెనుక నిజానిజాలు తెలుసుకునేందుకు ఓ డీఎస్పీ నేతృత్వంలో వివిధ విభాగాల నిపుణులతో జట్టు ఏర్పాటు చేసి విచారిస్తున్నాం. సాక్షుల మరణాలకు కారణాలను వెలుగులోకి తెస్తాం. సాక్షుల మృతి వెనుక సీబీఐ, పోలీసులు ఉన్నారనే ఆరోపణలు సరికాదు. రంగయ్య మృతి కేసు దర్యాప్తు బాధ్యతలను ఆర్కే వ్యాలీ సీఐ ఉలసయ్యకు అప్పగించాం. పోస్టుమార్టం వివరాలు వస్తే రంగయ్య మృతికి కారణాలు తెలుస్తాయి' అని ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.

పూర్తి స్థాయి విచారణ: బీటెక్ రవి


'వివేకా హత్య కేసులో సాక్షులు మరణిస్తున్నారు. కారణాలను కనుక్కోవాల్సిన అవసరం ఉంది. వాచ్‌మన్ రంగయ్య మృతిపై కూడా పూర్తి స్థాయి విచారణకు ఆదేశించాం. నిజానిజాలు తేలేవరకూ వరకూ రంగయ్య మృతిని అనుమానాస్పదంగానే చూస్తున్నాం' అని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి పులివెందులలో అన్నారు.

నేను కబ్జాదారుడిని కాదు

- తలపుల గ్రామ వాసి మురళీమోహన్ రెడ్డి

పీలేరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): తాను కబ్జాదారుడిని కానని, కబ్జా గురించి అధికారులకు తెలియజేసిన ఫిర్యాదుదారుడినని అన్నమయ్య జిల్లా పీలేరు మండలం తలపుల గ్రామానికి చెందిన మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. 'సర్కారీ భూములు స్వాహా' అన్న శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంలో తాను తలపులకు చెందిన సర్వే నంబర్లు 1960, 2360-2, 2361-10, 2361-11లో ఉన్న 14 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నానని వచ్చిందన్నారు. తాను ఆక్రమించలేదని, వైసీపీ నాయకులు ఆక్రమించుకుంటే తాను వాటిపై వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పటి నుంచి పోరాడుతున్నానని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రెవెన్యూ శాఖ ప్రత్యేక సీఎస్ సిసోడియా దృష్టికి తీసుకెళ్లానని, ఆయన ఆదేశాలతో రెవెన్యూ అధికారులు విచారించి నివేదిక అందజేశారని తెలిపారు. దాని ఆధారంగా కలెక్టర్ గత నెల 13న అక్రమ నిర్మాణాలను కూల్చివేశారన్నారు. ఆ భూముల చుట్టూ వేసిన కంచెను తొలగించడమే కాకుండా విద్యుత్ సర్వీసులను నిలిపివేశారని, ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించారని, నీటి బోర్లను కూడా సీజ్ చేశారన్నారని తెలిపారు.

ఆంధ్రజ్యోతి



విజయవాడ ● శుక్రవారం 7 మార్చి 2025

మహిళా దినోత్సవ కానుకగా అంగన్వాడీలకు గ్రాట్యుటీ



అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం కానుకగా అంగన్వాడీలకు గ్రాట్యుటీ ఇస్తామని, ఆరోజు సీఎం చంద్రబాబు దీనిపై ప్రకటన చేస్తారని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. గురువారం శాసనమండలిలో అంగన్వాడీల వేతన పెంపు, గ్రాట్యుటీపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. గత సీఎం అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని చెప్పి.. రూ.వెయ్యి పెంచి, సంక్షేమ పథకాలు కట్ చేశారన్నారు. వేతనాల పెంపు కోసం అంగన్వాడీలు ఆందోళనలు చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అంగన్వాడీ కార్యకర్తల వేతనాలు రూ.2,500 నుంచి రూ.10,500కు పెంచింది చంద్రబాబేనన్నారు.

బుల్లెట్ దిగిందా? లేదా? అన్నట్టు మాట్లాడాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే మాధవి తీరుపై డిప్యూటీ స్పీకరు అసహనం



అమరావతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పదే పదే బెల్ మోగిస్తున్నా పట్టించుకోకుండా సుదీర్ఘంగా మాట్లాడుతున్న జనసేన నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి తీరుపై డిప్యూటీ స్పీకరు రఘురామకృష్ణ రాజు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గురువారం శాసనసభలో మంత్రులు అచ్చెన్న, ఆనం, పవన్ కల్యాణ్ తరఫున నాదెండ్ల మనోహర్ ఆయా శాఖలకు గ్రాంట్లు, నిధుల మంజూరు కోసం ప్రవేశపెట్టిన డిమాండ్లపై డిప్యూటీ స్పీకరు చర్చకు అనుమతించారు. ముందుగా ఎమ్మెల్యే లోకం నాగమాధవి దాదాపు అర గంట మాట్లాడిన తర్వాత.. ఇంకా కొనసాగిస్తుడడంతో డిప్యూటీ స్పీకర్ బెల్ మోగిస్తూ.. 'ఎంతసేపు మాట్లాడామనేది కాదు.. ఎంతమంది వింటున్నారో కూడా మీరు చూడాలి. మీరు మాట్లాడుతుంటే సభ్యులెవరూ వినకుండా ఎవరి గొడవలో వాళ్లున్నారు. బుల్లెట్ దిగిందా? లేదా? అన్నట్టుండాలే తప్ప ఎంత సమయం తినేశాననేది కాదు' అని అన్నారు. కాసేపటి తర్వాత మళ్లీ బెల్ మోగిస్తున్నప్పటికీ.. నాగమాధవి ప్రసంగాన్ని కొనసాగిస్తుండటంతో ఆమె మైకును కట్ చేశారు.

రైతులను అన్నివిధాలా ఆదుకుంటాం: అచ్చెన్న



వ్యవసాయ రంగాన్ని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. ఎమ్మెల్యేల ప్రశ్నలు, సందేహాలకు మంత్రి సమాధానం ఇచ్చారు. తమది రైతు ప్రభుత్వమని, వ్యవసాయాన్ని లాభసాటిగా చేసి, రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటామని చెప్పారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో 1,423 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని అచ్చెన్నాయుడు ప్రకటించారు. సభ్యుల ప్రశ్నలకు ఆయన బదులిస్తూ.. 2024 జూన్ తర్వాత 39 మంది ఆత్మహత్యలు నమోదయ్యాయని చెప్పారు.

దేవదాయ శాఖలో సంస్కరణలు: మంత్రి ఆనం

గత వైసీపీ ప్రభుత్వం.. హిందూ ఆలయాల పవిత్రను దెబ్బతీసిందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విమర్శించారు. ఆ భగవంతుడే ప్రజల తీర్పు రూపంలో వైసీపీని 11 స్థానాలకు పరిమితం చేశాడని మంత్రి అన్నారు. గురువారం శాసనసభలో మంత్రి మాట్లాడుతూ దేవదాయ శాఖలో అనేక సంస్కరణలు తీసుకువస్తున్నామని చెప్పారు.

ఒక్క పెన్షనూ తొలగించలేదు: కొండపల్లి

రాష్ట్రంలో ఇప్పటి వరకూ ఒక్క సామాజిక పెన్షన్ కూడా తొలగించలేదని సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. 2019 నాటికి 53,85,796 మంది పెన్షన్ లబ్ధిదారులుంటే, ఇప్పుడు 63,59,907 మంది ఉన్నారన్నారు. 2024 జూన్ తర్వాత 14,967 మందిని తొలగించామన్నారు. 2019-24లో పది లక్షల పెన్షన్లు తొలగించారని ఆరోపించారు.

నిషేధిత జాబితా నుంచి గ్రామకంఠాల తొలగింపు

వైసీపీ హయాంలో 4,157 ఎకరాల గ్రామ కంఠాలను నిషేధిత జాబితాలో చేర్చినట్లు సమాచారం ఉందని, దీనిపై పూర్తిస్థాయిలో సమాచారం తీసుకుంటున్నామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. కూటమి ప్రభుత్వం జీవో 187 ప్రకారం గ్రామకంఠాలను పరిశీలించి నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ఆదేశించిందని చెప్పారు.

అమ్మ ఒడిపై జగన్ కనికట్టు

కోతలు కోసి కూడా ఇచ్చినట్టు ప్రచారం.. తల్లులకు మొత్తం 8 వేల కోట్లు ఎగవేత

- ఐదేళ్లలో 26,010 కోట్లు ఇచ్చామన్న జగన్
- తల్లుల ఖాతాలకు చేరింది 23,833 కోట్లే
- ఐదేళ్లలో పథకం అమలు చేసింది 4 సార్లే
- చివరి ఏడాది 6 వేలకోట్లు ఇవ్వని వైనం
- అయినా ఏటా 15 వేలు ఇచ్చినట్లు కలరింగ్
- అసెంబ్లీలో వాస్తవాలు బయటపెట్టిన ప్రభుత్వం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ఐదేళ్లలో ఎంతో సంక్షేమం చేశామని గొప్పలు చెప్పుకొన్న జగన్.. పథకాల్లో కోతలు కోసి కూడా ఇచ్చినట్లుగా ప్రచారం చేసుకున్నారు. తప్పుడు ప్రచారంతో ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు అమ్మఒడి పథకంపైనా కట్టుకథ చెప్పారు. పిల్లల్ని బడులకు పంపే ప్రతి తల్లికి ఏటా రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన ఆయన ఐదేళ్లలో నాలుగు సార్లే అమ్మఒడి నిధులు విడుదల చేశారు. అయితే ప్రతి ఏటా రూ.15 వేలు తల్లుల ఖాతాల్లో జమ చేసినట్లుగా జగన్ ప్రచారం చేసుకున్నారు. వాస్తవాలను కూటమి ప్రభుత్వం తాజాగా బట్టబయలు చేసింది. తమ హయాంలో రూ.26,010 కోట్లు ఇచ్చినట్లుగా జగన్ ప్రచారం చేసుకోగా, అందులోనూ వాస్తవంగా ఇచ్చింది రూ.23,833 కోట్లు మాత్రమేనని అసలు విషయాన్ని బయటపెట్టింది.

కోతల లెక్కలు ఇలా..

'పిల్లల్ని బడికి పంపే ప్రతి తల్లికి ఏటా రూ.15 వేలు ఇస్తాం'.. అనేది 2019 ఎన్నికల నాటి వైసీపీ మేనిఫెస్టో హామీ. అధికారంలోకి వచ్చాక ఏడు నెలల తర్వాత అమ్మఒడి పథకం తొలి విడత నిధులు విడుదల చేశారు. మొదటి విడతలో రూ.15 వేలు తల్లుల ఖాతాల్లో వేశారు. అయితే అమ్మఒడి నిధుల విడుదల సభలోనే పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణకు రూ.వెయ్యి వెనక్కి ఇవ్వాలని జగన్ లబ్ధిదారులను కోరారు. అదేంటి.. అలా ఇచ్చి ఇలా అడుగుతున్నారని చాలామంది రూ.వెయ్యి పాఠశాలలకు ఇవ్వలేదు. దీంతో ఇలా అడిగితే వెనక్కి ఇవ్వరని భావించిన ప్రభుత్వం ఆ తర్వాతి సంవత్సరం రూ.14 వేలు మాత్రమే ఖాతాల్లో వేసింది. ఆ తర్వాత సంవత్సరం మరుగుదొడ్ల నిర్వహణ నిధి(టీఎంఎఫ్) కింద రూ.వెయ్యి, పాఠశాలల నిర్వహణ నిధి(ఎస్ఎంఎఫ్) కింద మరో రూ.వెయ్యి కోత పెట్టి రూ.13 వేలే ఖాతాల్లో జమ చేశారు. మరో ఏడాది కూడా రూ.13 వేలు మాత్రమే తల్లులకు ఇచ్చారు. ఇక ఎన్నికల పేరుతో చివరి ఏడాది అమ్మ ఒడి నిధులు ఇవ్వలేదు. చివరి సంవత్సరం ఇవ్వకుండా ఎగ్గొట్టాలనే యోచనతో ముందుగా అమ్మఒడి నిధులు విడుదల చేసే నెలను మార్చారు. మొదటి రెండేళ్లు జనవరిలో విడుదల చేయగా, మూడో ఏడాది నుంచి జూన్‌కు మార్చారు. దీంతో 2,3 విడతల మధ్య ఏడాదిన్నర గ్యాప్ వచ్చింది. ఐదో విడత నిధుల విడుదల సమయానికి ఎన్నికలు వచ్చాయి. ఇక అమ్మఒడిలో పెట్టిన కోతలు మొత్తం లెక్కిస్తే నాలుగు విడతల్లో ఏకంగా రూ.2,177 కోట్లు ఎగ్గొట్టారు. అంతేగాక ఒక విడత పూర్తిగా ఎగ్గొట్టడంతో గత ప్రభుత్వానికి సుమారు రూ.6 వేల కోట్లు మిగిలాయి. జగన్ ఇచ్చిన హామీ మేరకు మొత్తంగా రూ.30 వేల కోట్లకు పైగా తల్లులకు విడుదల చేయాల్సి ఉండగా, చివరికి రూ.23,833 కోట్లే అందాయి. కానీ మాజీ సీఎం జగన్ ఇప్పటికీ ఐదేళ్లు అమ్మఒడి ఇచ్చామనే ప్రచారం చేసుకుంటున్నారు. పైగా అమ్మఒడిలో కోతలను ప్రస్తావించకుండా ఏటా రూ.15వేలు ఇచ్చినట్లు చెబుతున్నారు.



జగన్ చెప్పింది... వాస్తవంగా ఇచ్చింది (రూ.కోట్లలో)

సంవత్సరం	జగన్ ప్రచారం	అసలు ఇచ్చింది	తల్లికి అందింది
2019-20	6,349.64	6,349.54	15000
2020-21	6,673	6,228.41	14000
2021-22	6,595	5,715.32	13000
2022-23	6,392.94	5,540.55	13000
మొత్తం	26,010.58	23,833.92	-

అందరికీ తల్లికి వందనం

గత వైసీపీ ప్రభుత్వంలో ఎంత మంది పిల్లల్ని బడికి పంపినా తల్లుల సంఖ్య ఆధారంగానే అమ్మ ఒడి అమలు చేసింది. కానీ కూటమి ప్రభుత్వం బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి తల్లికివందనం అమలు చేయబోతోంది. అప్పట్లో ఏటా సుమారు 43 లక్షల మంది తల్లులకు పథకం వర్తించగా, ఇప్పుడు దాదాపు 80 లక్షల మంది పిల్లలకు పథకం వర్తించనుంది. ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున ఇవ్వడానికి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.9,407 కోట్లు కేటాయించింది. మొత్తంగా రూ.12 వేల కోట్ల వరకు అవసరం కాగా ప్రభుత్వం మిగిలిన నిధులు సర్దుబాటు చేసి తల్లికి వందనం అమలు చేయనుంది.

రాజధానిలో యోగా, ప్రకృతి వైద్య పరిశోధన కేంద్రం

- అమరావతిలో 25 ఎకరాలు కేటాయింపు: సత్యకుమార్

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మంజూరు చేసిన యోగా, ప్రకృతి వైద్య పరిశోధనా కేంద్రాన్ని రూ.100 కోట్లతో అమరావతిలో ఏర్పాటు చేయనున్నట్టు ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. గురువారం అసెంబ్లీలో ఆయుర్వేద, హోమియో ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరతపై సభ్యుల ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం 2018లోనే యోగా, ప్రకృతి వైద్య పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు అనుమతిచ్చిందన్నారు. గన్నవరం సమీప కొండపావులూరులో 25 ఎకరాలను ఈ కేంద్రం ఏర్పాటుకు నాటి ప్రభుత్వం కేటాయిందన్నారు. ఈ భూవిని వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీలకు కేటాయించిందన్నారు. యోగా, ప్రకృతి వైద్య పరిశోధనా కేంద్రం విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా.. అమరావతిలో 25 ఎకరాలు కేటాయించేందుకు అంగీకరించారని తెలిపారు. రూ.100 కోట్లతో పరిశోధన కేంద్రం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. సిబ్బంది నియామకాలు చేపట్టి ఆయుష్‌ను బలోపేతం చేస్తామన్నారు. తొలుత ఎమ్మెల్యేలు కె.మురళీమోహన్, మాధవి మాట్లాడుతూ రాష్ట్రంలో చాలా ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత ఉందని చెప్పారు. కడప హోమియో ఆస్పత్రిలో వాచ్‌మెన్ కూడా లేరన్నారు.

పోలవరం జాప్యంతో.. 50 వేల కోట్ల నష్టం!



- డయాఫ్రంవాల్ విధ్వంసం మానవ తప్పిదమే
- ఈ డిసెంబరుకల్లా పూర్తిచేస్తాం : నిమ్మల

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జగన్ అసమర్థ పాలన, అసంబద్ధ నిర్ణయాల వల్ల పోలవరం ప్రాజెక్టు ఐదేళ్లు నిలిచిపోయిందని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. నిర్మాణంలో జాప్యం కారణంగా.. ప్రాజెక్టు పూర్తయితే రావలసిన దాదాపు రూ.50 వేల కోట్ల ఫల సాయం రాకుండా పోయిందని తెలిపారు. గురువారం శాసన మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో పోలవరం డయాఫ్రం వాల్‌పై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. కొత్త వాల్ నిర్మాణానికి రూ.1,000 కోట్లు ఖర్చవుతుందని, 2019లో తమ ప్రభుత్వం కొనసాగి ఉంటే ప్రాజెక్టు పూర్తవడమే కాకుండా రాయలసీమ, ఉత్తరాంధ్రకు నీటి నిఅందించడం ద్వారా పంటలు పండి ఫల సాయం వచ్చేదని తెలిపారు. '2020లో ఆగస్టులో గోదావరికి వచ్చిన 23 లక్షల క్యూసెక్కుల వరద ఉధృతికి డయాఫ్రం వాల్ విధ్వంసానికి గురైంది. నిపుణులు పరిశీలించి ప్రకృతి వైపరీత్యం వల్ల కాదు.. మానవ తప్పిదం వల్లే అది ధ్వంసమైందని నివేదిక కూడా ఇచ్చారు. ఇప్పుడు మా ప్రభుత్వం జనవరి 18 తేదీన కొత్త వాల్ పనులు ప్రారంభించింది. డిసెంబరుకల్లా పూర్తి చేసే లక్ష్యంతో సాగుతున్నాం. 2027 డిసెంబరు నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలనే కృత నిశ్చయంతో ఉన్నాం' అని స్పష్టం చేశారు. వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభించామని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. గత ప్రభుత్వం పనులు చేసిన వారికి బిల్లులు చెల్లించలేదని, వంశధార లిఫ్ట్‌లో పెండింగ్ బిల్లులు చెల్లిస్తామన్నారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.176 కోట్లు కాగా.. వాస్తవ వ్యయం రూ.141.17 కోట్లని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ప్రజలకు ఎంతో ఉపకరించే నేరడి బ్యారేజీపై ఒడిశా,ఏపీ మధ్య కోర్టు వివాదాన్ని పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.

అనకాపల్లిలో మిట్టల్ నిప్పాన్ స్టీల్‌ప్లాంట్



- 1,47,162 కోట్లతో రెండు దశల్లో ఏర్పాటు
- దాదాపు లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు
- 2028 నాటికి అందుబాటులోకి: భరత్

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): దేశంలోనే ఉత్పత్తి పరంగా అతిపెద్ద స్టీల్ ప్లాంట్ అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు కానుంది. ఈ జిల్లాలో దాదాపు రూ.1,47,162 కోట్ల పెట్టుబడితో మిట్టల్ నిప్పాన్ కంపెనీ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకొచ్చిందని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ప్రకటించారు. గురువారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సందర్భంగా అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. రెండు ఫేజ్‌ల్లో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కానుందని చెప్పారు. ఫేజ్-1లో భాగంగా రూ.61,780 కోట్ల పెట్టుబడితో 7.3 మిలియన్ టన్నులు ఉత్పత్తి లక్ష్యంగా స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తారని, ఫేజ్-2లో రూ.85,382 కోట్ల పెట్టుబడితో 10.5 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా ప్లాంట్‌ను విస్తరిస్తారని చెప్పారు. ప్లాంట్ మొత్తం ఉత్పత్తి సామర్థ్యం 17.8 మిలియన్ టన్నులు ఉంటుందన్నారు. దీనిద్వారా లక్ష మందికి ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. ఇప్పటికే 700 ఎకరాలు సేకరించేందుకు సిద్ధమయ్యామని, ఫేజ్-2 ఏర్పాటుకు మరో 700 ఎకరాలు సేకరిస్తామని వెల్లడించారు. 2028 నాటికి ప్లాంట్ నిర్మాణం పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించాలని సీఎం చంద్రబాబు కంపెనీ అధినేతను కోరారని చెప్పారు. కాగా, 20 వేల ఉద్యోగాలను స్థానిక యువతకు కేటాయించాలని కొణతాల రామకృష్ణ కోరగా, మంత్రి అంగీకరించారు.

విద్యార్థుల ఆత్మహత్యలకు అడ్డుకట్ట

- మన పిల్లలకు జరిగినట్టే ఆ ఘటనలను చూడాలి
- మానవత్వంతో వ్యవహరించాలని అధికారులను కోరా
- ర్యాగింగ్, ఫీజుల ఒత్తిడి, చదువుల భయమే కారణం
- తల్లిదండ్రులు, ప్రైవేటు యాజమాన్యాలదే బాధ్యత
- కౌన్సెలింగ్‌కు అమెరికా సంస్థతో సంప్రదింపులు
- విద్యాలయాల్లో స్కూల్ వెల్‌నెస్ టీమ్‌ల ఏర్పాటు
- ఈ ఏడాది యూనివర్సిటీల్లో ఖాళీలన్నీ భర్తీ చేస్తాం
- శాసనమండలిలో మంత్రి లోకేశ్ వెల్లడి



అమరావతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల్లో పిల్లల ఆత్మహత్యలు బాధాకరమని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు అందరం కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని గురువారం మండలిలో ఈ అంశంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఎవరైనా విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటే సొంత పిల్లలకు జరిగినట్లుగా భావించాలని, మానవత్వంతో స్పందించాలని ఇప్పటికే అధికారులకు సూచించానన్నారు. "ఆత్మహత్యలు లేవు అని ప్రభుత్వం అనడం లేదు. కానీ, ఆత్మహత్యల ఘటనల్లో పెరుగుదల ఎప్పుడూ ఒకేలాలేదు. ఒక్కో ఏడాది ఒక్కోరకంగా ఉంటోంది. ఉదాహరణకు 2016లో ఆరుగురు విద్యార్థులు, 2019లో నలుగురు, 2021లో ఏడుగురు, 2022లో 12 మంది, 2023లో 17 మంది, 2024లో ఆరుగురు చనిపోయారు. వీరంతా ఇంటరు విద్యార్థులు. సాంకేతిక విద్యను అభ్యసిస్తున్నవారిలో ఒక ఏడాది ఒకరిద్దరు, మరో ఏడాది 11 మంది, ఇంకో ఏడాది ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. యూనివర్సిటీల స్థాయిలో గత పదేళ్లలో 18 మంది ఆత్మహత్య చేసుకున్నారు. విద్యార్థుల్లో ఆత్మహత్య భావనను మొగ్గలోనే తుంచివేయడం కోసం స్కూల్ వెల్‌నెస్ టీమ్‌లను ఏర్పాటుచేసి, ప్రైవేటు,ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నాం." అని లోకేశ్ వివరించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించడానికి అమెరికాకు చెందిన క్యూపీఆర్ ఇన్‌స్టిట్యూట్‌తో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. ఇంటర్ పిల్లల కోసం టెలీకౌన్సెలింగ్ ఏర్పాటుచేస్తామని, డిగ్రీ కాలేజీల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతున్నదని వివరించారు. ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఇవ్వాలని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కోరానన్నారు. ఆత్మహత్యలకు ర్యాగింగ్, చదువుల భయం, ఫీజు చెల్లింపు ఒత్తిడే ప్రధాన కారణమని తెలిపారు. "ఫీజు కట్టాం కాబట్టి అన్ని సబ్జెక్టుల్లో తమ పిల్లలకు మంచి మార్కులు రావాలని తల్లిదండ్రులు ఒత్తిడి పెడుతున్నారు. ఆవిషయంలో ప్రైవేటు యాజమాన్యంపైనా బాధ్యత ఉంది." అని లోకేశ్ స్పష్టం చేశారు. పాఠశాల మైదానాల విషయంలో చక్రపాణి నివేదికను అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. విద్యాసంస్థల్లో లైంగిక వేధింపుల నివారణకు 280 మంది కౌన్సెలర్లను నియమించామన్నారు. ఇంకా ఏమన్నారంటే..

పరిశ్రమల అవసరాలు తీర్చేలా..

"రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. దీనికోసం బడ్జెట్‌లో రూ.రెండు వేల కోట్లు ప్రతిపాదించాం. వర్సిటీల్లో ఖాళీలు ఉన్న మాట వాస్తవమే. ఈ ఏడాది ఏకసభ్య కమిషన్ నివేదిక అందిన వెంటనే ఖాళీలన్నీ భర్తీ చేస్తాం. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగుల్లో మన వర్సిటీలు తొమ్మిదో స్థానంలో ఉన్నాయి. వాటిని మూడోస్థానంలోకి తీసుకురావడమే లక్ష్యం. పీహెచ్‌డీ విద్యార్థులు 5600 మంది ఉన్నారు. ఏపీలో జీఈఆర్ (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్) రేషియో 36.5 శాతం ఉంది. సాంకేతిక సంబంధ స్టెమ్ కోర్సుల్లో మహిళలు తక్కువగా ఉన్నారు. 'ఒకే రాష్ట్రం-ఒకేరాజధాని' నినాదంతో పనిచేస్తున్న ప్రభుత్వ లక్ష్యాలను అందుకోవాలంటే ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీల్లో పాఠ్యప్రణాళికను తదానుగుణంగా రూపుదిద్దాల్సి ఉంటుంది. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత లీప్(లెర్నింగ్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఏపీ) పేరుతో అంతర్జాతీయ కంపెనీలు, పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులను అభివృద్ధి చేసే కృషిలో కాలేజీలు, పాలిటెక్నిక్‌లు,ఐటీఐ, యూనివర్సిటీలను భాగంచేసే పనిని మొదలుపెట్టాం. వాటి పాఠ్యప్రణాళికల్లో తదనుగుణంగా మార్పులు తీసుకువస్తున్నాం. అనేక పథకాల కింద వర్సిటీలకు కేంద్రం అందిస్తున్న నిధులను కూడా కలుపుకొని కార్యక్రమాలు నిర్వహిస్తాం." అని లోకేశ్ అన్నారు.

పాత తప్పులు పునరావృతం కారాదనే..

డీఎస్సీవిషయంలో గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా, న్యాయపరమైన వివాదాలకు తావులేకుండా పకడ్బందీగా నోటిఫికేషన్ ఇవ్వాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని లోకేశ్ తెలిపారు. "విశ్వవిద్యాలయాల్లో నియామకాల అంశం కోర్టులో ఉంది. దీనిపై అడ్వకేట్ జనరల్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. విశ్వవిద్యాలయాల్లో మంజూరైన పోస్టులు 4,330. అందులో 3,282 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. క్యూఎస్ ర్యాంకింగ్‌లో టాప్100లో మన రాష్ట్రం నుంచి కనీసం ఒక విశ్వవిద్యాలయమైనా ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం." అని లోకేశ్ తెలిపారు.

అంబేడ్కర్ స్మృతివనం ప్రాజెక్టులో అవకతవకలు

- ఇంకా రూ.160 కోట్ల పనులు పెండింగ్: బొండా ఉమా

వైసీపీ ప్రభుత్వ హయాంలో.. విజయవాడలో అంబేడ్కర్ స్మృతివనం పేరుతో చేపట్టిన ప్రాజెక్టులో భారీఎత్తున అవకతవకలు జరిగాయని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆరోపించారు. గురువారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును సగంలోనే ఆపేసిందని, ఇంకా రూ.160 కోట్లతో పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం టూరిజం శాఖ ఆధ్వర్యంలో అందర్నీ ఆకర్షించేలా అభివృద్ధి చేయాలన్నారు.



నాడు రైతుకు వైసీపీ సర్కారు ద్రోహం

- అరకొరగా ధాన్యం కొన్నా డబ్బులివ్వలేదు
- ధాన్యం బకాయిలు 1674 కోట్లు చెల్లించాం
- ఇప్పుడు 48 గంటల్లో ఇస్తున్నాం
- వ్యవసాయ సంస్కరణలు తీసుకొస్తాం
- అసెంబ్లీలో మంత్రి మనోహర్



అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): 'రైతులు పండించిన ధాన్యం గత ఐదేళ్లూ కొనలేదు.. రైతులు బతిమాలుకుంటే అరకొరగా కొనుగోలు చేసినా ఆ ధాన్యానికి కూడా డబ్బులు చెల్లించలేదు' అంటూ వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర రైతాంగం పడిన కష్టాలపై పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అసెంబ్లీలో ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వ్యవసాయరంగంలోని సమస్యలపై చర్చించేందుకు గురువారం ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు వినతిపై స్వల్పకాలిక చర్చకు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు అనుమతిచ్చారు. ఈ సందర్భంగా గడచిన ఐదేళ్లు రైతుల పడ్డ ఇబ్బందుల్ని ఎమ్మెల్యేలు ఏకరువు పెట్టారు. జనసేన ఎమ్మెల్యే పులవర్తి రామాంజినేయులు మాట్లాడుతూ.. వ్యవసాయానికి కొంతైనా మేలు చేయాలనుకుంటే కేంద్రంతో చర్చించి ఉపాధి హామీ పథకంతో అనుసంధించాలని సూచించారు. మిల్లర్లు బియ్యాన్ని ఆ జిల్లా పరిధిలోనే కాకుండా తమకు నచ్చిన చోట అమ్ముకోవడానికి అనుమతించాలని బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. రైతులకు ప్రోత్సాహం అందించి సన్నబియ్యం రకాల సాగుకు కృషిచేస్తే రేషన్ డిపోల్లో తిరస్కరించే అవకాశమే ఉండబోదని టీడీపీ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సూచించారు. అనంతరం మంత్రి మనోహర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత ఐదేళ్ల అరాచక పాలనలో విచిత్రమైన యాప్‌లు తీసుకొచ్చి తమకు నచ్చిన మిల్లులకు, తమకు కావాల్సిన రైతుల్ని పంపి సామాన్య రైతాంగానికి తీరని ద్రోహం చేశారని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో అలాంటి కష్టాలు ఉండకూడదని సీఎం చంద్రబాబు సంస్కరణలకు శ్రీకారం చుట్టారని, ఇందులో భాగంగా వ్యవసాయమంత్రి అచ్చెన్నాయుడు నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిందని చెప్పారు. తమ ప్రభుత్వం ఏర్పాటయ్యే నాటికి రైతులకు 1674కోట్లు అప్పు చెల్లించాల్సి వచ్చిందని, అంతేకాకుండా ఇప్పుడు ధాన్యం కొనుగోళ్ల డబ్బులు 48 గంటల్లోపే రైతులకు చెల్లిస్తున్నామని తెలిపారు.

హౌసింగ్ అక్రమాలపై చర్యలు తప్పవు: పార్థసారథి

వైసీపీ ప్రభుత్వంలో ఇళ్ల స్థలాల కోసం భూముల కొనుగోలుతోపాటు ఇళ్ల నిర్మాణంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక అందగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి ఈ వ్యవహారంలో 700కోట్లు దోచేశారని, విజిలెన్సు చర్యలు తీసుకోవాలని ప్రస్తుత ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి కోరారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలోనూ ఈ దోపిడీ జరిగిందని డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు వ్యాఖ్యానించగా మెజారిటీ ఎమ్మెల్యేలు అవుననంటూ సమర్థించారు. నరసరరావుపేటలో మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి ప్రభుత్వ భూమి ఆక్రమించి ప్లాట్లుగా విక్రయించి కోట్లు దోచేశారని, చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు కోరారు. తిరుపతిలో రూ.800కోట్ల ఒంటేరు చెరువు స్థలాన్ని కబ్జాచేసేందుకు ప్రయత్నిస్తున్న వైసీపీ నేతలపై చర్య తీసుకోవాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కోరారు. పంచాయతీల పరిధిలోని తాగునీటి ప్లాంట్ల మరమ్మతులు చేయించాలని ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి జీరో అవర్‌లో సభ దృష్టికి తీసుకొచ్చారు. గోదావరిలోకి రాజమహేంద్రవరంలోని డ్రైనేజీ నీరు చేసి పొలాలు కలుషితమవుతున్నాయని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. వాల్మీకులను ఎస్టీల్లో చేర్చాలంటూ పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర విన్నవించారు.

మే నుంచి పాఠశాలలకు నాణ్యమైన బియ్యం

- 66 వేల టన్నుల పీడీఎస్ బియ్యం సీజ్ చేశాం
- ప్రైవేటు గోదాములపై పర్యవేక్షణ పెంచాం: మనోహర్

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు అందించే మధ్యాహ్న భోజన పథకానికి మే నెల నుంచి నాణ్యమైన బియ్యం సరఫరా చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. గురువారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేల ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు వైసీపీ ప్రభుత్వంలో వ్యవస్థీకృత మాఫియా వ్యవస్థను సృష్టించారని ఆరోపించారు. 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో 76,854 టన్నుల బియ్యం సీజ్ చేస్తే, కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లో 66 వేల టన్నుల బియ్యం, 517 వాహనాలను సీజ్ చేసిందన్నారు. తొలుత వైసీపీ హయాంలో పీడీఎస్ బియ్యంలో అక్రమాలను ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కూన రవికుమార్, రాధాకృష్ణ, వనమాడి వెంకటేశ్వరరావు, వెనిగళ్ల రాము సభ దృష్టికి తీసుకువచ్చారు. 2022-24లో అప్పటి పౌరసరఫరాల శాఖ మంత్రి కనుసన్నల్లోనే అక్రమాలు జరిగాయని, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్, అతని తండ్రి, తమ్ముడు చేతుల్లో వ్యవస్థలను పెట్టుకుని వ్యవహారం నడిపారని రాధాకృష్ణ, వనమాడి ఆరోపించారు.

ఆర్థిక సంఘం నిధుల్ని దారి మళ్లించారు: గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని మంత్రి నాదెండ్ల మనోహర్ విమర్శించారు. గురువారం శాసనసభలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ తరఫున మనోహర్ ఆయా శాఖలకు గ్రాంట్లు, నిధుల కోసం ప్రతిపాదనలు ప్రవేశపెట్టారు. సభ్యుల ప్రశ్నలకు మనోహర్ సమాధానమిచ్చారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను గత ప్రభుత్వం దారి మళ్లించి పంచాయతీలకు తీరని నష్టం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లెల్లో పారిశుధ్య కార్యక్రమాలు, సిమెంట్ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు తదితర అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారంచుట్టిందన్నారు.

గంజాయి సాగు 90 శాతం తగ్గింది



- సాగు చేస్తే ఆస్తులు జప్తే: మంత్రి అనిత

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే ఉత్తరాంధ్ర జిల్లాల్లో 70 వేల కిలోల గంజాయిని ధ్వంసం చేశామని హోంమంత్రి వంగలపూడి అనిత చెప్పారు. గంజాయి ఉత్పత్తి, తయారీ, నిల్వ, రవాణా, ఎగుమతి, దిగుమతి, వాడకం, ప్రేరేపించినా అన్నీ నేరాలేనని, ఎవరు చేసినా శిక్ష తప్పదని చెప్పారు. గురువారం శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీల ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. గంజాయి కేసులు పెరిగాయన్న వైసీపీ విమర్శలపై మంత్రి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తొలి కొకైన్ కేసు ఘనతా వైసీపీ ప్రభుత్వానిదేనన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో గతంలో కంటే 90 శాతం గంజాయి సాగు తగ్గిందన్నారు. గంజాయి సాగు చేసే వారి ఆస్తులను జప్తు చేసే కార్యక్రమం ప్రారంభించామన్నారు. 3 చోట్ల ఆస్తులను జప్తు చేశామన్నారు. ప్రస్తుతం ఒడిసా నుంచి గంజాయి రవాణా అధికంగా సాగుతోందని, దీన్ని ఆపేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. హోంమంత్రిపై గతంలో డిప్యూటీ సీఎం పవన్ చేసిన వ్యాఖ్యలను వైసీపీ ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ప్రస్తావించగా.. మంత్రి లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ సందర్భంలో మాట్లాడారో తెలుసుకోవాలన్నారు.

శ్రావణి... సంధ్యారాణి... సవిత చీరల సంబరం



వెలగపూడి సచివాలయంలో 50 శాతం రాయితీతో విక్రయించే చేనేత ఉత్పత్తుల కేంద్రాన్ని ప్రారంభించి చీరలను చూపిస్తున్న మంత్రులు సవిత, సంధ్యారాణి, ఎమ్మెల్యే శ్రావణి

చేనేత వస్త్రాలపై 50% రాయితీ సేల్

- సచివాలయ ఉద్యోగులకు స్పెషల్ ఆఫర్

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం సందర్భంగా అమరావతి సచివాలయ ఉద్యోగులకు చేనేత వస్త్రాల 50 శాతం డిస్కౌంట్ సేల్ గురువారం ప్రారంభమైంది. సచివాలయ మూడో బ్లాక్‌లో ఉన్న ఆప్కో షోరూమ్ ప్రత్యేక కౌంటర్‌ను మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యే బండారు శ్రావణి తో కలిసి మంత్రి సవిత ప్రారంభించారు. సచివాలయ ఉద్యోగులకు ఈనెల 10వ తేదీ సాయంత్రం వరకు చేనేత వస్త్రాలను డిస్కౌంట్ ధరకు విక్రయిస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉద్యోగులు వినియోగించుకోవాలని కోరారు.

దద్దరిల్లిన ధర్నాచౌక్



విజయవాడలోని ధర్నాచౌక్‌లో గురువారం సమస్యలు పరిష్కరించాలంటూ నినదిస్తున్న ఆశా కార్యకర్తలు

వేతనం కోసం నినదించిన ఆశాలు

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

విజయవాడ (ధర్నాచౌక్), మార్చి 6(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశాలు రోడ్డెక్కారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్‌లో గురువారం చేపట్టిన ధర్నాలో పెద్దసంఖ్యలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు. తమకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా వర్కర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సెలవులు, సాధారణ సెలవులు, క్యాజువల్ సెలవులు, మెడికల్ లీవ్స్ వేతనంతో కూడిన మెటర్నిటీ లీవ్‌లు అమలు చేయాలని, పదవీ విరమణ వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని కోరారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస సెలవులు కూడా ఇవ్వకుండా వారితో ప్రభుత్వాలు వెట్టిచాకిరీ చేయిస్తున్నాయని మండిపడ్డారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలపై ప్రభుత్వంతో చర్చలు జరిగి, ఒప్పంద కాపీని విడుదల చేసి ఏడాది గడుస్తున్నా పాలకులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.

ఉమన్స్ డే స్పెషల్ సెల్ఫీ!



వెలగపూడి సచివాలయంలో మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమెన్స్ డే వేడుకల్లో మంత్రులు అనిత, సవిత, సంధ్యారాణి సెల్ఫీ సంబరం

ఆడబిడ్డల చదువును ప్రోత్సహించాలి

- మంత్రులు అనిత, సవిత, సంధ్యారాణి, నిమ్మల పిలుపు

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): విద్యతోనే మహిళల అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, ఎస్.సవిత, జి.సంధ్యారాణి, నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. ఆడబిడ్డల చదువును ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అమరావతి సచివాలయంలో ఏపీ సెక్రటేరియట్ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి నిమ్మల మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని, ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు తీసుకువచ్చారని తెలిపారు. మంత్రి సవిత మాట్లాడుతూ కుటుంబాన్ని నడిపే క్రమంలో ప్రతి తల్లీ పోలీసులా వ్యవహరించాలని సూచించారు. ఆడ బిడ్డలను మగ పిల్లలతో సమానంగా పెంచాలని మంత్రి సంధ్యారాణి సూచించారు.

వీడియో నాదే.. ఆడియో నాది కాదు

- పోలీసు విచారణలో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్
- పోక్సో చట్టంపై కొంతవరకే అవగాహన ఉందని వెల్లడి



విజయవాడ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో బాధితుల వివరాలు వెల్లడించడంపై నమోదైన కేసులో హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ గురువారం విజయవాడలో పోలీసుల విచారణకు హాజరయ్యారు. సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్లు బి.గుణరాము, పలివెల శ్రీనివాసరావు మాధవ్‌ను విచారించారు. 10 నుంచి 15 ప్రశ్నలను సంధించారని తెలిసింది. మాధవ్ మీడియా సమావేశంలో మాట్లాడిన వీడియో చూపించి ఇది మీదేనా అని పోలీసులు ప్రశ్నిస్తే.. అత్యాచార బాధితుల గురించి మాట్లాడిన వీడియో తనదేనని, అందులో ఉన్న ఆడియో మాత్రం తనది కాదని మాధవ్ చెప్పినట్టు తెలిసింది. 'ఇంతకుముందు పంపిన నోటీసు అందిందా..' అన్న ప్రశ్నకు తాను ఆ చిరునామాలో ఉండడం లేదని మాధవ్ బదులిచ్చారు. 'పోక్సో చట్టంపై అవగాహన ఉందా..' అని ప్రశ్నించగా.. కొంతవరకు అవగాహన ఉందని సమాధానమిచ్చారు. మళ్లీ విచారణకు పిలిచినప్పుడు హాజరుకావాలని పోలీసులు బీఎన్ఎస్ఎస్ 35(3) కింద నోటీసు ఇచ్చారు. ఈ నోటీసు ప్రకారం మాధవ్ అరెస్టయినట్టేనని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. విచారణ అనంతరం గోరంట్ల మాధవ్ మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబుపై విమర్శలు చేశారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన సాగుతోందన్నారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారన్నారు. తనపై ఫిర్యాదు చేసిన వాసిరెడ్డి పద్మ ఇంతకుముందు చంద్రబాబు, పవన్, లోకేశ్‌పైనా ఫిర్యాదు చేశారన్నారు. దానిపైనా కేసు నమోదు చేయాలన్నారు. అనంతపురం జిల్లాలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై తానూ ఫిర్యాదు చేస్తానన్నారు. కాగా, మాధవ్ వెంట వచ్చిన వైసీపీ న్యాయవాదులంతా పోలీస్ స్టేషన్లోకి వెళ్లడానికి ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. ఒక్కరినే అనుమతిస్తామని చెప్పగా, అందర్నీ పంపాలని వాగ్వాదానికి దిగారు. తర్వాత మాధవ్‌తోపాటు ఇద్దరు న్యాయవాదులను అనుమతించారు.

వంశీని మరింత విచారించాలి!

- బెయిల్ ఇస్తే సాక్షులను బెదిరించి, సాక్ష్యాలను తారుమారు చేస్తారు
- పోలీసుల తరఫు న్యాయవాదుల వాదన
- వంశీ అనారోగ్యంతో ఉన్నారన్న ఆయన లాయర్

విజయవాడ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సత్యవర్ధన్ కేసులో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని మరింత విచారణ చేయాల్సి ఉందని, బెయిల్ ఇవ్వొద్దని, ఆయన బయటకు వస్తే సాక్ష్యాలను తారుమారు చేస్తాడని ప్రాసిక్యూషన్స్ ఏడీ రాజేంద్రప్రసాద్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్యాణి వాదించారు. వంశీ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్, పోలీసులు వేసిన కస్టడీ పిటిషన్‌పై విజయవాడ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ కోర్టులో గురువారం వాదనలు జరిగాయి. వంశీతోపాటు వెలినేని శివరామకృష్ణప్రసాద్, నిమ్మ చలపతిని విచారించామని, వంశీ తప్ప మిగతా ఇద్దరూ కీలక సమాచారం ఇచ్చారని పోలీసుల తరఫు న్యాయవాదులు తెలిపారు. తాజాగా గంటా వీర్రాజు, వేల్పూరి వంశీబాబును విచారించినప్పుడు మరికొంత సమాచారం వచ్చిందన్నారు. వంశీ ఇచ్చిన ప్రణాళికలను తాము అమలు చేశామని నిందితులు వెల్లడించారని తెలిపారు. వంశీకి బెయిల్ ఇస్తే సాక్షులను బెదిరించి, సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందని చెప్పారు. సత్యవర్ధన్‌ను బెదిరించి గన్నవరం టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసు నుంచి తప్పుకొనేలా చేశారని కోర్టు దృష్టికి తెచ్చారు. అదేవిధంగా వంశీని 10 రోజుల కస్టడీకి ఇవ్వాలని అభ్యర్థించారు. వంశీ తరఫు న్యాయవాది సత్యశ్రీ వాదనలు వినిపిస్తూ వంశీపై ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదు చేసిందన్నారు. జైలులో ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిపారు. వంశీ సాక్షులను బెదిరించి, సాక్ష్యాలను తారుమారు చేసే వీలు లేదన్నారు. ఈ వాదనలను విన్న న్యాయాధికారి హిమబిందు బెయిల్‌పై తదుపరి విచారణను ఈ నెల 10వ తేదీకి వాయిదా వేశారు. కస్టడీపైనా అదే రోజు తీర్పు వెలువరిస్తామని తెలిపారు.

తురకా కిశోర్‌కు 14 రోజుల రిమాండ్



మాచర్లటౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిశోర్‌కు స్థానిక కోర్టు గురువారం 14 రోజులు రిమాండ్ విధించింది. 2022లో పల్నాడు జిల్లా విజయపురిసౌత్‌లో మంజుల అంజనేయులు అలియాస్ అంజి అనే వ్యక్తిపై దాడి చేయడంతోపాటు కారు ధ్వంసం కేసులో కిశోర్, ఆయన సోదరుడు శ్రీకాంత్‌పై సాగర్ పోలీసులు పలు కేసులు నమోదు చేయగా, తిరిగి 307 సెక్షన్ కింద కేసులను మార్చి పీటీ వారెంట్ వేశారు. కిశోర్, శ్రీకాంత్‌లను గురువారం మాచర్ల జూనియర్ సివిల్ కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. కాగా, వీరు ఇప్పటికే పలు కేసుల్లో నెల్లూరు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నారు. అయా కేసుల్లో హైకోర్టు నుంచి బెయిల్ లభించింది. తాజా రిమాండ్ నేపథ్యంలో వారిని నెల్లూరు జిల్లా జైలుకు తరలించారు.

దర్శకుడు వర్మకు ఉపశమనం

- సీఐడీ కేసులో 6 వారాలపాటు తదుపరి చర్యలు నిలుపుదల



అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): దర్శకుడు రామ్‌గోపాల్ వర్మకు హైకోర్టులో ఉపశమనం లభించింది. కులాల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టారంటూ సీఐడీ పోలీసులు నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలన్నింటినీ ఆరు వారాలపాటు నిలుపుదల చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశిస్తూ విచారణను ఏప్రిల్ 17కి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ గురువారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. మంగళగిరికి చెందిన బండారు వంశీకృష్ణ ఫిర్యాదు మేరకు సీఐడీ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ రామ్‌గోపాల్ వర్మ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.

'గనుల్లో' 1,300 కోట్లు గాయబ్

సర్కారుకు అడుగడుగునా చిల్లే

- రాష్ట్ర గనుల శాఖ నిర్వాకం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వానికి పన్నేతర ఆదాయం తీసుకొచ్చే గనుల శాఖ చతికిలపడింది. ఆదాయ లక్ష్యాలను అందుకోవడంలో దిశ, దశ లేకపోవడం, సకాలంలో కీలకమైన విధాన నిర్ణయాలు తీసుకోలేకపోవడంతో ఆదాయం భారీగా పడిపోయింది. ఏకంగా 2024-25 సంవత్సరానికి రూ.1,300కోట్ల ఆదాయాన్ని కోల్పోయింది. సీనరేజీ కలెక్షన్ కాంట్రాక్ట్‌ను(ఎస్‌సీసీ) సమర్థంగా కొనసాగించలేకపోవడం, అన్ని జిల్లాలకు విస్తరించకపోవడంతో మైనర్ మినరల్స్‌పై ఆదాయం పడిపోయింది. సీఎం చంద్రబాబు వద్ద ఇప్పటికే పలు దఫాలుగా సమీక్షలు జరిగినా, చర్చోపచర్చలు, పరిశీలనలు జరిపినా పలు కీలకమైన అంశాల్లో విధానపరమైన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. ఫలితంగా ఇప్పటికీ సీనరేజీ కలెక్షన్ కాంట్రాక్ట్ బ్రహ్మపదార్థంగానే ఉంది. గత ప్రభుత్వంలో ఏడు ఉమ్మడి జిల్లాలకు ఇచ్చిన కాంట్రాక్ట్ కాలపరిమితి గతేడాదే ముగిసింది. కాంట్రాక్ట్ కొనసాగింపు కోసం కంపెనీలు బకాయిలు చెల్లించలేదు. మరోవైపు లీజుదారుల నుంచి సీనరేజీ సహా అనేక రకాల ఫీజులు మాత్రం వసూలు చేస్తున్నాయి. ఆ కాంట్రాక్ట్ పొడిగించాలా? లేక కొత్తగా టెండర్లు పిలవాలా? అన్నదానిపై ప్రభుత్వం నెలల తరబడి పరిశీలనలు, పరిశోధనలు జరుపుతోన్నా నిర్ణయం తీసుకోలేకపోతోంది. దీంతోపాటు, మిగిలిన జిల్లాల కాంట్రాక్టు కూడా తేల్చలేకపోతున్నారు. దీంతో ప్రైవేటు వ్యక్తులు, వారి సంస్థలు దర్జాగా సీనరేజీ వసూళ్లకు దిగారు. ఇంత జరుగుతున్నా ఏ అంశంపైనా స్పష్టమైన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. ఇది ప్రైవేటు కంపెనీలు, వాటివెనక ఉన్న వ్యక్తులకు కనకవర్షం కురిపిస్తోంది.

సీనరేజీలోనే రూ.800 కోట్ల బకాయి

గనులశాఖ ఇటీవల సీఎంకు 3 రకాల నివేదికలు ఇచ్చింది. ఆదాయార్జన శాఖలపై జరిగిన సమావేశంలో ఒకటి, తర్వాత గనులశాఖపై ప్రత్యేకంగా జరిగిన సమీక్షలో రెండు రిపోర్టుల ద్వారా ఆదాయ వ్యయాల గణాంకాలను సీఎం ముందు పెట్టింది. 2023-24కు గనులశాఖ ఆదాయ టార్గెట్ 4,000 కోట్లు. 2024-25కు 4,500 కోట్లు. ఇవి జగన్ ప్రభుత్వంలో రూపొందించిన గణాంకాలు. 2023-24లో వైసీపీ నేతలు ఖనిజాల దోపిడికి పాల్పడినా, గనుల ఆదాయం సర్కారుకు చేరింది. ఇసుకపై చూపించిన ఆదాయం స్వల్పంగానే ఉన్నా మిగతా ఆదాయం ఎక్కువగా మైనర్ మినరల్స్ ద్వారానే వచ్చినట్లు పేర్కొన్నారు. 2024-25లో 4,500 కోట్లు ఆదాయం టార్గెట్. దీన్ని ఇప్పుడు గనులశాఖ 3,500 కోట్లుగానే చూపించింది. ఇదే పెద్ద మాయ. పోనీ, చూపించిన మేర ఆదాయం సంపాదించిందా?...అంటే లేనేలేదు. కూటమి ప్రభుత్వం వచ్చేనాటికి శ్రీకాకుళం, చిత్తూరు, అనంతపురం, గుంటూరు, విజయనగరం, కడప, తూర్పుగోదావరి ఉమ్మడి జిల్లాల పరిధిలో సీనరేజీ కలెక్షన్ కాంట్రాక్ట్ అమల్లోఉంది. దీని విలువ 1,748 కోట్లు. అధికారిక లెక్కలప్రకారం, 800 కోట్ల మేర కాంట్రాక్ట్ సంస్థలు బకాయిలు చెల్లించాలి. కూటమి ప్రభుత్వం కొలువుతీరిన కొత్తలో కాంట్రాక్ట్‌లను రద్దుచేయాలనుకున్నా తర్వాత వాటినే కొనసాగించారు. కాలపరిమితి ముగిసినా కంపెనీల నుంచి బకాయిలు వసూలు చేయలేదు. అలాగని, కాంట్రాక్ట్‌ను నిలుపుదల చేయలేదు. కాగా, మార్చి నెలాఖరు నాటికి అన్ని బకాయిలు కలిపి రూ.1,300కోట్లు వసూలు చేస్తామని గనులశాఖ ముఖ్యమంత్రికి జనవరిలో హామీ ఇచ్చింది. ఈ నెల 4న సీఎం వద్ద జరిగిన సమావేశంలో తేలిన దాని ప్రకారం, ఒక్క రూపాయి కూడా వసూలు కాలేదు. అప్పుడే మార్చి మొదటివారం ముగిసిపోతోంది. మరో మూడు వారాల్లో ఆర్థిక సంవత్సరమే ముగియనుంది. గత తొమ్మిది నెలల్లో సాధ్యంకాని బకాయిల వసూళ్లు మరో మూడు వారాల్లో చేయగలరా? అన్నది అతి పెద్ద ప్రశ్న. కీలకమైన ఆదాయం తీసుకొచ్చే విషయంలోనే సకాలంలో నిర్ణయాలు తీసుకోలేకపోవడం ప్రభుత్వానికి తీవ్ర ఆర్థికనష్టం చేకూర్చిందని మైనింగ్ నిపుణులు చెబుతున్నారు.

ఆరు జిల్లాల్లో 300 కోట్లు లోటు?

గనులశాఖ నియంత్రణలోని ఆరు జిల్లాల్లో వసూలు కావాల్సిన సీనరేజీ టార్గెట్‌లోనూ 300 కోట్ల మేర లోటు కనిపించినట్లు తెలిసింది. ప్రభుత్వం మారిన తర్వాత కొందరు నేతలు, ప్రైవేటు వ్యక్తులు ఆ జిల్లాల్లో సీనరేజీ వసూళ్లపై పెత్తనం చెలాయించడం వల్లే ఈ సమస్య ఏర్పడినట్లు తెలిసింది. పాత కాంట్రాక్టులున్న జిల్లాల్లో ఇప్పటికీ కొందరు నేతలు, ప్రైవేటు వ్యక్తులు, కంపెనీలు కలిసి జాయింట్ వెంచర్‌గా అనధికారికంగా సీనరేజీ వసూలు చేస్తున్నట్లుగా ఫిర్యాదులున్నాయి. దీనిపై గనుల శాఖకు నియంత్రణ లేనట్లుగా ఉంది.

సిలికా, క్వార్ట్జ్‌లో 200 కోట్లు పాయె..

కూటమి ప్రభుత్వం వచ్చాక సిలికా శాండ్, క్వార్ట్జ్‌లో అక్రమాల పేరిట సుదీర్ఘకాలం అనధికారికంగా పర్మిట్లు నిలిచిపోయాయి. ఈ పరిణామాన్ని కొందరు నేతలు, అధికారులు సొమ్ముచేసుకున్నారు. ఫలితంగా 200 కోట్ల మేర సర్కారుకు నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా. ప్రభుత్వానికి వచ్చే ఆదాయం పోతోందని, వెంటనే పర్మిట్లు ఇవ్వాలని ఆదేశించినా గనుల శాఖ జూనియర్ అధికారి సకాలంలో నిర్ణయం తీసుకోలేదని తెలిసింది. ఆయనపై చర్యలకు ప్రభుత్వం కదిలితే కూటమి పెద్దలే ఆయనను కాపాడేందుకు పైరవీలు చేశారు. దీంతో ఆ అధికారి సేఫ్. కానీ, ప్రభుత్వం కోల్పోయిన ఆదాయం మాత్రం వెనక్కి రాలేదు. ఇలా పలుకీలకమైన అంశాల్లో సర్కారు స్థాయిలో విధాన నిర్ణయాలు తీసుకోలేదు. ఫలితంగా బకాయిలు ఖజానాకు చేరకపోగా, కొత్తగా రావాల్సిన ఆదాయం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తోంది. ఈ విషయంలో సమయానుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని సీనియర్ అధికారులు సూచిస్తున్నారు.

దేశ భవితకు

యువతే పెట్టుబడి

హార్డ్‌వర్క్ కాదు.. స్మార్ట్ వర్క్ చేయాలి

- 2047నాటికి ప్రపంచంలోనే అగ్రస్థానంలో భారత్
- రిపబ్లిక్ ప్లీనరీ సమ్మిట్‌లో చంద్రబాబు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అమరావతిని మోడల్ రాజధానిగా నిర్మిద్దామనే కృతనిశ్చయంతో ఉన్నానని, అదే ఆకాంక్షతో ఏంజెల్ క్యాపిటల్‌కు శ్రీకారం చుట్టానని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. అభివృద్ధి అంశాలపై తనకున్న మక్కువతోనే కొన్ని సందర్భాల్లో ఓటమి పాలయ్యానని వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే అగ్రస్థానానికి చేరుతుందని, ప్రపంచవ్యాప్తంగా భారతీయులు నంబర్ వన్ స్థానంలో ఉంటారని ఆయన ఆకాంక్షించారు. గురువారం ఢిల్లీలో 'లిమిట్‌లెస్ ఇండియా' అనే అంశంపై రిపబ్లిక్ టీవీ నిర్వహించిన సమ్మిట్‌లో చంద్రబాబు మాట్లాడారు. "అమరావతి రాజధానికి రైతులే యజమానులు. అయితే, 2019 ఎన్నికల్లో మేం ఓడిపోయి వైసీపీ అధికారంలోకి రావడంతో అమరావతిలో పురోగతి నిలిచిపోయింది. అమరావతిని అప్పటి ప్రభుత్వం ఛిద్రం చేసి రైతులను ఇబ్బంది పెట్టింది. నన్ను అక్రమంగా అరెస్టు చేయించింది. నా అరెస్టుకు వ్యతిరేకంగా దేశంలోని అనేక రాష్ట్రాలు స్పందించాయి. ప్రపంచవ్యాప్తంగా 60దేశాల్లోని తెలుగు ప్రజలు మద్దతుగా నిలిచారు. సుమారు 53 రోజుల పాటు నిరసనలు తెలిపారు. నేను ఏపీకి అందించిన అభివృద్ధి, సంక్షేమాలను గుర్తించడం వల్లే వారు సంఘీభావంగా ముందుకొచ్చారు. ఇరవై ఐదేళ్ల క్రితం హైదరాబాద్‌లో ఐటీ విప్లవం తెచ్చాను. ఆర్థిక సంస్కరణలను 30 ఏళ్ల క్రితమే అమలుచేశాను. నా విధానాలతో విదేశాలకెళ్లి ఉద్యోగాలు చేసుకుంటున్న తెలుగు వారంతా గత ఎన్నికల్లో కూటమి వెంట నిలిచి గెలిపించారు" అని చంద్రబాబు తెలిపారు. ఆరోగ్యం, అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ఎజెండాగా ముందుకెళితే ప్రజలెప్పుడూ అండగా నిలుస్తారన్నారు. నేషన్ ఫస్ట్.. విధానంపై ప్రజలందరూ ఆలోచించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఇంకా ఏమన్నారంటే..

ఒకప్పుడు మీసేవ, ఈసేవ.. ఇప్పుడు వాట్సాప్ గవర్నెన్స్

"దేశ భవిష్యత్తుకు యువతే పెట్టుబడి. హార్డ్‌వర్క్ కాదు.. స్మార్ట్ వర్క్ చేయాలి. గతంలో నేనే 'మీ సేవ', 'ఈసేవ'లను తీసుకొచ్చాను. ప్రస్తుతం.. వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రవేశపెట్టాను. రాబోయే 10-15 ఏళ్లలో భారత్ నైపుణ్యాలు, సేవారంగాల్లో ప్రపంచవ్యాప్తంగా ఆధిపత్యం చెలాయించనుంది. దీని కోసం ప్రతికూల ఆలోచనలు పక్కనపెట్టి.. ప్రతిఒక్కరూ సానుకూల (పాజిటివ్) ఆలోచనలతో ముందుకెళ్లాలి. ప్రస్తుతం.. ప్రపంచంలో ఏ అభివృద్ధి చెందిన దేశానికి వెళ్లినా అక్కడ మన దేశ ప్రజలు కనిపిస్తారు" అని చంద్రబాబు తెలిపారు.



ఆ మూడు రంగాలు ఇవే

దేశంలో దృష్టి సారించాల్సిన ప్రధాన మూడు రంగాలేమిటని అడిగిన ప్రశ్నకు చంద్రబాబు వివరంగా జవాబిచ్చారు. "మొదటి ప్రాధాన్యం ఐటీ నుంచి ఏఐకు మళ్లడం. ఒకప్పుడు ఐటీ గురించి మాట్లాడాను. ఇప్పుడు ఏఐ అవసరమని చెబుతున్నాను. అయితే, ఏఐ వల్ల కొన్ని దుష్ప్రభావాలు కూడా ఉన్నాయి. వాటిని అరికట్టి సరైన మార్గంలో వెళ్లగలిగితే ఏఐ ఎన్నో అద్భుతాలు చేయగలదు. ఇక.. రెండోది గ్రీన్ ఎనర్జీ. భవిష్యత్తు తరాలకు ఇదెంతో అవసరం. మూడోది మానవ వనరులు. ఇందులో మనం ఎంత అభివృద్ధి చెందితే, దేశం అంత ఎత్తుకు ఎదుగుతుంది" అని చంద్రబాబు తెలిపారు. 2047 నాటికి దేశంలో 65 శాతం మంది 35 ఏళ్లలోపు వారే ఉంటారని పేర్కొన్నారు. ప్రపంచంలో మరే దేశానికీ ఇంతటి అవకాశం, అదృష్టం లేవన్నారు. అయితే, దక్షిణ భారతదేశం అనుసరించిన జనాభా నియంత్రణ విధానాలు ఇప్పుడు అతిపెద్ద సమస్యగా మారాయన్నారు. తాను ఎల్లప్పుడూ భవిష్యత్తు కాలాన్ని ముందే ఊహిస్తానని చంద్రబాబు తెలిపారు. దేశంలోనే తొలిసారిగా గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం కట్టామని గుర్తు చేశారు.

టెన్నిస్‌ను బాబు ప్రోత్సహించారు: సానియా మీర్జా

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు మార్కు ఉంటుందని టెన్నిస్ స్టార్ సానియా మీర్జా అన్నారు. రిపబ్లిక్ ప్లీనరీ సమ్మిట్‌లో పాల్గొన్న ఆమె.. చంద్రబాబు గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. కేవలం క్రికెట్ మాత్రమే ఆట అనుకునే రోజుల్లోనే ఆయన టెన్నిస్ సహా ఇతర క్రీడలను ప్రోత్సహించారని గుర్తుచేశారు. "చంద్రబాబు వల్లే హైదరాబాద్ ఇప్పుడు ఈ స్థాయిలో అభివృద్ధి చెందింది. ప్రస్తుతం.. ప్రపంచ స్థాయి కంపెనీలు అక్కడ ఉండడానికి ఆయనే కారణం. ఆయన అనుభవం, సంకల్పం అందరికీ ఆదర్శం. చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమ సూత్రం దేశానికి మార్గనిర్దేశనం చేసింది" అని కొనియాడారు. ఆ తర్వాత మాట్లాడిన చంద్రబాబు.. సానియా మీర్జాకు తొలిసారిగా రూ.25 లక్షల ఆర్థికసాయం అందించిన విషయాన్ని గుర్తుచేశారు.

నీ అంతు చూస్తా..!

- ఉద్యోగం ఎలా చేస్తావో చూస్తా..!
- రాయదుర్గం ఎంపీడీఓకు వైసీపీ ఎంపీటీసీ బెదిరింపులు

రాయదుర్గం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రాయదుర్గం ఎంపీడీఓ కొండన్నను వైసీపీ నాయకుడు, వడ్రవన్నూరు ఎంపీటీసీ అరుణ్ కుమార్ గురువారం బెదిరించారు. నేరుగా ఆయన చాంబర్‌కు వెళ్లి 'నీ అంతు చూస్తా' అని హెచ్చరించారు. కాలర్ పట్టుకొని దాడికి యత్నించారు. దుర్భాషలాడారు. దీంతో ఎంపీడీఓ కొండన్న, పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతనెలలో జరిగిన రాయదుర్గం మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ అరుణ్‌కుమార్ ఎంపీడీఓతో వాగ్వాదానికి దిగారు. అప్పటి నుంచి ఆయనను టార్గెట్ చేస్తున్న ఆయన తాజాగా గురువారం అనుమతి లేకుండా ఆయన చాంబర్‌లోకి వెళ్లారు. తమ గ్రామంలో నిర్మించిన సచివాలయ భవనం బిల్లు చెల్లించాలని అడిగారు. పనులు ఇంకా మిగిలి ఉన్నాయని, వాటిని పూర్తిచేస్తే బిల్లులు చెల్లిస్తామని ఎంపీడీఓ సమాధానమిచ్చారు. ఆ పనులు చేసేందుకే తనకు అప్పు ఇవ్వాలని ఎంపీటీసీ డిమాండ్ చేశారు. లేదంటే ఇప్పటి వరకు చేసిన పనుల కైనా బిల్లులు చెల్లించాలని కోరారు. అలా చెల్లించడానికి వీలు కాదని ఎంపీడీఓ స్పష్టం చేశారు. దీంతో తమ పట్ల పక్షపాతం ప్రదర్శిస్తున్నారంటూ వాదనకు దిగిన ఎంపీటీసీ.. ఎంపీడీఓను బెదిరించేదాకా వెళ్లారు. దీంతో తన కాలర్ పట్టుకొని బెదిరించారని ఎంపీడీఓ కొండన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.



అనంతపురం జిల్లా రాయదుర్గం ఎంపీడీఓ కొండన్నను బెదిరిస్తున్న వైసీపీ ఎంపీటీసీ అరుణ్ కుమార్

దూషణలు, విద్వేషాలే పోసాని పని

- సభ్య సమాజం ఆమోదించలేని పదజాలం వాడారు.. రక్షణ కల్పించొద్దు
- హైకోర్టులో ఏఏజీ, పీపీ వాదనలు
- సెక్షన్ 35(3) అనుగుణంగా నడుచుకోండి
- పోలీసులకు న్యాయస్థానం ఆదేశం



అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అసభ్య పదజాలంతో దూషించి వీడియోలను సోషల్ మీడియాలో పెట్టడం, విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడమే సినీ నటుడు పోసాని కృష్ణమురళి పనిగా పెట్టుకున్నారని పోలీసుల తరఫున అడిషనల్ అడ్వొకేట్ జనరల్(ఏఏజీ) సాంబశివప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ హైకోర్టులో వాదనలు వినిపించారు. ఇలా చేయడం ఆయన అలవాటుగా మార్చుకున్నారని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, వారి కుటుంబ సభ్యులను పిటిషనర్ అసభ్యకర పదజాలంలో దూషించారన్నారు. సభ్య సమాజం అంగీకరించలేని పదజాలంతో సోషల్ మీడియాలో వీడియోలు పెట్టారన్నారు. రాష్ట్రంలో 5 పోలీస్ స్టేషన్లలో నమోదు చేసిన కేసులను కొట్టివేయాలని పిటిషనర్ కోరారని, ఇందులో కర్నూలు జిల్లా ఆదోని పోలీసులు నమోదు చేసిన కేసులో పీటీ వారెంట్ అమలైందని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం, విశాఖ జిల్లా పద్మనాభం, అనంతపురం, సూళ్లూరుపేట పోలీసులు పీటీ వారెంట్లు వేసినప్పటికీ అవి అమల్లోకి రాలేదన్నారు. పిటిషనర్‌కు రక్షణ కల్పిస్తూ ఎలాంటి ఉత్తర్వులూ ఇవ్వొద్దని కోరారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్.. ఆదోని పోలీసులు నమోదు చేసిన కేసులో ఇప్పటికే పీటీ వారెంట్ అమలు చేసి పోసాని కృష్ణమురళిని అదుపులోకి తీసుకున్నందున ఆయన వేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు. ఇతర నాలుగు కేసులలో పీటీ వారెంట్లు అమలు కానందున పిటిషనర్ విషయంలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నడుచుకోవాలని పోలీసులకు స్పష్టం చేశారు. నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని ఆదేశించారు.

పోసాని కస్టడీపై తీర్పు రిజర్వు

కర్నూలు/నరసరావుపేట లీగల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పోసాని కృష్ణమురళిని పోలీస్ కస్టడీకి ఇవ్వాలని దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన కర్నూలు జిల్లా ఆదోని అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి తీర్పును రిజర్వ్ చేశారు. పోసానిపై నమోదైన కేసులో వివరాలు రాబట్టేందుకు మూడు రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఆదోని త్రీటౌన్ పోలీసులు గురువారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఇరువర్గాల వాదనలు విన్న ఇన్‌చార్జి న్యాయాధికారి అపర్ణ తీర్పును రిజర్వు చేశారు. పోసాని తరఫున సీనియర్ న్యాయవాది జీవన్‌సింగ్ బెయిల్ పిటిషన్ వేయగా.. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశిస్తూ కేసును శుక్రవారానికి వాయిదా వేశారు.

బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ

పోసాని కృష్ణమురళిని కస్టడీకి కోరుతూ నరసరావుపేట రెండో పట్టణ పోలీసులు స్థానిక కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం విచారణ ముగిసింది. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయాధికారి తీర్పును శుక్రవారానికి వాయిదా వేశారు. పోసాని బెయిల్ పిటిషన్‌పై గురువారం జరగాల్సిన వాదనలు ఆయన న్యాయవాదుల కోరిక మేరకు శుక్రవారం జరగనున్నాయి.

దువ్వాడ వ్యాఖ్యలతో శాంతిభద్రతలకు విఘాతం

- చర్యలు తీసుకోండి.. పాలకొల్లు, ముసునూరులో ఫిర్యాదులు

పాలకొల్లు టౌన్, ముసునూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై అనుచిత వాఖ్యలు చేసిన వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ భారతీయ కాపు సేవా సమితి నాయకులు పాలకొల్లు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 'సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు నెలకు రూ.50 కోట్లు ఇస్తున్నారు. అందుకే పవన్ నోరు విప్పడం లేదు. జనసైనికులు సైకోలు' అంటూ దువ్వాడ చేసిన వ్యాఖ్యలు వర్గాల మధ్య చిచ్చుపెట్టేలా, పార్టీల మధ్య గొడవలు రేపేలా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. దువ్వాడ శ్రీనివాస్ అనుచిత వ్యాఖ్యలు రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవిధంగా ఉన్నాయన్నారు. దువ్వాడపై చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో జనసేన, టీడీపీ ఫిర్యాదు చేశాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.